www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

## పిఠాపురం మనదే!

ఓటేయడం.. ప్రమాణ స్వీకారమే మిగిలింది
భీమవరం, గాజువాక, పిఠాపురం.. మూడు కళ్లు
నా లాంటి గొంతుక ఉండకూడదని వాళ్లు భావిస్తున్నారు
రూ.100-150 కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధమయ్యారు
ఓటుకి రూ.లక్ష ఇచ్చయినా కొనాలని చూస్తున్నారు
మీ ఆశీస్సులుంటే మనిషికి లక్ష పంచినా నేనే గెలుస్తా
పిఠాపురం నేతలతో జనసేన అధినేత పవన్ కల్యాణ్
కాకినాడ ఎంపీ అభ్యర్థిగా ఉదయ్ పేరు ప్రకటన



2

బుధవారం | 20-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 335 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి రా. 2.24 తదుపరి ద్వాదశి; నక్షత్రం: పుష్యమి రా. 10.39 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: శేషం ఉ. 6.46; దుర్ముహూర్తం: ఉ. 11.59-12.47; అమృతఘడియలు: మ. 3.35-5.21; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.23; సూర్యాస్తమయం: 6.23 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## ఆ ముగ్గురిపై గురి!

### నిఘా డీజీ, డీఐజీ, పల్నాడు ఎస్పీలపై చర్యలు!?



ఆంజనేయులు



పాలరాజు



రవిశంకర్‌రెడ్డి

ప్రధాని పాల్గొన్న సభపై ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం!

- వీవీఐపీల భద్రతకు చర్యలు తీసుకోలేదు
- పల్నాడు పోలీసులపై ఈసీకి ఫిర్యాదు
- భద్రతా వైఫల్యంపై కేంద్రానికి ఐబీ నివేదిక
- లోపాలను ఎస్పీజీ వేలెత్తిచూపినా పట్టించుకోని పోలీసు అధికారులు!
- సభకు జనం రాకుండా అడ్డుకున్న వైనం
- విఫలమంటూ రోత మీడియాలో కథనాలు
- ఢిల్లీ పెద్దలకు బీజేపీ నేతల రిపోర్టు!

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద ప్రధాని మోదీ పాల్గొన్న ప్రజాగళం సభలో భద్రతను పట్టించుకోని ముగ్గురు ఐపీఎస్ అధికారులపై చర్యలు తప్పవా? వీవీఐపీల సెక్యూరిటీ కోసం తీసుకోవలసిన చర్యలు తీసుకోలేదా? వీవీఐపీ గ్యాలరీల్లోకి కొందరు చొచ్చుకొచ్చినా ఉద్దేశపూర్వకంగానే పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారా? కేంద్ర నిఘా వర్గాల నివేదిక ఏం చెప్పింది? ఏపీ పోలీసుల్లో ఇప్పుడు ఈ అంశాలపై విస్తృత స్థాయిలో చర్చ జరుగుతోంది. ప్రధానికి భద్రత కల్పించే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) అధికారులు చేసిన సూచనలను అధికారులు పెడచెవిన పెట్టారని కేంద్ర హోం శాఖకు చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) నివేదిక ఇచ్చిందని తెలియడంతో.. ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్సార్ ఆంజనేయులు, గుంటూరు రేంజ్ డీఐజీ పాలరాజు, పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డిల్లో టెన్షన్ మొదలైనట్లు తెలుస్తోంది. దీనికి తోడు వారిపై చర్యలు తీసుకోవాలని, వారిని ఎన్నికల విధుల నుంచి తప్పించాలని టీడీపీ, జనసేన, బీజేపీ నేతల బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)కు

మిగతా 12వ పేజీలో...

## కలెక్టర్లు, ఎస్పీలపై ఈసీ నిఘా!

పది మందిపై వేటు పడే అవకాశం 12

- ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా.. నిబంధనల బేఖాతరుపై కమిషన్ కన్నెర్ర
- అధికార పార్టీ నేతలతో అంటకాగుతున్న కలెక్టర్లు, ఎస్పీల వివరాల సేకరణ
- నివేదికలు పంపిన సీఈవో మీనా.. వాటి ఆధారంగా ఏ క్షణమైనా చర్యలు



సీఈవో మీనా

## కోడ్ దాటే వలంటీర్లపై
# కేసుల కొరడా!?





### ప్రజాధనం వేతనంగా తీసుకుంటే 'పబ్లిక్ సర్వెంట్సే'

- అది గౌరవ వేతనమైనా అదే లెక్కలోకి!
- వాళ్లూ ప్రజాప్రాతినిధ్య చట్టం పరిధిలోనే!
- సెక్షన్ 123, 129, 134ఏ ఉల్లంఘించొద్దు
- ఐపీసీ సెక్షన్ 171(ఎఫ్) కింద కేసు పెట్టొచ్చు
- ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడటం శిక్షార్హమైన నేరాలు
- న్యాయ నిపుణుల స్పష్టీకరణ
- ఈసీ ఆదేశిస్తే చర్యలకు సిద్ధం

### కోడ్ కేసు పడితే ఇక ప్రభుత్వ ఉద్యోగం రానట్టే

చట్టాన్ని గౌరవించాలి. చెబితే వినాలి. బాధ్యతతో మెలగాలి. ఇవేవీ కావని అధికార పార్టీకి సలాం చేసి, గులాంలుగా మారితే!? చట్టం కొరడా ఝుళిపించడమే మార్గం!



కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లిలో కోడ్ ఉల్లంఘించి జగన్‌కు జైకొట్టిన ఈ వలంటీర్లపై మంగళవారం వేటుపడింది.

**ప్రజాప్రాతినిధ్య చట్టం ఏం చెబుతోంది?**

**సెక్షన్ 123:** ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడకూడదు.

**సెక్షన్ 129:** అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించకూడదు.

**ఐపీసీ 171ఎఫ్:** ఓటర్లను ప్రభావితం చేయకూడదు.

వలంటీర్లూ ప్రజాప్రాతినిధ్య చట్టం పరిధిలోకి వస్తారు. వారికీ ఈ సెక్షన్లు వర్తిస్తాయి. వీటిని ఉల్లంఘించడం... శిక్షార్హమైన నేరమే! కేసులు పెడితే ప్రభుత్వ ఉద్యోగాలకూ అనర్హులవుతారు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వలంటీర్లను నిలువరించడం ఎలా? వైసీపీ కార్యకర్తలను మించి మరీ ప్రచారం చేస్తున్న వారికి అడ్డుకట్ట వేయడం ఎలా? ఇప్పుడు ఇదో పెద్ద ప్రశ్న! వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ చెప్పింది. వారిని ఏజెంట్లుగా కూడా కూర్చోనివ్వొద్దని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రచారం చేయడమూ కుదరదని తేల్చి చెప్పింది. అయినా సరే.. వలంటీర్లు ఎక్కడా ఆగడంలేదు. కరపత్రాలు పట్టుకుని కొందరు, కండువాలు వేసుకుని మరికొందరు, జెండాలు కూడా పట్టుకొని ఇంకొందరు జగన్ భజన చేస్తూనే ఉన్నారు. ఈసీ

మిగతా 12వ పేజీలో...

### కోడ్ మాకు అడ్డమా? 11

- రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్ల బరితెగింపు
- వైసీపీ అభ్యర్థులకు అడ్డగోలు ప్రచారం
- 'ఆంధ్రజ్యోతి' కథనాలతో కొన్నిచోట్ల చర్యలు
- చాలాచోట్ల వివాదాస్పదంగా అధికారుల తీరు
- వైసీపీకి ఓటేయనన్నారని భార్యాభర్తలపై దాడి



### ఫిరాయింపుదార్లదే నిజమైన పార్టీయా?

2

- చట్టసభలోని బలాన్నే పరిగణనలోకి తీసుకుంటారా?
- ఓటర్లను అపహాస్యం చేయడం కాదా?
- ఎన్సీపీ వివాదంలో సుప్రీం వ్యాఖ్యలు
- 'అలారం' గుర్తు కోర్టు పరిధిలో ఉందని అన్ని ప్రకటనల్లో పేర్కొనాలని ఆదేశం

# మరో బరితెగింపు!

### ఎన్నికల ముంగిట భారీ పందేరం

- జింపెక్స్‌కు మంగంపేటలో 100 ఎకరాలు!
- 2008లో ఈ సంస్థకు భూ కేటాయింపు
- బెరైటీస్ ప్రాసెసింగ్ ప్లాంటుకు నిర్ణయం
- సకాలంలో ఏర్పాటు చేయకుండా వాయిదాలు
- చివరకు హైకోర్టుకు చేరిన ప్లాంట్ వివాదం
- కోర్టులో కేసు వెనక్కి తీసుకుంటామని.. వేరే చోట 100 ఎకరాలు ఇవ్వాలన్న కంపెనీ
- ఇవ్వడం కుదరదన్న రెవెన్యూ శాఖపై ఒత్తిళ్లు
- రంగంలోకి దిగిన 'కడప' వసూల్‌రాజా
- ఎన్నికల కోడ్ కూసినా భూ పందేరానికి రెడీ

'ఎన్నికల కోడ్ మీకే కానీ, మాకు కాదు'.. ఇదే జగన్ పాలసీ. ఎన్నికల షెడ్యూల్ అమల్లోకి రావడానికి కొన్ని గంటల ముందు ఆయన తన అస్మదీయ, సొంత మనుషుల కంపెనీలకు కోట్ల విలువైన భూములు కట్టబెట్టారు. ఇప్పుడు కోడ్ అమల్లోకి వచ్చినా వెనక్కి తగ్గడం లేదు. 'పాత తేదీ'లతో పందేరం చేస్తున్నారు.



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కోడ్ వచ్చిందా.. నియమావళి పాటించాలా? ఇవేవీ జగన్ సర్కారుకు పట్టదు. 'పాత తేదీ'లతో నియమాలకు పాతరేసే పని మొదలుపెట్టారు. రూ.వేల కోట్ల విలువైన బెరైటీస్ నిల్వలున్న మంగంపేట ఏరియాలో జింపెక్స్ కంపెనీకి వంద ఎకరాల పందేరానికి రంగం సిద్ధం చేశారు. ఇదంతా వ్యూహాత్మకంగా జరుగుతోంది. 'కంపెనీకి అర్జంటుగా 100 ఎకరాలు ఇవ్వండి' అంటూ గనుల శాఖలోని ఓ ముఖ్య అధికారితో

మిగతా 3వ పేజీలో...

### ఏపీఎండీసీ నుంచి తీసుకున్న 7 వేల కోట్లు ఏం చేశారు? 3

- జనవరిలో రూ.10 వేల కోట్లు దాటిన ప్రభుత్వ ఖర్చు
- వాటిలో సొంత వారికి 5 వేల కోట్లు పందేరం
- సొంత కాంట్రాక్టర్ల కోసం అప్పులు తెచ్చిమరీ చెల్లింపు
- ఎవరెవరికి చెల్లించారో చెప్పాలి: నీలాయపాలెం

### టీడీపీ బీసీ నేతపై వైసీపీ గొడ్డలి వేటు 11

ప్రకాశం జిల్లాలో దారుణ హత్య

- 'ప్రజా గళం' సభకు జనాన్ని తీసుకెళ్లడమే నేరం
- శాంతిభద్రతలపై ఈసీ సమీక్షించాలి: బాబు

## పేద మహిళకు ఏడాదికి లక్ష



### యువతకు ఏడాదిపాటు రూ.లక్ష అప్రెంటిస్‌షిప్



- రిజర్వేషన్లపై 50% సీలింగ్ తొలగింపు
- కనీస వేతనం రోజుకు 400కు పెంపు
- పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత
- పంట నష్టపోయిన 30 రోజుల్లో బీమా చెల్లింపు
- కేంద్ర ప్రభుత్వంలో 30 లక్షల ఉద్యోగాల భర్తీ
- కార్మికులకు ఆరోగ్య హక్కు చట్టం ఏర్పాటు
- ఆశ, అంగన్వాడీ కార్మికులకు డబుల్ శాలరీ కాంట్రిబ్యూషన్
- ఇంటింటికీ గ్యారెంటీ పేరిట కాంగ్రెస్ మ్యానిఫెస్టో
- ఐదు న్యాయాల్లో 25 గ్యారెంటీలకు చోటు

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి పేద కుటుంబంలోని ఓ మహిళకు ఏడాదికి లక్ష రూపాయలు! విద్యావంతులైన యువతకు ఒక ఏడాదిపాటు ఒక్కొక్కరికి లక్ష రూపాయల అప్రెంటిస్‌షిప్! రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ తొలగింపు! ఉపాధి హామీ సహా దేశవ్యాప్తంగా కనీస వేతనం రోజుకు రూ.400! శాశ్వత రుణ మాఫీ కమిషన్ ఏర్పాటు! శ్రామికులకు ఆరోగ్య హక్కు చట్టం! తాము అధికారంలోకి వస్తే అమలు చేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించనున్న హామీల్లో ఇవి కొన్ని మాత్రమే! మోదీ గ్యారెంటీలకు దీటుగా అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చేలా లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి తమ మ్యానిఫెస్టోను కాంగ్రెస్ సిద్ధం చేసింది. రైతులు, యువత, మహిళలు, కార్మికులు, అణగారిన వర్గాలను దృష్టిలో పెట్టుకుని 'ఐదు న్యాయాల'కు తుది రూపు ఇచ్చింది. 'ఇంటింటికీ గ్యారెంటీ' పేరిట రూపొందించిన ఐదు న్యాయాల్లో 25 హామీలను గుదిగుచ్చింది. పి.చిదంబరం నేతృత్వంలోని మ్యానిఫెస్టో కమిటీ రూపొందించిన ఐదు హామీలకు అత్యున్నత విధాన నిర్ణాయక మండలి అయిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఆమోదం తెలిపింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతలో మంగళవారం కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో సీడబ్ల్యూసీ సమావేశం జరిగింది. పార్టీ అగ్ర నేతలు సోనియా, రాహుల్, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితోపాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన సీడబ్ల్యూసీ సభ్యులు పల్లంరాజు, టి.సుబ్బిరామిరెడ్డి, గిడుగు రుద్రరాజు,

మిగతా 2వ పేజీలో...

# ప్రాజెక్టులపై పగ!

### జగన్ మాటలు, చేతలన్నీ మోసపూరితమే

- వెలిగొండ, పోలవరానికి పాతర
- రూ.32 కోట్లు కట్టక వరికపూడిసెల గాలికి
- దానికి పర్యావరణ అనుమతే తీసుకోలేదు
- చెడిపోయిన బోరింగ్ మెషిన్
- రెండేళ్లుగా వెలిగొండ టన్నెల్‌లోనే
- శ్రీశైలంలో నీళ్లు లేనందునే నల్లమలసాగర్‌కు ఇవ్వలేకపోతున్నామని తప్పుడు ప్రచారం
- డ్యాంలో నీరున్నా వదలలేరు.. వదిలితే ఐదారు చోట్ల గండిపడి గ్రామాల మునక
- పోలవరం ఖర్చును ఆర్‌సీసీ కుదిస్తే చప్పట్లు.. కిమ్మనకుండా సంతకాలు
- ఆయకట్టు రైతులను, ముంపువాసులను నిలువునా ముంచేసిన ముఖ్యమంత్రి



కాకినాడ జిల్లా తాళ్లూరు వద్ద పోలవరం ఎడమ కాలువ దుస్థితి

- గత ఐదేళ్లలో వెలిగొండ టన్నెల్‌లో ఒక్క మీటర్ కూడా లైనింగ్ పనులు చేయడం చేతకాని జగన్ ప్రభుత్వం.. సొరంగాలు పూర్తయి నీటి విడుదలకు సిద్ధంగా ఉన్నాయని పచ్చి అబద్ధం చెబుతోంది.
- వరికపూడిసెల ఎత్తిపోతలకు ఇంతవరకు పర్యావరణ అనుమతే తీసుకోలేదు. కనీసం దరఖాస్తు కూడా చేయలేదు.
- కేంద్ర జలసంఘం ఆమోదించిన దానికంటే పోలవరం అంచనాలను రూ.8,932 కోట్లకు ఆర్‌సీసీ తగ్గిస్తే.. జగన్ కనీసం నిరసన తెలపలేదు. పైగా గుడ్డిగా సంతకాలు చేసేశారు.





(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఇది మోసపూరిత ప్రభుత్వం.. వైసీపీ మేనిఫెస్టోలో చెప్పిన వెలిగొండ, పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ఘోరంగా విఫలమైంది. ముఖ్యంగా వెలిగొండ విషయంలో సీఎం జగన్ ప్రజలను మభ్యపెట్టి మాయచేస్తున్నారు. ఈ ఐదేళ్లూ ఆయనది నిష్క్రియాపరత్వమే! ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో సిద్ధం చేసి నీరు నింపాలంటే ఇంకా రెండేళ్లు పడుతుంది. మరో రూ.5,000 కోట్లు కావాలి. గత ఐదేళ్లలో కనీసం రూ.1,000 కోట్లు కూడా ఖర్చు పెట్టకుండా ప్రాజెక్టు పూర్తి చేశామని గొప్పలు చెబుతూ ప్రజలను మోసగిస్తున్నారు. అలాగే పోలవరం పూర్తిచేస్తామంటూ మేనిఫెస్టోలో, ఆ తర్వాత అసెంబ్లీలోనూ మాయమాటలు చెప్పిన జగన్.. ప్రాజెక్టు ఖర్చును కేంద్రం నియమించిన అంచనాల సవరణల

మిగతా 12వ పేజీలో...

# మూడో అత్యంత కాలుష్య దేశంగా భారత్

## అత్యంత కాలుష్య రాజధాని ఢిల్లీ

» దేశాల జాబితాలో మొదటి రెండు స్థానాల్లో బంగ్లాదేశ్, పాకిస్థాన్




న్యూఢిల్లీ, మార్చి 19: అత్యంత కాలుష్య పూరిత దేశాల్లో భారత్ మూడో స్థానంలో నిలిచింది. 134 దేశాల్లోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 30 వేలకు పైగా గాలి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాల నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా 2023 సంవత్సరానికి ప్రపంచ గాలి నాణ్యత నివేదికను మంగళవారం విడుదల చేశారు. స్విట్జర్లాండ్‌కు చెందిన ఐక్యూ ఎయిర్ సంస్థ ఈ నివేదికను రూపొందించింది. వార్షిక పీఎం 2.5 కాలుష్య గాఢత క్యూబిక్ మీటరుకు 79.9 మైక్రోగ్రాములతో బంగ్లాదేశ్ అత్యంత కాలుష్య భరిత దేశంగా మొదటి స్థానంలో నిలిచింది. 73.7 మైక్రోగ్రాములతో పాకిస్థాన్ రెండో స్థానంలో, 54.4 మైక్రోగ్రాములతో భారత్ మూడో స్థానంలో నిలిచాయి. 2022 సంవత్సరంలో వార్షిక పీఎం 2.5 కాలుష్య గాఢత క్యూబిక్ మీటరుకు 53.3 మైక్రోగ్రాములతో భారత్ అత్యంత కాలుష్య భరిత దేశాల జాబితాలో ఎనిమిదో స్థానంలో ఉంది. తాజా జాబితాలో ప్రపంచంలోనే అత్యంత కాలుష్య భరిత 50 నగరాలలో 42 భారతదేశంలోనే ఉండటం గమనార్హం. పీఎం2.5 కాలుష్య గాఢత క్యూబిక్ మీటరుకు 92.7 మైక్రోగ్రాములతో న్యూఢిల్లీ ప్రపంచంలోనే కాలుష్యపూరిత రాజధానుల్లో మొదటిస్థానంలో నిలిచింది. బిహార్‌లోని పారిశ్రామిక నగరం బెగుసరాయ్ పీఎం2.5 కాలుష్య గాఢత క్యూబిక్ మీటరుకు 118.9 మైక్రోగ్రాములతో ప్రపంచంలోనే అత్యంత కాలుష్యపూరిత నగరంగా మొదటి స్థానంలో నిలిచింది. 105.4 మైక్రోగ్రాములతో గువాహటీ రెండో స్థానం, 102.1 మైక్రోగ్రాములతో ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతం మూడో స్థానం, 100.4 మైక్రోగ్రాములతో పంజాబ్‌లోని ముల్లాన్‌పూర్ నాలుగోస్థానం, 99.5 మైక్రోగ్రాములతో పాకిస్థాన్‌లోని లాహోర్ నగరం ఐదో స్థానం, 92.7 మైక్రోగ్రాములతో న్యూఢిల్లీ 6వ స్థానంలో నిలిచాయి. అలాగే, 88.6 మైక్రోగ్రాములతో గ్రేటర్ నోడియా 11వ స్థానం, 84 మైక్రోగ్రాములతో గురుగ్రామ్ 17వ స్థానంలో నిలిచాయి.

### డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాలు.. 7 దేశాల్లోనే

ఆస్ట్రేలియా, ఫిన్లాండ్, ఐస్‌లాండ్, న్యూజిలాండ్, మారిషస్, ఎస్టోనియా, గ్రెనెడా దేశాలు వార్షిక పీఎం2.5 కాలుష్య గాఢత సగటు క్యూబిక్ మీటరుకు 5 మైక్రోగ్రాములు లేదా అంతకంటే తక్కువతో ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని నివేదిక తెలిపింది. గాలి కాలుష్య సంక్షోభ తీవ్రతను ఈ నివేదిక తెలియజేస్తోందని గ్రీన్‌పీస్ ఇంటర్నేషనల్ సీనియర్ గాలి నాణ్యత శాస్త్రవేత్త ఐదాన్ ఫర్రో వ్యాఖ్యానించారు. భారతదేశంలో పట్టణీకరణ గాలి నాణ్యతకు ఎలా సవాలుగా మారాయో నివేదిక తేటతెల్లం చేస్తోందని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరోన్మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనుమిత రాయ్ పేర్కొన్నారు.

## లోకం తీరు




## ఉష్ణోగ్రతలు

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| అనంతపురం | 40.0 | 24.0 |
| కర్నూలు | 39.4 | 26.7 |
| తిరుపతి | 37.6 | 24.4 |
| గుంటూరు | 37.0 | 23.0 |
| ఒంగోలు | 35.2 | 25.4 |

## ఎల్లుండి ముగియనున్న హె-1బీ వీసాల రిజిస్ట్రేషన్ గడువు




వాషింగ్టన్, మార్చి 19: భారత ఐటీ నిపుణులు ఆసక్తిగా ఎదురు చూసే హెచ్-1బీ వీసాలపై అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) కీలక ప్రకటన చేసింది. 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన హెచ్-1బీ వీసాల కోసం ఇనిషియల్ రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల 22తో ముగుస్తుందని సోమవారం ప్రకటించింది. ఆ రోజు ఈస్ట్రన్ టైం ప్రకారం మధ్యాహ్నం 12 గంటల (భారత కాలమానం ప్రకారం రాత్రి 9.30 గంటలు)కు ముగుస్తుందని తెలిపింది. ఆలోగా ఆసక్తికలవారు తగిన ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరింది. ఇందుకు సంబంధించిన ఫారం ఐ-129, ఫారం ఐ-907 కోసం కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. హెచ్-1బీ క్యాప్ పిటిషన్లపై ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. హెచ్-1బీ నాన్ క్యాప్ దరఖాస్తుల విషయమై తరువాత ప్రకటన వెలువరించనుంది.

## సీఏఏ అమలుపై స్టే నిరాకరణ

» 237 పిటిషన్లపై సమాధానాలకు కేంద్రానికి 3 వారాల గడువు

» సుప్రీంకోర్టు నిర్ణయం



సుప్రీంకోర్టు ఆవరణలో ఐయూఎంఎల్ నేతలు

న్యూఢిల్లీ, మార్చి 19(ఆంధ్ర జ్యోతి): పౌరసత్వ సవరణ చట్టా(సీఏఏ)న్ని అమలు చేయకుండా స్టే విధించాలన్న వినతిని మంగళవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. సీఏఏను సవాలు చేస్తూ దాఖలైన 237 పిటిషన్లపై సమాధానాలు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి మూడు వారాల సమయం ఇచ్చింది. వీటన్నింటిపై ఏప్రిల్ 8వ తేదీలోగా అఫిడవిట్లను సమర్పించాలని ఆదేశించింది. ఆ తేదీలోగా ఎవరికీ పౌరసత్వం ఇవ్వకూడదని అభిప్రాయపడుతూ ఒకవేళ ఇస్తే తమను ఆశ్రయించవచ్చని పిటిషనర్లకు భరోసా ఇచ్చింది. తదుపరి విచారణను ఏప్రిల్ తొమ్మిదో తేదీకి వాయిదా వేసింది. సీఏఏను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం విచారణ చేపట్టింది. కేరళకు చెందిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(ఐయూఎంఎల్), స్వచ్ఛంద సంస్థ రిహాయ్ మంచ్, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మొహువా మొయిత్రా తదితరులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. సీఏఏ ముస్లింల పట్ల వివక్ష చూపిస్తోందంటూ వీరంతా దావాలు వేశారు. తొలుత కేంద్రప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ మొత్తం 237 పిటిషన్లకుగానూ ఇప్పటికే 20 మధ్యంతర అఫిడవిట్లు సమర్పించామని చెప్పారు. సవివరంగా అఫిడవిట్ ఇచ్చేందుకు నాలుగు వారాల సమయం ఇవ్వాలని కోరారు. ఇందుకు పిటిషనర్ల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ఇందిరా జైసింగ్‌లు అభ్యంతరం చెప్పలేదు. కానీ సీఏఏ నిబంధనలు ముస్లింలకు వ్యతిరేకంగా ఉన్నందున వాటిని అమలు చేయకుండా స్టే ఇవ్వాలని కోరారు. సిబల్ వాదనలు వినిపిస్తూ సాధారణంగా చట్టాన్ని ఆమోదించిన తరువాత ఆరు నెలల్లోగా నిబంధనలను నోటిఫై చేయాల్సి ఉన్నా, సీఏఏ విషయంలో మాత్రం నాలుగేళ్ల తరువాత నోటిఫై చేశారని చెప్పారు. ఈ నిబంధనల మేరకు ఎవరికైనా పౌరసత్వం ఇస్తే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం కష్టమవుతుందని అన్నారు. అందువల్ల ఈ చట్టంపై తీర్పు వెలువడే వరకు నిబంధనలను అమలు చేయకూడదని కోరారు. 2019లోనే సీఏఏపై స్టే ఇవ్వాలని కోరగా, నిబంధనలు నోటిఫై చేయనందున ఆ అవసరం లేదని ధర్మాసనం చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. కేంద్రానికి 3వారాల గడువు ఇచ్చింది.

### 'పతంజలి'పై ఆగ్రహం

న్యాయస్థానం ఉత్తర్వులను అమలు చేయనందుకు యోగా గురు బాబా రాందేవ్, పతంజలి ఆయుర్వేద సంస్థ ఎండీ ఆచార్య బాలకృష్ణలపై మంగళవారం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తదుపరి విచారణ జరిగే రోజున వారిరువురు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. పంతజలి సంస్థ ఉత్పత్తులు, మందుల సామర్థ్యంపై ప్రకటనలు జారీ చేయకూడదంటూ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించింది. దీన్ని కోర్టు ధిక్కరణ చర్యగా ఎందుకు పరిగణించకూడదో వివరణ ఇవ్వాలంటూ పంపిన షోకాజ్ నోటీసుకు కూడా స్పందించకపోవడాన్ని తప్పుపట్టింది. దీనిపై బుధవారమే వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ కేసులో కేంద్రం వైఖరిని కూడా ధర్మాసనం తప్పుపట్టింది. తమ ఆదేశాలు అమలు కాకపోవడంపై 2 వారాల్లోగా అన్ని వివరాలతో అఫిడవిట్‌ను సమర్పించాలని ఆదేశించింది. ఇదే చివరి అవకాశమని హెచ్చరించింది.

## ఫిరాయింపుదార్లదే నిజమైన పార్టీయా?


» ఓటర్లను అపహాస్యం చేయడం కాదా?

» ఎన్‌సీపీ వివాదంలో సుప్రీం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మార్చి 19: ఫిరాయింపుదార్లనే నిజమైన పార్టీగా గుర్తిస్తున్న ప్రస్తుత విధానం ఓటర్ల తీర్పును అపహాస్యం చేయడం కిందకే వస్తుందని మంగళవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పార్టీ ఫిరాయింపులను నిషేధించడానికి ఉద్దేశించిన రాజ్యాంగంలోని పదో షెడ్యూలును పక్కన పెట్టి ఎన్నికల కమిషన్ నిర్ణయాలు తీసుకుంటుండడాన్ని ప్రశ్నించింది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ)లోని అజిత్ పవార్, శరద్ పవార్ వర్గాలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. అజిత్ పవార్ వర్గాన్నే నిజమైన ఎన్‌సీపీగా ఈసీ గుర్తించడాన్ని సవాలు చేస్తూ శరద్ పవార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎన్‌సీపీ ఎన్నికల గుర్తు అయిన 'అలారం క్లాక్'ను అజిత్ వర్గానికి కేటాయించడాన్ని కూడా ప్రశ్నించారు. ఆ గుర్తును స్తంభింపచేయాలని కోరారు. ఈ విషయంలో శరద్ పవార్ వర్గానికి ధర్మాసనం కాస్త ఊరట కలిగించింది. ప్రస్తుత పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఆ వర్గం నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ-శరద్ చంద్ర పవార్ అన్న పేరు పెట్టుకోవచ్చంటూ అనుమతి ఇచ్చింది. 'బాకా ఊదుతున్న వ్యక్తి' అన్న చిహ్నాన్ని ఎన్నికల గుర్తుగా వాడుకోవచ్చని తెలిపింది. 'అలారం క్లాక్'ను అజిత్ వర్గానికి కేటాయించినా కొన్ని షరతులు విధించింది. ఆ గుర్తు కోర్టు విచారణ పరిధిలో ఉందంటూ ఇంగ్లీషు, హిందీ, మరాఠీ పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలని అజిత్ పవార్ వర్గాన్ని ఆదేశించింది.

# పేద మహిళకు ఏడాదికి లక్ష

(మొదటి పేజీ తరువాయి)



సీడబ్ల్యూసీ సమావేశంలో సోనియా, ఖర్గే, రాహుల్

రఘువీరా రెడ్డి, వంశీచంద్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. మ్యానిఫెస్టోపై సీడబ్ల్యూసీ కూలంకషంగా మూడు గంటలపాటు చర్చించింది. భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపట్టిన రాహుల్‌ను అభినందిస్తూ తీర్మానం ఆమోదించింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. దేశం మార్పును కోరుకుంటోందని, 2004లో బీజేపీ ఇచ్చిన 'ఇండియా షైనింగ్' నినాదానికి పట్టిన గతే మోదీ గ్యారెంటీలకూ ఎదురవుతుందని విమర్శించారు. మ్యానిఫెస్టోకు వివిధ రాష్ట్రాల్లో విస్తృత ప్రచారం లభించేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, నిబద్ధతతో ప్రతి ఇంటికీ తీసుకువెళ్లాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో.. కాంగ్రెస్ హామీలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లడానికి ప్రణాళిక సిద్ధం చేశామని జైరాం రమేశ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ సర్వసన్నద్ధంగా ఉందని కేసీ వేణుగోపాల్ అన్నారు. ఇది మ్యానిఫెస్టో మాత్రమే కాదని, ప్రజలకు మంచి భవిష్యత్తును కల్పించేలా రూపొందించిన 'న్యాయ పత్రమ'ని అభివర్ణించారు. ఐదు న్యాయాలు, పాతిక గ్యారెంటీలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని చెప్పారు. 'ఘర్ ఘర్ గ్యారెంటీ' పేరిట ఇంటింటికీ హామీలను తీసుకెళ్లాలని సంకల్పించామని చెప్పారు. మ్యానిఫెస్టోకు తుది ఆమోదం ఇవ్వడమే కాకుండా దాని విడుదలకు తేదీని నిర్ణయించే అధికారాన్ని అధ్యక్షుడు ఖర్గేకు సీడబ్ల్యూసీ కట్టబెట్టింది. అంతేనా.. దేశవ్యాప్తంగా పాత పింఛను పథకం అమలుకు మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చారని, రాజ్యాంగ సంస్థల స్వేచ్ఛను కాపాడడంతో పాటు వాటి దుర్వినియోగాన్ని అరికట్టడానికి చట్టాన్ని తీసుకు రావాలని కూడా మ్యానిఫెస్టోలో పేర్కొన్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

### హిస్సేదారి (సమానత్వ) న్యాయం

- సామాజిక, ఆర్థిక కుల గణన
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లపై ఉన్న 50% సీలింగ్ తొలగింపు
- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం స్పెషల్ బడ్జెట్
- జల్ జంగల్ జమీన్‌పై చట్టబద్ధ హక్కులు
- గిరిజనులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను షెడ్యూల్డ్ ఏరియాగా గుర్తింపు

### నారీ (మహిళా) న్యాయం

- 'మహాలక్ష్మి' పథకం కింద ప్రతి పేద కుటుంబంలోని ఒక మహిళకు ఏడాదికి లక్ష రూపాయలు
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు
- ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు డబుల్ శాలరీ కాంట్రిబ్యూషన్
- మహిళల హక్కుల రక్షణ కోసం ప్రతి గ్రామంలో 'అధికార మైత్రి' ఏర్పాటు
- వర్కింగ్ విమెన్ కోసం సావిత్రిబాయి పూలే పేరుతో హాస్టళ్ల సంఖ్య రెట్టింపు

### కిసాన్ (రైతు) న్యాయం

- స్వామినాథన్ ఫార్ములా ప్రకారం పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత
- శాశ్వత రుణమాఫీ కమిషన్ ఏర్పాటు
- పంట నష్టపోయిన 30 రోజుల్లో బీమా పరిహారం చెల్లింపు గ్యారెంటీ
- రైతులు లబ్ధి పొందేలా ఎగుమతి, దిగుమతి విధానం
- వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ మినహాయింపు

### శ్రామిక్ (కార్మికుల) న్యాయం

- ఆరోగ్య హక్కు చట్టం అమలు. ఇందులో భాగంగా పరీక్షలు, మందులు, చికిత్సలు, శస్త్ర చికిత్సలు తదితరాలను పేర్కొంది.
- రోజుకు 400 రూపాయల కనీస వేతనం- ఉపాధి హామీ పథకంలో సైతం
- పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పథకం అమలు
- అసంఘటిత రంగ కార్మికులకు జీవిత, ప్రమాద బీమా
- ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాల నిలుపుదల

### యువ న్యాయం



- 'భర్తీ భరోసా' పథకం కింద కేంద్ర ప్రభుత్వంలో 30 లక్షల ఉద్యోగాల భర్తీ
- యువతకు ఏడాదిపాటు అప్రెంటిస్‌షిప్ పథకం. ఏడాదిపాటు నెలకు రూ.8,500 చొప్పున లక్ష రూపాయల చెల్లింపు
- పేపర్ లీకేజీలు అరికట్టేందుకు కఠినమైన చట్టం
- గిగ్ వర్కర్ల సామాజిక భద్రతకు చర్యలు
- స్టార్టప్‌ల ఏర్పాటుకు రూ.5000 కోట్ల నిధి కేటాయింపు

# పిఠాపురం మనదే!



నియోజక వర్గ నేతలతో జనసేన అధినేత పవన్

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): "పిఠాపురం మనదే. ఈ సీటు గెలిచి చూపించాలి. మూలాలు ఇక్కడే ఉన్నాయి. పిఠాపురం మొదలుకుని అన్నీ గెలుద్దాం. 21 ఎమ్మెల్యే సీట్లతో పాటు కాకినాడ, మచిలీపట్నం ఎంపీ స్థానాలు గెలిచి తీరాలి" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. "మన వరకు పిఠాపురంలో ఎన్నికలు అయిపోయాయి. ఓటు వేయడం, ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడమే మిగిలింది" అని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పిఠాపురం నాయకులతో పవన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన పిఠాపురం నాయకులను పార్టీలో చేర్చుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పిఠాపురం తనకు ప్రత్యేకమైన నియోజకవర్గమని, రాజకీయం కంటే కూడా నియోజకవర్గంలోని శ్రీపాద శ్రీవల్లభ భక్తుడినని చెప్పారు. "2009 నుంచి పిఠాపురంలో పోటీ చేయమని చెబుతుండేవారు. అప్పట్లోనే పోటీ చేయాలని ఆలోచించా. ఇప్పుడైనా నా గెలుపు కోసం పిఠాపురం తీసుకోలేదు. కులాల మధ్య ఐక్యత ఉండాలని, కాపులు పెద్దన్న పాత్ర పోషించాలని, కులాలన్నింటినీ కలుపుకొని వెళ్లాలని భావించా. ఈ రోజు అది సఫలీకృతం అవుతోంది" అని వ్యాఖ్యానించారు. పిఠాపురం, భీమవరం, గాజువాక నియోజకవర్గాలు తనకు మూడు కళ్లలాంటివని పవన్ చెప్పారు.

### ఆ భావనే నా హృదయాన్ని తాకింది

"నేను రాష్ట్రం కోసం పని చేస్తుంటే.. నన్ను గెలిపించే నియోజకవర్గం ఉండాలని అనుకున్నప్పుడు పిఠాపురం నుంచి వచ్చి మిమ్మల్ని గెలిపించే బాధ్యత మాదని కొందరు చెప్పారు. ఈ భావనే నా హృదయాన్ని తాకింది. పిఠాపురాన్ని వాడుకుని వెళ్లిపోయేలా కాకుండా, నియోజకవర్గాన్ని నేను స్వస్థలం చేసుకుంటా" అని పవన్ చెప్పారు. ఇంకా పవన్ ఏమనానరంటే...

### ఓటు అడిగే హక్కు సంపాయించా

2019లో నాకు ఓటేయండని ధాటిగా అడగలేదు. కానీ, ఈ రోజు నాకు ఓట్లేయమని అడిగే హక్కు సంపాదించుకున్నా. దశాబ్ద కాలం పాటు పోరాటాలు చేసి, అందరి కోసం నిలబడి, నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న టీడీపీకి వెన్నంటే ఉన్నా. నేను పిఠాపురంలో ఎవరినో దెబ్బతీయడానికి రాలేదు. నిలబడడానికి వస్తున్నా. ఆ క్రమంలో నన్ను శత్రువుగా భావిస్తే తప్పక యుద్ధం చేస్తా. పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా మారుస్తాం. దేశంలో ఒక అద్భుతమైన నియోజకవర్గం ఉందంటే అది పిఠాపురం అనేలా చేస్తా. నా అభిమాన బలాన్ని పిఠాపురానికి తీసుకువచ్చి కూర్చోబెడతా. జాబ్ మేళా, జాబ్ క్యాలెండర్స్ కోసం ప్రభుత్వంతో పని లేదు. ప్రభుత్వ నిధుల కోసం ఆలోచించకుండా నేనే సొంతగా పనిచేస్తా. పిఠాపురంలో రైతులను కన్నీరు పెట్టనివ్వను. దశాబ్ద కాలం నుంచి నన్ను చూస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గాన్ని గెలిపించుకుందాం. గెలుపు నా కోసం కాదు. నా పోరాటానికి బలం చేకూర్చేందుకే. ఉపాధి, విద్య, వైద్యంతో పాటు అభివృద్ధి ఎలా ఉంటుందో నేను మీకు చేసి చూపిస్తా.

### డబ్బు పేరుకుపోయి ఏం చేయాలో తెలీక

నేను ఒక్కసారి పనిచేయడం చూస్తే.. మీరు ఎప్పటికీ నన్ను వదలరు. అందరినీ కలుపుకొని వెళ్లే వ్యక్తిని. సమస్యలను తగ్గించే వ్యక్తినే కానీ, పెంచే వ్యక్తిని కాదు. సమాజాన్ని కలిపే వ్యక్తినే కానీ, విడదీసే వ్యక్తిని కాదు. మీ అందరి సహకారం, దీవెన కావాలి. నోటా ఓట్లు కూడా జనసేనకే పడాలి. సహజ వనరులను దోచుకోకుండా చూస్తా. ఎవరో వచ్చి పిఠాపురాన్ని భయపెడతానంటే అడ్డుపడతా. నన్ను నిలవరించే బాధ్యతను వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి తీసుకున్నారని అంటున్నారు. జగన్, మిథున్‌పై నాకు వ్యక్తిగత కోపాలు లేవు. నాలాంటి గొంతుక ఉండకూడదనే ఉద్దేశంతో రూ.100 నుంచి రూ.150 కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. మీ అందరి ఆశీస్సులుంటే మనిషికి లక్ష పంచినా అది పని చేయదు. జనసేన, పవన్ కల్యాణ్ గెలుస్తారు.

### ఆమె మా పార్టీలోకి రావాలని..

ప్రస్తుతం వైసీపీ తరఫున పోటీ చేస్తున్న వంగ గీత.. 2009లో మన ద్వారానే(ప్రజారాజ్యం) రాజకీయాల్లోకి వచ్చారు. భవిష్యత్తులో ఆమె వైసీపీని వీడి జనసేనలోకి రావాలని కోరుకుంటున్నా. ఎన్డీఏ కూటమిలో అన్ని విషయాలు మాట్లాడతా. ఏ విషయం మాట్లాడినా సాధ్యమైనంత వరకు పని చేస్తా. వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వను అంటే అందరూ నవ్వారు. ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఎందుకు సాధ్యపడుతుందో.. ఎలా సాధ్యపడుతుందో అనే వ్యూహం నాకు వదిలేయని చెప్పా. ఈ రోజు చేసి చూపించా. ప్రధానితో సభ కూడా నిర్వహించాం. కేంద్రంలోని పెద్దలు నన్ను ఎమ్మెల్యే ఎంపీగా పోటీ చేయాలని అడిగారు. నాకైతే ఎమ్మెల్యేగానే పని చేయాలని ఉంది. ముందు రాష్ట్రానికి పని చేసి, తర్వాత దేశం కోసం ఆలోచిస్తా.

### కాకినాడ ఎంపీ అభ్యర్థిగా ఉదయ్

జనసేనకు కాకినాడ పార్లమెంటు సీటు దక్కిన నేపథ్యంలో ఇక్కడ నుంచి 'టీ టైమ్' వ్యాపారవేత్త ఉదయ్‌ను బరిలో నిలుపుతున్నామని పవన్ చెప్పారు. "ఉదయ్ నా కోసం ఎంతో చేశాడు. అందుకే ఉదయ్‌ని కాకినాడ ఎంపీ అభ్యర్థిగా ప్రకటిస్తున్నా. కాకినాడ పార్లమెంట్‌లో భారీ మెజార్టీతో గెలవాలి. కాకినాడ గంజాయి ప్యారడైజ్‌గా మారిపోయింది. వీటన్నింటినీ నిలువరించాలంటే ఎంపీగా ఉదయ్, ఎమ్మెల్యేగా నేను ఉండాలి" అని వ్యాఖ్యానించారు.

# ఈ 8 మంది..

## లోక్‌సభ ఎన్నికల్లో చూపంతా వీరి వైపే


న్యూఢిల్లీ, మార్చి 18: కొందరేమో ప్రజలను కట్టిపడేసేలా అనర్గళంగా మాట్లాడే వక్తలు..! మరికొందరేమో తెరవెనుక కీలక వ్యూహకర్తలు..! ఇంకొందరేమో పట్టువదలని విక్రమార్కులు..! దేశం ఎదుర్కొననున్న అత్యంత కీలకమైన సార్వత్రిక ఎన్నికల్లో అందరి దృష్టి వీరిపైనే..! వచ్చే ఎన్నికలు ఈ ఎనిమిది మంది అగ్రనేతల చుట్టూనే తిరుగుతాయనడంలో సందేహం లేదు.



**తనదైన ముద్ర వేయాలని:** మద్దతుదారులకు ఓ అసాధారణ శక్తి అయితే.. వ్యతిరేకులకు కరుడుగట్టిన వర్గ విభజనవాది ప్రధాని మోదీ (74). హ్యాట్రిక్ కొట్టడమే కాదు.. సొంతంగానే 370 సీట్లు గెలుస్తాం.. మా కూటమికి 400 స్థానాలు ఖాయం అంటూ.. మూడో టర్మ్ తొలి వంద రోజు పాలనకు రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని చెబుతూ గెలుపుపై గట్టి నమ్మకంతో ఉన్నారు. ఈసారి వెయ్యేళ్ల గుర్తుండేలా పాలన అందిస్తామని చెబుతున్నారు. మోదీ గ్యారెంటీలపై ప్రచారం జరిగేలా చూస్తూ, జాతీయవాదానికి ఆయనను బ్రాండ్ అంబాసిడర్‌లా చూపుతూ వికసిత్ భారత్ లక్ష్యాలను బీజేపీ ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అవకాశం ఉంది. బీజేపీనే కాదు.. యావత్ విపక్ష ప్రచారమూ మోదీ చుట్టూనే తిరుగుతుందనడంలో సందేహం లేదు.



**గత ఓటమికి బదులు..:** జాతీయ స్థాయిలో బీజేపీకి సవాల్ విసురుతున్న ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ(53). సరిగ్గా 20 ఏళ్ల కిందట ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఈ కాంగ్రెస్ అగ్రనేత.. ఈసారి అత్యంత కఠినమైన పరీక్షను ఎదుర్కోనున్నారు. పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ 2019 ఎన్నికల్లో మోదీ చేతిలో ఓటమికి గురయ్యారు. లోక్‌సభ సభ్యత్వంపై వేటు, మోదీ పేరును కించపరిచినందుకు కేసులు, బంగ్లాను ఖాళీ చేయాల్సి రావడం వ్యక్తిగతంగానూ రాహుల్‌ను ఇబ్బందిపెట్టాయి. వీటికి గట్టిగా బదులు తీర్చుకునే అవకాశం ఇప్పుడు దక్కింది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి, మణిపూర్ నుంచి ముంబైకి చేపట్టిన భారత్ జోడో యాత్రలతో ప్రజల్లోకి వెళ్లిన రాహుల్.. కాంగ్రెస్ విధానాలు, సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయడంలో సఫలీకృతమయ్యారు. న్యాయ్ గ్యారెంటీలకు తోడు రైతులు, మహిళలకు లబ్ధి చేకూర్చే హామీలతో ప్రజలను ఆకట్టుకున్నారు.



**రగులుతున్న అగ్గి బరాటా:** రాష్ట్రంలో నేరుగా, ఇండియా కూటమితో జాతీయంగా బీజేపీతో తలపడుతున్నారు పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ(69). ఇండియా కూటమిలో కీలక పాత్ర పోషిస్తూనే.. కాంగ్రెస్‌కు సీట్లు ఇవ్వం పొమ్మని తేల్చిచెప్పారు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి. 42 ఎంపీ సీట్లకూ పోటీ చేస్తామని ప్రకటించారు. దీనివెనుక బీజేపీని ఓడించాలన్న ఆమె కసి స్పష్టంగా కనిపిస్తోంది. 2019లో బీజేపీ బెంగాల్‌లో 18 సీట్లు నెగ్గి మమతను కలవరపెట్టింది. ఢీ అంటే ఢీ అని తలపడుతున్న ఈ రెండు పార్టీల మధ్య బెంగాల్ ఎన్నికలు అత్యంత హోరాహోరీగా సాగడం ఖాయం.



**కేజ్రీ కథ ఎంతవరకో?:** మద్యం విధానం కుంభకోణంలో ఈడీ వేటాడుతున్నా.. బీజేపీ, మోదీకి తలొంచడం లేదు ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ (55). వచ్చే ఎన్నికల్లో ఈయన ప్రభావం స్పష్టంగా కనిపించనుంది. 2019లో ఒక్క సీటుకే పరిమితమైన ఆప్.. ఆ స్కోరును పంజాబ్ అండతో ఈసారి డబుల్ డిజిట్ దాటించే అవకాశం ఉంది. బోనస్‌గా ఢిల్లీలో కొన్ని స్థానాలు నెగ్గొచ్చు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ప్రభావం చూపినా.. ఎంపీ సీట్లు గెలుస్తాందో, లేదో చూడాలి.



**బిహార్ తేజం:** జేడీయూ నీతీశ్ చేతిలో మోసపోయిన బిహార్ యువ నేత, ఆర్జేడీ అధినేత తేజస్వీ యాదవ్ (34).. దానికి ప్రతీకారాన్ని తీర్చుకునే చాన్సు వచ్చింది. ప్రభావవంతమైన ముస్లిం-యాదవ్ (ఎంవై) సమీకరణంతో కాంగ్రెస్‌ను కలుపుకొని వెళ్తూ బీజేపీ-జేడీయూను తేజస్వీ ఢీకొట్టనున్నారు. 40 సీట్లున్న రాష్ట్రంలో ఇతర వర్గాలను ఆకట్టుకోలేకపోవడం ఆయన బలహీనత. అయోధ్య రామ మందిర నిర్మాణం బిహార్‌లోనూ ప్రభావం చూపుతున్న వేళ.. ఇండియా కూటమి కీలక నేతగా ఉన్న లాలూ కుమారుడికి సవాల్ ఎదురవనుంది.



**అఖిలేశ్ ఏం చేస్తారో?:** దిగ్గజ నాయకుడైన తండ్రి ములాయం సింగ్ లేకుండా తొలిసారి ఎన్నికలను ఎదుర్కొంటున్నారు యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ (50). లోక్‌సభ సీట్ల (80) పరంగా అతిపెద్ద రాష్ట్రమైన యూపీపై బీజేపీ చాలా పట్టుదలగా ఉంటుందనడంలో సందేహం లేదు. దీనికితోడు అయోధ్య రామ మందిర నిర్మాణం ఘనత ఉండనే ఉంది. అలాంటి చోట కాంగ్రెస్‌కు 17 సీట్లు ఇచ్చి, 63 సీట్లలో బరిలో దిగుతోంది సమాజ్‌వాదీ పార్టీ. తొలుత కాస్త బెట్టు చేసినా.. అఖిలేశ్ పరిస్థితులకు తగ్గట్లు సర్దుకుపోయారు. యూపీలోనూ ముస్లిం-యాదవ్ (ఎంవై) సమ్మేళనం కీలకం.

### పోయిన పవర్‌ను వెదుక్కొంటూ



జీవితంలో అత్యంత సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు మరాఠా యోధుడు శరద్ పవార్. 83 ఏళ్ల వయసులో, రాజకీయ జీవిత చరమాంకంలో కఠిన సవాలుకు సిద్ధమయ్యారు. ఆయన స్థాపించిన ఎన్సీపీని అన్న కొడుకు అజిత్ పవార్ సొంతం చేసుకున్నారు. పెద్ద పవార్ ఎన్సీపీ (శరత్‌చంద్ర పవార్)లో కొద్ది మంది నేతలే మిగిలారు. అయినా, తన వ్యూహాలతో వెన్నుచూపకుండా పోరాడుతున్నారు. తనలాగే బీజేపీ కారణంగా పార్టీని కోల్పోయిన శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రేతో కలిసి మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)ని నిలిపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇండియా కూటమిలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు.

### తమిళనాడు అడ్డుగోడ డీఎంకే



దేశంలో అత్యంత ఆత్మవిశ్వాసంతో లోక్‌సభ ఎన్నికలకు వెళ్తున్న ఏకైక నాయకుడు డీఎంకే అధినేత, తమిళనాడు సీఎం స్టాలిన్ (71) అని చెప్పొచ్చు. వీరి ప్రధాన విపక్షం ఏఐఏడీఎంకే చూపంతా వచ్చే అసెంబ్లీ ఎన్నికలపైనే ఉంది. బీజేపీ తమిళనాట తీవ్రంగా ప్రయత్నిస్తున్నా.. మోదీ, షా పలు సార్లు పర్యటించినా కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే ప్రభావం ఉందని తెలుస్తోంది. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీతో బంధాన్ని కొనసాగిస్తూ తమిళనాడులో బీజేపీని నిరోధిస్తున్నారు స్టాలిన్. 39 సీట్లున్న రాష్ట్రంలో గత ఎన్నికల్లో డీఎంకే కూటమి 38 గెలుచుకుంది. 'ఇండియా'కు ఓ విధంగా స్టాలిన్ పెద్ద అండ.

## బాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీం విచారణ ఏప్రిల్ 16కి వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంజూరుచేసిన బెయిల్‌ను రద్దు చేయాలన్న ఏపీ ప్రభుత్వ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ వాయిదా పడింది. ఈ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. హోలీ సెలవుల తర్వాత దీనిపై విచారణ జరుపుతామని తెలిపింది. తదుపరి విచారణ ఏప్రిల్ 16కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

## టీడీపీ నేత గుంటుపల్లి కన్నుమూత

▸▸ ఆయన మరణం పార్టీకి తీరనిలోటు: చంద్రబాబు

అమరావతి(ఆంధ్రజ్యోతి), నరసరావుపేట టౌన్, మార్చి 19: టీడీపీ జాతీయ క్రమశిక్షణా కమిటీ సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు పల్నాడు జిల్లా నరసరావుపేటలో కన్నుమూశారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో నరసరావుపేటలోని మహాత్మాగాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతి చెందారు. గతంలో రెండుసార్లు నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా గుంటుపల్లి పనిచేశారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామం గురజాల నియోజకవర్గం దాచేపల్లికు తరలిస్తామని బంధువులు తెలిపారు. గుంటుపల్లి భౌతికకాయాన్ని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు సందర్శించి నివాళులర్పించారు.

### గుంటుపల్లి కుటుంబానికి బాబు పరామర్శ

టీడీపీ సీనియర్ నేత గుంటుపల్లి నాగేశ్వరరావు మృతి పట్ల పార్టీ అధినేత చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి, పరామర్శించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా, రాష్ట్ర స్థాయిలో నాగేశ్వరరావు పార్టీకి విశేష సేవలు చేశారని కొనియాడారు. గుంటుపల్లి మృతి పట్ల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ సంతాపాన్ని తెలియజేశారు. కాగా నాగేశ్వరరావు అకాల మరణం పట్ల టీడీపీ నేతలు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలేసి, నివాళులర్పించారు.

## హత్యా రాజకీయాలు చేయించిన జగన్‌కు ఓటేయొద్దు

▸▸ ఆయనకు ఓటేస్తే మన గొంతు మనం కోసుకున్నట్టే!

▸▸ రాష్ట్రంలో రాజారెడ్డి, జగన్ రాజ్యాంగం నడుస్తోంది: దస్తగిరి



విజయవాడ (ధర్నాచౌక్) మార్చి 19: ఈసారి జగన్‌కు ఓటేస్తే మన గొంతు మనమే కోసుకున్నట్టు అవుతుందని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ పులివెందుల అభ్యర్థి దస్తగిరి తెలిపారు. ప్రజలను మరోసారి మోసంచేసి ఆయన గద్దినెక్కాలని చూస్తున్నారన్నారు. హత్యా రాజకీయాలు చేయించిన జగన్‌కు ఓటేయవద్దన్నారు. విజయవాడలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ పాలనలో దళిత బిడ్డలపై దాడులు జరిగాయన్నారు. దళిత మహిళపై అత్యాచారం చేసి పోలీస్‌స్టేషన్ ఎదుట పడేసినా ఈ ప్రభుత్వంలో ఎటువంటి చర్యలు లేవన్నారు. రాష్ట్రంలో రాజారెడ్డి, జగన్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. దళిత నాయకుడి భూమిని వైసీపీ నాయకులు ఆక్రమిస్తే దానిని పరిశీలించడానికి వెళ్లిన తనపైనే.. బెదిరిస్తున్నట్టు అసత్య ప్రచారం చేశారన్నారు. వైఎస్ వివేకా హత్య కేసులో తాను అప్రూవర్‌గా మారకుంటే తనకు ఓటు అడిగే హక్కు ఉండేది కాదన్నారు. జగన్ వల్ల పులివెందుల ప్రజలు మోసపోయారని, అందుకే అక్కడి నుంచే పోటీ చేస్తున్నట్టు చెప్పారు.



# మరో బరితెగింపు!

(మొదటి పేజీ తరువాయి)

లేఖలు రాయించారు. భూమి ఇవ్వడం కుదరదని రెవెన్యూశాఖ ఇప్పటికే ఒకసారి తేల్చిచెప్పింది. అయినా సరే, మరోసారి తమ విన్నపాన్ని పరిశీలించాలని, ఆ సంస్థకు భూమి ఇవ్వడం చాలా ముఖ్యమని సర్కారు పేర్కొంది. సందట్లో సడేమియాగా ముఖ్యనేత వద్ద పనిచేస్తున్న వసూల్ రాజా కూడా రంగంలోకి దిగిపోయారు. ముఖ్యనేత చెప్పారంటూ ఆయన రెవెన్యూపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని తెలిసింది. ఆ కంపెనీపై హద్దుల్లేని ప్రేమ చూపించడానికి చాలా కారణాలే ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం...

### 16 ఏళ్లయినా అతీగతీలేని ప్లాంటు

ఉమ్మడి కడప జిల్లా మంగంపేట బెరైటీస్ గనులకు ప్రసిద్ధి. ప్రపంచంలోనే అత్యధిక బెరైటీస్ నిల్వలున్న ప్రాంతంలో ఇది మూడో స్థానంలో ఉంది. దక్షిణాసియాలో దీనిదే తొలిస్థానం. 2008లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ)తో 'జింపెక్స్' అనే ప్రైవేటు కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది. తవ్వితీసిన బెరైటీస్‌ను ప్రాసెస్ చేసే బెనిఫికేషన్ ప్లాంటును ఏర్పాటు చేస్తామని తెలిపింది. దీంతో ఆ సంస్థకు అప్పట్లో జీవో 863 ప్రకారం కొర్లకుంటలో 100 ఎకరాలు కేటాయించారు. ఒప్పందం ప్రకారం రెండు సంవత్సరాల్లో ప్లాంటు ఏర్పాటు చేయాలి. ఇది ఆ సంస్థ సొంతమేమీ కాదు. ఎండీసీకి.. జింపెక్స్ జాయింట్ వెంచర్ సంస్థగా ఉండేలా ఒప్పందం ఉంది. ఈ భూకేటాయింపును వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున పోరాటం చేశారు. ఫలితంగా రెండేళ్లలో పూర్తికావాల్సిన ప్రాజెక్టు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో తమకు మరి కొంత గడువు ఇవ్వాలని జింపెక్స్ కోరింది. ఈ మేరకు 2014 మే 17 వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. ఈలోగా పర్యావరణ అనుమతులు, ఇతర ప్రభుత్వ లాంఛనాలను పూర్తిచేసుకోవాలని ఆ కంపెనీకి స్పష్టం చేశారు. అయినా, ఆ సంస్థ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లలేకపోయింది. దీంతో ఈ భూమిని ఏపీఎండీసీ తన అవసరాలకోసం ఉపయోగించుకుంది. బెరైటీస్ నిల్వలను ఆ భూమిలో డంపింగ్ చేస్తోంది. ఎండీసీ ఆ భూమిని వినియోగించడాన్ని సవాల్ చేస్తూ జింపెక్స్ 2017లో హైకోర్టును ఆశ్రయించింది. భూ వినియోగంపై స్టేటస్‌కో ఇస్తూ హైకోర్టు ఆదేశించింది. ఈ కేసు ఇప్పటికీ కోర్టు పరిధిలోనే ఉంది. ఇప్పటికే 16 సంవత్సరాల కాలం గడిచిపోయింది. రెండుసార్లు ఆ సంస్థకు గడువు ఇచ్చినా ప్రాజెక్టును పట్టాలెక్కించలేకపోయింది. కీలకమైన బెనిఫికేషన్ ప్లాంటును ఏర్పాటు చేయలేకపోయింది. దీంతో ఏపీఎండీసీకి జరిగిన నష్టం ఎక్కువగానే ఉంది.

### 100 ఎకరాల భూమికి టెండర్

16 ఏళ్ల వ్యవధిలో బెరైటీస్ బెనిఫికేషన్ ప్లాంటు ఏర్పాటు చేయలేకపోయిన జింపెక్స్ సంస్థ ఇప్పుడు ఓ కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. తమకు మంగంపేటలోనే మరోచోట 100 ఎకరాల భూమిని కేటాయిస్తే హైకోర్టులో కేసును వెనక్కి తీసుకుంటామని ప్రతిపాదించింది. ఏరకంగా చూసినా ఈ ప్రతిపాదనకు విలువ లేదు. అయినా సరే.. జింపెక్స్ కోరినట్లు మంగంపేటలో 100 ఎకరాలు కేటాయించేలా హడావుడిగా గనుల శాఖ నుంచి రెవెన్యూకు ప్రతిపాదనలు పంపించారు. ఇదంతా ఎన్నికల కోడ్ వచ్చాకే కావడం గమనార్హం. అయితే, ఈసీని మాయ చేసేందుకు పాత తేదీలతోనే దీనిని చేపడుతున్నట్టు తెలిసింది.

### రెవెన్యూ తిరస్కరణ

జింపెక్స్ కోరుతున్నట్లుగా మరోచోట 100 ఎకరాల భూమిని కేటాయించాలన్న ప్రతిపాదనను రెవెన్యూశాఖ తిరస్కరించింది. దీనికి పలు కారణాలను పేర్కొంది. "2008లోనే భూమిని కేటాయించాం. ఒప్పందం ప్రకారం 2010లో ప్రాజెక్టు అమల్లోకి రావాల్సి ఉన్నా అది జరగలేదు. 2014లో మరో రెండేళ్లపాటు గడువు పొడిగించినా ప్లాంటు ఏర్పాటు చేయలేకపోయారు. ఆ తర్వాత ప్రభుత్వం ఆ భూమిని వెనక్కి తీసుకొని ఎండీసీకి అప్పగించింది. కాబట్టి, ఆ భూమి స్థానంలో మరో చోట 100 ఎకరాలు కేటాయించడం కుదరదు. అలాంటి కేటాయింపు నిబంధనలకు వ్యతిరేకం. ప్రైవేటు, ప్రభుత్వానికి మధ్య వందల ఎకరాల భూమిని మార్చుకోవడం, బదలాయించడం సాధ్యంకాదు. కాబట్టి జింపెక్స్ కోరినట్లుగా 100 ఎకరాల కేటాయింపు సాధ్యంకాదు" అని రెవెన్యూశాఖ స్పష్టం చేసింది. అయినా... పెద్దల్లు వదల్లేదు. జింపెక్స్‌కు ఎలాగైనా భూములు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారు. ఏదో ఒక క్లాజును చూపి భూమి ఇచ్చే మార్గం కనిపెట్టాలని సూచిస్తున్నారు. ఈ మేరకు గనుల శాఖ అధికారితో రెండో లేఖ రాయించారు. ఆ లేఖ ఆధారంగా నిర్ణయం తీసుకోవాలంటూ 'వసూల్ రాజా' ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. నిజానికి వసూల్ రాజాది కూడా ఉమ్మడి కడప జిల్లానే. దీంతో ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవడం గమనార్హం!

# ఏపీఎండీసీ నుంచి తీసుకున్న 7వేల కోట్లు ఏం చేశారు?



▸▸ టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు ఆర్బీఐ నుంచి అప్పులు చేస్తూనే.. మరోవైపు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) నుంచి బాండ్లు జారీ చేయించిన రాష్ట్ర ప్రభుత్వం రూ.7,000 కోట్లు సమీకరించిందని, వాటిని ఆ సంస్థకు ఇవ్వకుండా సొంతానికి ఎలా తీసుకుంటుందని తెలుగుదేశం పార్టీ ప్రశ్నించింది. సాధారణంగా ప్రభుత్వం నెలవారీ ఖర్చు సగటున రూ.5 వేల కోట్లుగా ఉంటుంటే.. ఈ ఏడాది ఒక్క జనవరిలోనే రూ.10,300 కోట్లు ఖర్చుపెట్టిందని.. అంటే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సొంత వారికి రూ.5 వేల కోట్లు పందేరం చేశారని ఆరోపించింది. ఈ చెల్లింపులు ఎవరికి చేశారో.. ఎందుకు చేశారో.. ఆ వివరాలన్నీ బయటపెట్టాలని ఆ పార్టీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మారిపోతే సొంత వారికి బిల్లులు రావని, వారి కోసమే ప్రత్యేకంగా అప్పులుతెచ్చి మరీ భారీగా చెల్లింపులు చేశారని ఆయన విమర్శించారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ప్రభుత్వం పెట్టే ఖర్చులు, చేసే చెల్లింపులు రెవెన్యూ ఖర్చుల కిందకు వస్తాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరులో ఈ ఖర్చు రూ.5,500 కోట్లు, నవంబరులో రూ.5,300 కోట్లు, డిసెంబరులో రూ.6,500 కోట్లుగా ఉంటే.. జనవరిలో ఏకంగా రూ.10,300 కోట్లకు పెరిగింది. సాధారణంగా ప్రభుత్వ ఖర్చు నెలకు రూ.5,000 కోట్లు ఉంటుంది. కానీ, జనవరిలో ఇది రెట్టింపైంది. ఇంత ఖర్చయిందని లెక్క చూపించడం తప్ప.. ఆ వివరాలను ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఎందుకీ గోప్యత..? ఈ డబ్బు ఎవరికి చెల్లించారు..? ప్రజలకు వైసీపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలి' అని విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. 'కాగ్ ప్రకారం జనవరిలో రూ.8,484.84 కోట్లు అప్పుగా తెచ్చారు. అందులో రూ.6,500 కోట్లు రిజర్వ్ బ్యాంక్ నుంచి తెచ్చారు. మిగిలిన సొమ్ము ఎక్కడి నుంచి తెచ్చారో చెప్పడం లేదు. ఎన్నికల ముందు ఇన్ని వేల కోట్లు అప్పు తెచ్చి చెల్లింపులు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఈ చెల్లింపులపై కాగ్ ప్రత్యేకంగా విచారణ జరపాలి' అని విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్ పేరుతో తెచ్చిన అప్పును ఆ కార్పొరేషన్ అవసరాలకు ఇవ్వకుండా ప్రభుత్వం లాక్కొని వాడుకుంటోందని, దీనిపై ఎన్నికల కమిషన్ స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఇంకా ఏమన్నారంటే...

- జనవరిలో రెవెన్యూ శాఖ ఖర్చు రూ.5 వేల కోట్లు ఉండాలి. కానీ.. అది రూ.10,368 కోట్లకు ఎందుకు పెరిగింది?
- ప్రతినెలా చేస్తున్న వాటి కంటే జనవరిలో అదనంగా అప్పులు చేసి.. వాటిని ఎందుకు ఖర్చు చేశారు..?
- ఏ కాంట్రాక్టర్లు, ఏ అస్మదీయుల కోసం వాటిని చెల్లించారు..?
- ఎన్నికల కోడ్ అమల్లోకి రావడానికి ముందు ఏపీఎండీసీ పేరుతో బాండ్లు జారీ చేసి రూ.7 వేల కోట్లు సమీకరించారు. ఆర్బీఐ ద్వారా అప్పులు చేస్తూనే ఇంత పెద్ద మొత్తంలో నిధులు సమీకరించాల్సిన అవసరం ఏమిటి?
- ఏపీఎండీసీ నుంచి సమీకరించిన రూ.7వేల కోట్లు ప్రభుత్వానికి పన్నుల ద్వారా వచ్చిన ఆదాయం కాదు. ఒక కార్పొరేషన్ బాండ్లు జారీ చేయడం ద్వారా వచ్చిన సొమ్మని.. రాష్ట్ర ప్రభుత్వం తీసేసుకుని తన సొంతానికి ఎలా వాడుకుంటుంది? ఈ విషయంలో కాగ్ వెంటనే స్పందించాలి.
- ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఖర్చులపై ఈసీ నియంత్రణ విధించాలి.

## క్షమాభిక్ష ఓకే... విమాన టికెట్ ఎలా?

▸▸ కువైత్‌లోని రాయలసీమ వాసులకు కొత్త కష్టాలు

▸▸ సాయం కోసం 20 వేల మంది ఎదురుచూపులు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: కువైత్‌లో వీసా నిబంధనలు ఉల్లంఘించి ఉంటున్న విదేశీయులకు ఆ దేశం క్షమాభిక్ష ప్రసాదించినా స్వదేశానికి వచ్చేందుకు అవసరమైన సహకారం అందని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కువైత్ ప్రభుత్వం కల్పించిన మినహాయింపుతో ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతానికి చెందిన దాదాపు 20 వేల మంది వరకూ స్వదేశం చేరే మార్గం కోసం అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలోనే అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలానికి చెందిన కురపల్లి అంజలీ అనే మహిళ గత మూడు రోజులుగా కువైత్‌లోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతుంది. స్వదేశం వెళ్లేందుకు ఆమె చేస్తున్న ప్రయత్నాలకు సహకరించేవారే కరవయ్యారు. ఉద్యోగం క్రమబద్ధీకరణ చేసుకోవడానికి అవసరమైన ప్రభుత్వ ఫీజు చెల్లించడానికి అనేక మంది తెలుగు ప్రవాసీయులు ఆనాసక్తి ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సమయం కావడంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమపట్ల సానుభూతితో వ్యవహరించి విమాన టిక్కెట్లకు అవసరమైన ఆర్థిక సాయం చేస్తాయేమోనని వారంతా ఎదురుచూస్తున్నారు. ఆర్టికల్ 20 వీసా కలిగిన పేదలకు ప్రభుత్వమే ఉచిత విమానయానం కల్పించి వారిని ఇళ్లకు చేర్చాలని టీడీపీ నాయకుడు కోడూరి వెంకట్ విజ్ఞప్తి చేస్తున్నారు. 2018లో క్షమాభిక్ష ప్రకటించినప్పుడు కూడా రాయలసీమకు చెందిన అనేక మంది దరఖాస్తులు చేసుకున్నా పాస్ పోర్టులు పొందిన తర్వాత స్వదేశానికి తిరిగి వెళ్లడంలో విఫలమయ్యారని అధికారులు పేర్కొంటున్నారు.



కోర్టు భవనాల సముదాయాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాగూర్

## చట్టాలకు లోబడి జీవించాలి

▸▸ నందిగామ కోర్టు భవనాల ప్రారంభోత్సవంలో జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాగూర్

నందిగామ, మార్చి 19: ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి జీవించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాగూర్ పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో నిర్మించిన న్యాయస్థానాల భవన సముదాయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి జీవించాలన్నారు. న్యాయవాదులు క్రమశిక్షణతో పనిచేసి బార్, బెంచ్ సంబంధాలు పటిష్టపరచాలని సూచించారు. జూనియర్ న్యాయవాదులు అంకితభావంతో పనిచేసి వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. చట్టాల పట్ల పటిష్టమైన అవగాహన కలిగివుంటే కక్షిదారులకు న్యాయం చేయవచ్చని పేర్కొన్నారు. కోర్టుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. డబ్బు కంటే కక్షిదారులకు న్యాయం చేయడమే న్యాయవాదికి ప్రధానమని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎ.వి.శేషసాయి, జస్టిస్ వి.ఆర్.కె.కృపాసాగర్, జస్టిస్ వి.శ్రీనివాస్, జస్టిస్ వి.గోపాలకృష్ణారావు, జస్టిస్ మండవ కిరణ్మయి, కృష్ణాజిల్లా ప్రిన్స్‌పల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి అరుణసారిక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.





## 150 కిలోల వ్యక్తికి మోకీళ్ల మార్పిడి విజయవంతం

▸▸ గుంటూరు సాయిభాస్కర్ హాస్పిటల్ ఘనత

▸▸ అధిక బరువు ఆపరేషన్‌కు అడ్డుకాదు: డాక్టర్ నరేంద్రరెడ్డి



డాక్టర్ నరేంద్రరెడ్డితో మురళీకృష్ణ

గుంటూరు (మెడికల్) మార్చి 19: 150 కిలోల బరువు ఉన్న వ్యక్తికి గుంటూరు సాయిభాస్కర్ హాస్పిటల్‌లో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు సాయిభాస్కర్ హాస్పిటల్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ.. ఈ ఆపరేషన్‌లో సరికొత్త రోబోటిక్ టెక్నాలజీ వినియోగించామని తెలిపారు. వంద శాతం కచ్చితత్వంతో ఇంప్లాంట్ ఎలైన్‌మెంట్‌ను సాధించామని చెప్పారు. అధిక బరువు మోకీళ్ల మార్పిడి ఆపరేషన్‌కు అడ్డుకాదని స్పష్టంచేశారు. కృష్ణా జిల్లా గంపలగూడేనికి చెందిన మురళీకృష్ణ (52) అధిక బరువు కారణంగా మోకీళ్లు 30 డిగ్రీల వరకు వంగిపోయి నడవటం కూడా కష్టంగా మారింది. బాధితుడు స్థూలకాయుడు కావడంతో మోకీళ్ల మార్పిడి సర్జరీకి పలు ఆసుపత్రులు విముఖత చూపాయి. ఆపరేషన్ చేసినా ఫలితం ఉండదని వెనక్కి పంపాయి. ఈ నేపథ్యంలో బాధితుడు ఇటీవల గుంటూరులో డాక్టర్ నరేంద్రరెడ్డిని సంప్రదించారు. రోబోటిక్ టెక్నాలజీ వినియోగించి ఇంప్లాంట్ అమరికలో వంద శాతం కచ్చితత్వం ఉండేలా చేస్తే ఫలితంగా బాగుంటుందని ఆయన చెప్పడంతో రోగి అంగీకరించారు. ఈ నెల మొదటి వారంలో ఆధునిక రోబోటిక్ టెక్నాలజీతో డాక్టర్ నరేంద్రరెడ్డి విజయవంతంగా మురళీకృష్ణకు ఆపరేషన్ నిర్వహించారు. సర్జరీ తర్వాత ఎలాంటి ఇబ్బంది లేకుండా నడుస్తున్నానని, మోకీళ్ల ఆపరేషన్‌తో తనకు పునర్జన్మనిచ్చిన డాక్టర్ నరేంద్రరెడ్డికి మురళీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కాగా 25-30 ఏళ్ల వరకు ఇంప్లాంట్ పని చేస్తుందని, రోగికి నడకలో ఎటువంటి ఇబ్బంది ఉండదని డాక్టర్ నరేంద్రరెడ్డి వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## ఎన్నికల వేసవి!

సార్వత్రిక ఎన్నికలకూ, నాలుగురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో రాబోయే వేసవికి ఎన్నికలవేడి కూడా తోడవుతోంది. అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు, ఆధునిక సౌకర్యాలు అందివచ్చినప్పటికీ, దేశ తొలిసార్వత్రిక ఎన్నికల తరువాత మళ్ళీ అంతటి సుదీర్ఘ ఎన్నికల ప్రక్రియలో దాదాపు 97కోట్ల మంది ఓటర్లు పాల్గొనబోతున్నారు. ఈ ప్రక్రియ నలభైనాలుగురోజులకు విస్తరించడం వెనుక పాలకపక్షం ప్రయోజనాల పరిరక్షణ ఉన్నదన్న విమర్శలూ వింటున్నాం. ఇక, ఎన్నికలతో ముడిపడిన మరో రెండు కీలక పరిణామాలు చోటుచేసుకున్నప్పుడే ఈ షెడ్యూల్ కూడా విడుదలైంది. ఒకపక్క, ఎన్నికల బాండ్లలో రహస్యాన్ని విప్పే లక్ష్యంతో సుప్రీంకోర్టు ఆదేశానిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెంటపడుతోంది. మరోవైపు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని కమిటీ 2029నుంచి జమిలికి పోవాల్సిందేనంటూ వందలపేజీల నివేదికను రాష్ట్రపతికి సమర్పించింది.

ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతను, నిబద్ధతను అంచనావేసే, అనుమానించే కాలం ఇది. సుప్రీంకోర్టు స్ఫూర్తికి పూర్తిభిన్నం గా ఎన్నికల కమిషనర్లను ఎంపికచేసే కమిటీనుంచి ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, కేంద్రప్రభుత్వం ఆ స్థానంలో హోంమంత్రిని చేర్చుకొని, ప్రతిపక్షనాయకుడి మాట చెల్లుబాటు కాకుండా జాగ్రత్తపడింది. ఇక, పాలకులు గతంలో ఏరికోరి నియమించుకున్న అరుణ్‌గోయల్ ఇప్పుడు హఠాత్తుగా ఎందుకు రాజీనామా చేశారన్నది ఓ బ్రహ్మరహస్యం. ప్రధాన ఎన్నికల కమిషనర్ తప్ప మిగతా రెండుస్థానాలు ఖాళీ కావడంతో, ఆ పోస్టుల భర్తీ జరిగిపోయింది, తన మార్గదర్శకాలకు భిన్నంగా జరిగిన ఆ నియామకాలను నిలువరించడానికి సర్వోన్నత న్యాయస్థానం కూడా ఉత్సాహపడలేదు. ఆ ఇద్దరు కమిషనర్ల నియామకం తీరును ప్రతిపక్ష నాయకుడు అధిర్ రంజన్ 'రిగ్గింగ్'తో పోల్చిన విషయం తెలిసిందే. ఎన్నికల షెడ్యూల్‌ను నెలలతరబడి సాగదీయడం వెనుక బీజేపీకి ప్రయోజనం కలిగించే ఉద్దేశం ఈసీకి ఉన్నదన్న విమర్శలు కొత్తవేమీ కావు. పశ్చిమబెంగాల్‌లో ఏడు దశల్లో ఎన్నికలు ఉండేలా షెడ్యూల్ రూపొందడం వెనుక ఏ అంశాలు పనిచేశాయో తెలియదు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించడంతో పాటు, ప్రజలకు ఆ మేరకు నమ్మకాన్ని కలిగించాలి. హద్దులుదాటినవారు ఎంతటివారైనా విడిచిపెట్టకుండా, ఎన్నికలు సజావుగా జరిగేట్టు చూడాలి.

అంత తొందర ఎందుకో తెలియదు కానీ, ఈ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు కొద్దిరోజుల ముందు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ నేతృత్వంలోని కమిటీ జమిలి ఎన్నికలను బలంగా సమర్థిస్తూ నివేదికను సమర్పించింది. పదేళ్ళుగా పాలకులు కలగంటున్న 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'ను ఆచరణసాధ్యం చేయడానికి వీలుగా నివేదిక రూపొందింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేమారు నిర్వహించడం, మరో వందరోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిచేయడం, ఒకే ఓటర్లజాబితా, ఒకే ఐడెంటిటీ కార్డు ఇత్యాదివి అనేకం అందులో ఉన్నాయి. జమిలి ఎన్నికలతో కాలమూ ఖర్చూ కలిసొస్తాయని బీజేపీ ఎప్పటినుంచో అంటోంది. గత ఎన్నికల మానిఫెస్టోలో దానిని తన ఎజెండాగా ప్రకటించింది. 47 రాజకీయపక్షాలు తమ అభిప్రాయాన్ని తెలియచేశాయని, వాటిలో 32 పార్టీలు జమిలికి అనుకూలంగా ఉన్నాయని కోవింద్ అంటున్నారు. ఏకాభిప్రాయంతోనే జమిలిని సుసాధ్యం చేస్తానని బీజేపీ హామీ ఇస్తున్నది కానీ, ఈ మారు అధికారంలోకి వస్తే ఏ విధంగానైనా దానిని ఆచరణలోకి తెస్తుందన్నది నిర్వివాదాంశం. ఏ ఎన్నికల విధానం ద్వారా ప్రజల ఆకాంక్షలకు, మనోభావాలకు ప్రాధాన్యం దక్కుతుందో దానిని ఆచరించడం ముఖ్యం కానీ, ఆర్థికమో, సౌలభ్యమో ప్రాతిపదికలు కాకూడదు. పార్లమెంటు ఎన్నికల్లోనూ, అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రజలు వేర్వేరు అంశాల ఆధారంగా ఓటుచేస్తారు. జమిలి వల్ల రాష్ట్ర, స్థానిక అంశాలు వెనక్కుపోయి జాతీయ ప్రాధాన్యాల ఆధారంగా ఓటింగ్ జరుగుతుందన్నది వాస్తవం. గత రెండు సార్వత్రిక ఎన్నికల్లోనూ ఢిల్లీలోని అన్ని స్థానాలనూ బీజేపీ గెలుచుకుంటే, ఆ మరుసటి ఏడాదిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీ అద్భుతమైన విజయాలు సాధించిన విషయం తెలిసిందే. జమిలిలో జాతీయ అంశాలు కీలకమై, ప్రాంతీయపార్టీలకు నష్టం జరుగుతుంది కనుక, బీజేపీ ఈ విధానాన్ని రుద్దుతున్నదని విపక్షాలు అంటున్నాయి. మందబలంతో రాజ్యాంగసవరణలు చేసి, జమిలిని బలవంతంగా తేవడం కాక, సమాఖ్యస్ఫూర్తికి భిన్నమైన ఈ విధానంపై ముందుగా లోతైన చర్చలు జరగాలి.

---

**ధార్మిక అంశాలను అధ్యాత్మిక దృక్పథంతో మాత్రమే చూడాలి కానీ అందులో రాజకీయ దృష్టి ఉండకూడదు. దేవుడి పేరిట ఓట్లు అడిగే రాజకీయం ఆ వైఖరితోనే ఆరంభమవుతుంది. కాషాయం లేదా ఖజ్జురం అందుకు మినహాయింపు కాదు.**


## రాజకీయ ఇఫ్తార్ విందులు

ధార్మిక సంప్రదాయాలను భక్తి శ్రద్ధలతో పాటించడం ఏ మతానికి సంబంధించిన వారికైనా ఒక వ్యక్తిగత వ్యవహారం. ఆ ఆచారాలను నిష్ఠగా, వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా ఆచరించాలి, అయితే అందుకు భిన్నంగా మత విశ్వాసాల పేర రాజకీయ కోణంతో ఏ రకమైన సందడి చేసినా ఆ ధార్మిక కార్యం అపవిత్రమవుతుంది.

ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష ఇస్లాంలోని ఐదు మౌలిక సూత్రాలలో ఒకటి. ఉపవాస దీక్ష (రోజా లేదా సోం) విరమించే సూర్యాస్తమయ సందర్భం అత్యంత కీలకమైంది. రంజాన్ మాసంలో ఇస్లాం మత విశ్వాసులు ప్రతి రోజూ సూర్యోదయం కంటే ముందు నుంచి ఆహారం, నీళ్ళు లేకుండా దినమంతా పాటించిన దీక్షను సూర్యాస్తమయ సమయంలో ముగిస్తూ తాను చేసిన పాపాలకు ప్రాయశ్చితంగా అల్లాహ్‌ను క్షమాపణ కోరుకోవడం (దీనినే మఘ్ఫిరత్ అని అంటారు) ఇఫ్తార్‌లోని కీలక ఘట్టం. ఇది పూర్తిగా వ్యక్తిగత, ధార్మిక వ్యవహారం. ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం సమాజాలు రంజాన్ పర్వదినాలను రంగరంగ వైభవంగా జరుపుకోవడం పరిపాటి. అయితే ఇఫ్తార్ సందర్భాన్ని మాత్రం పూర్తిగా అధ్యాత్మిక చింతనతో కుటుంబ సభ్యుల మధ్య భక్తితత్పరతతో జరుపుకోవడం ఆనవాయితీ. దురదృష్టవశాత్తు భారతావనిలో ఇఫ్తార్ అనేది రాజకీయ ప్రయోజనాలకు ఒక వేడుకగా మారిపోయింది. ఇస్లాం పేర రాజకీయ పబ్బం గడుపుకొనే అన్ని స్థాయిల ముస్లింల నాయకులకు తోడుగా రాజకీయ పక్షాలు కూడ ఇందులో పాలు పంచుకోవడం వల్ల ఇఫ్తార్ ఉద్దేశ్యం దారి తప్పుతోంది.

**గల్ఫ్ లేఖ**

ఢిల్లీలో రంజాన్ మాసంలో ఇఫ్తార్ అనేది రాజకీయవేత్తలు తప్పకుండా పాల్గొనే ఒక విందు భేటీ. ఈ విందుకు తేదీలను ఎంపిక చేసుకోవడం ప్రముఖ నాయకులకు చాలా కష్టంగా ఉండేది. పార్లమెంటులో అనుసరించవల్సిన వ్యూహాలను కూడ ఒకప్పుడు రాజకీయ పార్టీల ప్రముఖులు ఇఫ్తార్ విందుల సందర్భంగా కలుసుకుని, నిర్ణయించుకునే వారు. ఆ విందులు సాధారణంగా రాజకీయ సయోధ్యకు దోహదం చేసేవి. తెలుగు రాష్ట్రాలలో అటు కర్ణాటక సరిహద్దులో ఆంధ్రప్రదేశ్‌లోని పుంగనూరు మొదలు ఇటు తెలంగాణలో మహారాష్ట్ర సరిహద్దులో సిర్పూర్ వరకు ఇప్పటికీ ఇఫ్తార్ విందు ఏర్పాటు ఒక రాజకీయ అనివార్యతగా ఉన్నది. హైదరాబాద్‌లో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా, జూబ్లీ హాల్ లేదా యల్.బి. స్టేడియంలో ప్రభుత్వమే ఇఫ్తార్ విందులు ఇవ్వడం ఒక ఆనవాయితీగా వస్తోంది. అధికారంలో ఉన్న నాయకులు రావడం, నెత్తిన టోపీ ధరించి, ఖజ్జురపు పళ్ళు తినడం లేదా భాయి సాబ్ నాయకులకు తినిపించడం ఒక సంస్కృతిగా మారిపోయింది. ఈ రకమైన ప్రచార ఆర్భాటాలకు ముస్లిం ధార్మికవేత్తలు అయిన హాఫెజ్, ఆలీం, ఇమాంలు గతంలో దూరంగా ఉండేవారు. అయితే ఇప్పుడు ఈ మతాచార్యులు కూడా ఈ ఇఫ్తార్ విందులలో పాల్గొంటున్నారు.



ఇఫ్తార్ విందులో అధికార పక్షానికి చెందిన ఒక రాజకీయ నాయకుడు వచ్చి టోపీ ధరిస్తే ముస్లిం వర్గాలు సంతోషిస్తున్నాయి. అయితే ఒక ముస్లిం నాయకుడు ఎవరైనా దేవాలయానికి వెళ్ళి వేదపండితుల దీవెనలు తీసుకోవడాన్ని ముస్లిం వర్గాలు, ముఖ్యంగా రాజకీయ శ్రేణులు హర్షించలేకపోతున్నాయి. తెలంగాణలో హైదరాబాద్ నగరం బయట ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గం నిజామాబాద్ అర్బన్. ఇటీవలి శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మొహమ్మద్ అలీ షబ్బీర్, సామాజిక వర్గాల గణంకాల ప్రకారం సునాయాసంగా గెలిచి తీరాలి. అయితే ఆయన 14 వేల ఓట్ల తేడాతో బిజెపి అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని ఒక ఆలయాన్ని సందర్శించిన షబ్బీర్ అలీ వేద పండితుల నుండి ఆశీర్వాదాలు తీసుకోవడాన్ని చూపిస్తున్న ఒక ఫోటోను ఆయన రాజకీయ ప్రత్యర్థులు విస్తృతంగా ప్రచారం చేసారు, షబ్బీర్ అలీ ఓటమికి ప్రధాన కారణాలలో ఆ ఫోటో ప్రచారం ఒకటి. ఇఫ్తార్ పార్టీ విందుకు టోపీ ధరించి వచ్చే హిందూ రాజకీయ నాయకులను చూసి అమితంగా సంతోషించేవారు, షబ్బీర్ అలీ ఒక హిందూ దేవాలయాన్ని సందర్శించడాన్ని సంకుచిత ధోరణితో చూడడం ఎంత వరకు సమంజసం?

రంజాన్ మాసం పూర్తయిన కొద్ది కాలానికి వచ్చేది హజ్ మాసం. నాంపల్లిలోని హజ్ హౌస్ నుండి సౌదీ అరేబియాలోని మక్కాకు వచ్చే యాత్రికుల సేవల నెపంతో నాయకుల ఫోటోల సందడి జుగుప్సాకరంగా ఉంటుంది. మోతాదుకు మించి ప్రభుత్వ జోక్యం, నాయకుల ప్రచారం మంచిది కాదు. ధార్మిక అంశాలను అధ్యాత్మిక దృక్పథంతో మాత్రమే చూడాలి కానీ అందులో రాజకీయ దృష్టి ఉండకూడదు. దేవుడి పేరిట ఓట్లు అడిగే రాజకీయం ఆ వైఖరితోనే ఆరంభమవుతుంది. కాషాయం లేదా ఖజ్జురం అందుకు మినహాయింపు కాదు.

■ **మొహమ్మద్ ఇర్ఫాన్**
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

---

# ఈసీ మాటలు నీటిపై రాతలేనా?



■ ఎ. కృష్ణారావు

**ఇండియాగేట్**

'మేము ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని అనుమతించం..' అని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ గత వారం విజ్ఞాన్ భవన్‌లో ఎన్నికల షెడ్యూలును ప్రకటిస్తూ అన్నారు. కండబలం, ధన బలం, తప్పుడు సమాచారం, ఎన్నికల కోడ్ ఉల్లంఘన.. ఈ నాలుగింటినీ సహించే ప్రసక్తి లేదు అని ఆయన చెప్పారు. ఈ ప్రకటన విన్నవారికి సీఈసీ ఎంతో నిజాయితీగా మాట్లాడుతున్నట్లు అనిపిస్తుంది. కాని గత ఎన్నికల షెడ్యూలు ప్రకటించినప్పుడు కూడా ఎన్నికల కమిషనర్లు ఇదే విధమైన ప్రకటనలు చేశారు. ఈ దేశంలో అధికారులు కూడా బూటకపు ప్రకటనలు చేసే విషయంలో రాజకీయ నాయకులకు ఏ మాత్రం తీసిపోరని గత కొన్ని సంవత్సరాలుగా దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను బట్టి అర్థమవుతోంది. దాదాపు ఏడు దశలుగా షెడ్యూలు ప్రకటించిన నాటి నుంచి దాదాపు 75 రోజుల్లో ఏఏ చీకటి గుహల్లోంచి డబ్బులు బయటకు వస్తాయో ఎవరు కనిపెట్టగలరు? ఇక షెడ్యూలు ప్రకటించకముందు నిర్వహించిన భారీ బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలకు ఎక్కడి నుంచి డబ్బు ప్రవహిస్తోందో ఎవరైనా లెక్కవేసేవారున్నారా?

తెలంగాణలో గత ఎన్నికల్లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చాలా మంది అభ్యర్థులకు చివరి దశలో నిధులు పంపించలేదని, అందుకే వారు ఓడిపోయారని భారత రాష్ట్ర సమితి నేతలే పలువురు చెప్పారు. బహుశా అప్పటికే తాము ఎంత ఖర్చు పెట్టినా ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేయాలని నిర్ణయించుకుని ఉంటారని కేసీఆర్‌కు సమాచారం అందడంతో ఆయన ఎందుకైనా మంచిదని డబ్బులు పంపించకూడదని నిర్ణయించుకుని ఉంటారని వారు చెబుతున్నారు. ఇదే కేసీఆర్ అంతకుముందు మునుగోడులో జరిగిన ఉప ఎన్నికల్లో భారీ ఎత్తున డబ్బులు ఖర్చు పెట్టారని, తమ పార్టీ నేతలే అన్నమాట ప్రకారం డబ్బు ఖర్చు పెట్టలేదని బీజేపీ నేతలు వాపోయారు. ఈ డబ్బుల ఖర్చు విషయంపై ఇద్దరు మాజీ ఎంపీల మధ్య వచ్చిన తగాదా చివరకు ఎలా చల్లారిందో కాని వారిద్దరూ ఇప్పుడు మరో అధికార పార్టీలో చేరారు. నిజానికి 2022 ఎన్నికల్లో ఢిల్లీ మద్యం కుంభకోణం డబ్బును ఆమ్ ఆద్మీ పార్టీ హవాలా మార్గం ద్వారా గోవాకు మళ్లించినట్లు ఆధారాలు దొరికినందువల్లే తీగలాగితే డొంకకదిలినట్లు మొత్తం వ్యవహారం బయటపడిందని ఈడీ తన ఛార్జిషీటులో పేర్కొంది.

ఈ దేశంలో రాజకీయ పార్టీలు ఒకదానికొకటి సహాయపడేందుకు ఎన్నికల నిధులు మళ్లిస్తే గతంలో ఎవరూ పట్టించుకునేవారు కాదు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నిధుల మళ్లింపుపై నిఘా పెట్టింది. సమాజ్‌వాది పార్టీ, జనతాదళ్ (యు), జనతాదళ్ (ఎస్), తృణమూల్ కాంగ్రెస్ తదితర పార్టీల నేతలకు ఎవరెవరు నిధులు పంపారో బీజేపీకి తెలిసినందువల్లనే పంపిన వారిని తమ చెప్పుచేతల్లో ఉంచుకోవడం బీజేపీకి సాధ్యపడిందని చెప్పక తప్పదు. దీని వల్ల భవిష్యత్ రాజకీయ సమీకరణల్ని కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభావితం చేయగలిగారు. తమ పార్టీకోసమే కాకుండా ఇతర రాష్ట్రాల్లో రాజకీయ పార్టీల కోసం కూడా డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు పెట్టాలని నేతలు భావిస్తున్నారంటే ఈ దేశంలో రాజకీయాల్లో ఎంత డబ్బు సమకూరుతుందో అర్థమవుతుంది. కేసీఆర్ తన పార్టీ పేరునే మార్చుకుని ఇతర రాష్ట్రాలకు విస్తరించేందుకు ప్రయత్నించడం, భారీ ఎత్తున దేశంలో వందలాది పత్రికలకు సైతం ప్రకటనలు గుప్పించడం, జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు సైతం నిధులు ఇవ్వచూపినట్లు ప్రచారం జరగడం, ఉప ఎన్నికల్లో సైతం కోట్లాది రూపాయలు ఖర్చు చేయడంతో ఈ దేశంలో ఒక ప్రాంతీయ పార్టీ ధన బలం జాతీయ స్థాయిలో చర్చనీయాంశమయింది. 2014 ఎన్నికలకు ముందు అవినీతికి వ్యతిరేకంగా వేదికను ఏర్పాటు చేసి, అన్నా హజారేతో కలిసి యూపీఏకు వ్యతిరేకంగా ధర్నాలు చేసి ప్రాచుర్యంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఎన్నికల కోసం భారీ ఎత్తున నిధులు సేకరించకపోతే ఇవాళ ఆత్మరక్షణలో పడి ఉండేది కాదు. ఈ పార్టీలే కాదు, దేశంలో ఉన్న మెజారిటీ ప్రాంతీయ పార్టీల అధినేతలు అవినీతి ఆరోపణలు, ఆదాయానికి మించి ఆస్తుల కేసుల్ని ఎదుర్కొన్నవారే. భారతీయ జనతా పార్టీ ఈ బలహీనతల ఆధారంగా తన సామ్రాజ్యాన్ని నిర్మించుకుంది. పోనీ అలా అని ఆ పార్టీ ఎన్నికల వ్యవస్థను ఏమైనా ప్రక్షాళనం చేయగలిగిందా అంటే అదీ లేదు. అన్ని సామ, దాన, బేధ, దండోపాయాలను ఉపయోగించుకుని రాజకీయ నిధుల సమీకరణలో బీజేపీ అన్ని పార్టీలను తలదన్నిందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించిన ఎన్నికల బాండ్ల వివరాలను బట్టి తెలుస్తోంది. అయితే ఎన్నికల బాండ్ల ద్వారా సమీకరించిన మొత్తం ఎన్నో రెట్లు ఎక్కువ మొత్తంలో ధన ప్రవాహం జరుగుతోందని అన్ని రాజకీయ పార్టీలకు తెలుసు. 'When Crime Pays: Money and Muscle in Indian Politics' అని వాషింగ్టన్‌లో కార్నెగీ ఎండోవ్‌మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్‌లో సీనియర్ ఫెలోగా ఉన్న మిలన్ వైష్ణవ్ రాసిన పుస్తకంలో రాజకీయాల్లోకి రాకముందే జగన్మోహన్ రెడ్డి ఆస్తులు ఎలా పెరిగాయో వివరించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పుడు కేవలం రూ. 9లక్షల మేరకే ఆస్తులు ఉన్న జగన్ నికర ఆస్తుల విలువ 2014 నాటికి రూ. 400 కోట్లకు పైగా దాటిందని ఆయన తెలిపారు. భారీ ఎత్తున సంపాదించి ఉండకపోతే కాంగ్రెస్ పార్టీనే ఎదిరించి ఒక రాజకీయ పార్టీ పెట్టగల ధైర్యం ఆయనకుండేది కాదేమో. ఇక అధికారంలోకి వచ్చిన తర్వాత గత అయిదు సంవత్సరాల్లో జగన్ ఎంత మేరకు సమీకరించారో, ఈ ఎన్నికల్లో ఎంత ధనం ప్రవహిస్తుందో ఊహించాల్సిందే.

జగన్‌కు, కానీ, కేసీఆర్‌కు కానీ, బీజేపీ, కాంగ్రెస్ వంటి ఇతర పార్టీల నేతలకు కానీ నిధులు సమకూర్చేందుకు కార్పొరేట్ సంస్థలు ఎన్నికల బాండ్ల రూపంలోనే కాకుండా దొడ్డిదారిన కూడా ముట్టజెబుతున్నాయి మైనింగ్, ఇరిగేషన్ ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్, మద్యం, ఇసుక, గేమింగ్, ఫార్మా, టెలికమ్యూనికేషన్, కాంట్రాక్ట్, ప్రైవేట్ విద్యాసంస్థలు, మాదక ద్రవ్యాలు మొదలైన అనేక రంగాల నుంచి రాజకీయ పార్టీలకు డబ్బులు చేరుతున్నాయి.

2016 నవంబర్ 8న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ దేశంలో నల్లధనాన్ని రూపుమాపేందుకు పెద్ద నోట్ల రద్దును ప్రకటించిన తర్వాత ఎన్నికల రాజకీయాల్లో నల్లధనం పాత్ర పెరిగిందే కాని తగ్గిన దాఖలాలు లేవు. అసలు ఎన్నికల్లో ఎన్ని వేల కోట్ల ఖర్చవుతున్నదో చెప్పేందుకు కొలమానాలు లేవు. ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం 2019 ఎన్నికల్లో తమిళనాడులో రూ. 900 కోట్లు పట్టుబడగా, ఆ తర్వాత గుజరాత్‌లో రూ. 552 కోట్లకు పైగా స్వాధీనపరుచుకున్నారు. దేశ వ్యాప్తంగా దాదాపు రూ. 3500 కోట్ల మేరకు దొరికాయి. ఈ లెక్కల్ని చూపి తాము ధన బలాన్ని అరికట్టామని ఎన్నికల కమిషన్ చెప్పుకోవడం హాస్యాస్పదమే. 2019 లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు రూ. 60వేల కోట్లు ఖర్చు చేశారని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ జరిపిన ఒక అధ్యయనంలో తేలింది. ఇందులో 45 శాతం బీజేపీయే ఖర్చు పెట్టిందని ఈ సంస్థ తెలిపింది. ప్రతి లోక్‌సభ నియోజకవర్గానికి రూ. 100 కోట్లు ఖర్చు పెట్టారని, ప్రతి ఓటరుకు ఓటుకు కనీసం రూ. 700 చెల్లించారని ఈ సంస్థ అంచనా వేసింది. కాని నిజానికి ఈ అంచనా కూడా తక్కువే. కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్‌కు కనీసం రూ.5వేలు చెల్లించిన సందర్భాలు కూడా ప్రజల అనుభవంలో ఉన్నాయి ఈ నేపథ్యంలో ప్రతి లోక్‌సభా నియోజకవర్గానికీ అభ్యర్థికి రూ. 95 లక్షలు మాత్రమే ఖర్చు పెట్టాలన్న పరిమితి విధించామని సీఈసీ రాజీవ్ కుమార్ చెబుతుంటే ఎవరికైనా నవ్వు రాకమానదు. కార్పొరేటర్ ఎన్నికకు కూడా ఇంతకంటే ఎక్కువే ఖర్చవుతుందని చాలా మందికి తెలుసు.

ధనబలం సంగతి పక్కనపెడితే కండబలం, తప్పుడు సమాచారం, ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై కూడా ఎన్నికల కమిషన్ తాను ప్రకటించినట్లుగా చర్యలు తీసుకుంటుందని కూడా నమ్మడానికి వీలు లేదు. ఈ దేశంలో నేతలపై ఉన్న కేసులను చూస్తుంటే నేరచరితులకూ, రాజకీయ నాయకులకూ మధ్య విభజన రేఖ చెరిగిపోతోందని మిలన్ వైష్ణవ్ అన్నారు. కేవలం డబ్బు మాత్రమే కాదు, 2014 ఎన్నికల్లో 5వేల కిలోల మాదక ద్రవ్యాలను ఎన్నికల కమిషన్ అధికారులే స్వాధీనపరుచుకున్నారు. కనీసం ఏడు భారీ స్విమ్మింగ్ పూల్స్‌లో నింపగల మద్యం పట్టుబడిందని అధికారులు తెలిపారు. దాదాపు 40శాతం మంది నేరచరితులు రాజకీయాల్లో ప్రవేశిస్తున్నారు.

ఇక ఎన్నికల ప్రచారంలో నేతలు అత్యధికంగా తప్పుడు ప్రచారం చేయడంతోనే కాలక్షేపం చేస్తారని, ఊకదంపుడు ఉపన్యాసాలతో మభ్యపెడతారని ఎవరి ప్రసంగాలు విన్నా అర్థమవుతోంది. ఇక సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్ గురించి చెప్పనక్కర్లేదు. వాటన్నింటినీ పరిశీలించి వెనువెంటనే చర్య తీసుకోగల సామర్థ్యం కమిషన్‌కు లేదు. విద్వేష ప్రసంగాల విషయంలో కూడా ఎన్నికల కమిషన్ చేయగలిగింది ఏమీ లేదు. పార్లమెంట్‌లో విద్వేష ప్రసంగాలు చేసిన వారికే తిరిగి టిక్కెట్లు ఇస్తున్నారు. మత, కుల ప్రాతిపదికగా ప్రచారాన్ని పూర్తిగా అరికట్టడం, ముఖ్యంగా అధికార పార్టీ నేతల నోళ్లకు తాళం వేయడం కూడా ఎన్నికల కమిషన్‌కు సాధ్యం కాదని ఎన్నో ఉదంతాలను ఉదహరించవచ్చు.

నిజానికి ఎన్నికలు స్వేచ్ఛగా సజావుగా, జరగాలంటే ప్రభుత్వానికి ఎన్నికల సంస్కరణలను చిత్తశుద్ధితో అమలు చేయగల నిజాయితీ ఉండాలి. లా కమిషన్‌తో పాటు ఎన్నో కమిటీలు సూచించిన సంస్కరణలను బుట్టదాఖలు చేశారు. జమిలి ఎన్నికలు అమలు చేసే ముందు ఎన్నికల సంస్కరణలను అమలు చేసినప్పుడే ఈ దేశంలో నిజమైన మార్పును ప్రభుత్వం కోరుతున్నట్లు భావించగలం.

(ఆంధ్రజ్యోతి డిల్లీ ప్రతినిధి)




**ప్రతి లోక్‌సభా నియోజకవర్గానికీ అభ్యర్థికి రూ. 95 లక్షలు మాత్రమే ఖర్చు పెట్టాలన్న పరిమితి విధించామని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ చెబుతుంటే ఎవరికైనా నవ్వు రాకమానదు. ఒక కార్పొరేటర్ ఎన్నికకు కూడా ఇంతకంటే ఎక్కువే ఖర్చవుతుందని చాలా మందికి తెలుసు. ధనబలం సంగతి పక్కనపెడితే కండబలం, తప్పుడు సమాచారం,ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై ఎన్నికల కమిషన్ తాను ప్రకటించినట్లుగా చర్యలు చేపడుతుందా?**

---

# రాజకీయ సీతాకోక చిలకలున్నాయి జాగ్రత్త!


ఎన్నికల వేళ, ఒక పార్టీనించీ ఇంకో పార్టీకి మారడాలు (ఫిరాయింపులు) మొదలవుతాయి. నిన్నటిదాకా, ఒకర్ని ఒకరు చాలా సున్నిత పదాలతో (లుచ్ఛా, లఫంగ్, సన్నాసీ, బట్టేబాజ్ వగైరా) విమర్శించుకున్నవారే, స్నేహాలింగనాలు చేసుకుంటారు, ఇలాంటి వాటిని చూసి ఎవరైనా ఆశ్చర్యపోతే, మన రాజకీయ నాయకులు చెప్పే మాటలు: 'రాజకీయాల్లో శాశ్వత మిత్రులూ, శాశ్వత శత్రువులూ అంటూ వుండరు! 'రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చు!' అని. ఆ మాట నిజమే. కాకపోతే, 'బూర్జువా రాజకీయాలలో...' అనే మాట చేర్చితే కరెక్టుగా వుంటుంది. 'బూర్జువా రాజకీయ పార్టీలకేనా ఈ లక్షణాలున్నాయి? కమ్యూనిస్టు పార్టీలు పెట్టుకునే పొత్తుల సంగతేమిటి?' – అనే ప్రశ్న ఎవరికైనా వస్తే, అది సిద్ధాంత అమాయకత్వం అవుతుంది. శ్రామిక జనాలకు వర్గ చైతన్యం నేర్పవలిసిన వారు, ఆ పనికి తిలోదకాలిచ్చి, ఎప్పుడైతే ఓట్ల రాజకీయాల్లోకి దిగారో, అప్పట్నించీ కమ్యూనిస్టుపార్టీలు కూడా, అటు కేంద్రంలోగానీ, ఇటు రాష్ట్రాల్లోగానీ, ఏదో ఒక బూర్జువా పార్టీతో పొత్తులు పెట్టుకుంటున్నారు.

పార్టీ ఫిరాయింపులకు పాల్పడే వారు చెప్పే కారణాలు రకరకాలు: 'నా నియోజకవర్గ ప్రజల కోసం', 'రాష్ట్ర ప్రయోజనాల కోసం', 'దేశ శ్రేయస్సు కోసం', 'నాకు అక్కడ తగిన గుర్తింపు లేదు, గౌరవం లేదు', 'ఈ పార్టీ వారి భావజాలం నచ్చింది', 'ఆ పార్టీకి భవిష్యత్తు లేదు, మునిగిపోయే నావ అది', '...గారి నాయకత్వం దేశానికి అవసరం' – ఇలా చాలా కారణాలు చెపుతారు.

ఇలా ఫిరాయించిన వారిని, పరమ అవినీతిపరులని నిన్నటిదాకా అన్న వాళ్ళే, తమ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తారు. అవినీతి ఆరోపణలూ, కేసులూ అన్నీ క్షణాల్లో మటుమాయం! అందుకే, 'ఆ పార్టీ వాషింగ్ మెషీన్ వంటిది' అనీ, 'ఆ పార్టీ పవిత్ర గంగానది వంటిది' అనీ పోలికలు వచ్చాయి. ఎన్నికల సమయానికి ఎక్కువ బలం వున్న పార్టీలోకి గెంతేవారిని రాజకీయ సీతాకోక చిలకలు అంటారు. 'రాజకీయ సీతాకోక చిలకలు' ('పొలిటికల్ బటర్‌ఫ్లైస్') అనే మాట రాజకీయ రంగంలో ఫిలిప్పైన్స్ దేశంలో వాడతారు. ప్రకృతిలోని కీటకాలైన సీతాకోక చిలకలు ఎక్కడ, ఏ పువ్వులో తేనె దొరికితే అక్కడ వాలి, ఆ తేనెని జుర్రుకుంటాయో, అలాగే సమాజంలోని రాజకీయ నాయకులు కూడా ఆ సమయానికి ఏ పార్టీకి ఎక్కువ అధికార బలం వుంటే అక్కడికి ఫిరాయించుతారు– అని అర్థం.

పార్టీ ఫిరాయింపుల గురించి ఎన్నికల వ్యవస్థలో సంస్కరణల కోసం ప్రయత్నించే ఒక సంస్థ, 2014 నించీ, 2021 వరకూ, ఏడేళ్ళ కాలంలో జరిగిన ఎన్నికల్లో, ఏ పార్టీనించీ ఏ పార్టీకి ఫిరాయింపులు జరిగాయో, లెక్కలతో సహా అన్ని పార్టీల వివరాలూ ఇచ్చింది. ఉదాహరణకి, కాంగ్రెస్ నించీ బీజేపీ వైపు 399 మంది ఫిరాయించారు. వాళ్ళలో ఎమ్మెల్యేలూ, ఎంపీలూ 177 మంది వున్నారు. బీజేపీ నించీ కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన వారు 115 మంది. వాళ్ళలో 61 మంది ఎంపీలూ, ఎమ్మెల్యేలూనూ. ప్రాంతీయ పార్టీల నించీ ఫిరాయించిన వాళ్ళ లెక్కలూ; ప్రాంతీయ పార్టీలలోకి ఇతర పార్టీలనించీ వచ్చిన వాళ్ళ లెక్కలూ కూడా ఉన్నాయి. ఇటీవలి కాలంలో, గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రులుగా వున్న వారు 13 మంది బీజేపీలో చేరారని రాజ్‌దీప్ సర్దేశాయి ఇచ్చిన లెక్క (ఆంధ్రజ్యోతి, ఫిబ్రవరి 23). బీజేపీ ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఎనిమిది మంది గతంలో, కాంగ్రెస్‌లోకి ఫిరాయించారట!

ఇలా పార్టీలు మారడం ఎలా చెయ్యగలుగుతున్నారు– అనే ప్రశ్నకి జవాబు, ఆ పార్టీల మధ్య నిజమైన తేడా అంటూ ఏమీ లేకపోవడమే! శ్రమ దోపిడీ ద్వారా వచ్చే కౌళ్ళూ, వడ్డీలూ, లాభాలూ, వర్తక కమిషన్లూ– వంటి ఆదాయ మార్గాలను అనుమతించే పవిత్ర రాజ్యాంగం మీద ప్రమాణం చేసి, అన్ని రాజకీయాల పార్టీల వారూ ఎన్నికల్లో పాల్గొంటారు. అధికారంలోకి వచ్చాక అన్ని పార్టీల ప్రభుత్వాలూ అమలు చేసే విధానాలు ఒకటే. తమకు దగ్గరగా వుండే పెట్టుబడిదారులకు (అంటే బాగా చందాలిచ్చే వాళ్ళకు) పందారాలు పెడతారు, భూముల కేటాయింపూ, ఇతర రాయితీలూ వగైరా. శ్రామిక జనాలకు ద్రోహం చేసే ప్రైవేటీకరణా, సరళీకరణా, ప్రపంచీకరణా అనే విధానాల్ని పకడ్బందీగా అమలు చేస్తారు. వాటిని ప్రవేశపెట్టిన నాయకుణ్ణి, 'సంస్కరణల పితామహుడు' అని అన్ని పార్టీలవారూ కీర్తిస్తారు. (అదే ఒక నాయకురాలైతే, ఆమెని 'ఐరన్ లేడీ' అంటారు.) అడవుల్ని ధ్వంసం చేసి, గనులు తొలిచి, గిరిజనుల బ్రతుకు తెరువుని ధ్వంసం చేయడానికి పెట్టుబడిదారులకు ఎడా పెడా అనుమతులిస్తారు. దానికి వ్యతిరేకంగా, గిరిజనుల్ని సంఘటితం చేసే ఉద్యమకారుల్ని, 'ఆపరేషన్ గ్రీన్ హంట్' పేరుతోనో, 'ఆపరేషన్ సమాధాన్' పేరుతోనో అణచివేయడానికి ప్రయత్నిస్తారు. ఆ అణచివేతని ఆ ప్రాంతాల్లో వుండే అధికార పార్టీలూ, ప్రతిపక్ష పార్టీలూ, రెండూ ఏకకంఠంతో సమర్థిస్తాయి. ప్రజల్లో రకరకాల సెక్షన్ల వారు (ఉదా: అంగన్‌వాడీ కార్మిక స్త్రీలు) జీతాలు పెంచమని అడిగితే లాఠీ చార్జీలూ, బాష్పవాయువులూ, వాటర్ కేనన్లూ ప్రయోగిస్తారు. కొన్ని సార్లు, కొన్ని చోట్ల గుర్రాలతో తొక్కించడాలు కూడా చేస్తారు. రైతులు ఉద్యమిస్తే, వాళ్ళకి టెరరిస్టుల ముద్ర వేస్తారు. ఉన్న రాజ్యాంగం పరిమితుల్లోనే అయినా, ప్రజల పక్షాన ప్రశ్నలు లేవనెత్తే మేధావుల్ని అర్బన్-నక్సలైట్లు అనో, జాతివ్యతిరేకులు అనో ముద్రవేసి, తప్పుడు కేసులు పెడతారు. విచారణ లేకుండా ఏళ్ళ తరబడి జైళ్ళలో ఉంచుతారు. ఈ విధానాలను అన్ని పార్టీలూ– బీజేపీ, కాంగ్రెస్సూ లాంటి జాతీయ పార్టీలే కాదు, ప్రాంతీయ పార్టీలు కూడా– అమలు చేస్తాయి, చేశాయి. కాకపోతే, సాధించిన సీట్లని బట్టి, అంటే మెజారిటీని బట్టి, ఆ విధానాల వేగమూ, తీవ్రతా వుంటాయి. ఎవరికి ఎక్కువ సీట్లు వస్తే, వాళ్ళకి చట్టబద్ధ ప్రజామోదం ('జనాదేశ్', 'లెజిటిమసీ') ఉన్నట్టు లెక్క. ఆ ప్రజామోదం పేరుతో, ఏదైనా చెయ్యొచ్చు. అందుకే ఓట్ల కోసం నానా వేషాలూ వేస్తారు. తీరా ఓటు వేశాక జనాల్ని పట్టించుకోరు. కాబట్టి ఓటర్లు చెయ్యవలిసింది ఏమిటీ– అనే ప్రశ్న వస్తుంది.



**ఎన్నికల సమయానికి ఎక్కువ బలం వున్న పార్టీలోకి గెంతేవారిని రాజకీయ సీతాకోక చిలకలు అంటారు. ప్రకృతిలోని కీటకాలైన సీతాకోక చిలకలు ఎక్కడ, ఏ పువ్వులో తేనె దొరికితే అక్కడ వాలి, ఆ తేనెని జుర్రుకుంటాయో, అలాగే సమాజంలోని రాజకీయ నాయకులు కూడా ఆ సమయానికి ఏ పార్టీకి ఎక్కువ అధికార బలం వుంటే అక్కడకి ఫిరాయించుతారు– అని అర్థం.**

ఓటర్లు (ప్రజలు) పని స్థలాలలోనూ, నివాస స్థలాలలోనూ సంఘాలుగా ఏర్పడి, ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రయత్నాలు చేస్తూ పోవాలి. బాతాఖానీ క్లబ్బులుగా, కాలహరణ కేంద్రాలుగా పేరు గడించిన చట్టసభలకి వెళ్ళి వెలగపెట్టేదేమీ లేదని తేలిపోయింది కాబట్టి, చట్టసభల బయట జరిగే పోరాటాలకే పూర్తి సమయాన్ని ఉపయోగించాలి. ఇప్పటికే ఎన్నో సంఘాలున్నా, చాలా వరకూ ఏదో ఒక ఓట్ల రాజకీయ పార్టీ నాయకత్వాన వున్నాయి. కొత్తగా ఏర్పడే సంఘాలు గానీ, పాత సంఘాలే గానీ, సమస్యల పరిష్కారం గురించే ఆలోచించాలి. ఎవరు అధికారంలో వున్నా ప్రశ్నించేలా తయారు కావాలి. కొన్ని గ్రామాల ప్రజలు, తమ గ్రామ సమస్యల్ని పరిష్కరించనందుకు నిరసనగా, ఎన్నికల్ని బహిష్కరించిన సందర్భాలు చూశాం.

ఇప్పుడున్న పరిస్థితుల్లో, ఓటు హక్కువల్ల ఏమీ ఉపయోగం లేదని భావించే వారు, ఓట్లు వెయ్యడానికి ఆసక్తి చూపడం లేదు. (ఈ అనాసక్తి, ఎప్పుడో 70 ఏళ్ళనాడే వున్నట్టు, సాహిత్యంలో ఒకటి రెండు ఉదాహరణలు కనిపిస్తాయి. చలం గారు 1937కీ–1955కీ మధ్య రాసిన మ్యూజింగ్స్‌లో ఒక దానిలో, ఇలా వుంది: 'ఈ వోటులో చాలా మోసం వుంది. నువ్వేకదా ఎన్నుకున్నది ప్రభుత్వాన్ని – అంటారు. పైగా, వోట్లతో ఎన్నుకున్న మునిసిపలు వ్యవహారాలు ఇన్ని ఏళ్ళూ ఒకే రకంగా నడిచాయి. ఎవణ్ణి ఎన్నుకున్నా ఫలితం వొకటే కదా – అని వోటు మీది ఉత్సాహం తగ్గిపోతోంది ప్రజకి.') ఓటర్ల అనాసక్తి, పోలయ్యే ఓట్ల సంఖ్యని బట్టి కూడా తెలుస్తుంది. ఒక లెక్క ప్రకారం మొత్తం ఓటర్లలో, మూడో వంతు మంది, అంటే నూటికి 33 మంది ఓట్లు వెయ్యడం లేదు. తమ ఓటుని ఏ పార్టీ వాళ్ళో దొంగగా వేసేస్తారేమో అనే అనుమానం వుంటే, తమ ఓటు హక్కుని ఉపయోగించుకుందాం అని అనుకుంటే, 'నోటా' అనే దాని మీద మీట నొక్కాలి. ఆ రకంగా, 'ఇప్పుడున్న పార్టీలన్నీ ఒకే రకం అయినవి. ఏవీ కూడా ప్రజల సమస్యల్ని పట్టించుకోవు' అని నిరసనను తెలియపరచవచ్చును.

ఇంతకీ తక్షణంగా జరగవలిసింది ఏమిటంటే: కారణాలు చెప్పి ఓట్లు వేయడం మానెయ్యడం, ఒక వేళ వేసినా, అన్ని పార్టీలకూ నిరసనగా 'నోటా' మీట నొక్కడం! తర్వాత కొన్నాళ్ళకు అసలు చెయ్యవలిసిందేమిటో, అనుభవంలో తెలుస్తుంది.

● **ఈడ్పుగంటి నౌరోజీ**

---

## నేరస్థులను సంస్కరించేలా జైలుశిక్ష

రిమాండ్‌కు పంపబడిన ఖైదీలు సుదీర్ఘకాలపు జైలుశిక్షతో మానసికంగా కుంగిపోయి అనారోగ్యంపాలై జీవితం మీద విరక్తి చెందుతున్నారు. నలభై, యాభై సంవత్సరాల క్రితం సామాన్య ప్రజలలో నేరచరితులు తక్కువ. ఆంగ్లేయుల పాలనలో స్వాతంత్ర్య పోరాటం చేసిన భారతీయ నాయకులెందరినో అకారణంగానే జైళ్ళలో బంధించారు. వారంతా పోరాటాలు తప్ప, నేరాలు చేయలేదు. జైలుశిక్ష అనుభవిస్తున్న కాలంలో గాంధీ, నెహ్రూ, వాజ్‌పాయ్, లాంటి చాలామంది నాయకులు మానవాళి సంస్కరణకు అనేక విశిష్ట రచనలు చేశారు. కాలక్రమేణా వచ్చిన మార్పులతో ఇప్పుడిప్పుడే విదేశాల్లోను, మనదేశంలో కూడా చాలాచోట్ల శిక్షాకాలంలో ఖైదీలతో పనిచేయిస్తూ, ఉపాధి కల్పిస్తూ సరైన మార్గంలో నడిచే విధంగా కొత్త ఆలోచన చేస్తుండడం ఆహ్వానించదగ్గ పరిణామం.



కొన్నిచోట్ల చిన్న చిన్న కుటుంబ తగాదాలు, ఆర్థిక నేరాలకు పాల్పడ్డవారిని కూడా కరుడుగట్టిన నేరస్థుల మధ్య ఉంచి అగౌరవంగా చూడడం, కొన్ని సందర్భాల్లో థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, జైల్లో మరుగుదొడ్లు కడిగించడం లాంటి పనులు చేయిస్తూ వారు మానసికంగా కృంగిపోయేలా చేస్తున్నారు. క్షణికావేశంలో నేరం చేసి, పశ్చాత్తాపానికి కూడా అవకాశం లేక జైలుశిక్ష అనుభవిస్తున్న వారి మానసిక వేదన వర్ణనాతీతం. నేర స్వభావంతోనే నేరం చేసినా శిక్షాకాలంలో వారు మానసిక పరివర్తన చెంది మంచిగా మారాలనేది భారతీయ శిక్షాస్మృతిలో అంతర్లీనంగా ఉన్న సందేశం.

తమకు నచ్చని వ్యక్తులమీద కేసులు బనాయించి, జైలుశిక్ష వేయించాలనే అక్కసుతో అనేకమంది జైలుపాలవుతున్నారు. ఇతరులపై కావాలని కేసులు పెట్టడం కూడా ప్రత్యక్షంగా కనపడని నేర ప్రవృత్తే. కానీ దానికి శిక్ష లేదు. సామాన్యులకు సౌకర్యాల లేమితో జైల్లో నరకం చూపిస్తారు. న్యాయవాదుల ఖర్చు భరించలేక, బెయిలు రాక సుదీర్ఘకాలం జైల్లోనే మగ్గుతున్నవారు కొందరైతే జడ్జీల కొరతతో పని వత్తిడితో, విచారణలో ఋజువులు దొరకక న్యాయస్థానాల్లో వాయిదాలు పడుతూ జైల్లోనే గడుపుతున్నవారు కొందరు. సత్వర న్యాయం లేదా సత్వర శిక్ష అమలైతే జైళ్ళపై వత్తిడి తగ్గుతుంది. నాసిరకపు తిండి, అపరిశుభ్ర పరిసరాలతో మూకుమ్మడిగా రోగాలబారిన పడుతున్నారు.


హత్యలు, మానభంగాలు, ఉగ్రవాద చర్యలకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా సత్వర శిక్షలు అమలు జరగాలి. కేంద్ర న్యాయ శాఖ, కోర్టులు, మేధావులు ఈ దిశగా ఆలోచించి కేసును బట్టి విచారణకు గరిష్ఠ కాలపరిమితి నిర్ణయించాలి. సుదీర్ఘకాలపు శిక్షలు మనిషి జీవితకాలాన్ని హరించివేసినట్లే. కాలయాపన, నేర తీవ్రత కూడా హెచ్చుతగ్గులకు కారణమవుతుంది. ఖైదీలు విచారణ పేరుతో సంవత్సరాల తరబడి జైళ్ళలో మగ్గడం సరైన సంకేతం కాదు. జైళ్ళలో సౌకర్యాల లేమిపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి. స్టేషన్‌లోనే పరిష్కారమయ్యే కేసులు రిమాండు దాకా రాకుంటే జైళ్ళకు కొంత వెసులుబాటు కలుగుతుంది. ఖైదీలకు ఊరికే వెట్టిచాకిరీ కాకుండా ఉపాధి కల్పన చూపించి, నేరచరితులను సంస్కరించే సంస్కరణాలయాలుగా జైళ్ళు మారాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**– జోస్యుల వేణుగోపాల్**

---

**వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా**

ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com





బాలశౌరితో వంగవీటి రాధా మాటామంతీ..

# భేటీల్లో వంగవీటి

## నాదెండ్ల మనోహర్, బాలశౌరితో వేర్వేరుగా వంగవీటి రాధా సమాలోచనలు

- అవనిగడ్డ నుంచి జనసేన తరపున పోటీ చేస్తారని ప్రచారం
- రేసులో విక్కుర్తి శ్రీనివాస్

**(విజయవాడ - ఆంధ్రజ్యోతి) :** వంగవీటి రంగా తనయుడు రాధా జనసేన కార్యాలయంలో ప్రత్యక్షమవ్వడం.. ఆ పార్టీ నేత నాదెళ్ల మనోహర్‌తోను మచిలీపట్నం నుంచి జనసేన ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న వల్లభనేని బాలశౌరితోనూ భేటీ కావడం రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చకు తెరదీసింది. 2019 ఎన్నికలకు ముందు రాధా వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ ఎన్నికల్లో రాధా ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం జరిగింది. అయితే తనకు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే ఆసక్తి లేదని రాధా టీడీపీ పెద్దలకు చెప్పినట్టు సమాచారం. సోమవారం రాత్రి ఆయన జనసేన కార్యాలయంలో నాదెండ్ల మనోహర్‌తో, గుంటూరులో బాలశౌరితో భేటీ కావడంతో మళ్లీ కొత్త ప్రచారాలకు తెరదీసింది. రాధా జనసేనలో చేరి అవనిగడ్డ నుంచి పోటీ చేస్తారంటూ ప్రచారం జరుగుతోంది. అయితే రాధా సన్నిహితులు ఆ ప్రచారాన్ని ఖండిస్తున్నారు. మరోవైపు జనసేన ఖాతాలో ఉన్న అవనిగడ్డ నుంచి పోటీ చేసేందుకు ఇప్పటికే ప్రముఖ వ్యాపారవేత్త విక్కుర్తి శ్రీనివాస్ రేసులో ఉన్నారు. గత కొంతకాలంగా ఆయన నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నాయకులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ తనకు సహకరించాలని కోరుతున్నారు. అవనిగడ్డ జనసేన ఖాతాలోకి వెళుతున్నట్టు ప్రచారం జరుగుతండటంతో టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న మండలి బుద్ధ ప్రసాద్‌కు టికెట్ కేటాయించే పరిస్థితి లేదని చర్చ నడుస్తోంది. మరోపక్క బుద్ధప్రసాద్‌ను జనసేనలోకి పంపి ఆ పార్టీ టికెట్‌పై పోటీ చేయించే అంశంపై టీడీపీ, జనసేన పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో అభ్యర్థిగా ఎవరు పోటీ చేయనున్నారనే అంశంపై స్పష్టత రానుంది.

# 16,83,000 మంది

## ఈ నెల 16 నాటికి ఎన్టీఆర్ జిల్లా ఓటర్ల సంఖ్య ఇదీ

- జనాభాలో 65 శాతం మంది ఓటర్లుగా నమోదు
- మహిళా ఓటర్లు 51.24 శాతం.. పురుష ఓటర్లు 48.74 శాతం
- నవ ఓటర్లు 37,760 మంది

ఎన్టీఆర్ జిల్లా జనాభాలో ఓటర్ల శాతం గణనీయంగా పెరిగింది. జనవరి 22న తుది ఓటర్ల జాబితా విడుదల అనంతరం 2024 మార్చి 16 నాటికి జిల్లాలో 16,83,000 మంది ఓటర్లు ఉన్నారు. తుది ఓటర్ల జాబితా విడుదల తర్వాత మరో 8005 మంది ఓటర్లు పెరిగారు. జిల్లాలో కొత్తగా నవ యువ ఓటర్ల సంఖ్య 37,760కి చేరింది. జిల్లాలో ప్రతి 1000 మంది జనాభాకు 710 మంది ఓటర్లు ఉన్నారు.

- 6లో..



## రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-20 (బుధ)
సహర్ (ఉదయం) : 4-59 (గురు)



# ఇసుక దోపిడీకి అడ్డేది?

## అనుమతుల్లేకుండా జీసీకేసీ ఇసుక తవ్వకం

ఎన్నికల కోడ్ వచ్చినా అధికార పార్టీ ఇసుక దందాకు అడ్డుకట్ట పడటం లేదు. ఎలాంటి అనుమతులూ లేకున్నా ఇసుకను ఇష్టారాజ్యంగా దోచేస్తున్నారు. నిన్నటి వరకు జేపీ సంస్థను తెరపై పెట్టి కృష్ణమ్మ గర్భాన్ని కొల్లగొట్టిన వైసీపీ నేతలు తాజాగా జీసీకేసీ సంస్థను తెరపైకి తెచ్చి ఇసుక దోపిడీకి తెరదీశారు. ఒక్క నెలలో రూ.90 కోట్ల ఆదాయాన్ని జేబులో వేసుకున్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే అధికారులు మంజూరు చేయాల్సిన అనుమతులనూ జీసీకేసీ ప్రతినిధులే ఇచ్చేస్తూ అధికార యంత్రాంగానికి సవాల్ విసురుతున్నారు. కోట్లాది రూపాయల సహజవనరులు దోపిడీకి గురవుతున్నా.. అధికారులనే అపహాస్యం చేసేలా జీసీకేసీ వ్యవహరిస్తున్నా జిల్లా యంత్రాంగం చేష్టలుడిగి చూస్తూ ఉండిపోతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- రెండు జిల్లాల్లో నెలకు రూ.90 కోట్ల ఇసుక దోపిడీ
- పట్టా భూముల్లోనూ యథేచ్ఛగా తవ్వకాలు
- ఎకరాకు రూ.25 లక్షలిస్తే తవ్వుకోవచ్చట

**(విజయవాడ - ఆంధ్రజ్యోతి) :** డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ సంస్థ రాష్ట్రంలోని ఇసుక రీచ్‌లకు 2023 డిసెంబరులో ఈ-టెండర్లు పిలువగా, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన టెండర్‌ను జీసీకేసీ సంస్థ చేజిక్కించుకుంది. ప్రకాశం బ్యారేజీ దిగువన ఉన్న ఒక క్వారీకి కూడా ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు. అయినా జీసీకేసీ సంస్థ ప్రకాశం బ్యారేజీ దిగువన కూడా తవ్వకాలు చేపడుతోంది. గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాల్సిన జిల్లా యంత్రాంగం ఆ ఆదేశాలు పక్కన పెట్టి ఇసుక మాఫియాకు సహకరిస్తోంది.

### ఎన్‌జీటీ ఆదేశాలు బేఖాతరు

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలోని ఒక్క ఇసుక రీచ్‌కు కూడా పర్యావరణ క్లియరెన్స్ సర్టిఫికెట్లు లేవు. ఈ విషయమై గతేడాది నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) కూడా తప్పుపట్టింది. పర్యావరణ అనుమతులు లేకుండా రీచ్‌లలో తవ్వకాలు జరపవద్దని ఆదేశించింది. ఎన్‌జీటీ ఆదేశాలను సుప్రీం కోర్టు కూడా సమర్థించింది. రాష్ట్రంలో 110 ఇసుక రీచ్‌లలో తవ్వకాలు జరపవద్దని స్టేట్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్టు అసెస్‌మెంట్ అథారిటీ (ఎస్ఈఐఏఏ) గత ఏప్రిల్‌లో ఆదేశాలిచ్చింది. ఈ 110 రీచ్‌లలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలోని అన్ని రీచ్‌లు ఉన్నాయి. అయినా అడ్డూ అదుపూ లేకుండా ఇసుక తవ్వకాలు జరుగుతుండటం గమనార్హం.

### ఉమ్మడి కృష్ణాలో రోజూ లక్షల టన్నుల్లో తవ్వకం

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పరిధిలోని మునేరు వాగు, కృష్ణా నదిలో ఉన్న అన్ని రీచ్‌ల్లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. కృష్ణా జిల్లాలోని చోడవరం, కాసరనేనిపాలెం, మద్దూరు, వల్లూరుపాలెం, రొయ్యూరు, లంకపల్లి శ్రీకాకుళం రీచ్‌ల్లో నిత్యం లక్షల టన్నుల ఇసుకను తవ్వి తరలించేస్తున్నారు. అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని ఘంటసాల మండలంలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని గతంలో గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ పాపవినాశనం క్వారీ నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా తరలించేస్తున్నారు. తోట్లవల్లూరు మండలం రొయ్యూరు క్వారీకి అనుమతులు లేకున్నా జీసీకేసీ సంస్థ ఇష్టారాజ్యంగా ఇసుక కొల్లగొట్టేస్తోంది. వాల్టా చట్టం నిబంధనలు సైతం ఉల్లంఘించి భూగర్భ జలాలకు ప్రమాదం కలిగే విధంగా ఇసుక తవ్వకాలు జరుపుతుండటం గమనార్హం.

### నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణకు..

నిబంధనల ప్రకారం ఇసుకను పొరుగు రాష్ట్రాలకు తరలించకూడదు. కానీ ఎన్టీఆర్ జిల్లా నుంచి ఇసుక భారీగా తెలంగాణాకు తరలిపోతోంది. ఈ అక్రమ రవాణాను నిలువరించాల్సిన అధికారులు చేష్టలుడిగా చూస్తున్నారు. కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా విధులు నిర్వహించే అవకాశం ఉన్నా కాసులకు కక్కుర్తిపడి జీసీకేసీ అక్రమాలకు వంత పాడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో కంచికచర్ల మండలం చెవిటికల్లు, మున్నలూరు రీచ్‌ల (కృష్ణానది)లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇసుక తవ్వకాలకు రేయింబవళ్లు ఆరు యంత్రాలు పనిచేస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వందల సంఖ్యలో ఇసుక లారీలు యథేచ్ఛగా పక్క రాష్ట్రానికి వెళుతున్నా వాటిని నిలువరించే ధైర్యం ఒక్క అధికారి కూడా చేయడం లేదు.

### పట్టా భూములపైనా జీసీకేసీ పెత్తనం

తోట్లవల్లూరు మండలం రొయ్యూరు వద్ద పట్టా భూముల్లో తవ్వకాలకు ఇటీవల కొందరు రైతులు అధికారులను ఆశ్రయించారు. అదే సమయంలో జీసీకేసీ ప్రతినిధులు జోక్యం చేసుకుని ఇసుక తవ్వకాలకు తమకే అధికారం ఉందని, అధికారులు ఎవ్వరూ అనుమతులు ఇవ్వడానికి లేదని, తమకు ఎకరాకు రూ.25 లక్షలు చెల్లిస్తే తవ్వుకోవడానికి అనుమతి ఇస్తామని తేల్చి చెప్పారు. దీంతో దిక్కుతోచని రైతులు అంత మొత్తం ఇచ్చుకోలేమని చెప్పడంతో రోజువారీ తరలించే ఇసుకను సగం రైతులకు సగం జీసీకేసీకి ఇచ్చేలా ఒప్పందం చేసుకుని అడ్డగోలుగా పట్టా భూముల్లో తవ్వకాలు జరిపేస్తున్నారు. సుమారు 10 ఎకరాల్లో ఇసుక తవ్వకాలు జరిగిపోతున్నాయి. పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి పొందాలంటే మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, తదితర శాఖలు ఎన్‌వోసీ జారీ చేయాల్సి ఉంది. ఆ తర్వాత అంతిమంగా కలెక్టర్ ఆమోద ముద్రతో పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలు జరుపుకోవాల్సి ఉంటుంది. కానీ అధికారులను అపహాస్యం చేసేలా జీసీకేసీ ప్రతినిధులే ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది.

# కాపాడమంటే.. కొట్టేశాడు!

## భూమికి రక్షణ కల్పించమంటే ఎకరం అమ్ముకున్న వైసీపీ నేత

అక్రమణలకు, అక్రమ రిజిస్ట్రేషన్‌లకు కాదేది అనర్హం అని వైసీపీ నాయకులు రుజువు చేస్తున్నారు. గ్రామ పెద్దగా వ్యవహరిస్తారని నమ్మి పర్యవేక్షణ చేయమని సహాయం అడిగితే ఏకంగా ఎకరం భూమిని దర్జాగా కొట్టేశాడు ఒక అక్రమార్కుడు. ఏకంగా కుటుంబసభ్యుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి అమ్మి సొమ్ము చేసుకున్నాడు. న్యాయం కోసం బాధితులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. నందివాడ మండలం తుమ్మలపల్లిలో చోటుచేసుకున్న ఈ అక్రమం కథాకమామీషు ఏంటో చూద్దాం..



పత్రాలను చూపుతున్న శాంతకుమారి

- తొలుత భార్య పేరుతో అక్రమ రిజిస్ట్రేషన్... ఆపై అమ్మకం
- మిగిలిన భూమికి పదేళ్లుగా లీజు చెల్లించకుండా దౌర్జన్యం
- బాధితులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం శూన్యం
- తుమ్మలపల్లిలో భూ బాగోతం

**గుడివాడ :** నందివాడ మండలం తుమ్మలపల్లికి చెందిన కోటే జాన్ సుందరరావుకు గ్రామంలోని రీసర్వే నెం.78లో ఎకరం, 120/1లో 2.20 ఎకరాలు, 2.24 ఎకరాలు వేర్వేరుగా వ్యవసాయ భూమి ఉంది. 1937 నుంచి జాన్ సుందరరావు ఆధీనంలోనే భూమి ఉంది. సుందర్‌రావు పేరున పట్టాదారు పాస్‌పుస్తకం కూడా ఉంది. సుందర్‌రావుకు వారసులెవ్వరూ లేకపోవడంతో తమ్ముడి కుమారుడైన ఆర్మ్‌స్ట్రాంగ్ పేరునే 2012 ఆగస్టులో వీలునామా రాశారు. అదే ఏడాది జాన్ సుందర్‌రావు మృతి చెందారు. ఆర్మ్‌స్ట్రాంగ్ ఉద్యోగరీత్యా ముంబైలో నివాసముంటున్నాడు. ఈ నేపథ్యంలో తన పిన్ని అయిన వారా శాంతకుమారి పేరుతో ఆర్మ్‌స్ట్రాంగ్ పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చారు.

### దర్జాగా ఎకరం కొట్టేసి, అమ్మేసి

కొత్త పాస్‌పుస్తకాన్ని అడుగుతున్నా రెవెన్యూ అధికారులు తాత్సర్యం చేసుకుంటూ వచ్చారు. అనుమానం వచ్చి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈసీ నకలు తీయించడంతో ఎకరం భూమి నాగమణి పేరుతో ఉండటంతో ఆశ్చర్యపోయారు. పదేళ్ల క్రితమే తమకు చెందిన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని అమ్ముకున్నారని గుర్తించారు. 2013లోనే ఎమ్మెల్యే నాని ముఖ్య అనుచరుడు, వైసీపీ సీనియర్ నాయకుడు గూడపాటి వెంకటేశ్వరరావు కోడలు తన కోడలికి పసుపు కుంకుమ కింద సదరు ఎకరం భూమిని ఇచ్చినట్టు చూపి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వేరే వారికి అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో ఆర్మ్‌స్ట్రాంగ్, శాంతకుమారి ఎకరం విషయంలో నిలదీయగా, పెద్దల సమక్షంలో మరోచోట ఎకరం భూమిని కొనుగోలు చేసి ఇస్తానని వైసీపీ నాయకుడు గూడపాటి హామీ ఇచ్చినట్టు చెబుతున్నా నేటికి పొలం చూపించలేదు.

### అక్రమంగా చెరువులో కలిపేసుకుని

మిగిలిన 4.44 ఎకరాల భూమిని సైతం ఆర్మ్‌స్ట్రాంగ్‌కు చెప్పకుండానే 2014లో చెరువు తవ్వి అందులో కలిపేసుకున్నారు. ఆనాటి నుంచి నేటి వరకు వైసీపీ నాయకుడు గూడపాటి లీజు కూడా చెల్లించకుండా తాత్సర్యం చేసుకుంటూ వస్తున్నారు. గతేడాది కాలంగా కనీసం లీజు నగదైనా ఇవ్వాలని పలుమార్లు ఆర్మ్‌స్ట్రాంగ్ కుటుంబసభ్యులు కోరుతూ వచ్చారు. నామమాత్రంగా రూ.లక్ష చేతిలో పెట్టి పట్టాదారు పాస్‌పుస్తకానికి రూ.50వేలు అయినట్టు చూపి తిరిగి తీసేసుకున్నారు.

### రెవెన్యూ అధికారుల పాత్ర కీలకం

సర్వే నెం.78లోని ఎకరం పొలం చెరువుగా ఉంది. గూడపాటి కుటుంబసభ్యులే నారుమడి, పంటకు అవసరమయ్యే నీటి కోసం చెరువును వినియోగించుకుంటూ తృణమో ఫలమో ఇచ్చేవారు. అప్పటి వీఆర్‌వో ఇచ్చిన అడంగల్ కాపీతోనే అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిందని, డబ్బులకు, అధికారానికి భయపడి అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో అప్పటి వీఆర్వో, వీఆర్ఏ కీలకంగా వ్యవహరించి అడంగల్‌లో పేరు మార్చారని ఆర్మ్‌స్ట్రాంగ్ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. అప్పటి రెవెన్యూ అధికారి సైతం కింద సిబ్బంది తప్పులకు వంతపాడుతూ ఏకంగా ఎకరం భూమికి పట్టాదారు పాస్‌పుస్తకాన్ని జారీ చేశారు.

### ఉన్నతాధికారులు న్యాయం చేయాలని..

అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న ఎకరం భూమి తాలుకు పత్రాలను తమ వద్దే ఉన్నాయని, రెవెన్యూ అధికారులు కావాలనే తాత్సర్యం చేస్తూ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారా శాంతకుమారి ఆరోపించారు. ఆర్మ్‌స్ట్రాంగ్ ముంబైలో ఉంటున్నాడని, భూమిపై తనకు పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చాడని స్పష్టం చేశారు. గ్రామంలో ఏం జరిగినా తానే చూసుకుంటానని గూడపాటి వెంకటేశ్వరరావు ఖాళీ ఫారాలపై సంతకాలు చేయించుకున్నాడని ఆరోపించారు. అనుమానం వచ్చి అడిగితే కొత్త పాస్‌పుస్తకం ఇప్పిస్తానని నమ్మబలికి సంతకాలు చేయించుకున్నారన్నారు. కొత్త పాస్‌పుస్తకంలో కేవలం 4.44 ఎకరాల భూమి ఉన్నట్టు నమోదైందని, దీంతో ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లానని అన్నారు. ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం ఇచ్చామని, సచివాలయాల్లో గానీ, సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో వివరాలు అడిగి తెలుసుకోవాలని రెవెన్యూ అధికారులు ఉచిత సలహా ఇచ్చారు. కలెక్టర్, రెవెన్యూ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని శాంతకుమారి కోరారు.

# వైసీపీలో కొట్లాట!

వైసీపీలో వర్గ విభేదాలు రచ్చకెక్కాయి. ఇవి ఒకరిపై ఒకరు దాడులు చేసుకునే స్థాయికి చేరాయి. దళితులంటే చులకనభావంతో చూస్తున్నాడని, దళితులపై అక్రమ కేసులు బనాయించి వారిని జైలుపాలు చేస్తున్నాడని ఆరోపిస్తూ వైసీపీకి చెందిన మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ చోరగుడి రవికాంత్... ఎమ్మెల్యే నానికి ప్రధాన అనుచరుడిగా ఉన్న దుక్కిపాటి శశిభూషణ్‌కారుపై దాడికి పాల్పడ్డారు. కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. శశి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గతంలో జరిగిన ఒక ఘటన నేపథ్యంలో చోరగుడి ఈ దాడి చేసినట్టు వైసీపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## నాని ప్రధాన అనుచరుడు శశి కారుపై ఆ పార్టీ నేత చోరగుడి రాళ్ల దాడి

- దళితులను చులకనగా చూస్తున్నారని చోరగుడి ఆరోపణ
- ఇద్దరి మధ్య వర్గ విభేదాలే కారణం



రాళ్లదాడిలో దెబ్బతిన్న కారు అద్దం

**గుడివాడ :** గుడివాడలో ఎమ్మెల్యే నాని తరువాత అన్నీ తానై చూసే వ్యక్తి దుక్కిపాటి శశిభూషణ్. షాడో మంత్రిగా నియోజకవర్గంలో సుపరిచితుడు. మొదటి నుంచి శశి తీరు వివాదాస్పదంగానే ఉంది. ఎవరినీ ఎదగనివ్వకుండా తొక్కేస్తున్నాడని పార్టీ నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు. మంగళవారం స్థానిక ఇందిరానగర్ కాలనీలోని వైసీపీ నాయకుడు బూసి ప్రకాష్ ఇంటికి వెళ్లివస్తుండగా మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ చోరగుడి రవికాంత్ రాళ్లదాడికి తెగబడ్డారు. స్వల్పగాయాలతో శశి బయటపడ్డారు. రవికాంత్‌ను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి 41ఏ నోటీసు ఇచ్చి రాత్రి 10 గంటలకు వదిలేశారు.

### గతంలో చోరగుడిపై అక్రమ కేసు

చిన్న వివాదం నేపథ్యంలో మాజీ కౌన్సిలర్ చోరగుడి రవికాంత్‌పై షాడో మంత్రి శశి ఒత్తిడి మేరకు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసు నమోదు చేశారని చోరగుడి అనుచరులు బహిరంగ విమర్శలకు దిగారు. శశిభూషణ్ అప్పట్లో పోలీస్ శాఖను గుప్పెట్లో పెట్టుకుని కక్ష సాధింపునకు పాల్పడ్డారని వైసీపీ నాయకులే విమర్శిస్తున్నారు. దళిత నాయకుడిగా నియోజకవర్గంలో ఎదుగుతున్నాడనే కారణంతోనే అక్రమ కేసు బనాయించి జైలుపాలు చేశారని దళిత సంఘాలు దుమ్మెత్తిపోశాయి. ఎమ్మెల్యే నాని దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో చోరగుడి అభిమానులు నోరు మెదపలేదు. మూడు నెలల పాటు కుటుంబానికి దూరంగా, చేయని తప్పుకు జైలుశిక్ష అనుభవించారని చోరగుడి అభిమానులు శశిభూషణ్‌పై మండిపడుతున్నారు. గుడివాడ అభ్యర్థి ప్రకటన విషయంలో సందిగ్ధత నెలకొనడంతో చోరగుడి అభిమానులు ఇప్పటివరకు సంయమనం పాటించారు.

### విభేదాలు ఎందుకొచ్చాయంటే..

గుడివాడ మున్సిపాల్టీలో టిడ్కో గృహాల కేటాయింపు విషయంలో లక్షలాది రూపాయలు చేతులు మారాయని, ఇందులో శశి పాత్ర కీలకంగా ఉందని చోరగుడి ఆరోపించారు. సుమారు 800 మంది అర్హులైన లబ్ధిదారులను తొలగించి వారి స్థానంలో తమకు కావలసిన వారికి, వేరే మండలాలకు చెందిన వారికి గృహాలను కేటాయించారని సోషల్ మీడియా వేదికగా చోరగుడి పలుమార్లు ఆరోపించారు. దీంతోపాటు చోరగుడి రవికాంత్ కుటుంబంలో ఏర్పడిన చిన్న సమస్యను శశి రాజకీయంగా ఉపయోగించుకుని అక్రమ కేసులు బనాయించడంతో ఇద్దరి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి.

# వైసీపీ ప్రచారంలో పీఏసీఎస్ కార్యదర్శి

- యనమలకుదురులో జోగి రమేష్‌తో పాటు ప్రచారం
- గతంలోనే పెనమలూరు కార్యదర్శిగా పలు విమర్శలు

**పెనమలూరు, మార్చి 19 :** కంకిపాడు పీఏసీఎస్ కార్యదర్శి వల్లభనేని మణికంఠ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. ప్రొటోకాల్‌ను సైతం పక్కన పెట్టి మంగళవారం జోగి రమేష్‌తో యనమలకుదురులో జరిగిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. గతంలో పెనమలూరు పీఏసీఎస్ కార్యదర్శిగా మణికంఠ పనిచేసిన సమయంలో పలు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయన్ను కంకిపాడు పీఏసీఎస్ కార్యదర్శిగా మార్చారు. ఈ పదవితోపాటు పెదపారుపూడి మత్స్యకారుల సంఘం కార్యదర్శిగా కూడా పని చేస్తున్నారు. అయితే మంత్రి కబురంపిందే తడవుగా ముఖ్యమైన మత్స్యకారుల సంఘం మీటింగ్‌ను సైతం పక్కన పెట్టి మంగళవారం జరిగిన జోగి రమేష్‌తో ప్రచార కార్యక్రమంలో పాల్గొని విమర్శలు ఎదుర్కొంటున్నారు.



యనమలకుదురులో జోగి రమేష్‌తో ప్రచారంలో మణికంఠ (సర్కిల్‌లో)

# కోడ్ మీరొద్దు..

- శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి
- మద్యం, నగదు అక్రమ రవాణాపై నిఘా పెంచాలి
- పోలీస్ అధికారులతో కలెక్టర్, ఎస్పీ సమావేశం

- 6లో..



అవార్డు అందుకుంటున్న మురకొండ సందీప్ చౌదరి

## 'విజేత సూపర్ మార్కెట్స్'కు బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డు

**అజిత్‌సింగ్‌నగర్, మార్చి 19 :** విజేత సూపర్ మార్కెట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బిజినెస్ ఎక్స్‌లెన్స్-2023 అవార్డును దక్కించుకుంది. రాయదుర్గంలోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురకొండ సందీప్ చౌదరి ఈ అవార్డును అందుకున్నారు. కార్యక్రమానికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురకొండ సందీప్ చౌదరి మాట్లాడుతూ, తన తండ్రి జగన్మోహన్‌రావు అడుగుజాడల్లో వ్యాపారం కొనసాగిస్తున్నట్టు చెప్పారు. 1999 చందానగర్‌లో తొలి బ్రాంచ్‌ను స్థాపించి నేటికి 109బ్రాంచ్‌లతో విజేతను ఓ బ్రాండ్‌గా నిలబెట్టామన్నారు. సంస్థ అభివృద్ధికి సహకరించిన కష్టమర్ దేవుళ్లు, డిస్ట్రిబ్యూటర్లు, ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులకు, కుటుంబసభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మున్ముందు మరింత నాణ్యమైన సేవలను సంస్థ అందించేందుకు సిద్ధంగా ఉందని, వచ్చే మూడేళ్లల్లో మరో 21 బ్రాంచ్‌లు ప్రారంభించే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్టు చెప్పారు.



సీపీఎస్ రద్దు కోరుతూ ఎంప్లాయిస్ సంఘ్ నిరసన ర్యాలీ

## ఓపీఎస్ పునరుద్ధరించాలని నిరసన

**రైల్వేస్టేషన్, మార్చి 19 :** నూతన పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ (ఓపీఎస్) విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ్ ఏజీఎస్ యడ్ల నాగేంద్రబాబు మాట్లాడుతూ, రైల్వే కార్మికులను కేంద్ర ప్రభుత్వం దగా చేసిందని, మొండి వైఖరితో కార్మిక చట్టాలను అణచివేస్తున్నదని పేర్కొన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని కార్మికుల కుటుంబాలను అధోగతికి గురిచేస్తున్నారని విమర్శించారు. నూతన పెన్షన్ విధానంలో కార్మికులకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. నూతన పెన్షన్ విధానంలో రూ.3వేల నుంచి 4వేల వరకు మాత్రమే పెన్షన్ వస్తుందని తెలిపారు. పదవీవిరమణ చేసిన కార్మికుడి కుటుంబం ఏ విధంగా మనగలుగుతుందో చెప్పాలన్నారు. పాతపెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. డివిజన్ అధ్యక్షుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ, రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. డిప్యూటీ డివిజన్ సెక్రటరీ రాజబాబు, సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్లు అల్లం రమేశ్, శ్రీను, సీడబ్ల్యూ బ్రాంచ్ కార్యదర్శి కర్నూల్ సుకుమార్, మెడికల్ బ్రాంచ్ కార్యదర్శి శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ బ్రాంచ్ కార్యదర్శి శ్రీనివాసరావు, శ్యామ్, దాస్, బాజీ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



లంక లితీష్‌ను పరామర్శిస్తున్న వసంత కృష్ణప్రసాద్

## అమరావతి రాజధానిపై జగన్ మాటతప్పారు

» వసంత వెంకట కృష్ణ ప్రసాద్

**మైలవరం/రెడ్డిగూడెం, మార్చి 19 :** రాష్ట్ర అభివృద్ధిలో సీఎం జగన్మోహన్ రెడ్డి పూర్తిగా వైఫల్యం చెందడమే కాక అమరావతి విషయంలో మాట తప్పాడని, ఆయన నియంత వైఖరి నచ్చకే వైసీపీ వీడి టీడీపీలోకి వచ్చినట్టు మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ నేత వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు. తెలుగుయువత మైలవరం నియోజకవర్గ అధ్యక్షుడు లంక లితీష్ ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న వసంత మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం రెడ్డిగూడెం మండలం నాగులూరులో టీడీపీ నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వసంత మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు నాయుడితోనే సాధ్యమన్నారు. చంద్రబాబు నాయకత్వంలో పార్టీ విజయానికి కష్టపడతానని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి పార్టీశ్రేణులకు అన్ని వేళలా అందుబాటులో అండగా ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కోమటి సుధాకరరావు, జంపాల సీతారామయ్య, చెన్నుబోయిన చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానికే భద్రత కల్పించలేని సీఎం : దేవినేని ఉమా

**గొల్లపూడి, మార్చి 19 :** చిలకలూరిపేట ప్రజాగళం సభకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ వస్తే భద్రత కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. గొల్లపూడిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, కూటమి సభను భగ్నం చేయాలని వైసీపీ ప్రభుత్వం, పోలీసులు శాయశక్తులా ప్రయత్నించారని ఆరోపించారు. బీజేపీ-టీడీపీ-జనసేన తొలి సభ విజయవంతమైందన్నారు. ప్రధాని భద్రత, ప్రజలు, ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై పోలీస్‌బాస్‌ల నిర్లక్ష్యంపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ సమగ్ర విచారణ చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నేతలు నర్రా వాసు, రంగినేని నరేంద్రబాబు, సుంకర విష్ణు కుమార్, వేముల కృష్ణలు పాల్గొన్నారు.



లంకపల్లిలో ఇసుక క్వారీ వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు

## ఇసుక దందా అడ్డుకోండి..

» లంకపల్లి క్వారీ వద్ద టీడీపీ నేతల ధర్నా

**లంకపల్లి(పమిడిముక్కల), మార్చి 19 :** వైసీపీ నాయకుల ఇసుక దందా అడ్డుకోవాలని పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వర్లకుమార్ రాజ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు లంకపల్లి క్వారీ వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా కుమార్ రాజా మాట్లాడుతూ, ఎన్నికల కోడ్‌తో జిల్లాలో క్వారీలు మూసివేసినా పామర్రు ఎమ్మెల్యే కనుసన్నల్లో లంకపల్లి క్వారీ యథేచ్ఛగా కొనసాగుతూ భారీగా ఇసుక దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. నియోజక వర్గంలో రోడ్లు పట్టించుకోని ఎమ్మెల్యే క్వారీలోకి రెండులైన్ల రోడ్డువేసి ఇసుక దందా కొనసాగిస్తున్నారని విమర్శించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇసుక దోపిడీ అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. జక్కా శ్రీనివాసరావు, రాజులపాటి శ్రీనివాసరావు, నారాయణ, లంకపల్లి, శ్రీరంగపురం గ్రామస్థులు పాల్గొన్నారు.

## జిల్లా ఫారెస్టు సెటిల్మెంట్ అధికారిగా టీఈఎం రాజు

**కృష్ణలంక, మార్చి 19 :** ఏలూరు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీలలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా ఫారెస్టు సెటిల్మెంట్ అధికారిగా టీఈఎం రాజు మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ దిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

» 72 గంటల గడువు ముగిసింది
» రాజకీయ పార్టీలు, ఉద్యోగులు, అధికారులు, మీడియా, ప్రజలు అవగాహనతో ఉండాలి
» రూ.50 వేలకు మించి డబ్బులు వెంట ఉంటే బిల్లులు ఉండాల్సిందే
» జిల్లా వ్యాప్తంగా రూ.10 కోట్ల విలువ చేసే నగదు, మద్యం, గంజాయి, లోహాల సీజ్
» సీఆర్‌పీఎఫ్ బలగాలతో జల్లెడ పడుతున్నాం.. అంతరాష్ట్ర చెక్‌పోస్టుల్లో విస్తృత తనిఖీలు
» గూడవల్లి, వారధి, ఇబ్రహీంపట్నంలలో ముమ్మర తనిఖీలు
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు, పోలీసు కమిషనర్ కాంతిరాణా





చెక్‌పోస్టు వద్ద కేంద్ర బలగాలతో జిల్లా అధికారులు

# కోడ్ మీరొద్దు..

## ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయ్

జిల్లా వ్యాప్తంగా అమల్లో ఉన్న ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.. ఎంతటివారైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది.. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దిల్లీరావు, పోలీసు కమిషనర్ కాంతి రాణాలు ఎన్నికల కోడ్‌పై అధికారులు, ఉద్యోగులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు, మీడియా సంస్థలకు ముందస్తు హెచ్చరికలు చేశారు. అందరూ అవగాహన, బాధ్యత కలిగి ఉండాలన్నారు. కోడ్ ఉల్లంఘనలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

మోడల్ కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో, మంగళవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్‌తో కలిసి కలెక్టర్, సీపీలు ప్రవర్తనా నియమావళి అమలు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దిల్లీరావు మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేసిన తర్వాత మంగళవారం మధ్యాహ్నం 3 గంటలతో 72 గంటల గడువు ముగిసిందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘనలు ఎంత మాత్రం సహించబోమన్నారు. ఎన్నికల కోడ్‌కు సంబంధించి రాజకీయ పార్టీలకు చెందిన ప్రతి ఒక్కరూ, అభ్యర్థులు, ప్రజలు, ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు అవగాహన పెంపొందించుకోవాల్సి ఉందన్నారు. మోడల్ కోడ్ అమలుకు జిల్లా వ్యాప్తంగా 42 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తిరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ, పోలీసు అధికారులు కూడా కోడ్ అతిక్రమణలను గుర్తించటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆవరణలలో, ప్రైవేటు ప్రాంతాల్లో ఉన్న అనధికార బోర్డులను 90 శాతం పైగా తొలగించటం జరిగిందన్నారు. ఈ విషయంలో ఆర్‌ఓలు, ఏఆర్‌వోలకు స్పష్టమైన మార్గదర్శనం చేయటం జరిగిందన్నారు.

### కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఎన్నికల నిర్వహణలో ఫిర్యాదులు, సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ, పోలీసు, ఎక్సైజ్ తదితర విభాగాలతో కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఫిర్యాదులను పరిష్కరించేందుకు 9154970454 వాట్సాప్ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 1950 కాల్ సెంటర్, సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను కూడా కంట్రోల్ రూమ్ ద్వారా పరిష్కరించటం జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, కేబుల్ నెట్‌వర్క్‌లలో ప్రకటనలకు సంబంధించి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ అనుమతి తప్పనిసరి అన్నారు. ప్రింట్ మీడియాలో ప్రకటనలకు ముందస్తు అనుమతి అవసరం లేనప్పటికీ ఎన్నికల ప్రకటనల వ్యయ వివరాలను ఎంసీఎంసీకి అందచేయాల్సి ఉంటుందన్నారు. పెయిడ్ న్యూస్‌పై పర్యవేక్షణ ఉంటుందని కలెక్టర్ చెప్పారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీ వరకు వచ్చిన ఓటర్ల జాబితా దరఖాస్తులను మార్చి 26వ తేదీ లోగా పరిష్కరిస్తామన్నారు. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల వస్తున్నందున అప్పటి వరకు చేర్పులు, బదిలీలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను కూడా పరిష్కరిస్తామన్నారు.

### సీఆర్‌పీఎఫ్ బలగాలతో జల్లెడ

జిల్లాలో శాంతియుతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని చర్యలు చేపట్టిందని, సీఆర్‌పీఎఫ్ బలగాలను రంగంలోకి దించి జిల్లాను జల్లెడ పడుతున్నట్టు పోలీసు కమిషనర్ కాంతి రాణా చెప్పారు. పోలీసు శాఖ ద్వారా కిందటేడాది 2023, డిసెంబరు 26 నుంచి మార్చి 18, 2024 వరకు రూ. 4.19 కోట్ల నగదును సీజ్ చేయటం జరిగిందన్నారు. అలాగే 35992 లీటర్ల మద్యం, 165.76 కిలోల గంజాయి, 33.97 కిలోల విలువైన లోహాలను సీజ్ చేశామన్నారు. మార్చి 16, 2023 నుంచి ఏడాది కాలంలో రాష్ట్రంలోనే అత్యధికంగా రూ.10 కోట్ల విలువ చేసే డబ్బు, మద్యం, లోహాలను సీజ్ చేయటం జరిగిందన్నారు. మొత్తం 33 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 443 ఆయుధ లైసెన్సులు ఉన్నాయని, బ్యాంకులు మినహా 361 ఆయుధాలను స్వాధీనం చేసుకోవటం జరిగిందని తెలిపారు. జిల్లాలో సెక్షన్ 107, 108, 110ఆర్‌డబ్ల్యూ, 151 సీఆర్‌పీసీ 1973 సెక్షన్ల ప్రకారం 3215 బైండోవర్ కేసులను నమోదు చేశామన్నారు. జిల్లాలో మొత్తం 12 అంతరాష్ట్ర బోర్డర్ చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయని, నందిగామ, తిరువూరు, మైలవరం ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. గూడవల్లి, ఇబ్రహీంపట్నం, వారధి తదితర చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాకు నాలుగు సీఆర్‌పీఎఫ్ కంపెనీలు వచ్చాయని, మరో కంపెనీ రావాల్సి ఉందన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజలు రూ. 50 వేలు కంటే ఎక్కువగా నగదు, బంగారం తదితరాలను తీసుకు వెళ్లవద్దన్నారు. రూ. 50 వేలు మించితే సంబంధిత బిల్లులను దగ్గర పెట్టుకోవాలని చెప్పారు. అన్నీ సవ్యంగా ఉంటే.. కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలో పనిచేసే సీజర్ కమిటీలో తక్షణం నిర్ణయం తీసుకుని విడుదల చేయటం జరుగుతుందన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తం

» కృష్ణా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ సమీక్ష

**మచిలీపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) :** ఎన్నికల కోడ్ ఖచ్చితంగా అమలు చేయాలని పోలీస్ అధికారులను కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ అద్నాన్‌నయీం అస్మి ఆదేశించారు. మచిలీపట్నం కలెక్టరేట్‌లో పోలీస్, ఎక్సైజ్‌శాఖ అధికారులతో మంగళవారం వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల షెడ్యూలు విడుదలైన నాటినుంచే కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. ఎక్కడా అల్లర్లు జరగకుండా పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో లైసెన్స్ పొందిన ఆయుధాలు స్వాధీనం చేసుకోవడంతోపాటు, నూతనంగా లైసెన్సులు ఇచ్చే ప్రక్రియను వాయిదా వేయాలన్నారు. ఈ అంశంపై సమీక్షకు జిల్లాలో ప్రత్యేక కమిటీని వేయడం జరిగిందన్నారు.

### మద్యం ఉత్పత్తి, నిల్వలపై నివేదిక ఇవ్వండి

ఎక్సైజ్ అధికారులు లిక్కర్ లైసెన్సులజారీని నిలిపివేయాలన్నారు. మద్యం ఉత్పత్తులు, సెంట్రల్ స్టాక్‌పాయింట్‌లో ఉన్న నిల్వలకు సంబంధించిన నివేదికను ప్రతిరోజు అందజేయాలన్నారు. ఎన్నికలసంఘం నిబంధనలమేరకు మద్యం దుకాణాలు ఉదయం 11 గంటలనుంచి రాత్రి 9గంటలవరకు పనిచేయాలన్నారు. బార్‌అండ్‌రెస్టారెంట్లు ఉదయం 11గంటల నుంచి రాత్రి 11గంటలవరకు మాత్రమే తెరవాలన్నారు. అంతర్‌జిల్లా, అంతర్‌రాష్ట్ర సరిహద్దులవద్ద పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటుచేసి, రవాణాశాఖ అధికారుల సమన్వయంతో వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. నగదు, మద్యం అక్రమరవాణా పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు.

### లైసెన్స్ ఆయుధాల డిపాజిట్

జిల్లాలో 153మంది ఆయుధ లైసెన్సులు కలిగి ఉన్నారని ఎస్పీ అద్నాన్‌నయీం అస్మి అన్నారు. వీటిలో ఇప్పటివరకు 132ఆయుధాలను డిపాజిట్ చేసుకున్నట్టు తెలిపారు. బ్యాంకులు, టోల్‌గేట్ల వద్ద కాపలాదారులకు ఆయుధ లైసెన్సులనుంచి మినహాయింపు ఉందన్నారు. ఇవి కాకుండా లైసెన్సులు కలిగి ఉండి, ఆయుధాలను పోలీస్ శాఖకు డిపాజిట్ చేయని వారి నుంచి వెంటనే స్వాధీనం చేసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, డీఎస్పీలు, ఎక్సైజ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

### ఫిర్యాదుల స్వీకరణ కేంద్రం పరిశీలన

డీఈవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన సీ-విజిల్ సెంటర్, ఫిర్యాదుల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. ఎన్నికల సంఘానికి పంపే విధానం, వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులు, పరిష్కార వివరాలను ప్రత్యేకంగా భద్రపరచాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం ఎంసీఎంసీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రచార మాధ్యమాల్లో ప్రకటనలు, పెయిడ్ ఆర్టికల్స్‌ను ఎప్పటికపుడు లెక్కించి వివరాలు నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

### అభ్యర్థుల బ్యాంకు ఖాతాల వివరాలు చెప్పండి

ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులకు సంబంధించి ఆర్థిక లావాదేవీల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని కలెక్టర్ రాజాబాబు బ్యాంకు అధికారులను ఆదేశించారు. మంగళవారం బ్యాంకు అధికారులతో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వారి ప్రతినిధులతో కలిసి ప్రత్యేక ఖాతాను తెరవాల్సి ఉందన్నారు. ఖాతాలో రూ.లక్షకు మించి నగదు జమ అయితే వాటి వివరాలను తెలియజేయాలన్నారు.

## ఎన్టీఆర్ దంపతుల విగ్రహాలకు కోడ్ మినహాయింపు కోరుతూ దరఖాస్తు

**పామర్రు, మార్చి 19 :** ఎన్నికల నియమావళి అమల్లో భాగంగా పామర్రు మండలంలో టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ స్వగ్రామమైన నిమ్మకూరులో ప్రైవేటు స్థలంలో ఉన్న ఎన్టీఆర్ బసవతారకం విగ్రహాలకు ముసుగు నుంచి మినహాయింపు ఇవ్వాలని స్థల యాజమాని పాలడుగు రామప్రసాద్ మంగళవారం గ్రామ అధికారులకు వినతి పత్రం అందజేశారు. గతంలో ఒకసారి మినహాయింపు ఇచ్చారని రామప్రసాద్ చెప్పారు. ఆ వినతి పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పరిశీలన నిమిత్తం పంపుతున్నట్టు అధికారులు తెలిపారు.

## గూడవల్లి చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు




**గుణదల :** సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా సరిహద్దు గూడవల్లి వద్ద చెక్‌పోస్టును కలెక్టర్ దిల్లీరావు, సీపీ కాంతి రాణా, జేసీ సంపత్‌కుమార్ మంగళవారం సందర్శించారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సాయుధదళాలు, సిబ్బంది, పోలీసులకు తగు సూచనలు ఇచ్చారు. వాహనాల తనిఖీల్లో అప్రమత్తంగా ఉండాలని, మారణాయుధాలు, నగదుతో జిల్లాలోకి ఎవరూ రాకుండా చూడాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ సిబ్బందిని హెచ్చరించారు. పటమట సీఐ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**మచిలీపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) :** జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ పీవీఎస్ రాజేంద్ర ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో గురుకుల పాఠశాలల్లో 5వతరగతి ప్రవేశంతోపాటు, 6, 7, 8 తరగతుల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. ప్రవేశానికి ఏపీఆర్-క్యాట్-2024 ప్రవేశపరీక్ష నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు రాస్తున్న విదార్థులు గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ కోర్సుల్లో చేరేందుకు ఏపీ ఆర్‌జేసీ ద్వారా ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 31లోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. గురుకుల జూనియర్ కళాశాలల్లో, గురుకుల పాఠశాలల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 25న ప్రవేశపరీక్షను జిల్లాకేంద్రమైన మచిలీపట్నంలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

## నిబంధనలమేరకే కరపత్రాలు ముద్రించాలి

**మచిలీపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) :** ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థుల పేరుతో కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలను నిబంధనలమేరకే ముద్రించాలని, కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. పబ్లిషర్లు, ప్రింటర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కరపత్రాలపై వ్యక్తిగత విమర్శలు, దూషణలు, కులం, మతం, ప్రాంతీయపరమైన విభేదాలు సృష్టించేలా వ్యాఖ్యలు ఉండకూడదన్నారు. ముద్రించిన కరపత్రాలపై ప్రింటర్ చిరునామా తప్పనిసరిగా ఉండాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా కరపత్రాలు, పోస్టర్లు ముద్రించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రచారానికి సంబంధించిన వివరాలను మూడురోజుల్లోగా ఎన్నికల అధికారులకు సమర్పించాలన్నారు. జేసీ గీతాంజలి శర్మ డీఆర్వో చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.




# 16,83,000 మంది

## నవ ఎన్టీఆర్ జిల్లా జనాభాలో 65 శాతం ఓటర్లు.. మహిళలు 51.24, పురుషులు 48.74

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

నవ ఎన్టీఆర్ జిల్లా జనాభాలో ఓటర్ల శాతం గణనీయంగా పెరిగింది. జనవరి 22న ఓటర్ల జాబితా విడుదల అనంతరం మార్చి 16, 2024 నాటికి ఎన్టీఆర్ జిల్లాలో 16,83,000 మంది ఓటర్లు ఉన్నారు. తుది జాబితా విడుదల తర్వాత మరో 8005 మంది ఓటర్లు పెరిగారు. దీంతో జిల్లాలో కొత్తగా యువ ఓటర్ల సంఖ్య 37,760కి చేరుకుంది. జిల్లా జనాభా ప్రాతిపదికన చూస్తే ఓటర్ల నిష్పత్తి పెరిగింది. ఎన్టీఆర్ జిల్లా జనాభాలో సగానికి కంటే ఎక్కువగా ఓటర్లు ఉన్నారు. ఎన్టీఆర్ జిల్లా జనాభా మొత్తం 25,89,917 మంది కాగా మార్చి 16 2024 నాటికి 16,8300 మంది ఓటర్లు ఉన్నారు. ప్రతి 1000 మంది జనాభాకు 710 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లా జనాభాతో పోల్చి చూస్తే 65 శాతం మేర ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు శాతం 48.74 కాగా మహిళా ఓటర్లు 51.24 శాతంతో మెజారిటీ స్థానంలో ఉన్నారు. ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 0.008 శాతం, సర్వీసు ఓటర్లు 0.02 శాతం, దివ్యాంగ ఓటర్లు 0.08 శాతం, 18-19 సంవత్సరాల వయస్సున్న ఓటర్లు 2.25 శాతం చొప్పున ఉన్నారు. మొదటిసారిగా ఓటు హక్కును వినియోగించుకోబోతున్న యువ ఓటర్లు 37,760 మంది ఉన్నారు.

దివ్యాంగ ఓటర్లు మొత్తం 14,388 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 8519 మంది కాగా, మహిళలు 6318 మంది ఉన్నారు. 85 సంవత్సరాల వయస్సు పైబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు 9572 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 4250 మంది ఉండగా.. మహిళలు 5321 మంది ఉన్నారు. వీరిలో కూడా ఒక్కరు ట్రాన్స్‌జెండర్ ఓటరు ఉన్నాడు.

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 382 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 349 మంది కాగా, మహిళలు 33 మంది ఉన్నారు.

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 1781 పోలింగ్ స్టేషన్లు, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 82 పోలింగ్ స్టేషన్లు వెరసి 1863 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 718 లోకేషన్లు ఉన్నాయి. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 685 పోలింగ్ లోకేషన్లు, గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 33 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

జిల్లాలో పలు మోడల్ పోలింగ్ స్టేషన్లు ఈ ఎన్నికలలో ఆదర్శంగా నిలువబోతున్నాయి. మహిళా పోలీసు సిబ్బందే ప్రత్యేకంగా నిర్వహించే పోలింగ్ కేంద్రాలు 7 ఉన్నాయి. దివ్యాంగులు నిర్వహించే పోలీసు స్టేషన్లు కూడా మరో 7 ఉన్నాయి. యువత నిర్వహించే పోలింగ్ స్టేషన్లు 7 ఉన్నాయి. ఇవి కాకుండా మోడల్ పోలింగ్ స్టేషన్లు మరో 10 ఉన్నాయి.

ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి (డిస్ట్రిక్ట్ ఎలక్టోరల్ ఆఫీసర్ - డీఈఓ)గా కలెక్టర్ దిల్లీరావు వ్యవహరిస్తారు. ఒక పార్లమెంట్ నియోజకవర్గం(విజయవాడ), ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు(జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు, విజయవాడ తూర్పు, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్)లు కలిపి మొత్తం 7 గురు రిటర్నింగ్ అధికారులు ఉన్నారు. వీరికి సహాయకంగా పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 8 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు (ఏఆర్ఓ) ఉండగా.. అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 33 మంది ఏఆర్ఓలు ఉన్నారు. ఎన్నికల ప్రక్రియలో బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓ)లు విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 1781, గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 82 మంది కలిపితే మొత్తం 1863 మంది బీఎల్ఓలు ఉన్నారు.

**ఎన్టీఆర్ జిల్లా సమగ్ర సమాచారం**

| | |
|---|---|
| ఎన్టీఆర్ జిల్లా జనాభా | 25,89,917 |
| జిల్లా ఓటర్లు (మార్చి 16,2024) | 16,83,000 |
| పురుష ఓటర్లు | 8,20,443 |
| మహిళా ఓటర్లు | 8,62,413 |
| థర్డ్ జెండర్ ఓటర్లు | 144 |
| సర్వీసు ఓటర్లు | 382 |
| 18-19 వయసున్న కొత్త ఓటర్లు | 37,760 |
| అసెంబ్లీ నియోజకవర్గాలు | 7 |
| పార్లమెంట్ నియోజకవర్గం | 1 |
| పోలింగ్ స్టేషన్లు | 1863 |
| రిటర్నింగ్ అధికారులు | 8 |
| సహాయ రిటర్నింగ్ అధికారులు | 41 |
| బూత్ లెవల్ ఆఫీసర్లు | 1863 |

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ఫైలు చెత్తకుప్పలో

» కృష్ణా కలెక్టర్ రాజాబాబు సీరియస్
» విచారణాధికారిగా జేసీ గీతాంజలి శర్మ
» సిగ్గు..సిగ్గు : కొల్లు రవీంద్ర ధ్వజం

**మచిలీపట్నం టౌన్, మార్చి 19 :** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ మంత్రి రోజా సంతకం చేసిన మినిట్స్ బుక్, ఫైళ్లు బందరు సమాచార శాఖ కార్యాలయంలో మాయం కావడం సంచలనం కలిగించింది. సమాచార శాఖ కార్యాలయం బయట చెత్తకుప్పలో మంత్రి రోజా, డీఆర్వో చంద్రశేఖర్, బందరు, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు, కమిటీ సభ్యుల సంతకాలతో ఉన్న రిజిస్టరులోని కాగితాలు మంగళవారం తెల్లవారు జామున కనిపించాయి. సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర ప్రసాద్, డివిజనల్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీనివాసరావు వద్దమినిట్స్ రిజిస్టరు, సంబంధిత ఫైళ్లు ఉంటాయి. రిజిస్టరు గల్లంతై వారం రోజులైనా పోలీసులకు ఎందుకు ఫిర్యా దు చేయలేదనేది అంతుచిక్కని ప్రశ్న. ఈ విషయాన్ని కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మను విచారణాధికారిగా నియమించారు. జర్నలిస్టులకిచ్చిన హామీని ప్రభుత్వం చెత్తబుట్టలో వేసిందని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ఫైలు మాయం కావడంపై సమాచార శాఖ డిప్యూ టీ డైరెక్టర్‌తో ఆయన చర్చించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జర్నలిస్టులకు స్థలాలిచ్చి ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి, మరొకరికి గాయాలు



**ఇబ్రహీంపట్నం, మార్చి 19 :** విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై మూలపాడు సెంటర్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూలపాడు సెంటర్ వద్ద ట్రాక్టర్ యూటర్న్ తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వెళుతున్న డీసీఎం వ్యాన్ వేగంగా దాన్ని ఢీ కొట్టి పక్కనే ఉన్న స్తంభానికి గుద్దుకోవడంతో డీసీఎం డ్రైవర్ స్వరాజ్‌కుమార్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడిది ఉత్తరప్రదేశ్ రాష్ట్రమని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి ఎస్సై బి.అనూష దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్నికలకు సహకరించండి

**కృష్ణలంక, మార్చి 19 :** సాధారణ ఎన్నికలను నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తు.చ తప్పక పాటించి సహకరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.దిల్లీరావు రాజకీయా పార్టీల ప్రతినిధులకు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ దిల్లీరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పక పాటించాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందిని సంసిద్ధం చేయడం జరిగిందన్నారు.

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 112, 121, 132 |
| చికెన్ విత్ స్కిన్ | 210 |
| చికెన్ స్కిన్‌లెస్ | 220 |



**నెక్ కోడిగుడ్డు ధర**

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.23

## టెన్త్ పరీక్షకు 97.72 శాతం మంది హాజరు



**వన్‌టౌన్, మార్చి 19:** జిల్లాలో మంగళవారం జరిగిన పదో తరగతి పరీక్షకు 28,705 మంది విద్యార్థులకు 28,503 మంది హాజరయ్యారు. మొత్తం 97.72 శాతం హాజరు నమోదైంది. కృష్ణలంక లోని పొట్టి శ్రీరాములు మునిసిపల్ హైస్కూల్ కేంద్రంలోని సెంటర్‌ను పాఠశాల విద్యా కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ పరిశీలించారు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నారు.

# విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

### ఎఫ్టానిక్స్ మేనేజర్ హెచ్‌ఆర్ స్ఫూర్తి



మాట్లాడుతున్న ఎఫ్టానిక్స్ మేనేజర్ హెచ్‌ఆర్ స్ఫూర్తి

**లబ్బీపేట, మార్చి 19:** విద్యార్థులు చదువుతోపాటు ఎంప్లాయబిలిటీ స్కిల్స్, టెక్నాలజీని ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవాలని ఎఫ్టానిక్స్ మేనేజర్ హెచ్‌ఆర్ డి.స్ఫూర్తి అన్నారు. నలంద డిగ్రీ కళాశాలలో ఎగ్జిబిట్ 2024ను మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మట్లాడుతూ విద్యార్థులు ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్, లాజికల్ థింకింగ్, ఆలోచన విధానాన్ని మెరుగుపరచుకోవటానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పరిశోధనలపై దృష్టి సారించి రీసెర్చ్ స్కాలర్స్‌గా ఎదగాలని అన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ మాట్లాడుతూ కళాశాలలో చదువుతోపాటు వివిధ నైపుణ్యాలను పెంపొందించేలా వర్క్‌షాపులు, సెమినార్స్ వివిధ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పీపీటీ, క్విజ్, మ్యాథ్స్ మోడల్, ఫ్రీ ఫైర్, ట్రెజర్ హంట్, ఫ్యాషన్ వాక్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మ్యాథ్స్ హెచ్‌వోడీ వి.లక్ష్మీ, స్టాటిస్టిక్స్ హెచ్‌వోడీ పి.రవికుమార్, ఫిజిక్స్ హెచ్‌వోడీ బి.శేషపవన్, కెమిస్ట్రీ హెచ్‌వోడీ పి.అనీల, ఇతర అధ్యాపకులు పాలొన్నారు.

# షాపు తాళాలు పగులకొట్టి నగదు, చీరలు చోరీ



షట్టర్ తాళాలు పగులకొట్టిన షాపు

**సత్యనారాయణపురం, మార్చి 19:** నిత్యం రద్దీగా ఉండే శాంతీప్రశాంతి థియేటర్ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తులు షాపు షట్టర్ తాళాలు పగులకొట్టి నగదు, చీరలు ఎత్తుకెళ్లారు . పోలీసుల వివరాల ప్రకారం ఎనికేపల్లి శివ నాగగంగాధర్ గులాబితోటలో నివసిస్తుంటాడు. ఇతను గాంధీనగర్ శాంతి ప్రశాంతి రోడ్డు పోస్టాఫీస్ పక్కన స్వర్ణలక్ష్మి శారీస్ అండ్ కట్ పీసెస్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. శివ పని మీద సోమవారం ఊరు వెళ్లాడు, షాపును శివ తల్లి తెరిచింది సోమవారం రాత్రి షాపు మూసి వెళ్లి పోయింది. మంగళవారం ఉదయం ఈ షాపు పక్కనే టీస్టాల్ నిర్వహించే వ్యక్తి షాపులో అద్దాలు పగిలి ఉండడం, తాళాలు పగలకొట్టి ఉండడంతో షాపు యజమానికి ఫోన్ చేశాడు. ఊరి నుంచి తిరిగి వచ్చి శివ మంగళవారం మధ్యాహ్నం జరిగిన సంఘటనపై సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు షాపు తెరిపించి చూడగా షాపులో చీరలు చిందరవందరగా పడి ఉన్నాయి. షాపు అద్దాల డోర్ పగుల కొట్టి ఉంది. పోలీసులు క్లూస్ టీమ్‌ను పిలిచి వేలి ముద్రలు సేకరించారు. షాపులో రూ.5 వేల విలువ చేసే చీరలు, రూ.10 వేలు కనిపించలేదని శివనాగ గంగాధర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

### ప్రమాదం జరిగి 24 గంటలు గడిచినా బాధితుడి వివరాలు తెలియని వైనం

**వన్‌టౌన్, మార్చి 19:** కృష్ణలంక జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. డీసీఎం హోటల్ ఎదురుగా జరిగిన ఈ ప్రమాదంలో కారును అదుపు చేయలేక డ్రైవర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు కింద పడడంతో తీవ్ర రక్త స్రావమైంది. గాయపడిన వ్యక్తిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి వివరాలు తెలియాల్సి ఉంది. రోడ్డు ప్రమాదం జరిగి 24 గంటలు దాటిన బాధితుడి వివరాలు పోలీసులకు తెలియక పోవడం ఆశ్చర్యకరంగా ఉంది. గాయపడిన వ్యక్తి ద్విచక్ర వాహన నెంబర్‌ను బట్టి కానీ, అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ లేదా ఇతర ఆధారాల బట్టి కాని అతని వివరాలు తెలుసుకునే అవకాశం ఉన్నప్పటికీ మంగళవారం రాత్రి పొద్దుపోయేంత వరకు బాధితుడి వివరాలు తెలియరాలేదనడం పోలీసుల పనితీరుకు అద్దం పడుతోంది.



కృష్ణలంకలో జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం



## భార్యపై కత్తితో దాడి

**అజిత్‌సింగ్‌నగర్, మార్చి 19 :** భార్యపై ఓ వ్యక్తి కత్తితో పొడిచి గాయపరచిన ఘటన బుడమేరు మధ్యకట్ట ప్రాంతంలో మంగళవారం జరిగింది. వివరాల ప్రకారం అంబళ్ల సింహాచలం,లక్ష్మీ దంపతులు కూలిపనులు చేస్తుంటారు. భార్య పనికి వెళ్లడం ఇష్టం లేకపోవడంతో గత కొద్ది రోజులుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం భార్య పనికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా భర్త ఇంట్లోని కత్తితో భార్య పొత్తికడుపులో పొడిచాడు. గాయపడ్డ ఆమెను చుట్టు ప్రక్కల వారు ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, భర్తను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**మొగల్రాజపురం, మార్చి 19:** విద్యుత్ మరమ్మతులు మెయింటెనెన్స్ నిమిత్తం బుధవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు మొగల్రాజపురం సెక్షన్ మహాత్మాగాంధీ ఇండోర్ సబ్ స్టేషన్, 11 కేవీ జమ్మిచెట్టు ఫీడర్ పరిధిలో మధుగార్డెన్ ఏరియా, ఏఎస్ రామారావు రోడ్డు, శాంతి నగర్, జమ్మిచెట్టు సెంటర్, ఉడ్‌పేట, బాడవ పేట, వాటర్ ట్యాంకు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## 23 నుంచి నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

**గంపలగూడెం, మార్చి 19:** నెమలిలో ఈనెల 23 నుంచి 28 వరకు జరగనున్న వేణుగోపాలస్వామి బ్రహ్మోత్స వాల వాల్ పోస్టర్లను ఆలయం వద్ద మంగళవారం ఆలయ చైర్మన్ కావూరి శశిరేఖ, అసిస్టెంట్ కమిషనర్ నూతక్కి సాంబశివరావు, ట్రస్టుబోర్డు సభ్యులు ఆవిష్కరించారు.



'ప్రజాగళం' భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన

# పోలీసులపై చర్యలు తీసుకోవాలి

### బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

**పటమట, మార్చి 19 :** 'ప్రజాగళం' బొప్పూడి సభలో భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ ఉన్నతాధికారులపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ డిమాండ్ చేశారు. అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఉదయం, సాయంత్రం 4, 5, 9, 20, 21, 22 డివిజన్లలోని బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులతో ఎమ్మెల్యే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ ప్రజాగళం సభ విజయవంతమైందని, మూడు పార్టీల కార్యకర్తలు, అభిమానులు పాల్గొని సభను దిగ్విజయం చేశారని అన్నారు. ఈ ఐదేళ్ల జగన్ పాలన్‌లో అభివృద్ధి ఆగిపోయిందని ప్రధాని మోదీ స్పష్టం చేశారని తెలిపారు. ఏపీ ప్రజల కష్టాలు తనకు తెలుసునని వచ్చే ఐదేళ్లు ఎంతో కీలకమైనవని ప్రధాని తెలియజేశారన్నారు. ఏపీ ప్రభుత్వంపై ప్రజాగ్రహం ఏ స్థాయిలో ఉందో ఈ సభ ద్వారా తెలుస్తోందని, ఈ అరాచక పాలనకు అంతం పలుకుదామని ప్రధాని పిలుపునిచ్చారని వివరించారు. ప్రజాగళం సభ భద్రతను పోలీస్ బాస్‌లు ఎందుకు పట్టించుకోలేదో చీఫ్ ఎలక్షన్ కమీషన్ సమగ్రంగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. చెన్నుపాటి గాంధీ, ముమ్మనేని ప్రసాద్, సిద్ధం నాగేంద్రరెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

### వైసీపీకి ఒక్కచాన్స్ ఇచ్చి ప్రజలు బాధపడుతున్నారు: గద్దె అనురాధ

**భారతీనగర్:** వైసీపీకి ఒక్కఛాన్స్ ఇచ్చి ప్రజలు చాలా బాధపడుతున్నారని, మరో ఛాన్స్ ఇవ్వరని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు.మంగళవారం తూర్పు పరిధి 3వ డివిజన్ పరిధిలో నాగార్జునగర్ పార్కు రోడ్డు గద్దె అనురాధ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ను, ఎంపీగా కేశినేని శివనాథ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గద్దె అనురాధగద్దె మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలన అంతా అరాచకం, అన్యాయంతో జరిగిందన్నారు. తనకు ఒక్క చాన్స్ ఇవ్వాలంటూ దేవినేని అవినాష్ అడుగుతున్నాడని, జగన్ మాటలు నమ్మి ఒకసారి అధికారం అప్పగించి రాష్ట్ర ప్రజలు తమ మెడకు యమపాశం చుట్టుకున్నట్లు గా అయిందన్నారు. అవినాష్‌ను గెలిపిస్తే తూర్పులో కూడా అదే విధంగా ఉంటుందన్నారు. తాడి బాబురావు, పేరేపి ఈశ్వర్, గద్దె రమేష్, కొత్తపల్లి హరీష్, శ్రీనివాసరావు, పీ.హెచ్.బాలాజీ, పినవీన్, దాడి సుబ్బారావు, గుణమాల రాజశేఖర్, తాడి విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.



10వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో దేవినేని అపర్ణ, గద్దె రాజేష్

### వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

**కార్పొరేటర్ దేవినేని అపర్ణ, గద్దె రాజేష్, క్రాంతి**

**పటమట:** వైసీపీ ప్రభుత్వ హయాంలో తన డివిజన్‌తో పాటు నియోజకవర్గంలో కూడా అభివృద్ధి జరగటం లేదని 10వ డివిజన్ కార్పొరేటర్ దేవినేని అపర్ణ ఆరోపించారు. 10వ డివిజన్‌లో పోస్టల్‌కాలనీలో దేవినేని అపర్ణ గద్దె రామ్మోహన్ కుమారులు గద్దె రాజేష్, క్రాంతిలతో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ డివిజన్‌లో శానిటేషన్ పనిచేయడానికి వర్కర్‌లను కేటాయించకుండా ఇబ్బంది పెడుతున్నారని, డి విజన్‌లో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని, యూజీడీ మురుగునీటి కాల్వల నిర్వహణ సరిగ్గా లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సైకిల్ గుర్తుకే ఓటు వేసి ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్ , ఎంపీగా కేశినేని శివనాథ్‌ను గెలిపించాలని కోరారు. గద్దె రాజేష్, క్రాంతిలు మాట్లాడుతూ 10వ డివిజన్‌లో తమ ప్రచారానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. పొన్నం శ్రీనివాస్, పాలగాని జగన్మోహన్‌రావు, డి. చంద్రశేఖర్, రామారావు, బొర్రా రవీంద్ర పాల్గొన్నారు.

## కంప్యూటర్ రంగంలో విప్లవాత్మక అభివృద్ధి



మాట్లాడుతున్న డాక్టర్ సి. నాగరాజు

**వన్‌టౌన్, మార్చి 19:** కంప్యూటర్ రంగంలో విప్లవాత్మక అభివృద్ధి జరుగుతోందని పొద్దుటూరులో వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ విభాగాధిపతి సీ నాగరాజు అన్నారు. కేబీఎన్ కళాశాలలో మిషన్ లెర్నింగ్, ఐటీస్ అప్లికేషన్ అంశంపై మంగళవారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కంప్యూటర్ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ప్రతి నిత్యం మార్పులు ఆవశ్యమన్నారు. అందుబాటులోకి వచ్చిన నూతన సాఫ్ట్‌వేర్‌లను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.నారాయణరావు, విభాగాధిపతి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## లారీ, ట్రక్కు డ్రైవర్లకు కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

**ఆటోనగర్(పెనమలూరు), మార్చి 19:** ఆటోనగర్ ఐలా, చోళా సైట్ సేవర్స్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సుమారు రెండువందల మందికి పైగా డ్రైవర్లకు కళ్లజోళ్ల పంపిణీ చేశారు. మహావీర్ కాటా ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐలా, చోళ సంస్థల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి దూర, హ్రస్వ దృష్టి లోపాలున్న వాహన చోదకులకు కళ్లజోళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, బాహుబలేంద్ర కోటేశ్వరరావు, కత్తిక శివనాగేశ్వరరావు, తోటకూర చంటి, డాక్టర్ అబ్దుల్ కలాం, బెవర నాగేశ్వరరావు, జమాక్ అధ్యక్షుడు త్రిపురనేని నాగచంద్, బ్లాక్‌స్మిత్ అసోసియేషన్ అధ్యక్షుడు వాడపల్లి శ్రీరాములు, తిరుమలశెట్టి శ్రీనివాస్, ఏసుబాబు, అంద్రాజు గోవర్ధన్, ఒడుగు నాగరాజు, కొల్లేటి నాగరాజు పాల్గొన్నారు.

# తెలంగాణ మద్యం స్వాధీనం

**నందిగామ రూరల్, మార్చి 19:** మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ హనీష్ అన్నారు. తెలంగాణ నుంచి ద్విచక్రవాహనంపైతీసుకువస్తున్న 75 మద్యం సీసాలను సోమవారం రాత్రి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారంతో దాడి చేశామన్నారు. మాగల్లు గ్రామం నుంచి వెంబడించి నందిగామ శివారులో పట్టుకున్నామన్నారు. పట్టుబడిన వ్యక్తి పల్నాడు జిల్లా అమరావతి మండలం, ధరణికోటకు చెందినవానిగా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

### గంగినేనిపాలెం చెక్‌పోస్టు వద్ద..

**జి.కొండూరు:** తెలంగాణ నుంచి తెల్లదేవరపాడు గ్రామానికి చెందిన పొట్లదుర్తి సాంబశివరావు అనే వ్యక్తి 24 మద్యం బాటిళ్లను తీసుకువస్తుండగా గంగినేనిపాలెం చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షబ్బీర్ అహమ్మద్ తెలిపారు. ద్విచక్రవాహనంలో మద్యాన్ని తరలిస్తుండగా సిబ్బంది అదుపులోకి తీసుకున్న అతనిని కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

### బోర్డర్‌లో వాహనాల తనిఖీ

**తిరువూరు, మార్చి 19:** సార్వత్రిక ఎన్నికల ప్రకటనతో పట్టణం శివారు బైపాస్‌రోడ్డు అంతరాష్ట్ర బోర్డర్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. పట్టణం సెక్టార్-1ఎస్సై సత్యనారాయణ సీఐఎస్ఎఫ్ బలగాలతో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. పట్టణం నుంచి తెలంగాణకు వెళ్లే వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

### నవాబుపేటలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలి

**పెనుగంచిప్రోలు:** నవాబుపేటలో పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన కేకేఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కోసూరి అక్కయ్య గౌడ్, ఎస్సై రాంబాబుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

## తొలి ఎన్‌డీఏ సభ విజయవంతం

### టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్

**వన్‌టౌన్, మార్చి 19:** చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో ఆదివారం జరిగిన ప్రజాగళం సభ భద్రతా వైఫల్యంలో పోలీసు ఉన్నతాధికారులపై ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోవాలని పశ్చిమ టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఏపీ సీఎం జగన్‌రెడ్డి ఆకాశంలో వెళుతున్నా సరే నేలపైన ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసులు ప్రధానమంత్రి పాల్గొనే సభ పట్ల నిర్లక్ష్యం వహించి భద్రత కల్పించలేదన్నారు. లక్షలాది మంది జనం తోసుకు వస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూశారని విమర్శించారు. బీజేపీ-టీడీపీ-జనసేన తొలి ఎన్‌డీఏ సభ కనీవినని రీతిలో విజయవంతమైనదని ఆయన పేర్కొన్నారు. అరాచక పాలనకు అంతం పలుకుదామని ప్రధాని పిలుపునిచ్చినట్లు చెప్పారు. ప్రధాని భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, జన నియంత్రణ వంటి అంశాలను గాలికి వదిలేసిన పోలీసులపై ఎలక్షన్ కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఈవో రామారావు

## దుర్గగుడి అభివృద్ధి పనుల పరిశీలన

**వన్‌టౌన్, మార్చి 19:** దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో మల్లేశ్వరాలయానికి దిగువన మెట్ల పక్కన జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఈవో కేఎస్ రామారావు పరిశీలించారు. ల్యాండ్ స్కేపింగ్ పనులు, ఇతర నిర్మాణ పనులను ఆయన పరిశీలించి పనులు వేగవంతం కావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఇటీవల మల్లేశ్వరాలయ విస్తరణ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం కొనసాగింపుగా ఆలయంలో పలు పనులను చేపట్టారు. కొద్దిరోజుల క్రితం సీఎం జగన్మోహనరెడ్డి కొన్ని నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వాటిని కొనసాగిస్తున్నారు.

## పేరంటాలమ్మ హుండీ ఆదాయం రూ.13.13 లక్షలు



**గుణదల, మార్చి 19 :** రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో హుండీల ద్వారా రూ 13.13 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పాతూరి లోకేశ్వరి తెలిపారు. గడచిన 73 రోజుల నుంచి భక్తులు అమ్మ వార్లకు హుండీల ద్వారా చెల్లించిన మొక్కుబడులను మంగళవారం లెక్కించారు. ఈ కార్యక్రమాన్ని దేవదాయశాఖ అధికారులు జి.వి.కృష్ణారావు, ఈవో లోకేశ్వరి, పాలక మండలి చైర్మన్ బోయిన భాను పర్యవేక్షించారు. కానుకల రూపంలో నగదు మాత్రమే వచ్చాయని, ఆభరణాలు రాలేదని తెలిపారు.

## కంకిపాడులో ఆశీల పాట రూ. 3.31లక్షలు

**కంకిపాడు, మార్చి 19 :** వ్యాపార వేత్తలకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా ఆశీలు వసూలు సక్రమంగా చేపట్టాలని కంకిపాడు సర్పంచ్ బాకి రమణ అన్నారు. కంకిపాడు పంచాయతీ పరిధిలో ప్రతి ఏటా నిర్వహించే ఆశీలు పాటతో పాటు ఆటో స్టాండ్‌కు కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం వేలం పాట నిర్వహించారు. సర్పంచ్ బాకి రమణ, ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ వేలం పాట నిర్వహించారు. కంకిపాడుకు చెందిన షేక్ బాజి, సురేష్, పులి అనీల్ ఈ వేలం పాటలో పాల్గొన్నారు. ఆశీల పాటను షేక్ బాజి రూ. 3.31 లక్షలకు పాడుకు న్నారు. అదే విధంగా ఆటో స్టాండ్ వేలం పాటు పంచాయతీ వారి పాట రూ. 1 లక్ష నుంచి ప్రారంభం కాగా ఎవ్వరూ ఆశక్తి చూపించక పోవడంతో ఆటో స్టాండ్ వేలం పాటను ఈ నెల 22కి వాయిదా వేశారు.

### కార్యదర్శిని నిలదీసిన పాటదారులు

కంకిపాడులో ఆశీలు, ఆటోస్టాండ్‌కు నిర్వహించిన వేలం పాటలో పలువురు అధికార పార్టీకి చెందిన నాయకులు ధరావత్తు చెల్లించకుండా వేలం పాటలో ఎలా పాల్గొంటారు అంటూ పులి అనీల్ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణను నిలదీశారు. దీంతో తక్షణం కనీస మొత్తాన్ని చెల్లించి అధికార పార్టీ నాయకులు వేలం పాటలో పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 20 మార్చి 2024
cinema@andhrajyothy.com


# గ్లాస్ అంటే సైజు కాదు... సైన్యం



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న మాసివ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాలో పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా పవన్‌కల్యాణ్ నటిస్తున్నారు. 'భగత్ బ్లేజ్' పేరుతో ఈ సినిమా టీజర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ సినిమాలో పంచ్ డైలాగులు పవర్‌ఫుల్‌గా ఉన్నాయి.. తన రేంజ్‌ను విమర్శించే వారికి ఘాటుగా సమాధానం ఇస్తూ 'గాజు పగిలే కొద్దీ పదునెక్కుద్ది.. గ్లాస్ అంటే సైజు కాదు.. సైన్యం.. కనిపించని సైన్యం' అంటూ పవన్ కల్యాణ్ కౌంటర్ ఇవ్వడం గూస్ బంప్స్ తెప్పించింది. ఈ టీజర్‌లో హీరోయిన్ శ్రీలీల కూడా కనిపించారు. సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఆకట్టుకొనే బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో పవన్‌కల్యాణ్ క్యారెక్టర్‌కు ఎలివేట్ చేశారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: అయనంక బోస్, స్క్రీన్‌ప్లే: కె.దశరథ్, నిర్మాతలు: నవీన్ యర్నేని, వై.రవిశంకర్.

# మహేశ్‌ను జపాన్ తీసుకొస్తా





రాజమౌళి

జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా దర్శకధీరుడు రాజమౌళి రూపొందించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం దేశవిదేశాల్లో విజయం సాధించింది. అలాగే ఇటీవల జరిగిన ఆస్కార్ వేడుకల సందర్భంగా గత ఏడాది ఆస్కార్ వేదికపై 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం సృష్టించిన సందర్భాన్ని అందరూ మరోసారి గుర్తు చేసుకున్నారు. ఈ సినిమా జపాన్‌లో కూడా విడుదలై విజయం సాధించింది. ఈ విజయాన్ని అక్కడి ప్రేక్షకులతో కలసి ఆస్వాదించడానికి రాజమౌళి ఇటీవలే జపాన్ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి ప్రేక్షకులతో మాట్లాడుతూ "నేను దర్శకత్వం వహించే నెక్ట్స్ ప్రాజెక్ట్ స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. నటీనటుల ఎంపిక ఇంకా ఓ కొలిక్కి రాలేదు. కేవలం కథానాయకుడు మాత్రమే ఖరారు అయ్యారు. ఆయన పేరు మహేశ్‌బాబు. చాలా అందంగా ఉంటారు. త్వరలోనే ఈ సినిమాను మొదలుపెడ్తాను. సినిమా రిలీజ్ సమయానికి మహేశ్‌ను కూడా జపాన్ తీసుకువచ్చి మీకందరికీ పరిచయం చేస్తాను. మహేశ్‌ను కూడా కచ్చితంగా మీరందరూ ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని చెప్పారు.

# అత్యద్భుత విజువల్స్‌తో...



తమిళ హీరో సూర్య నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. ఈ భారీ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌కు 'వేదాలమ్, వీరుడొక్కడే, వివేకం' వంటి చిత్రాలు తీసిన శివ దర్శకత్వం వహిస్తున్నారు. దిశాపటాని, యోగిబాబు, బాబీడియోల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'కంగువ' సినిమాను భారీ బడ్జెట్‌తో ప్రముఖ నిర్మాణ సంస్థలు స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్‌పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. పది భాషల్లో తెరకెక్కుతున్న 'కంగువ' త్రీడీలోనూ ప్రేక్షకుల ముందుకు రానుంది. పలు అంతర్జాతీయ భాషల్లోనూ ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శరవేగంగా షూటింగ్ పూర్తి చేసి సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు. మంగళవారం 'కంగువ' టీజర్ విడుదలైంది. అత్యద్భుత విజువల్స్‌తో ఈ టీజర్ ఆకట్టుకుంది. ఇందులో సూర్య పోరాట యోధుడిగా చేసిన యాక్షన్ సీన్స్ థియేటర్స్‌లో అందరిచేత విజిల్స్ వేయించేలా ఉన్నాయి. ఈ చిత్రానికి ఎడిటర్: నిశాద్‌యూసుఫ్, సినిమాటోగ్రఫీ: వెట్రి పళనిస్వామి, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఏ జే రాజా, కో ప్రొడ్యూసర్: నేహా జ్ఞానవేల్‌రాజా.

# సిద్ధమైన హనీ-బన్నీ



హాలీవుడ్ వెబ్ సిరీస్ 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్‌లో సమంత, వరుణ్ ధావన్ జంటగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఒరిజినల్ వెర్షన్‌కు రుస్సో బ్రదర్స్ దర్శకత్వం వహించగా, 'ఫ్యామిలీమ్యాన్' సిరీస్‌తో పాపులర్ అయిన దర్శక ద్వయం రాజ్, డీకే ఇండియన్ వెర్షన్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్ చిత్రీకరణ పూర్తయినా, ఎప్పటి నుంచి స్ట్రీమింగ్ అవుతుందనే విషయంలో ఇంతవరకూ ఎటువంటి అప్‌డేట్ రాలేదు. మేకర్స్ మంగళవారం ఈ సిరీస్ పోస్టర్‌తో పాటు టైటిల్‌ను రివీల్ చేశారు. 'హనీ-బన్నీ' పేరుని ఖరారు చేశారు. ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవనుంది. డేట్ మాత్రం ఇంకా ఫిక్స్ చేయలేదు. 1990ల నేపథ్యంలో సాగనున్న ఈ సిరీస్ అద్భుతమైన ప్రేమ కథతో కూడిన స్పై యాక్షన్ థ్రిల్లర్. దర్శక ద్వయం రాజ్, డీకే రూపొందించిన 'ఫ్యామిలీమ్యాన్' సిరీస్‌లో నెగెటివ్ టచ్ ఉన్న పాత్రను పోషించిన సమంత 'హనీ-బన్నీ సిరీస్‌కోసం మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ పొందారు. ఈ సిరీస్‌లో కేకే మీనన్, సిమ్రాన్, సోహమ్ మజుందార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.


# కామెడీతో వేడి పుట్టిస్తాం



సుహాస్ హీరోగా దిల్ రాజు ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం విడుదల తేదీని ప్రకటించారు. 'అందరూ మెచ్చే వినోదం ప్రారంభమవుతుంది. మీ క్యాలెండర్‌లో మే 24ని గుర్తు పెట్టుకోండి. మేం అద్భుతమైన కామెడీతో వేడి పుట్టించడానికి సిద్ధంగా ఉన్నాం' అని హీరో సుహాస్ వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్‌లో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఇందులో సుహాస్‌కి జతగా సంకీర్తన విపిన్ నటిస్తున్నారు. 'సలార్' చిత్రానికి డైలాగ్ రైటర్‌గా పని చేసిన సందీప్‌రెడ్డి బండ్ల ఈ సినిమాకు దర్శకుడు. మే 24న విడుదలయ్యే ఈ సినిమా టైటిల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని నిర్మాతలు చెప్పారు. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆ పోస్టర్‌ను చూస్తుంటే ఫ్యామిలీ ఎమోషన్స్ కలిగిన ఓ ఫన్నీ కోర్టు డ్రామా చిత్రమని అర్థమవుతుంది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్, మురళీశర్మ, గోపరాజు, రఘుబాబు, పృథ్వీ, శివన్నారాయణ, రూపలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: హర్షిత్ రెడ్డి, హన్షిత. సమర్పణ: శిరీష్.

# దర్శక ధీరుడి సమర్పణలో...

దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి తనయుడు ఎస్.ఎస్.కార్తికేయ నిర్మాతగా మారుతున్నారు. ప్రముఖ ఆర్కా మీడియా వర్క్స్ సంస్థ అధినేతలు శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేనితో కలసి కార్తికేయ రెండు క్రేజీ ప్రాజెక్ట్స్‌ను రూపొందించనున్నారు. పాన్ ఇండియా డైరెక్టర్ ఎస్.ఎస్.రాజమౌళి ఈ చిత్రాలకు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. సినిమా, సినిమాకు ఎంచుకునే పాత్రల్లో వైవిధ్యాన్ని ప్రదర్శించే మళయాళ నటుడు, 'పుష్ప' ఫేమ్ ఫహాద్ ఫాజిల్ ఈ రెండు చిత్రాల్లోనూ నటిస్తుండటం విశేషం. కార్తికేయ ఈ మధ్య తెలుగులో డిస్ట్రిబ్యూటర్‌గా విడుదల చేసిన 'ప్రేమలు' చిత్రానికి ఫహాద్ ఫాజిల్ కూడా ఓ నిర్మాత అనే సంగతి తెలిసిందే. ఈ రెండు చిత్రాల్లో ఒకటి ఫ్రెండ్‌షిప్ ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. దీనికి 'ఆక్సిజన్' అనే టైటిల్ ఖరారు చేశారు. నూతన దర్శకుడు సిద్ధార్థ్ నాదెళ్ల దర్శకుడు. మరో చిత్రం ఫ్యాంటసీ కథాంశంతో రూపొందుతోంది. ఈ చిత్రం టైటిల్ 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. శశాంక్ ఏలేటి దర్శకుడు. ఈ రెండు





చిత్రాలకు వేటికవే భిన్నంగా, కంటెంట్ బేస్డ్‌గా తెరకెక్కనున్నాయి. ఈ సినిమాలను ప్రకటించిన సందర్భంగా కార్తికేయ మాట్లాడుతూ "డిస్ట్రిబ్యూటర్‌గా నా తొలి చిత్రం 'ప్రేమలు' ద్వారా నాకు విజయాన్ని అందించి నాపై మీకున్న అపరిమితమైన ప్రేమను తెలియజేశారు. దీంతో మంచి చిత్రాలకు భాషాపరమైన భేదాలుండవనే నమ్మకం నాలో మరింతగా పెరిగింది. ఈ రెండు చిత్రాల్లో నటిస్తున్న ఫహాద్ ఫాజిల్ బహుముఖ ప్రజ్ఞకు ప్రతిరూపం, నేనెంతగానో ఆరాధించే వ్యక్తి" అని అన్నారు.

# మహిళలకు టెనెంట్ సందేశం



'పొలిమేర 2' చిత్రం ఘన విజయం తర్వాత సత్యం రాజేశ్ కథానాయకుడిగా నటిస్తున్న సినిమా 'టెనెంట్'. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు చక్కటి స్పందన వచ్చింది. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు థ్రిల్ చేసే అంశాలతో ఈ చిత్రం రూపొందిస్తున్నామని దర్శకుడు తెలిపారు. 'ఈ తరం మహిళలు ఎంత జాగ్రత్తగా మెలగాలో ఈ చిత్రంలో చూపించబోతున్నాం, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. ఏప్రిల్ మూడో వారంలో 'టెనెంట్'ను విడుదల చేస్తాం' అని నిర్మాత తెలిపారు. మేఘా చౌదరి, చందన పయావుల కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సాహిత్య సాగర్. సినిమాటోగ్రఫీ: జెమిన్ జోమ్

# 14ఏళ్ల తర్వాత వేదం కాంబినేషన్‌లో..



మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి చిత్రంతో రీ ఎంట్రీ ఇచ్చారు అనుష్క శెట్టి. ప్రస్తుతం ఆమె నటిస్తున్న 50వ చిత్రం అధికారికంగా ఖరారైంది. ప్రయోగాత్మక చిత్రాలు తీసే క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ కృష్ణ రెడ్డి, రాజీవ్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ చిత్రానికి 'ఘాటి' అనే టైటిల్‌ను ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. చీరతో ముఖాన్ని కప్పి ఎడారిలో ఒంటరి బాటసారిగా సాగుతున్న అనుష్కను ఇందులో చూపించారు. ఓ మహిళ.. తనకు జరిగిన అన్యాయంపై పోరాడి బయటపడే కథగా ఈ సినిమా తెరకెక్కనుంది. కాగా, క్రిష్ దర్శకత్వంలో దాదాపు 14 ఏళ్ల తర్వాత అనుష్క నటిస్తుండటం విశేషం. వీరిద్దరి కలయికలో వచ్చిన 'వేదం' విమర్శకుల ప్రశంసలతో పాటు క్లాసికల్ హిట్ స్టేటస్‌ను సంపాదించుకుంది. అందులో వేశ్యగా నటించిన అనుష్క, ఈ చిత్రంలోనూ అదే పాత్ర పోషించనున్నారని టాక్ వినిపిస్తోంది.

# ఏడు గెటప్పుల్లో మంచు లక్ష్మి




లక్ష్మీ మంచు ప్రధాన పాత్ర పోషించిన సోషియో ఫాంటసీ 'ఆదిపర్వం'. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహిస్తున్నారు. ఎం.ఎస్.కే నిర్మాత. ఈ పీరియాడిక్ డ్రామా తెలుగుతో పాటు పలు భాషల్లో విడుదలవుతోంది. తెలంగాణ ఎఫ్.డి.సి ఛైర్మన్ ఎన్. గిరిధర్ చేతుల మీదుగా 'ఆదిపర్వం' తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ మంచు మాట్లాడుతూ 'పోస్టర్ చూస్తుంటే 'నేను ఇన్ని పాత్రలు చేశానా?' అనిపిస్తోంది. అన్ని రకాల ఎమోషన్స్ ఉన్న సినిమా ఇది' అన్నారు. 'ఈ చిత్రానికి బలం, బలగం మంచు లక్ష్మి. ఆమె నటించకపోతే ఈ సినిమా లేదు. ఇందులో ఆమె ఏడు రకాల గెటప్స్ వేశారు. తన నట విశ్వరూపం చూస్తాం' అని దర్శకుడు చెప్పారు. శివ కంఠంనేని, ఎస్తర్ నోరోనా కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: మాధవ్, సంజీవ్. సినిమాటోగ్రఫీ: ఎస్ఎన్ హరీశ్

# స్వేచ్ఛకు స్ఫూర్తి




సాయికుమార్, పార్వతీశం, ఐశ్వర్య, హారిక ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'మెర్సీ కిల్లింగ్'. సూరపల్లి వెంకట రమణ దర్శకత్వంలో మాధవి తాలబత్తుల నిర్మిస్తున్నారు. ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను హీరో ఆకాశ్ పూరి చేతుల మీదుగా విడుదల చేశారు. కొత్త తరహా కాన్సెప్ట్‌తో తెరకెక్కిన 'మెర్సీ కిల్లింగ్' ఘన విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 స్ఫూర్తితో ఈ సినిమా కథ రూపొందించినట్లు దర్శకుడు తెలిపారు. స్వేచ్ఛ అనే అనాథ బాలిక న్యాయం కోసం జరిపిన పోరాటం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని నిర్మాత చెప్పారు. సంగీతం: ఎం. ఎల్ రాజా. సినిమాటోగ్రఫీ: అమర్ జి.

# యుద్ధ విద్యల్లో శిక్షణ



హృతిక్ రోషన్, ఎన్టీఆర్ నటిస్తున్న మల్టీస్టారర్ 'వార్ 2'. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ చిత్రంలో హృతిక్ రోషన్ ఏజెంట్ కబీర్ పాత్రలో కనిపించనున్నారు. తన పాత్ర కోసం ఆయన కసరత్తు మొదలుపెట్టారు. తన సినిమాల్లోని పాత్రకు తగ్గట్లు కనిపించేందుకు ఆయన ఎంత కష్టమైనా వెనుకాడరు. జిమ్‌లో కసరత్తులు చేసి, ఇప్పటికే బాడీని ఫిట్‌గా తయారు చేశారు. భారీ పోరాట ఘట్టాలతో తెరకెక్కుతోన్న చిత్రం కావడంతో, స్టైలిష్ యాక్షన్ సీక్వెన్స్ కోసం ఆయన మార్షల్ ఆర్ట్స్, కత్తియుద్ధంలో శిక్షణ తీసుకోబోతున్నారని యూనిట్ తెలిపింది. గతంలో వచ్చిన 'వార్' చిత్రానికి ఇది సీక్వెల్. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగస్టులో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

# పురాణ యోధుడి పాత్రలో షాహిద్ కపూర్



వరుస విజయాలతో జోరుమీదున్నారు బాలీవుడ్ కథానాయకుడు షాహిద్ కపూర్. ఆయన హీరోగా నటించబోయే కొత్త చిత్రం 'అశ్వత్థామ' అధికారికంగా ఖరారైంది. మహాభారతంలోని అశ్వత్థామ పాత్ర ఆధారంగా అల్లుకున్న కల్పిత గాథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఆ మహావీరుడు ఈ కాలానికి ఎలా వచ్చాడు, ఇక్కడున్న దుష్టశక్తులను తుదముట్టించేందుకు ఆయన జరిపిన భారీ పోరాటాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సచిన్ రవి దర్శకత్వంలో వసు భగ్నానీ, పూజా ఎంటర్టైన్‌మెంట్స్ నిర్మిస్తున్నాయి. గతంలో విక్కీ కౌశల్ కథానాయకుడిగా దర్శకుడు ఆదిత్యధర్ 'అశ్వత్థామ' ప్రాజెక్ట్‌ను ప్రకటించినా బడ్జెట్ పరిమితుల వల్ల వెనక్కు తగ్గారు.

# 'కలియుగం పట్టణంలో'



విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో'. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రాబోతోన్న ఈ మూవీకి రమాకాంత్ రెడ్డి దర్శకత్వం వహించారు. డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేష్‌లు నిర్మించిన 'కలియుగం పట్టణంలో' ఈ నెల 29న రాబోతోంది. సోమవారం ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేష్‌లు మాట్లాడుతూ "కలియుగం పట్టణంలో సినిమా అంతా కూడా కడపలోనే తీశాం. దర్శకుడు రమాకాంత్ రెడ్డి చెప్పిన కథ నచ్చడంతో ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించాం. సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది" అని అన్నారు. దర్శకుడు రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ. "ఈ సినిమాలో యాక్షన్, లవ్, క్రైమ్..ఇలా అన్నీ ఉన్నాయి. ప్రేక్షకులు మా సినిమాను చూసి ఆదరించాలి" అని కోరారు. విశ్వ కార్తికేయ మాట్లాడుతూ "కలియుగం పట్టణంలో ప్రతీ పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ఈ సినిమా తప్పక ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది" అని అన్నారు. ఆయుషి పటేల్ మాట్లాడుతూ "టీం అంతా కలిసి సినిమా షూటింగ్ ఎంతో సరదాగా చేశాం" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: గ్యారీ బీహెచ్, కెమెరామెన్: చరణ్ మాధవనేని, సంగీతం: అజయ్ అరసాద, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రామ్ ప్రకాష్ రెడ్డి.

ఫ్యాషన్

# లవ్లీ లాంగ్ గౌన్స్

ఈవినింగ్ పార్టీల్లో వెలిగిపోవాలంటే, ఆకర్షణీయమైన ఈవినింగ్ గౌన్స్ ధరించాలి. శాటిన్, నెటెడ్, సెక్విన్, ఎంబ్రాయిడరీ.... ఇలా లాంగ్ గౌన్స్‌లో బోలెడన్ని వెరైటీలు. వాటిలో నప్పే గౌన్ ఎంచుకుంటే లవ్లీ లేడీ మీరే కావచ్చు!



**శాటిన్ గౌన్**

సింపుల్‌గా, ఎలిగెంట్‌గా కనిపించాలనుకుంటే శాటిన్ మేడ్ లాంగ్ గౌన్ ధరించాలి. పార్టీలకు నప్పే ఈ గౌన్ బరువు కూడా చాలా తక్కువ. కాబట్టి వేడుకల్లో హుషారుగా పాల్గొనాలనుకుంటే, శాటిన్ గౌన్ బెస్ట్ ఆప్షన్!

**బుట్ట బొమ్మల్లా**

నడుము కింద నుంచి వెడల్పుగా విస్తరించినట్టు కనిపించే గౌన్‌లో కూడా దేవకన్యలా వెలిగిపోవచ్చు. ఇందుకోసం గౌన్‌లో ఎక్కువ లేయర్లు ఉండేలా చూసుకోవాలి. అలాగని గౌన్ అసౌకర్యంగా, బరువుగా ఉండకూడదు. చూడడానికి భారీగా కనిపించినా, ధరించడానికి తేలికగా ఉండాలి.

**లేయర్ లాంగ్ గౌన్**

నిలువుగా ఒకే పొడవుతో ఉండే గౌన్ బోరు కొట్టిందా! అయితే అలలుఅలలుగా ఎగసిపడే లేయర్ గౌన్ ఎంచుకోండి. ఛాతీ దగ్గర సెక్విన్ వర్క్‌తో, నడుము కింద నుంచి ప్లెయిన్‌గా ఉండే లేయర్ లాంగ్ గౌన్ నాజూకుగా కనిపించేలా చేస్తుంది. ఈ డ్రెస్‌తోపాటు, మెడలో చోకర్, చెవులకు స్టడ్స్ జోడిస్తే అలంకరణ పూర్తయినట్టే.

---

సెలబ్ ఫిట్

**బడి రోజుల్లో ఐఏఎస్ అధికారి కావాలనుకుంది. ఇరవయ్యేళ్లు వచ్చేసరికి నటించాలనే ఆసక్తి కలిగింది. ఆ కోరిక బలపడి... అవకాశాలు వెతుక్కొంటూ ముంబయి చేరింది. మోడల్‌గా మొదలుపెట్టి... విభిన్న చిత్రాలతో అలరిస్తూ... మంచి నటిగా ఎదిగిన యామీ గౌతమ్ జీవితంలో పెద్దగా మలుపులేమీ లేవు. కానీ అనుకున్నది సాధించాలన్న పట్టుదల, అంకితభావం కనిపిస్తాయి. అలరించే పాత్రలతోనే కా దు... అద్భుతమైన శరీరాకృతితోనూ అలరిస్తున్న నటి యామీ.**


## ఆరోగ్యమే అందం... ఆనందం

ప్రతిభ ఉంటే అవకాశాలకు కొదవలేదని నిరూపించిన నటి యామీ గౌతమ్. ఆరంభం నుంచే మూస పాత్రల్లో ఒదిగిపోకుండా... విభిన్న కథాంశాలను ఎంచుకొంటూ... తనకంటూ ఒక ప్రత్యేకమైన కెరీర్‌ను నిర్మించుకుంది. హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్‌కు చెందిన ఆమె... పెరిగింది చండీగఢ్‌లో. ఆమె తండ్రి ముఖేష్ గౌతమ్ పంజాబీ సినీ పరిశ్రమలో దర్శకుడు. తల్లి అంజలి గృహిణి. యామీకి చెల్లి సురిలీ గౌతమ్, తమ్ముడు ఓజాస్ గౌతమ్ ఉన్నారు. సురిలీ కూడా నటి. పంజాబీ సినిమాతో కెరీర్ ప్రారంభించింది. నాన్న దర్శకుడే అయినా... చిన్నప్పుడు ఆ రంగం వైపు వెళ్లాలని యామీ ఏ రోజూ అనుకోలేదు. సివిల్ సర్వీసెస్ రాసి ఐఏఎస్ అధికారి కావాలని కలలు కన్నది. న్యాయవాద వృత్తిమీద ఆసక్తితో 'లా'లో చేరింది. లా చదువుతుండగా ఆమె మనసు నటన వైపు మళ్లింది.

ఎప్పుడైతే నటి కావాలనే కోరిక మదిలో నాటుకుందో... ఆ దిశగా అప్పుడే ఆమె ప్రయత్నం మొదలైంది. చదువు మధ్యలోనే ఆపేసి... ముంబయికి వెళ్లిపోయింది. సినిమాల్లో అవకాశాలు దక్కించుకోవాలన్నది ఆమె ప్రధాన లక్ష్యం. మోడల్‌గా ముంబయిలో ప్రయాణం మొదలుపెట్టిన యామీ తొలిసారి తెరపై కనిపించింది... టీవీ సీరియల్‌లో. 2008లో ప్రసారమైన 'చాంద్ కే పార్ చలో'లో ప్రధాన పాత్ర పోషించిన ఆమె... తరువాత మరో అయిదు హిందీ ధారావాహికల్లో నటించింది. 'యే ప్యార్ న హోగా కామ్' సీరియల్ ఆమెకు మంచి పేరు తీసుకువచ్చింది.

బుల్లి తెరపై యామీ అందం, అభినయం చూసిన కన్నడ దర్శకుడు దేవరాజ్ పాలన్ 'ఉల్లాస ఉత్సాహ'లో ఆమెకు అవకాశం ఇచ్చారు. 2010లో విడుదలైన ఆ చిత్రంతో తొలిసారి వెండి తెరపై మెరిసింది యామీ. ఆ మరుసటి ఏడాది తెలుగు చిత్రం 'నువ్విలా'లో నటించింది. అందులో యామీతో పాటు ఆరుగురు కొత్త ముఖాలను దర్శకుడు రవిబాబు తెరకు పరిచయం చేశారు. వారిలో హీరో విజయ్ దేవరకొండ ఒకరు. 'విక్కీ డోనార్'తో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టిన యామీ గౌతమ్... దక్షిణాది భాషల్లో కూడా నటిస్తూ వచ్చింది. తెలుగులో 'గౌరవం, యుద్ధం, కొరియర్‌బాయ్ కల్యాణ్' చిత్రాలు చేసింది. పరిశ్రమలోకి వచ్చిన పద్నాలుగేళ్లలో దాదాపు ముప్పై చిత్రాల్లో నటించిన యామీ కెరీర్‌ను మలుపు తిప్పింది మాత్రం 2018లో విడుదలైన 'ఉరీ: ది సర్జికల్ స్ట్రయిక్'. అందులోని అద్భుతమైన నటనకు ప్రశంసలు, అవార్డులు అందుకుంది. గత నెలలో వచ్చిన 'ఆర్టికల్ 370'లో జూనీ హస్కర్‌గా యామీ అభినయం మరో స్థాయిలో ఉంది.

'సనమ్ రే' షూటింగ్‌లో భాగంగా సహ నటుడు పులకిత్ సామ్రాట్‌తో మూడేళ్లు సహజీవనం చేసిన యామీ... 2018లో అతడికి బ్రేకప్ చెప్పేసింది. 2021లో 'ఉరీ' దర్శకుడు, గీత రచయిత ఆదిత్య ధార్‌ను పెళ్లి చేసుకుంది. 'నా వైవాహిక జీవితం ఎంతో ఆహ్లాదంగా, ఆనందంగా సాగుతోంది. వృత్తిగత, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవడానికి నాకు మావారు ఆదిత్య మద్దతు, ప్రోత్సాహం ఉన్నాయి. నా కుటుంబ సహకారం, అండ ఉన్నాయి' అంటూ 'ఆర్టికల్ 370' ప్రచార కార్యక్రమాల్లో భాగంగా యామీ చెప్పుకొచ్చింది. పెళ్లికి ముందు, ఆ తరువాత కూడా ఆమెలో అదే ఉత్సాహం, అంకితభావం. తన వృత్తిపట్లే కాదు... తన శరీరం గురించి శ్రద్ధ తీసుకోవడంలోనూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తోంది ఆమె. ఎందుకంటే.. 'ఆరోగ్యంగా ఉంటేనే అందం, ఆనందం' అంటుంది యామీ.



### ఇదీ మెనూ...

'పిజ్జాలు, బర్గర్లు వంటి జంక్ ఫుడ్‌కు నేను దూరం. సాధ్యమైనంతవరకు ఇంటి వంటకే ప్రాధాన్యం ఇస్తాను. శరీరం డీహైడ్రేట్ అవ్వకుండా తరచూ నీళ్లు తాగుతా. కొబ్బరి నీళ్లు, ఇతర పండ్ల రసాలు తీసుకొంటా. అలాగే నా డైట్‌లో కూడా పుచ్చకాయ లాంటి నీటి ఆధారిత పండ్లు ఉండేలా చూసుకొంటా' అంటున్న యామీకి స్వీట్స్ ఇష్టమైన వంటకం. కుదిరినప్పుడల్లా నేరు తీపి చేసుకొంటుంది.

- బ్రేక్‌ఫాస్ట్‌లో ఎగ్ వైట్, ఫ్రూట్ స్మూతీస్, మిల్క్ షేక్స్, బాదంతో కూడిన పూర్తి స్థాయి పోషకాహారం.
- మధ్యాహ్న భోజనానికి ముందు బౌల్ నిండా పండ్ల ముక్కలు, నట్స్.
- లంచ్‌కు పప్పు లేదా చికెన్ కర్రీ, పెరుగుతో చపాతీ, అన్నం, వెజిటబుల్ సలాడ్.
- రాత్రి భోజనంలో బ్రౌన్ బ్రెడ్‌తో వెజిటబుల్ శాండ్‌విచ్, గ్రిల్డ్ చికెన్.

డైట్ పేరుతో కడుపును ఆకలితో ఉంచడం యామీకి నచ్చదు. అలా చేస్తే ఆరోగ్యం దెబ్బతింటుందనేది ఆమె అభిప్రాయం. ఆకలి వేసినప్పుడు తినడం, బరువు పెరిగినట్టు అనిపిస్తే జిమ్‌లో అదనపు గంటలు శ్రమించి, శరీరాన్ని అదుపులో పెట్టుకోవడం... ఇదే ఇన్నేళ్లుగా ఆమె అనుసరిస్తున్న విధానం.



### వర్కవుట్ ఇలా...

నచ్చింది వెనకాడకుండా తినేస్తుంది యామీ. అయితే ఎంత తింటే అంత వ్యాయామం చేస్తుంది. జిమ్‌కు వెళ్లి ఎప్పటికప్పుడు అదనపు కేలరీలు కరిగిస్తుంది. రోజు విడిచి రోజు యోగా చేస్తుంది. తన మేని మెరుపులకు, మానసిక ప్రశాంతతకు, ఆశావహ దృక్పథానికి యోగానే కారణమని చెబుతోంది.

- ఉదయం లేవగానే ట్రెడ్‌మిల్‌పై జాగింగ్, రన్నింగ్‌తో కూడిన కార్డియో సెషన్.
- రోజూ వ్యాయామాలకు ముందు కనీసం ఇరవై నిమిషాలు జాగింగ్
- వెయిట్, స్ట్రెంత్ ట్రైనింగ్ సెషన్స్‌తో పాటు పిలెట్స్ తప్పనిసరి. పిలెట్స్ ఆమెకు ఇష్టమైన వ్యాయామం.
- వీటితోపాటు డ్యాన్స్‌ను తన వర్కవుట్‌లో భాగం చేసుకుంది యామీ. తరచూ ఒకే రకమైన వ్యాయామాల వల్ల ఆసక్తి తగ్గుతుంది. అందుకే రొటీన్‌కు భిన్నంగా కార్డియో సెషన్‌కు నాట్యాన్ని జోడించింది. ఇది తనకు మానసికంగా ఉల్లాసాన్ని ఇస్తుందని, తన సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తుందనేది యామీ మాట.

---

న్యూస్‌మేకర్


**మనలో చాలా మంది సముద్రతీరాలకు విహారయాత్రలకు వెళ్తూ ఉంటాం. సముద్ర అందాలను ఆస్వాదిస్తాం. కొద్ది కాలం గడపి వచ్చేస్తాం. సముద్రమనగానే మనకు అందమైన జ్ఞాపకాలే గుర్తుకొస్తాయి. కానీ తమిళనాడుకు చెందిన ఉమామణి ఏ విషయాన్నీ అంత త్వరగా మర్చిపోరు. పదేళ్ల క్రితం... 49 ఏళ్ల వయస్సులో సరదాగా చేసిన స్కూబా డైవింగ్ ఆమె జీవితాన్నే మార్చేసింది. ప్రస్తుతం ఆమె సముద్ర కాలుష్యాన్ని నివారించటానికి ఉద్యమం చేపట్టారు. తాజాగా ఆమెను సోని-బీబీసీ ఎర్త్... "ఎర్త్ ఛాంపియన్ ఆఫ్ ది మంత్"గా ప్రకటించాయి కూడా!**

## సముద్రాలకు ఛాంపియన్






"సముద్రం మొదట చాలా భయపెడుతుంది. కళ్ల ముందు అంతు లేని నీళ్లు కనిపిస్తుంటే కాళ్లలో వణుకుపుడుతుంది. పదేళ్ల క్రితం తొలి సారి స్కూబా డైవింగ్‌కు వెళ్లినప్పుడు నాలో అలాంటి భయమే కలిగింది. దూకండి.. దూకండి అని స్కూబా ట్రైనర్ అరుస్తున్నాడు. దూకనని మొరాయించాను. కానీ కళ్లు మూసుకొని ఒక్క సారి ఆలోచించా. భయపడి మానేస్తే- జీవితంలో అలాంటి అనుభవం మరో సారి దొరుకుతుందో.. లేదో అనుకున్నా. కళ్లు మూసుకొని దూకేసా! ఆ సమయంలో నా వయస్సు గుర్తుకురాలేదు. ఆ జంప్ నా జీవితాన్ని మార్చేసింది" అంటారామె! ఉమామణి పుట్టింది.. పెరిగింది చెన్నైలో. మద్రాసు యూనివర్సిటీలో సాహిత్యంలో మాస్టర్స్ చేశారు. ఆ తర్వాత ఒక డాక్టర్‌తో వివాహమయింది. భర్త వృత్తిరీత్యా 2004లో మాల్దీవులకు వెళ్లిపోయారు. "చిన్నప్పటి నుంచి నాకు పెయింటింగ్ అంటే ఇష్టం. అయితే ఒక మాస్టర్ వద్ద పెయింటింగ్ నేర్చుకోలేకపోయాను. ఆ నిరాశ నన్ను చాలా కాలం వెంటాడుతూ ఉండేది. పెళ్లి అయిన తర్వాత పెయింటింగ్‌ను కూడా వదిలేశాను. మంచి భార్యను అయితే చాలనుకున్నాను. మా పిల్లలకు చదువు చెబుతూ కాలం గడిపేదాన్ని. ఇలా కొద్ది కాలం గడిచింది. ఏదో చేయాలనే కోరిక మళ్లీ బలంగా నాలో కలిగింది. దీనితో పీహెచ్‌డీ చేయటం మొదలుపెట్టా. అంతే కాదు. 45 ఏట మళ్లీ పెయింటింగ్ మొదలుపెట్టా. అది నాకు పునర్జన్మ అని చెప్పాలి.." అంటారు ఉమామణి. ఆ సమయంలోనే ఆమె సముద్రగర్భంలోని కోరల్‌రీఫ్స్‌పై డాక్యుమెంటరీ చూశారు. అది ఆమెను ఆకర్షించింది. నెమ్మదిగా కోరల్ రీఫ్స్ పెయింటింగ్స్ వేయటం మొదలు పెట్టారు. ఎగ్జిబిషన్స్ కూడా నిర్వహించారు. అయితే ఉమామణి తన జీవితంలో ఎప్పుడూ కోరల్ రీఫ్స్‌ను చూడలేదు.




### మలుపు తిప్పిన సంభాషణ...

ఒక రోజు ఉమామణి తన కజిన్‌తో మాట్లాడుతున్నప్పుడు సముద్ర కాలుష్యం వైపు సంభాషణ మళ్లింది. "నిజమైన కోరల్ రీఫ్స్‌ను ఎప్పుడైనా చూశావా? అని మా కజిన్ అడిగాడు. నువ్వు అందమైన పెయింటింగ్స్ వేస్తున్నావు. కానీ లోపలికి వెళ్లి చూడు. ఎంత కాలుష్యం ఉందో అర్థమవుతుంది" అన్నాడు. ఆ సంభాషణ నాలో కొత్త ఆలోచనలు రేకెత్తించింది. సముద్ర గర్భంలోకి వెళ్లి కోరల్ రీఫ్స్‌ను చూసి..వాటిని రక్షించటానికి ఏదైనా చేయాలనిపించింది. దీంతో ఆమె ఒక సారి సముద్రగర్భంలోకి వెళ్లి చూశారు. ఆ తర్వాత తాను కూడా స్కూబా డైవింగ్‌లో కోర్సు చేయాలని నిర్ణయించుకున్నారు. దానికి ఆమె కుటుంబం కూడా చాలా సహకరించింది. "మాకు పెళ్లి అయ్యి 25 ఏళ్లైన సందర్భంగా మా అబ్బాయి నాకు సర్టిఫికేషన్ కోర్సుకు అయ్యే ఖర్చును బహుమతిగా ఇస్తామన్నాడు. వాడి మాటలు వింటే నాకు కళ్లంపట నీళ్లు తిరిగాయి. నాపై వాడికున్న ప్రేమ అర్థమయింది.." అంటారు ఉమామణి. ఆమెకు కోరల్ రీఫ్స్ పట్ల ఉన్న ప్రేమ పెరగటం మొదలుపెట్టింది. అదే సమయంలో వాటిని కాపాడటానికి ఏదో ఒకటి చేయాలనే సంకల్పం కూడా నెరవేరింది. "పదేళ్ల క్రితం తొలిసారి నేను కోరల్ రీఫ్స్‌ను చూశాను. ఆ తర్వాత అనేక సార్లు సముద్ర గర్భంలోకి వెళ్లాను. వెళ్లిన ప్రతి సారి - కాలుష్యం పెరిగిపోతూనే ఉంది. చాలా మందికి తెలియని విషయమేమిటంటే- మనకు ఆక్సిజన్ కావాలంటే సముద్రాలు కాలుష్యసారం కాకూడదు. కార్బన్ వాయువులను సముద్రాలు తమ ఒడిలో దాచుకుంటాయి. కానీ మనం సముద్ర గర్భాలను చెత్తను పడేసే బ్యాగ్‌ల వాడుతున్నాం" అంటారామె!

### డాక్యుమెంటరీ...

కోరల్ రీఫ్స్ గురించి ఏదో చేయాలనే సంకల్పంతో ఉన్న ఉమామణికి ప్రియా తువాసరి పరిచయమయ్యారు. అప్పటికే ప్రియాకు మంచి డాక్యుమెంటరీ చిత్రాలు తీసే దర్శకురాలుగా పేరు ఉంది. ఉమామణి జీవితం ప్రియను బాగా ఆకర్షించింది.

కోరల్ రీఫ్స్ పరిరక్షణకు సంబంధించి- ఒక డాక్యుమెంటరీ తీయటానికి ఇద్దరు కలిపి ప్రయత్నం ప్రారంభించారు. ఇదే 2019లో - 'కోరల్ ఉమెన్'గా విడుదలయింది. దీనికి అనేక అవార్డులు లభించాయి. "మన దేశంలో కోరల్ రీఫ్స్ గురించి ఎక్కువగా మాట్లాడరు. అందువల్ల ఈ చిత్రం అనేక మందిని ఆకర్షించింది. అనేక అవార్డులు కూడా వచ్చాయి. అయితే ఇకపై నేను వేసే పెయింటింగ్‌లలో కోరల్‌రీఫ్స్ అందంగా కనబడవు. సముద్రం లోపల ఉన్న వాస్తవ చిత్రాన్ని అవి కళ్లకు కడతాయి" అంటారామె! ఉమామణి తన ఉద్యమాన్ని ప్రారంభించి- ఒక దశాబ్దమయింది. తన పెయింటింగ్ ఎగ్జిబిషన్స్ వల్ల ఎంతో కొంత అవగాహన పెరిగిందంటారామె! "ఒక గృహిణి నుంచి స్కూబా డ్రైవర్‌గా.. ఒక ఉద్యమకారిణిగా మారాను. సముద్రాలు తమ గురించి తాము చెప్పుకోలేవు. అందుకే నేను సముద్రాల గురించి బయట ప్రపంచానికి చెప్పుకోగలుగుతాను. అందరూ నాలాగే ఈ ప్రపంచానికి ఏదో ఒకటి చేయాలని సంకల్పిస్తే- అంత కన్నా గొప్ప విషయం ఏదీ ఉండదు" అంటారు ఉమామణి.

---

స్ఫూర్తి

**ఈమె పేరు... సరిత. కేరళ రాష్ట్రం. లాయర్ కావాలన్నది ఆమె ఆశయం. అయితే విధి ఆమెకు పెద్ద సవాలే విసిరింది. రైలు ప్రమాదంలో ఎడమ చేయి పోయింది. కానీ తన లక్ష్యం నుంచి ఆమె పక్కకు తప్పుకోలేదు. ఒంటిచేత్తోనే కష్టపడి... విజయాన్ని అందుకున్నారు.**



"త్రిశూర్ లా కాలేజీలో చదువుకుని.. మా ఊరు కొచ్చిన్‌కు వెళ్తున్నా. రైలు ఆగింది. డోర్ పక్కన నిలుచున్నా. వెనకాల నుంచి డోర్ వేగంగా నా మీదకు వచ్చింది. ఏం జరిగిందో తెలీలేదు. తలకు గాయమైంది. స్పైనల్ సమస్యతో పాటు ఎడమ చేయి మోచేతి దాకా.. కట్ అయిపోయింది. ఆ ఘోరమైన యాక్సిడెంట్ జరిగిందనే విషయం ఆసుపత్రిలో మెలకువ వచ్చాక తెలిసింది. ఏమీ చేయలేని పరిస్థితి. కొన్ని నెలల పాటు మంచానికి పరిమితమైంది. దీనికి ముందు నా జీవితం బావుండేది.

**అలా చదువుకోవాలనే ఆశ...**

మాది పేద కుటుంబం. అయినా చదువుకోవాలనే ఆశ ఉండేది.

## విజయాన్ని ఒంటి చేత్తో అందుకుంది

దీంతో టీ షాప్‌లో పని చేశా. డబ్బు సరిపోకపోవటంతో కొరియర్ ఏజెంట్‌గా పని చేశా. డబ్బే లేని వ్యక్తి చదువులెందుకు అనవసరం అన్నట్టు కొందరు మాట్లాడేవారు. అవేమీ పట్టించుకునే దాన్ని కాదు. ఎందుకంటే మా నాన్నకి ఉద్యోగం లేదు. మా అమ్మ ఇద్దరు ఆడపిల్లలతో కష్టపడేది. కొందరి ఇళ్లలో పనిమనిషిగా చేసేది. దీంతో డిగ్రీ ముందు నుంచే అమ్మకు చేదోడు వాదోడుగా ఉండేదాన్ని. డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేశా. ఆ క్రమంలో 2001లో టైపిస్ట్‌గా ఓ లాయర్ దగ్గర ఉద్యోగం దొరికింది. టైప్ రాకున్నా.. నేర్చుకుని అక్కడ జాయినయ్యా. ఆ సమయంలో చదువుకోవాలనే ఆశ పుట్టింది. ఆ బర్నింగ్ డిజైర్ వల్లనే సాయంత్రం పూట లాకోర్సులో జాయినయ్యా.

**అంతా బావుందనుకుంటే...**

టైపిస్ట్‌గా పని చేసేప్పుడే చదువుకుని ఎంట్రన్స్ ఎగ్జామ్ రాశా. కొజికోడే పట్టణంలోని గవర్నమెంట్ లా కాలేజ్‌లో సీట్ వచ్చింది. ఎగిరి గంతేశా. అయితే ఉద్యోగం వదిలేస్తే పూట గడవని పరిస్థితి కాబట్టి కాలేజీలో చేరలేకపోయా. అయితే మళ్లీ 2020లో ఎంట్రన్స్ రాస్తే.. త్రిశూర్ లా కాలేజీలో సీట్ వచ్చింది. జాబ్ వదిలేయకుండానే చదువుకునే అవకాశం ఉండటంతో రోజూ కాలేజీకి రైల్‌లో వెళ్లి వచ్చేదాన్ని. అలాంటి సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం జరిగాక.. నాకు పర్లేదు అనుకున్నప్పుడు.. మా నాన్న క్యాన్సర్‌తో చనిపోయారు. 2022 సమయంలో మా ఆఫీసులోని కొందరు స్టాఫ్ నాకు అండగా నిలిచారు. ఆర్థికంగా సాయపడ్డారు. దీంతో లా కోర్సు పూర్తి చేశా. గత వారంలోనే లాయర్‌గా ఎన్‌రోల్ అయ్యా.

**అదే నా ఆశ...**

టీషాప్‌లో పని చేసిన దాన్ని చదువుతానని అనుకోలేదు. చదివినా.. లాయర్ అవుతానని అస్సలు అనుకోలేదు. జీవితంలో ఏమేమో అనుకున్నా. అందుకు వ్యతిరేకంగా జరిగాయి. అయినా ముందుకెళ్లా. చివరికి లాయర్ అయ్యాను. ఈ సమాజానికి నా వంతు సేవ చేయాలన్నదే నా ఆశయం.

---

## కూల్ కూల్ గ్లాసెస్

ఎండాకాలం వచ్చేస్తోంది. ఈ కాలంలో చలువ కళ్లద్దాలు పెట్టుకునే అలవాటు మీకుందా? అయితే మీ ముఖాకృతికి తగిన వాటిని ఎలా ఎంచుకోవాలో తెలుసుకోండి!

**దీర్ఘవృత్తాకారం:** మీ ముఖం ఈ ఆకృతిలో ఉంటే దీర్ఘచతురస్రాకారం, నలుచదరం లేదా ఏవియేటర్ మోడల్ కళ్లద్దాలు ఎంచుకోవాలి.

**వృత్తాకారం:** ఈ ముఖాకృతి కలిగి ఉంటే, దీర్ఘచతురస్రం, నలుచదరం లేదా వృత్తాకార గాగుల్స్ ఎంచుకోవాలి.

**నలుచదరం:** ఈ కోవకు చెందిన వారు బ్రోలీన్, క్యాట్ ఐ, రౌండ్ మోడళ్లు ఎంచుకోవాలి.

**డైమండ్:** ఈ షేప్ కలిగి ఉంటే, ఓవల్, రౌండ్ లేదా క్యాట్ ఐ చలువ జోళ్లు ఎంచుకోవాలి.

**పియర్:** ఈ షేప్ అయితే బ్రోలీన్, ఓవల్ లేదా ఏవియేటర్ బాగుంటాయి.

**హార్ట్:** దీర్ఘచతురస్రం, రౌండ్ లేదా జామెట్రిక్ షేప్‌లు బాగుంటాయి.



# రోజుకు రూ. 25 లక్షలు



**ఐపీఎల్ వ్యాఖ్యాతగా మళ్లీ సిద్ధూ**

న్యూఢిల్లీ: మాజీ క్రికెటర్ నవ్‌జ్యోత్ సింగ్ సిద్ధూ దశాబ్ద కాలం తర్వాత కామెంటేటర్‌గా కనిపించనున్నాడు. శుక్రవారం నుంచి జరిగే ఐపీఎల్ ద్వారా అతను అభిమానులను అలరించబోతున్నాడు. కామెంటరీ బాక్స్‌లో సిద్ధూ ఉంటే ఆ సందడే వేరుగా ఉంటుంది. తనకు మాత్రమే ప్రత్యేకమైన చలోక్తులు, ప్రాస, జాతీయాలతో మ్యాచ్ జరిగే విధానాన్ని అత్యంత ఆసక్తికరంగా మారుస్తుంటాడు. అలాగే కామెంటేటర్‌గా తొలిసారి కమ్‌బ్యాక్ చేస్తున్నానని, విరామం వచ్చినా తన మాటల పదును తగ్గదని సిద్ధూ తేల్చాడు. గతంలో టోర్నీ మొత్తానికి రూ.60-70 లక్షలు వస్తే.. ఈసారి ఐపీఎల్‌లో మ్యాచ్‌కు రూ.25 లక్షలు తీసుకుంటున్నట్టు వెల్లడించాడు.



## ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలి

**డబ్ల్యూఎఫ్ఐకి పాలనాధికారం అప్పగించడంపై వినేష్, మాలిక్**

న్యూఢిల్లీ: రెజ్లింగ్‌కు సంబంధించిన పూర్తి పాలనాధికారాన్ని సంజయ్ సింగ్ నేతృత్వంలోని భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)కు జాతీయ ఒలింపిక్ సంఘం (ఐవోఏ) అప్పగించడాన్ని స్టార్ రెజ్లర్లు వినేష్ ఫొగట్, సాక్షి మాలిక్ తప్పుపట్టారు. ఈ విషయంలో ప్రధానమంత్రి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేసిన రెజ్లర్లు.. బ్రిజ్‌భూషణ్ లాంటి అణచివేతవాదులను క్రీడలకు దూరం ఉంచేందుకు ఏదో ఒకటి చేయాలని నరేంద్ర మోదీని కోరారు. 'రెజ్లర్లను వేధించిన బ్రిజ్‌భూషణ్ మళ్లీ రెజ్లింగ్‌పై అధికారాన్ని హస్తగతం చేసుకొన్నాడు. మహిళా శక్తి గురించి అనర్గళంగా ఉపన్యాసాలు ఇచ్చే మోదీ.. ఇలాంటి వారిని నియంత్రించండి' అని ఫొగట్ ఘాటైన పదజాలంతో సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. డబ్ల్యూఎఫ్ఐ ఆఫీసు బేరర్లు.. తమను తాము చట్టాలకు అతీతులుగా భావిస్తున్నారని సాక్షి మాలిక్ కామెంట్ చేసింది. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్‌కు అనుచరుడైన సంజయ్.. రెజ్లింగ్ చీఫ్‌గా ఉంటే పరిస్థితుల్లో మార్పు ఉండదని వినేష్, మాలిక్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## 'ఫ్రెండ్‌షిప్ గేమ్స్'.. రాజకీయ కుట్ర



బాచ్

- రష్యా క్రీడలకు దూరంగా ఉండండి
- అథ్లెట్లు, ప్రభుత్వాలకు ఐవోసీ విజ్ఞప్తి

జెనీవా: ప్రపంచ క్రీడలపై రష్యా ఎదురుదాడి.. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ)ని కలవరపెడుతోంది. ఒలింపిక్స్‌లో తమ దేశంపై నిషేధం విధించడంతో.. రష్యానే అలాంటి విశ్వక్రీడల నిర్వహణకు సన్నాహాలు చేస్తోంది. ఒలింపిక్స్ తరహాలో సెప్టెంబరు 15 నుంచి 29 వరకు మాస్కో, యకతరీన్‌బర్గ్‌లో 'అంతర్జాతీయ ఫ్రెండ్‌షిప్ గేమ్స్' పేరుతో గ్రాండ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇదివరకే ప్రకటించారు. ఇందులో పతక విజేతల కోసం రూ. 415 కోట్ల ప్రైజ్‌మనీని కూడా ఆయన ప్రకటించారు. ఇదే ఐవోసీని ఎక్కువగా భయపెడుతోంది. ఒలింపిక్స్‌లో పతకాలు మాత్రమే ఇస్తారు కానీ.. నజరానాలు ఉండవు. అథ్లెట్లు డబ్బు కోసం ఆశపడి రష్యా క్రీడల్లో పాల్గొనే అవకాశం లేకపోలేదు. అందుకే.. ఈ 'ఫ్రెండ్‌షిప్ గేమ్స్'లో అథ్లెట్లు ఎవరూ పాల్గొనవద్దని ఐవోసీ విజ్ఞప్తి చేస్తోంది. విశ్వక్రీడల స్ఫూర్తిని దెబ్బతీసి, ఆటలను రాజకీయమయం చేసేందుకు రష్యన్ సమాఖ్య చేస్తున్న కుట్ర ఇదని ఐవోసీ చీఫ్ థామస్ బాచ్ మంగళవారం ఆరోపించారు.

# పంత్ రాక.. మారేనా ఢిల్లీ రాత?



**2 ఐపీఎల్ రోజుల్లో**

టైటిల్ విషయం పక్కనపెడితే ఈసారి ఐపీఎల్‌కు సంబంధించి ఢిల్లీ క్యాపిటల్స్‌కు అత్యంత ఉత్సాహకరమైన విషయం కెప్టెన్ రిషబ్ పంత్ పునరాగమనం. దాదాపు ఏడాదిన్నర క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పంత్ నిరుడు ఈ మెగా టోర్నీకి పూర్తిగా దూరమయ్యాడు. అందరినీ సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తి కోలుకోవడం ద్వారా ఈ ఐపీఎల్‌కు తన పూర్వస్థాయిలో పంత్ సై అంటుండడం క్యాపిటల్స్ ఆత్మవిశ్వాసాన్ని రెండింతలు పెంచుతోంది. పదహారు సీజన్లలో ఒక్కసారే టైటిల్ ఫైట్‌కు రాగలిగింది ఢిల్లీ. హేమాహేమీ క్రికెటర్లున్నా జట్టు విజేతగా నిలవకపోవడమేమిటి? అనేది క్యాపిటల్స్ అభిమానుల ఆవేదన. ఈ నేపథ్యంలో పునరాగమన వేళ.కెప్టెన్ పంత్ తన జట్టును విజేతగా నిలుపుతాడా చూడాలి. **ఇక, ఈ సీజన్‌లో ఢిల్లీ జట్టుకు కెప్టెన్‌గా పంత్ వ్యవహరిస్తాడని క్యాపిటల్స్ యాజమాన్యం మంగళవారం అధికారికంగా ప్రకటించింది.**

**బలం:** పంత్ తిరిగి రావడం ఢిల్లీ బ్యాటింగ్ లైనప్‌ను మరింత బలోపేతం చేస్తుంది. డేవిడ్ వార్నర్ ఎలాగూ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. అతడి ధాటి బ్యాటింగ్‌కు పృథ్వీ షా తోడైతే శుభారంభాలు ఖాయం. మరో ఆస్ట్రేలియన్ మిచెల్ మార్ష్ దూకుడైన బ్యాటింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. జ్యే రిచర్డ్ సన్, నోకియా, ముకేశ్‌తో పేస్ విభాగం.. అక్షర్, కుల్దీప్‌తో స్పిన్ బౌలింగ్ దుర్భేద్యంగా కనిపిస్తోంది.

**బలహీనత:** పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్లు లేకపోవడం ఢిల్లీకి లోటు. అలాగే ఇంగ్లండ్ స్టార్ హ్యారీ బ్రూక్, ఎన్‌గిడి ఈ సీజన్ నుంచి తప్పుకోవడం పెద్ద దెబ్బ.

**ఢిల్లీ జట్టు** పంత్ (కెప్టెన్), వార్నర్, పృథ్వీ షా, నోకియా, అభిషేక్ పోరెల్, మార్ష్, అక్షర్, స్టబ్స్, ఇషాంత్, ముకేశ్, ఖలీల్, కుల్దీప్, వోస్వాల్, ప్రవీణ్ దుబే, ఫ్రాజెర్, హోప్, యశ్ ధుల్, స్వస్తిక్, లలిత్, రికీ భుయ్, కుశాగ్ర, రసిక్, రిచర్డ్‌సన్, సుమిత్.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

# భారీ అంచనాలతో..



ఐపీఎల్ అరంగేట్రాన్ని ఘనంగా చాటిన జట్టు గుజరాత్ టైటాన్స్. బరిలో దిగిన తొలిసారే ఏకంగా టైటిల్ పట్టేసి అదరగొట్టిన ఆ జట్టు..రెండోసారి రన్నరప్‌గా నిలవడం ద్వారా తమ ఆట గాలివాటం కాదని నిరూపించింది. టైటాన్స్‌ను రెండుసార్లు అద్భుతంగా నడిపించిన కెప్టెన్ హార్దిక్ పాండ్యా అనూహ్యంగా గుజరాత్‌ను వీడి తన పాత జట్టు ముంబైకి జైకొట్టాడు. దాంతో యువ క్రికెటర్ శుభమన్ గిల్ సారథ్యంలో ఈసారి గుజరాత్ జట్టు అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. మ్యాచ్ విన్నర్లతో కూడిన టైటాన్స్ తన తొలి రెండు సీజన్లలో అద్భుతంగా రాణించింది. దీంతో ఈసారీ ఆ జట్టుపై భారీ అంచనాలున్నాయి.

**బలం:** గిల్, డేవిడ్ మిల్లర్, కేన్ విలియమ్సన్, వేడ్, రాహుల్ తెవాటియాలాంటి స్టార్లతో గుజరాత్ బ్యాటింగ్ లైనప్ బలంగా ఉంది. ముఖ్యంగా మిల్లర్, వేడ్ కొద్ది బంతుల్లోనే మ్యాచ్ గతిని మార్చి వేయగల బ్యాటర్లు. గత సీజన్‌లో అమోఘంగా ఆడిన గిల్.. ఈసారీ చెలరేగితే టైటాన్స్‌కు తిరుగుండదు.

**బలహీనత:** హార్దిక్ పాండ్యా లేకపోవడం, కీలక పేసర్ షమి గాయంతో దూరం కావడంతో ఆ జట్టు బౌలింగ్ బలహీన పడింది. గాయం నుంచి కోలుకొని పునరాగమనం చేస్తున్న స్పిన్నర్ రషీద్ ఎలా బౌలింగ్ చేస్తాడనేది కీలకం. జోష్ లిటిల్, మోహిత్ శర్మ, ఉమేశ్, జాన్సన్ ప్రత్యర్థి బ్యాటర్లను ఎలా నియంత్రిస్తారో చూడాలి.

**గుజరాత్ జట్టు:** గిల్ (కెప్టెన్), సాహా, వేడ్, మిల్లర్, కేన్ విలియమ్సన్, సాయి సుదర్శన్, మనోహర్, విజయ్ శంకర్, నల్‌కండే, తెవాటియా, రషీద్, ఉమేశ్, లిటిల్, మోహిత్, షారుఖ్, జయంత్, నూర్ అహ్మద్, సాయికిశోర్, అజ్మతుల్లా, సుశాంత్, కార్తీక్ త్యాగి, సుతార్, జాన్సన్, మిన్జ్.

# ఆ గండం గట్టెక్కాలి..



ఐపీఎల్‌లో రెండేళ్ల క్రితం అరంగేట్రం చేసిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్.రెండుసార్లు ప్లేఆఫ్స్‌కు చేరినా ఎలిమినేటర్ గండాన్ని దాటలేకపోయింది. 2022లో బెంగళూరు చేతిలో ఓడిన లఖ్‌నవూ.. గత సీజన్‌లో ముంబైకి తలొగ్గి మూడో స్థానంతో సరిపెట్టుకొంది. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ ఫైనల్ చేరాలనే పట్టుదలతో ఉంది. గతేడాది గాయంతో సగం సీజన్‌కు దూరమైన కెప్టెన్ కేఎల్ రాహుల్.. అందుబాటులోకి రావడం జట్టుకు అదనపు బలం.

**బలం:** కెప్టెన్ కేఎల్ రాహుల్, స్టొయినిస్, మేయర్స్, పూరన్, క్రునాల్ పాండ్యా, డికాక్‌లతో బ్యాటింగ్ లైనప్ బలంగానే కనిపిస్తోంది. ఇక, అవేశ్ ఖాన్‌కు బదులు ట్రేడింగ్‌లో దేవదత్ పడిక్కళ్‌ను తీసుకోవడంతో బ్యాటింగ్ లైనప్ మరింత పటిష్ఠంగా తయారైంది. వేలంలో రూ. 6.4 కోట్లకు కొనుగోలు చేసిన పేసర్ శివమ్ మావి.. మొహిసిన్ ఖాన్‌కు బ్యాకప్‌గా నిలవనున్నాడు.

**బలహీనత:** నాకౌట్‌లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడంలో జట్టు విఫలమవుతోంది. గత రెండు సీజన్లలో బౌలింగ్ విభాగంలో అనుభవలేమి ఎక్కువగా కనిపించింది. ఇంగ్లండ్ పేసర్ ఉడ్ దూరమవడం లోటే. మావి, సిద్దార్థ్, యష్ ఠాకూర్, అర్షద్ ఖాన్, అమిత్ మిశ్రాలు ఎంతమేరకు రాణిస్తారేది కూడా ప్రశ్నార్థకం.

**లఖ్‌నవూ జట్టు:** రాహుల్ (కెప్టెన్), పడిక్కళ్, డికాక్, పూరన్, టర్నర్, బదోని, దీపక్ హుడా, కృష్ణప్ప గౌతమ్, క్రునాల్, మేయర్స్, స్టొయినిస్, అర్షద్, ప్రేరక్, యుధ్‌వీర్, అర్షిన్, విల్లే, మావి, జోసెఫ్, మయాంక్ యాదవ్, మొసిన్, బిష్ణోయ్, యష్ ఠాకూర్, అమిత్ మిశ్రా, నవీనుల్, సిద్దార్థ్.

## సూర్య ఫిట్‌నెస్‌పై సందిగ్ధత

**ముంబై తొలి మ్యాచ్‌కు దూరం?**



ముంబై: ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ ఐపీఎల్ బరిలోకి దిగడంపై సందిగ్ధత నెలకొంది. దీంతో ఈనెల 24న గుజరాత్‌తో జరిగే తొలి లీగ్ మ్యాచ్‌కు అతడు దాదాపు దూరమైనట్టే. స్పోర్ట్స్ హెర్నియా ఆపరేషన్ చేయించుకొన్న సూర్య.. జాతీయ క్రికెట్ అకాడమీలో పునరావాసంలో ఉన్నాడు. మంగళవారం నిర్వహించిన ఫిట్‌నెస్ టెస్ట్‌లో సంతృప్తికర ఫలితాలు రాలేదు. గురువారం మరోసారి సూర్యకు ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహించిన తర్వాత.. అంతా బాగుందనుకొంటే ఐపీఎల్‌లో ఆడేందుకు అనుమతిస్తారు.

## అఫ్ఘాన్‌తో ఆసీస్ టీ20 సిరీస్ వాయిదా

సిడ్నీ: ఈ ఏడాది ఆగస్టులో అఫ్ఘానిస్థాన్‌తో జరగాల్సిన మూడు టీ20ల సిరీస్‌ను ఆస్ట్రేలియా వాయిదా వేసుకొంది. అఫ్ఘాన్‌లో మహిళలు, ఆడపిల్లలపై జరుగుతున్న అకృత్యాలు, అణచివేత ధోరణులకు నిరసనగా ఆసీస్ ఈ నిర్ణయం తీసుకొంది. 2021లోనూ ఇలాంటి కారణాలతోనే అఫ్ఘాన్‌తో టెస్ట్ మ్యాచ్‌ను కూడా ఆసీస్ రద్దు చేసుకొంది.

# రివ్యూ వేగంగా.. మరింత కచ్చితంగా

**ఐపీఎల్‌లో 'స్మార్ట్ రీప్లే వ్యవస్థ'**

ముంబై: నిర్ణయ సమీక్షను మరింత వేగంగా, కచ్చితంగా చేసేందుకు ఈసారి ఐపీఎల్‌లో కొత్తగా 'స్మార్ట్ రీప్లే వ్యవస్థ'ను ప్రవేశపెట్టనున్నారు. ఈ కొత్త సిస్టమ్‌లో ఇద్దరు హాక్-ఐ ఆపరేటర్ల నుంచి థర్డ్ అంపైర్‌కు నేరుగా 8 హైస్పీడ్ కెమెరాల నుంచి విభిన్న కోణాల్లోంచి తీసిన ఇమేజ్‌లు అందుబాటులో ఉంటాయి. వారు కూడా అంపైర్‌తోపాటు అదే రూమ్‌లో ఉంటారు. గతంలో టీవీ బ్రాడ్‌కాస్టింగ్ డైరెక్టర్.. వీరి మధ్య అనుసంధానకర్తగా వ్యవహరించే వాడు. కానీ, నూతన వ్యవస్థలో అతడి ప్రమేయం అనవసరం. అంతేకాకుండా హాక్-ఐ ఆపరేటర్లతో జరిపే సంప్రదింపులను కూడా నేరుగా ప్రసారం చేస్తారు. దీనివల్ల ఏ నిర్ణయం ఎందుకు తీసుకొన్నారో స్పష్టంగా అర్థమవుతుంది. బౌండ్రీ వద్ద అందుకొనే క్యాచ్‌లు, ఎల్బీలు, స్టంపింగ్‌లతోపాటు నేలకు దగ్గరగా పట్టే క్యాచ్‌లను వేగంగా విశ్లేషించడం కోసం.. అంపైర్లకు వివిధ కోణాల్లో స్పష్టమైన విజువల్స్ అందుబాటులోకి రావడంలో ఈ వ్యవస్థ సహాయకారిగా ఉంటుంది. రివ్యూ చేసేటప్పుడు సంప్రదాయ పద్ధతిలో ఒకటి తర్వాత ఒకటి ఇలా అన్నింటినీ పరిశీలించకుండా.. వేగంగా నిర్ణయానికి వచ్చే స్టెప్‌కు రావడానికి కొత్త వ్యవస్థ దోహదం చేస్తుంది. స్మార్ట్ రీప్లే సిస్టమ్‌పై అవగాహన కోసం ఎంపిక చేసిన 15 మంది అంపైర్లకు బీసీసీఐ ఇటీవల రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించింది.

## లక్ష్య.. ర్యాంకుల్లో ముందంజ

న్యూఢిల్లీ: గతవారం ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరడంతో భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ ర్యాంకింగ్స్‌లో ముందంజ వేశాడు. మంగళవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో సింగిల్స్‌లో లక్ష్య ఐదు స్థానాలు మెరుగై 13వ ర్యాంకులో నిలిచాడు. ప్రణయ్ 9వ ర్యాంక్‌ను నిలబెట్టుకోగా..శ్రీకాంత్ 27వ, సింధు 11వ ర్యాంకులో ఉన్నారు. డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ జోడీ టాప్ ర్యాంకును పదిలం చేసుకోగా, గాయత్రి/ట్రీసా జంట 26వ ర్యాంకులో కొనసాగుతోంది.

## స్విస్ ఓపెన్ మెయిన్‌డ్రాకు సిక్కి జోడీ

బాసెల్: స్విస్ ఓపెన్ మెయిన్ బ్యాడ్మింటన్ టోర్నీలో మెయిన్ డ్రాకు సిక్కిరెడ్డి-సుమిత్ రెడ్డి జోడీ అర్హత సాధించింది. మంగళవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ అర్హత పోటీల్లో సిక్కి-సుమిత్ జంట 21-12, 21-17తో లీలా-జోరినా(స్విట్జర్లాండ్) జంటపై గెలిచింది.

## వాలీబాల్ లీగ్ ఫైనల్లో ఢిల్లీ

చెన్నై: ఢిల్లీ తుఫాన్స్ జట్టు ప్రైమ్ వాలీబాల్ లీగ్ ఫైనల్లో ప్రవేశించింది. మంగళవారం జరిగిన ఎలిమినేటర్ పోరులో ఢిల్లీ 3-2తో అహ్మదాబాద్ డిఫెండర్స్‌పై విజయం సాధించింది.

## 'హాల్ ఆఫ్ ఫేమ్'లో పంకజ్

న్యూఢిల్లీ: లెజెండరీ క్యూయిస్ట్, భారత స్టార్ పంకజ్ అడ్వాణీ కెరీర్‌లో మరో మైలురాయి చేరింది. 38 ఏళ్ల పంకజ్‌కు ప్రతిష్ఠాత్మక 'హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటు దక్కింది. చైనాలోని షాంగ్రావో సిటీలోని వరల్డ్ బిలియర్డ్స్ మ్యూజియంలో సోమవారం పంకజ్ చిత్రపటాన్ని ఏర్పాటుచేసిన నిర్వాహకులు.. అతడిని హాల్ ఆఫ్ ఫేమ్ గౌరవంతో సత్కరించారు.

# బిజినెస్

## టీసీఎస్ ఉద్యోగుల వేతనాలు పెంపు!

**ఆఫ్‌సైట్ ఉద్యోగులకు మరింత హైక్**

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తన ఉద్యోగుల జీతాలను ఏప్రిల్ నుంచి పెంచుతోంది. ఆన్‌సైట్ ఉద్యోగులకు సగటున రెండు నుంచి నాలుగు శాతం, ఆఫ్‌సైట్ ఉద్యోగులకు సగటున 7 నుంచి 8 శాతం పెరుగుతాయని సమాచారం. మంచి పనితీరు కనబరిచే టీసీఎస్ ఉద్యోగుల వేతనాలు మాత్రం 12 నుంచి 15 శాతం పెరగనున్నాయి. గత ఏడాది కూడా టీసీఎస్ ఉద్యోగుల జీతాలు 6 నుంచి 9 శాతం పెంచింది. మంచి పనితీరు కనబరిచే ఉద్యోగుల వేతనాలను 12 నుంచి 15 శాతం పెంచింది. అయితే ఏప్రిల్ నుంచి పెంచే జీతాలు అందరికీ వర్తిస్తాయా? లేక కొందరికేనా? అనే విషయం ఇంకా స్పష్టం కాలేదు. కొన్ని ఐటీ కంపెనీలు ప్రస్తుత డౌన్ ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని జీతాలు పెంపు మానేశాయి. కొన్ని కంపెనీలైతే పనితీరు ఆధారంగా ఇచ్చే వేరియబుల్ జీతాల్లోనూ కోత పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో టీసీఎస్ తన ఉద్యోగుల జీతాలు కొద్ది స్థాయిలోనైనా పెంచడం విశేషం. అయితే టీసీఎస్ మాత్రం ఈ జీతాల పెంపు వార్తలు పుకార్లని కొట్టివేసింది. జీతాల పెంపు ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని తెలిపింది.

## ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.18.90 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇప్పటి వరకు (ఈ నెల 17 వరకు) ప్రత్యక్ష పన్నుల నికర వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 20 శాతం వృద్ధితో రూ.18,90,259 కోట్లకు చేరుకున్నాయని ఐటీ శాఖ మంగళవారం వెల్లడించింది. అందులో, కార్పొరేట్ పన్నుల నికర వసూళ్లు రూ.9,14,469 కోట్లు కాగా.. సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) సహా వ్యక్తిగత ఆదాయం పన్ను (పీఐటీ) వసూళ్లు రూ.9,72,224 కోట్లుగా నమోదయ్యాయి. కాగా, ప్రత్యక్ష పన్నుల స్థూల వసూళ్లు 18.74 శాతం వృద్ధితో రూ.22.27 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2023-24కు గాను సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం.. ఈసారి ప్రత్యక్ష పన్నుల ద్వారా రూ.19.45 లక్షల కోట్ల ఆదాయం సమకూరవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

## వడ్డీ రేట్లు పెంచిన బ్యాంక్ ఆఫ్ జపాన్

టోక్యో: జపాన్ కేంద్ర బ్యాంక్.. బ్యాంక్ ఆఫ్ జపాన్ (బీఓజే) వడ్డీ రేట్ల పెంపునకు దిగింది. కనీస వడ్డీ రేటును మైనస్ 0.1 శాతం నుంచి 0.1 శాతానికి పెంచింది. 2007 ఫిబ్రవరి తర్వాత బీఓజే వడ్డీ రేట్లు పెంచడం ఇదే మొదటిసారి. ప్రతికూల వడ్డీ రేట్ల ద్వారా తక్కువ ఖర్చుతో ఆర్థిక వ్యవస్థలోకి పెట్టుబడులు ఆకర్షించాలన్న లక్ష్యం నెరవేరినందున వడ్డీ రేట్లు స్వల్పంగా పెంచినట్టు బీఓజే గవర్నర్ కజువో యుఎడా చెప్పారు.

# రూ.4.86 లక్షల కోట్లు ఆవిరి

**భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్ .. సెన్సెక్స్ 736 పాయింట్లు డౌన్ .. 22,000 దిగువ స్థాయికి నిఫ్టీ**

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం ట్రేడింగ్‌లో భారీగా నష్టపోయాయి. ఇంట్రాడేలో 815 పాయింట్లు క్షీణించి 72,000 దిగువకు జారుకున్న సెన్సెక్స్.. చివరికి 736.37 పాయింట్ల (1.01 శాతం) నష్టంతో 72,012.05 వద్ద ముగిసింది. నిఫ్టీ 238.25 పాయింట్లు (1.08 శాతం) కోల్పోయి 21,817.45 వద్ద స్థిరపడింది. సూచీలకు నెల రోజులకు పైగా కనిష్ఠ స్థాయిలివి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 23 నష్టాల్లో ముగిశాయి.

ప్రధాన కంపెనీలతో పాటు చిన్న, మధ్య స్థాయి షేర్లు సైతం తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దాంతో బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 1.04 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.36 శాతం పతనమయ్యాయి. రంగాలవారీ సూచీల్లో ఐటీ, టెక్ 2.66 శాతం వరకు నష్టపోగా.. టెలికాం, సర్వీసెస్, యుటిలిటీస్ ఇండెక్స్‌లు ఒక శాతానికి పైగా జారుకున్నాయి. బేరిష్ ట్రెండ్ కారణంగా ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) ఒక్కరోజులోనే రూ.4.86 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.373.93 లక్షల కోట్లకు జారుకుంది.

**మార్కెట్ నష్టాలకు కారణాలు**

- బ్యాంక్ ఆఫ్ జపాన్ (బీఓజే) 17 ఏళ్లలో తొలిసారిగా వడ్డీ రేట్లను పెంచడంతో ఆసియా మార్కెట్లో ట్రేడింగ్ సెంటిమెంట్ ప్రతికూలంగా మారింది. దాంతో మన మార్కెట్లు నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అధిక ధరల వద్ద ట్రేడవుతున్న షేర్లలో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు.
- ఐటీ రంగ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్‌తో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో అమ్మకాలు సూచీలకు భారీగా గండికొట్టాయి.
- అమెరికన్ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ కూడా బుధవారం వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్త ధోరణిని కనబరిచారు. ఫెడ్ రేట్ల తగ్గింపు జాప్యం కావచ్చన్న ఆందోళనలు ప్రపంచ మార్కెట్ల ట్రేడింగ్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపుతున్నాయి. భారత్ సహా వర్ధమాన మార్కెట్ల నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు మళ్లీ వెనక్కి వెళ్లిపోతున్నాయి.
- అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు మళ్లీ ఎగబాకుతుండటం కూడా మన ఈక్విటీ మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది.



**తిరోగమనంలో ఎల్ఐసీ షేరు**

**ఏడాది గరిష్ఠ స్థాయి నుంచి 25 శాతం పతనం**

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ షేరు వరుసగా మూడో రోజూ నష్టపోయింది. మంగళవారం మరో 2.77 శాతం క్షీణించి రూ.879.50 వద్ద స్థిరపడింది. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో షేరు 8.27 శాతం తగ్గింది. ఈ ఏడాది ఫిబ్రవరి 9న నమోదైన ఏడాది గరిష్ఠ స్థాయి రూ.1,175 నుంచి ఇప్పటివరకు 25.14 శాతం పతనమైంది.

**ఆర్ఈసీ రూ.4.5 మధ్యంతర డివిడెండ్**

ఈ ఆర్థిక సంవత్సరానికి (2023-24) గాను ప్రభుత్వ రంగ సంస్థ ఆర్ఈసీ మూడో మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. వాటాదారులకు రూ.10 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.4.5 డివిడెండ్ చెల్లించేందుకు కంపెనీ బోర్డు మంగళవారం ఆమోదం తెలిపింది. ఇప్పటికే ప్రకటించిన రెండు మధ్యంతర డివిడెండ్‌లతో కలిపి 2023-24కు గాను కంపెనీ మొత్తం డివిడెండ్ రూ.6.5 డివిడెండ్ చెల్లించినట్లవుతుంది. తాజా డివిడెండ్ చెల్లింపునకు అర్హులైన షేర్‌హోల్డర్ల రికార్డు తేదీని ఈనెల 28గా నిర్ణయించింది. వచ్చే నెల 17లోగా డివిడెండ్ చెల్లించనుంది.

**పాపులర్ వెహికిల్ లిస్టింగ్.. ప్చ్**

మారుతి సుజుకీ, హోండా, జేఎల్ఆర్ బ్రాండ్ కార్లతో పాటు టాటా మోటార్స్ వాణిజ్య వాహనాల డీలర్‌షిప్‌లను కలిగిన పాపులర్ వెహికిల్స్ అండ్ సర్వీసెస్ లిమిటెడ్ మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.295తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు ఒక శాతం డిస్కౌంట్‌తో రూ.292 వద్ద లిస్టయింది. ఒక దశలో 11 శాతం వరకు క్షీణించిన కంపెనీ షేరు.. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 6.35 శాతం నష్టంతో రూ.276.25 వద్ద స్థిరపడింది. గత గురువారంతో ముగిసిన కంపెనీ ఐపీఓకు ఇష్యూ సైజుతో పోలిస్తే 1.23 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

## అపోలో హాస్పిటల్స్ ప్రెసిడెంట్, సీఈఓగా మధు శశిధర్



హైదరాబాద్: అపోలో హాస్పిటల్స్ డివిజన్ ప్రెసిడెంట్, సీఈఓగా డాక్టర్ మధు శశిధర్ నియమితులయ్యారు. ఈ మేరకు అపోలో గ్రూప్ ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం ప్రెసిడెంట్‌గా ఉన్న కే హరిప్రసాద్ నుంచి శశిధర్ ఈ బాధ్యతలు తీసుకోనున్నారు. గత ఏడాది అక్టోబరు నుంచి శశిధర్ అపోలో చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతకు ముందు ఆయన అమెరికాలోని క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ ట్రెడిషన్ హాస్పిటల్ ప్రెసిడెంట్‌గా పని చేశారు. శశిధర్ నాయకత్వంలో అపోలో హాస్పిటల్స్ పేరు ప్రతిష్ఠలు మరింత ఇనుమడిస్తాయని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఆశాభావం వ్యక్తం చేసింది.



**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 66,330 ▲ | 60,800 ▲ | 80,300 ▲ |
| ముంబై | 65,589 ▼ | 60,080 ▼ | 73,844 ▼ |

## భారత్‌లోనే విద్యుత్ కార్ల అసెంబ్లింగ్

**ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్**

ఇంగోల్‌స్టాట్ (జర్మనీ): జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల కంపెనీ ఆడి భారత్‌లో విక్రయించే విద్యుత్ కార్లను దేశీయంగానే అసెంబ్లింగ్ చేసే ప్రయత్నంలో ఉంది. దీనివల్ల కస్టమర్లకు అందుబాటులో ఉండే వివిధ ధరల శ్రేణుల్లో కార్లను అందుబాటులోకి తెచ్చి కస్టమర్ బేస్ పెంచుకునే వీలు కలుగుతుందని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ అన్నారు. ఆడి కంపెనీ కొత్త ఎలక్ట్రిక్ కారు క్యూ6 ఈ-ట్రాన్‌ను ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేసింది. ఈ ఏడాదిలోనే ఈ కారు ప్రపంచ మార్కెట్లలో ప్రవేశించనుంది. వచ్చే ఏడాది భారత మార్కెట్లో కూడా విక్రయాలు ప్రారంభం అవుతాయి. ఈ సందర్భంగా ధిల్లాన్ మాట్లాడుతూ.. ఈ మోడల్‌లో విద్యుత్ వాహనాల రంగంలో తమ అస్తిత్వం మరింత పెరుగుతుందని అన్నారు. 2030 నాటికి తమ అమ్మకాల్లో 50 శాతం విద్యుత్ కార్లే ఉంటాయని భావిస్తున్నట్టు చెప్పారు. ఈ కారు ఒకసారి చార్జి చేస్తే 625 కిలోమీటర్లు నడుస్తుంది. ప్రస్తుతం విద్యుత్ కార్లన్నీ సీబీయూలుగా దిగుమతి చేసుకుని ఔరంగాబాద్ ప్లాంట్‌లో అసెంబ్లింగ్ చేస్తోంది. దీని వల్ల 60 శాతం నుంచి 100 శాతం వరకు కస్టమ్స్ సుంకాలు భరించాల్సి వస్తోంది. స్థానికంగానే ఉత్పత్తి చేయడం వల్ల ఆ భారం తగ్గి కస్టమర్లకు మరింత తక్కువ ధరకు కార్లు అందించగలుగుతామని ధిల్లాన్ అన్నారు.

**2025 నాటికి 20 కొత్త మోడల్స్:** వచ్చే ఏడాది చివరికి తాము ప్రపంచ మార్కెట్లో 20 కొత్త మోడల్స్ ప్రవేశపెట్టాలనుకుంటున్నట్టు ఆడి ఏజీ సీఈఓ గెర్నాట్ డోల్నర్ చెప్పారు. వివిధ రకాల కార్ల అభివృద్ధి కార్యకలాపాలపై తాము 2024-28 మధ్య కాలంలో 4100 యూరోలు ఇన్వెస్ట్ చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. గత ఏడాది తమ విద్యుత్ కార్ల డెలివరీలు 50 శాతం పెరిగినట్టు ఆయన చెప్పారు. 2023 సంవత్సరంలో ఆడి కంపెనీ 1.78 లక్షల విద్యుత్ కార్లు విక్రయించింది. ముందు ఏడాదితో పోల్చితే ఇది 51 శాతం అధికం.

## మహబూబ్‌నగర్‌లో గ్లోబల్‌లాజిక్ కార్యాలయం

హైదరాబాద్: జపాన్ కంపెనీ హిటాచీ గ్రూప్‌నకు చెందిన గ్లోబల్ లాజిక్ మహబూబ్‌నగర్‌లో కొత్త కార్యాలయం ప్రారంభించింది. దీనివల్ల కంటెంట్ ఇంజనీరింగ్ బిజినెస్ కార్యకలాపాలు మహబూబ్‌నగర్ కేంద్రంగా చేపట్టగలుగుతుంది. 180 మంది పని చేయగల సామర్థ్యంతో 18,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ కేంద్రం తమకు ఇన్నోవేషన్, టెక్నాలజీ హబ్‌గా ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. డేటా, జీఐఎస్ సొల్యూషన్లు, అత్యాధునిక జెనరేటివ్ ఏఐ ప్రాజెక్టులు సహా విభిన్న రంగాల్లో అత్యున్నత నాణ్యత గల కార్యకలాపాలకు ఇది కేంద్రంగా ఉంటుందని పేర్కొంది. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో హబ్ అండ్ స్పోక్ విధానంలో కార్యకలాపాలు చేపట్టి స్థానిక ప్రతిభకు అవకాశాలు కల్పించడంలో ఇది తమ తొలి ప్రయత్నమని కంపెనీ వెల్లడించింది. విస్తరణ వ్యూహంలో భాగంగా తాము తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు తెలిపింది. ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించి ఆర్థిక వృద్ధిని ఉత్తేజితం చేయడం, ఉపాధి అవకాశాలు కల్పించడంలో తమ కట్టుబాటుకు మహబూబ్‌నగర్‌లో కార్యాలయం ప్రారంభం నిదర్శనమని గ్లోబల్ లాజిక్ ఏపీఏసీ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ ప్రెసిడెంట్ పీయూష్ ఝా అన్నారు.

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**



| | | | |
|---|---|---|---|
| 19వ తేదీ | | విజయవాడ | 425 |
| హైదరాబాద్ | 415 | విశాఖపట్నం | 430 |
| 20వ తేదీ | | వరంగల్ | 415 |
| చిత్తూరు | 478 | | |
| గోదావరి | 425 | డజను గుడ్లు రూ.72 | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 101 | గోదావరి | 103 |
| వరంగల్ | 101 | విజయవాడ | 103 |
| కరీంనగర్ | 101 | గుంటూరు | 107 |
| మహబూబ్‌నగర్ | 101 | ఒంగోలు | 107 |
| కర్నూలు | 101 | చిత్తూరు | 110 |
| విశాఖపట్నం | 98 | | |

## 8.3% వడ్డీ రేటుకే గృహ రుణాలు: బీఓఐ

ముంబై: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) గృహ రుణాల వడ్డీ రేటు తగ్గించింది. ప్రస్తుతం గృహ రుణాలపై 8.45 శాతంగా ఉన్న వడ్డీ రేటును 8.3 శాతానికి తగ్గించింది. అయితే ఈ ఆఫర్ ఈ నెలాఖరు వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపింది. ఈ ఆఫర్ సందర్భంగా తీసుకునే గృహ రుణాలపై ప్రాసెసింగ్ చార్జీలను కూడా బ్యాంక్ రద్దు చేసింది. రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులకూ ఈ నెలాఖరు వరకు 7 శాతం వడ్డీ రేటుకే రుణాలు ఇవ్వనున్నట్టు ప్రకటించింది.

**గ్లెనిగల్స్ హెల్త్‌కేర్**

## ఇక గ్లెనిగల్స్ హాస్పిటల్స్

హైదరాబాద్: గ్లెనిగల్స్ హెల్త్‌కేర్ ఇండియా తన హాస్పిటల్స్ పేరు మార్చుకుంది. ఈ హాస్పిటల్స్ ఇక 'గ్లెనిగల్స్ హాస్పిటల్స్' పేరుతో వ్యవహరించబడతాయి. గ్లెనిగల్స్ హాస్పిటల్స్.. హైదరాబాద్ సహా ముంబై, చెన్నై, బెంగళూరుల్లో మొత్తం 6 హాస్పిటల్స్‌ను నిర్వహిస్తోంది. ఈ హాస్పిటల్స్ మొత్తం 1,500 పడకలతో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాయి. ఐహెచ్‌హెచ్ హెల్త్‌కేర్ గత ఏడాది ఆగస్టులో గ్లెనిగల్స్ హాస్పిటల్స్ ఈక్విటీలో 100 శాతానికి కొనుగోలు చేసింది.

# 27 నుంచి జగన్ బస్సు యాత్ర

## కార్యకర్తలను సన్నద్ధం చేయడానికే: సజ్జల



అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఎమ్మెల్యేల కు టికెట్ నిరాకరణ.. కొందరికి వేరే నియోజకవర్గాల బదిలీ.. నేతల మధ్య వర్గ విభేదాలు.. తమ కంటే వలంటీర్లే ముద్దయ్యారంటూ కేడర్‌లో అసంతృప్తి నేపథ్యంలో సీఎం, వైసీపీ అధ్యక్షుడు జగన్ ఎన్నికల ప్రచారానికి సమాయత్తమయ్యా రు. ఈ నెల 27 నుంచి బస్సు యాత్ర ప్రారంభిస్తున్నారు. ఇడుపులపాయ నుం చి ఇచ్ఛాపురం వరకు నిర్వహించాలని తలపెట్టారు. తొలిరోజు పులివెందుల, కమలాపురం నియోజకవర్గాల మీదుగా ప్రొద్దుటూరు చేరుకుంటారు. మర్నాడు నం ద్యాల, 29న ఎమ్మిగనూరులో బస్సుయాత్ర కొనసాగుతుందని వైసీపీ మంగళవారం ప్రకటించింది. జగన్ తన బస్సు యాత్రతో లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసి ఉత్సాహం నింపుతారని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు ఆయన బస్సులోనే పర్యటిస్తారని వెల్లడించారు.



## ఫోన్ వాడుతూ రైలు ఎక్కితే.. జైలుకే

- భద్రత దృష్ట్యా అధికారుల నిషేధాజ్ఞలు

హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రైలు ఎక్కుతున్నప్పుడు, దిగే సందర్భంలో సెల్‌ఫోన్ వాడుతున్నారా..? రైల్వే ట్రాక్‌ల దగ్గర నడుస్తున్నప్పుడు ఫోన్‌లో మాట్లాడటం లేదా మొబైల్ చూడటం వంటివి చేస్తున్నారా? అయితే తస్మాత్ జాగ్రత్త.. ఇకపై ఇలాంటివి చేస్తే జైలు శిక్షతో పాటు జరిమానా కూడా తప్పదని రైల్వే అధికారులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు.. రైల్వే ట్రాక్ కనబడగానే స్మార్ట్‌ఫోన్ బయటికి తీసి సెల్ఫీలు దిగినా.. లొకేషన్ బాగుందని రైలు పట్టాల వెంబడి షార్ట్ ఫిల్మ్‌లు, ప్రీ వెడ్డింగ్ షూట్‌లు, ఇతర ఫొటోగ్రఫీలు తీసినా.. కటకటాల్లోకి వెళ్లాల్సి వస్తుందని చెబుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి నిషేధాజ్ఞలను అమలు చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.



# కోడ్ మాకు అడ్డమా?

వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ నిబంధనలు విధించినప్పటికీ వాటిని ధిక్కరించి మరీ వైసీపీకి ప్రచారం సాగిస్తూనే ఉన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికార పార్టీ జెండాలు, కరపత్రాలు పట్టుకుని వీధుల్లో తిరుగుతున్నారు. 'వలంటీర్లు నా సైన్యం' అంటూ ముఖ్యమంత్రి జగన్ నుంచి వైసీపీ పెద్దల దాకా చేస్తున్న ప్రకటనలతో ఎక్కడికక్కడ రెచ్చిపోతున్నారు. 'నేను వైసీపీ కార్యకర్తను. ప్రచారం చేస్తాను. ఏం చేస్తారో చేసుకోండి' అంటూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఓ వలంటీరు బరితెగించే స్థాయికి పరిస్థితి చేరుకుంది.




కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో వలంటీర్లకు పంపిణీ చేసిన సెల్‌ఫోన్(ఫైల్‌ఫొటో)

- రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్ల బరితెగింపు
- వైసీపీ అభ్యర్థులకు అడ్డగోలు ప్రచారం

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో ఎన్నికల కోడ్‌ను అమలు చేయాల్సిన అధికారులకు వలంటీర్ల తీరు సవాల్‌గా మారింది. బాహాటంగానే వలంటీర్లు బరితెగించినా పదిమందికిగాను ఒక్కరిపైనే చర్యలు తీసుకుంటున్నారు. మరికొన్నిచోట్ల అధికారుల వ్యవహార శైలి కూడా వివాదాస్పదంగా మారింది. కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లిలో వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు వలంటీర్లపై మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో సత్యకుమార్ విచారణ చేశారు. 'వలంటీర్ల వాడకానికి కొత్త డ్రామా' అంటూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం ఆధారంగా విచారణ జరిగింది. నాగార్జున అనే వలంటీర్ 'నేను వైసీపీ. ప్రచారం చేసేది చేసేదే, ఏమిచేస్తారో చేయండి' అంటూ కరాఖండీగా చాలా నిర్లక్ష్యంగా చెప్పినట్టు చెబుతున్నారు. అదే రాసి ఇవ్వాలని పంచాయతీ కార్యాలయానికి వెళ్లి కార్యదర్శి సురేశ్‌బాబు కోరగా... వైసీపీ ప్రచారంలో తాను పాల్గొంటానని రాసిచ్చినట్టు తెలిసింది. కొద్దిసేపటికి ఎంపీడీవో పంచాయతీ కార్యాలయానికి వెళ్లగా హైడ్రామా నడిచింది. వైసీపీ నేతలకు నాగార్జున ఫోన్ కలిపి.. మాట్లాడాల్సిందిగా ఎంపీడీవోకు ఇవ్వగా, ఆయన నిరాకరించారు. దీంతో నాగార్జున కొంత తగ్గాడు. పంచాయతీ కార్యదర్శి ముందు ఇచ్చిన సంజాయిషీకి భిన్నంగా... 'తప్పయింది. తెలియక వెళ్లా. మళ్లీ ప్రచారంలో పాల్గొనను' అని సంజాయిషీ రాసిచ్చాడు. మొదటి తప్పుగా అధికారులు పరిగణించి నాగార్జునను వదిలేశారు. ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం నేరేడుపల్లి, వరిమడుగు గ్రామాల్లో కనిగిరి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణయాదవ్ సోమవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో లక్ష్మక్కపల్లి సచివాలయ పరిధిలోని ఇద్దరు వలంటీర్లు హడావుడి చేశారు. అభ్యర్థితో కలిసి దిగిన ఫొటోను ఒక వలంటీరు తన వాట్సాప్ గ్రూపులో డీపీగా పెట్టుకున్నారు. వైసీపీకి ఓటు వేసేందుకు నిరాకరించామని తమపై వలంటీరు, ఆమె భర్త దాడి చేశారని భార్యభర్తలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడిచేసిన ఇద్దరూ బాధితులకు బంధువులే. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామ సచివాలయ పరిధి 8వ వార్డులో ఈ ఘటన జరిగింది. ఎన్నికల వేళ అనంతపురం జిల్లా గుమ్మఘట్ట మండలం పరిధిలోని పూలకుంట గ్రామ వలంటీరు హనుమంతు కర్ణాటక నుంచి ద్విచక్రవాహనంపై మద్యం తెస్తూ మంగళవారం పోలీసులకు పట్టుబడ్డాడు.

### స్వీట్ ప్యాకెట్.... ఐదు వేల నగదు

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో మంగళవారం పెదనందిపాడు మండల పరిధిలోని వలంటీర్లతో రహస్య సమావేశం జరిగినట్టు తెలిసింది. ఒక్కో వలంటీరుకు స్వీట్ ప్యాకెట్.. రూ. ఐదు వేల నగదు ఈ సమావేశంలో అందించినట్టు సమాచారం.

### 16 మందిపై సస్పెన్షన్ వేటు...

అంబాజీపేట, మార్చి 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి, ఇరుసుమండలో కోడ్ ఉల్లంఘించి వైసీపీ కార్యక్రమంలో పాల్గొన్న 16 మంది వలంటీర్లపై సస్పెన్షన్ వేటు పడింది. 'మేమూ సిద్ధం... వైసీపీ కార్యక్రమాల్లో వలంటీర్లు' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతి కోనసీమ జిల్లా మెయిన్‌లో వచ్చిన వార్త ఆధారంగా అధికారులు చర్య తీసుకున్నారు. కాగా, అధికార పార్టీకి అనుకూలంగా ప్రచారం చేసినందుకు అనకాపల్లి జిల్లా కొత్తమల్లంపేట సచివాలయం పరిధిలో ఇద్దరు వలంటీర్లను విధుల నుంచి తొలగించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో మంత్రి దాడిశెట్టి రాజా నియోజకవర్గానికి చెందిన 1000మందికిపైగా వలంటీర్లకు, కొంత మంది పోలీస్ సిబ్బందికి సెల్‌ఫోన్‌లు పంపిణీ చేశారని, వెలుగు, మెప్మా పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి నగదు పంపిణీ చేశారని ఆరోపిస్తూ టీడీపీ నేతలు పక్కా ఆధారాలతో ఈసీకి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై వలంటీర్లనుంచి వివరణ తీసుకోవాలని ఎంపీడీవోలకు ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చింది.



కోటనందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగన్ స్టిక్కర్లతో ఉన్న బాక్స్‌లు

## ఎన్నికల కోడ్ వీటికి వర్తించదా?

- ఆరోగ్య సురక్ష బాక్స్‌లపై జగన్ బొమ్మలు

కోటనందూరు, మార్చి 19: కోడ్ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడా జగన్ బొమ్మలు ఉండకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదు. కాకినాడ జిల్లా కోటనందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష బాక్స్‌లపై జగన్ బొమ్మలు, స్టిక్కర్లు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. జగన్ బొమ్మతో.. జగనన్న ఆరోగ్య సురక్ష సంచులు కూడా ఆస్పత్రిలో కనిపిస్తున్నాయి.



టెన్త్ విద్యార్థులకు ఎమ్మెల్యే ఫొటోతో ప్యాడ్లు

## పలమనేరు ఎమ్మెల్యేకు షోకాజ్

పలమనేరు/వి.కోట, మార్చి19: చిత్తూరు జిల్లా పలమనేరులో ఎమ్మెల్యే వెంకటేగౌడ ఫొటోతో ఉన్న ప్యాడ్లతో సోమవారం పలువురు పదో తరగతి విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన అంటూ అధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై వి.కోట పోలీసులు కేసు నమోదు చేశారని ఎన్నికల అధికారి, ఆర్డీవో మనోజ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. దీనిపై ఎన్నికల అధికారులు కూడా నివేదిక అందజేస్తారన్నారు. ఎమ్మెల్యే వెంకటేగౌడకు షోకాజ్ నోటీసు ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే ఫొటోతో ఉన్న ప్యాడ్లను అనుమతించవద్దని ఆదేశించామన్నారు.

## మేయర్ తాయిలాల పంపిణీపై సీఈవో సీరియస్

- 24 గంటల్లో చర్యలకు ఆదేశం
- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 19: ఎన్నికల కోడ్ కూసిన తర్వాత ఒంగోలు మేయర్ గంగాడ సుజాత తన నివాసంలో సచివాలయ సెక్రటరీలకు తాయిలాలు పంపిణీ చేయడంపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీరియస్ అయ్యింది. మే 17న 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన 'కోడ్ కూసినా ఆగని తాయిలాలు' కథనంపై విచారణ జరిపి, వాస్తవాలు వెల్లడించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను సీఈవో ముఖేష్ మీనా ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు మంగళవారం కలెక్టర్ కార్యాలయానికి అందాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

# ఏడు చోట్ల బీజేపీ ఎన్నికల సభలు

- 3 సభలకు మోదీ, మిగతా వాటికి అగ్ర నేతలు
- రేపు బీజేపీ ఏపీ అభ్యర్థుల ప్రకటన!

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో డబుల్ ఇంజిన్(కేంద్ర, రాష్ట్ర) సర్కార్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ జాతీయ నాయకత్వం ఆ దిశగా అడుగులు ముమ్మరం చేసింది. ఏపీలో ఏడు చోట్ల సభలు నిర్వహించేందుకు సిద్ధమైంది. రాయల సీమ, కోస్తా, ఉత్తరాంధ్రలో ఒక్కో సభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నారని తెలిసింది. మిగతా నాలుగు సభలకు పార్టీ అగ్రనేతలు హాజరయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు రాష్ట్రంలోని ఎన్డీఏ(టీడీపీ, జనసేన, బీజేపీ) నేతలకు ఢిల్లీ పెద్దల నుంచి సంకేతాలు అందాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో పాటు పార్టీ ముఖ్య నేతలు మంగళవారం ఢిల్లీకి చేరుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల మొదలు కొని వ్యూహాలు, ప్రణాళికలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏడు చోట్ల సభల గురించి కూడా చర్చకు వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 17న చిలకలూరిపేటలో జరిగిన మొదటి ఎన్డీఏ పక్షాల ఉమ్మడి సభకు ప్రధాని మోదీ వచ్చిన విషయం తెలిసిందే. కర్నూలు లేదా కడపలో ఒక సభ ఏర్పాటు చేసి అక్కడికి కూడా మోదీని ఆహ్వానించాలని కూటమి నేతలు ఆలోచిస్తున్నారు. తిరుపతి లేదా కర్నూలులో నిర్వహించే సభకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వచ్చే అవకాశం ఉంది. విజయనగరంలో ఒక సభ నిర్వహించేందుకు అనుకూలించే పరిస్థితులపై ఢిల్లీ బీజేపీ వర్గాలు ఆరా తీశాయి. అక్కడికి ప్రధాన మంత్రిని ఆహ్వానిస్తే పార్టీ శ్రేణులకు ఉత్సాహం వస్తుందనే చర్చ బీజేపీలో జరుగుతోంది. శ్రీకాకుళం లేదా పాతపట్నం, పాడేరు అసెంబ్లీ స్థానాల్లో ఏదైనా బీజేపీకి దక్కితే అక్కడ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను.. విజయవాడ, ఏలూరు, రాజమండ్రిలో ఏదో ఒక చోట నిర్వహించే సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను ఆహ్వానించాలని భావిస్తున్నారు. చివరి సభ ఎక్కడ నిర్వహించాల్సి వస్తే అక్కడికి మరో కేంద్రమంత్రి, అగ్రనేత అమిత్ షాను ఆహ్వానించి అన్ని సభల్ని విజయవంతం చేయాలనే ప్రణాళిక కూటమి పార్టీలు సిద్ధం చేస్తున్నాయి.

### అభ్యర్థులపై కసరత్తు..

ఏపీ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేయబోయే అభ్యర్థుల జాబితాను గురువారం ప్రకటించే అవకాశం ఉందని పార్టీవర్గాలు తెలిపాయి. 6 పార్లమెంటు, 10 అసెంబ్లీ స్థానాలకు టీడీపీ, జనసేన మద్దతుతో కమలం గుర్తుపై పోటీలో నిలిచే అభ్యర్థుల వడపోత ఢిల్లీలో జరుగుతోంది. రాయల సీమలో 4, కోస్తాలో 3, ఉత్తరాంధ్రలో 3 అసెంబ్లీ స్థానాలకు పలువురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. బీజేపీ ఆశించిన సీట్లు పొత్తులో భాగంగా కొన్ని చోట్ల దక్కలేదు. మరికొన్ని చోట్ల బలం లేకున్నా బరిలో దిగాల్సి వస్తోంది. ఇలాంటి సమస్యల్ని ఎలా అధిగమించాలనే విషయంపై చర్చించేందుకు పార్టీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఇతర ముఖ్యనేతలు ఢిల్లీకి వెళ్లారు. అక్కడ చర్చల అనంతరం గురువారం పార్లమెంటు అభ్యర్థుల పేర్లు ఢిల్లీ నుంచి జేపీ నడ్డా విడుదల చేస్తారని, అదే రోజు అసెంబ్లీ అభ్యర్థుల్ని కూడా ఏపీ బీజేపీ ప్రకటిస్తుందని తెలుస్తోంది. అయితే, ఎంపీ స్థానాల్లో విజయనగరం పేరు ఇప్పటి వరకు వినిపిస్తుండగా దీని స్థానంలో అమలాపురం సీటు బీజేపీకి దక్కవచ్చని తెలుస్తోంది.

# బీజేపీ సీట్ల పంచాయితీ ఢిల్లీకి!

## హస్తిన చేరిన పురందేశ్వరి

విశాఖపట్నం/అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేనతో సీట్ల సర్దుబాటు కుదిరినా.. బీజేపీలో సీట్ల పంచాయితీ కొలిక్కి రాలేదు. దీంతో ఇప్పుడిది ఢిల్లీ చేరింది. పొత్తులో భాగంగా బీజేపీకి రాష్ట్రంలో ఆరు లోక్‌సభ, పది అసెంబ్లీ స్థానాలు కేటాయించిన సంగతి తెలిసిందే. ఆ ఆరింటిలో.. విజయనగరం, అనకాపల్లి, అరకు ఎంపీ స్థానాలు బీజేపీకి ఇచ్చారని, అక్కడ పోటీ చేసే అవకాశం కోసం సీనియర్లు పోటీ పడుతున్నట్లు చెబుతున్నారు. అయితే వీటిలో కొన్ని స్థానాలు మార్పు చేసి వేరే సీట్లు కోరే అవకాశం ఉందని, అందుకే పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఢిల్లీ వెళ్లారని అంటున్నారు. విజయనగరం లోక్‌సభ స్థానానికి మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి, సెయిల్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు పోటీ పడుతున్నారు. అయితే ఆ స్థానంలో ఓసీ అభ్యర్థిని కాకుండా బీసీని దించితే బాగుంటుందని టీడీపీ సూచిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం పల్సస్ గ్రూపు అధినేత గేదెల శ్రీనుబాబు ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దలను కలిశారు. తనకు అవకాశం కల్పించాలని కోరారు. అనకాపల్లి ఎంపీ స్థానం కోసం రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ ప్రయత్నం చేస్తున్నారు. అరకు ఎంపీ స్థానానికి మాజీ ఎంపీ కొత్తపల్లి గీతనే నిలుపుతారని భావిస్తున్నారు. ఇక అసెంబ్లీ స్థానాలకు వస్తే బీజేపీకి ఇచ్చిన పది సీట్లలో రెండు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్నాయి. వీటన్నిటిపై ఢిల్లీ పెద్దలతో పురందేశ్వరి చర్చించాక.. ఒకట్రెండు రోజుల్లో అభ్యర్థులను ప్రకటిస్తారని తెలిసింది.

### ఆ సీట్లు టీడీపీకే?

విజయనగరం లోక్‌సభ, శ్రీకాకుళం అసెంబ్లీ స్థానాలు టీడీపీ ఖాతాలోకి వెళ్లే అవకాశం ఉందని అంటున్నారు. వాటికి బదులు వేరే సీట్లను బీజేపీకి కేటాయించాల్సి వస్తుంది. ఈ మార్పుచేర్పుల ఆలోచన వల్లే టీడీపీ ఎంపీ అభ్యర్థుల జాబితా మంగళవారం విడుదల కాలేదు.

# టీడీపీ బీసీ నేతపై గొడ్డలి దాడి

- తీవ్ర గాయాలు... హైదరాబాద్ తరలింపు
- చికిత్స పొందుతూ మంగళవారం మృతి
- శాంతిభద్రతలపై ఈసీ సమీక్షించాలి: బాబు

అమరావతి(ఆంధ్రజ్యోతి), గిద్దలూరు టౌన్, మార్చి 19: టీడీపీ నాయకుడు పాముల మునయ్య(35)పై సోమవారం రాత్రి వైసీపీ వర్గీయులు గొడ్డలితో దాడిచేశారు. తీవ్ర గాయాలతో కుప్పకూలిన ఆయనను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. పరమేశ్వర్‌నగర్‌లో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న మునయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రజాగళం సభకు జనాలను తీసుకెళ్లాడన్న నెపంతో వైసీపీ వర్గీయులైన అల్లూరయ్య, రంగనాయకులు, ప్రేమ్‌కుమార్, ఈశ్వరయ్యలు... మునయ్యపై గొడ్డలితో దాడి చేశారు. తీవ్ర గాయాలపాలైన మునయ్యను చికిత్స కోసం గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున ఆయన మృతి చెందారు. మృతదేహాన్ని మంగళవారం రాత్రికి గ్రామానికి తీసుకొస్తున్నామని, బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీర సోమయ్య తెలిపారు.

### వైసీపీ హింసా రాజకీయాలు: చంద్రబాబు

ఎన్నికల వేళ రాష్ట్రంలో వైసీపీ మరింత రాజకీయ హింసకు దిగుతోందని టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. మరో 50 రోజుల్లో కుర్చీ దిగి, ఇంటికి పోయే ముందు కూడా జగన్ హింసా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. 'ఓటమి భయంతో తీవ్ర నైరాశ్యంలో ఉన్న వైసీపీ మూకలు టీడీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నాయి. ప్రజాగళం సభకు వచ్చారన్న కారణంతో గిద్దలూరు నియోజకవర్గం గడికోటకు చెందిన మునయ్యను గొడ్డళ్లతో నరికి దారుణంగా చంపేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం చాగలమర్రిలో ఇమామ్ హుస్సేన్ అనే 21 ఏళ్ల యువకుడిపై కత్తులతో దాడి చేసి, బలి తీసుకున్నారు. మాచర్లలో టీడీపీ కార్యకర్త సురేశ్ కారును తగలబెట్టారు. ఈ మూడు ఘటనలపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలి. బాధిత కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుంది. ప్రకాశం ఎస్పీ పరమేశ్వరరెడ్డి, నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి, పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి వైసీపీకి అత్యంత అనుకూలమైన వారే. వైసీపీ నేతలతో సన్నిహిత సంబంధాలున్న ముగ్గురు ఎస్పీల అండ చూసుకునే వైసీపీ గూండాలు చెలరేగుతున్నారు. కోడ్ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కూడా రాష్ట్రంలో శాంతిభద్రతలపై తక్షణమే దృష్టి సారించాలి. పెచ్చరిల్లుతున్న రాజకీయ హింస, శాంతి భద్రతల పరిస్థితిపై సమీక్షించి, తగు చర్యలు తీసుకోవాలి' అని చంద్రబాబు డిమాండ్ చేశారు.

### వైసీపీకి గొడ్డలి గుర్తు ఇవ్వండి: అచ్చెన్న

కాగా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఓ ప్రకటన చేస్తూ... రాక్షస జాతి పార్టీ వైసీపీకి ఫ్యాన్ గుర్తు రద్దు చేసి, గొడ్డలి గుర్తు కేటాయించాలని అన్నారు. టీడీపీ కార్యకర్త మునయ్యను నరికి చంపడం దుర్మార్గమన్నారు. అధికారం కోల్పోతున్నామనే అక్కసుతో వైసీపీ రాక్షస మూకలు నరమేథం సాగిస్తున్నాయని ఆరోపించారు. గిద్దలూరు టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ, టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసిన వారిని, హత్యలు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు.

## టీడీపీ కార్యకర్త కారు దహనం

### పల్నాడు జిల్లా మాచర్లలో దారుణం



మాచర్లలో కాలిపోతున్న కారు

మాచర్లటౌన్, మార్చి 19: టీడీపీ కార్యకర్త కారును గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారు. పల్నాడు జిల్లా మాచర్లలో సోమవారం అర్ధరాత్రి ఈ దారుణం జరిగింది. మాచర్లలోని రింగురోడ్డు ప్రాంతానికి చెందిన ఇర్లా సురేశ్ సోమవారం రాత్రి తన మారుతి బ్రీజా కారును ఇంటి సమీపంలోని గ్లేవీఆర్ హైస్కూల్ ముందు పార్క్ చేశారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాన్ని దహనం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు గుంటూరు నుంచి ఫోరెన్సిక్ సిబ్బందిని రప్పించి ఆధారాలు సేకరించారు. కాగా, అర్ధరాత్రి సమయంలో నల్ల కారులో వచ్చిన వ్యక్తులు పెట్రోల్ పోసి సురేశ్ కారును తగలబెట్టినట్టు సమాచారం ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే పీఆర్కే పాలనలో చాలా రోజులుగా బలహీన వర్గాలపై దాడులు పెరిగాయన్నారు. వైసీపీ నేతలు అన్ని చోట్లా రెచ్చగొట్టే పనులు చేస్తున్నారన్నారు.

# జగన్ సీఎం అయ్యాక రాజకీయాలు పెడదారి

- విలువలతో కూడిన రాజకీయాలు చేద్దాం
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయం: లోకేశ్

మంగళగిరి, మార్చి 19: జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో రాజకీయాలు పెడదారి పట్టాయని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఆరోపించారు. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆయన తన ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని అమరావతి ఐకాన్ అపార్టుమెంట్ వాసులతో 'బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేశ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వ్యక్తిగత, విద్వేషపూరితమైన రాజకీయాలకు జగన్ తెర తీశారని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలకు మనుగడ లేకుండా చేయడంపై దృష్టి సారించడం ప్రజాస్వామ్యంలో సరికాదని హితవు పలికారు. రాజకీయాల్లో విమర్శలెప్పుడూ విధానాల పరంగా ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో మళ్లీ విలువలతో కూడిన రాజకీయాలు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జగన్ విధ్వంసకర పాలనతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ముందెన్నడూ లేనంత దయనీయంగా తయారైందని లోకేశ్ చెప్పారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవాలంటే పరిశ్రమలు పెరగాలని, అందుకు తగిన ఎకో సిస్టమ్ అవసరమని తెలిపారు. తెచ్చిన అప్పులను సరైన రీతిలో సద్వినియోగం చేసుకోలేకపోతే శ్రీలంక తరహా పరిస్థితులు ఎదుర్కోవల్సి వస్తుందని లోకేశ్ హెచ్చరించారు. "రాష్ట్ర విభజన మనం కోరుకున్నది కాదు. ఆనాడు కట్టుబట్టలతో బయటకు వచ్చి ప్రయాణం సాగించాల్సి వచ్చింది. అయినప్పటికీ చంద్రబాబు రేయింబవళ్లు శ్రమించి తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పోటీపడి పరిశ్రమలు తెచ్చి అభివృద్ధిని సాధించారు' అని లోకేశ్ పేర్కొన్నారు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో ఎక్కడా మూడేసి రాజధానుల్లేవు... అవగాహన, అనుభవం లేని జగన్ మూడు ముక్కలాటతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారంటూ ఆయన ఆవేదన వెలిబుచ్చారు. 'అభివృద్ధి వికేంద్రీకరణ అంటే ఏమిటో చంద్రబాబు ఇప్పటికే చేసి చూపించారు. జగన్ పాలనలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ రాలేదు. విశాఖలో మాత్రం రూ.550 కోట్లతో విలాసవంతమైన ప్యాలెస్ కట్టుకున్నారు. ఒకే రాష్ట్రం-ఒకటే రాజధాని- అభివృద్ధి వికేంద్రీకరణ' అనేదే మా విధానం. దీనిని అంతఃకరణ శుద్ధితో ఆచరిస్తాం' అని లోకేశ్ ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆగిపోయిన రాజధాని అమరావతి పనులను పునఃప్రారంభిస్తామని చెప్పారు.



తాడేపల్లిలోని అంజిరెడ్డి కాలనీలో నిర్వహించిన రచ్చబండలో మాట్లాడుతున్న లోకేశ్

### చంద్రబాబు విలువ తెలిసొచ్చింది

'చిన్న కోడలు వచ్చాకే పెద్ద కోడలు విలువ తెలిసొచ్చింద'న్నట్టుగా జగన్ అధికారంలోకి వచ్చాకే చంద్రబాబు విలువ రాష్ట్ర ప్రజలందరికీ తెలిసొచ్చిందని ఈ సమావేశంలో అపార్ట్‌మెంట్ వాసి ఒకరు వ్యాఖ్యానించారు. అయిదేళ్లుగా రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు స్తంభించి అభివృద్ధి శూన్యంగా మారిందని చెప్పారు. ప్రొఫెసర్ ఏవీవీ రాజు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో చదువుకున్న పేదింటి పిల్లలకు ఉద్యోగాలు వచ్చాయని, తద్వారా ఆ కుటుంబాల జీవన ప్రమాణాలు పెరిగాయని తెలిపారు. అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు రూ.5కే భోజనం అందించారని గుర్తుచేశారు. ఆ మంచి పనులన్నీ అలాగే అమలై ఉంటే నేడు రాష్ట్రంలో ఇంత దయనీయమైన పరిస్థితులు వచ్చేవి కావని అభిప్రాయపడ్డారు. వలంటీర్లు, డబ్బుతో ఎన్నికల్లో గెలవొచ్చని జగన్ భావిస్తున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చాక మేకిన్ ఇండియా తరహాలో 'మేకిన్ ఆంధ్ర' నినాదంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని అమరావతి ఐకాన్ అపార్టుమెంటు వాసులు లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.

### కోడ్ దాటే వలంటీర్లపై
# కేసుల కొరడా!?

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాల మేరకు వీరిని ఎలా నిలువరించాలో అర్థంకాక అధికారులే తలలు పట్టుకుంటున్నారు. ఇప్పుడు.. వలంటీర్ల కట్టడికి ఒక మార్గం లభించింది. అదే.. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 123, 129, 134ఏ సెక్షన్లతోపాటు ఐపీసీ 171(ఎఫ్) ప్రయోగించడం!

**వలంటీర్లు పబ్లిక్ సర్వెంట్లే...**

వలంటీర్లు 'స్వచ్ఛంద సేవకులు' అని, పూర్తికాల ప్రభుత్వ ఉద్యోగులు కాదు కాబట్టి వారికి ఎన్నికల కోడ్ వర్తించదని వైసీపీ వాదిస్తోంది. కానీ.. ఈ వాదన ఎంతమాత్రం చెల్లుబాటు కాదు. ఎందుకంటే.. వలంటీర్లు పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులు కాకపోయినప్పటికీ, ప్రభుత్వ సంఘటిత నిధి (కన్సాలిడేటెడ్ ఫండ్) నుంచే గౌరవ వేతనం అందుకుంటున్నారు. వలంటీరు, కాంట్రాక్టు, పర్మినెంట్.. ఇలా పేరు ఏదైనప్పటికీ.. గౌరవ వేతనం, వేతనం, జీతం, రెమ్యునరేషన్ ఇలా తీరు ఏదైనప్పటికీ ప్రభుత్వ సంఘటిత నిధి నుంచి డబ్బులు తీసుకుని పని చేసే వారంతా 'పబ్లిక్ సర్వెంట్' కిందకే వస్తారు. వీరందరికీ 'కోడ్ ఆఫ్ కాండక్ట్' వర్తిస్తుంది. వలంటీర్లకూ ఇదే వర్తిస్తుంది. ఉద్యోగులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించినప్పుడు ఏం చర్యలు తీసుకుంటారో ఆ చర్యలు వలంటీర్లపై కూడా తీసుకోవచ్చు.

**బాధ్యతగా ఉండాలంటే...**

'సస్పెండ్ చేస్తే చేసుకోండి. మేం ఇంకా స్వేచ్ఛగా ప్రచారం చేసుకుంటాం' అన్నట్లుగా కొందరు వలంటీర్లు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నేతలూ వారికి అండగా నిలబడుతున్నారు. ఈ బరితెగింపును ఆపేందుకూ ఒక మార్గం ఉందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ఉత్తుత్తి హెచ్చరికలు, ప్రభావితం చూపలేని సస్పెన్షన్లతో సరిపెట్టకుండా... నియమావళిని ఉల్లంఘించే వలంటీర్లపై ఆ సెక్షన్ల కింద కేసులు పెట్టాలని సూచిస్తున్నారు. కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలు కూడా లభించవని, అప్పుడైనా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని చెబుతున్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 123 ప్రకారం ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడటం నేరం. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించినా, వారికి ఓటేయాలంటూ ప్రభావితం చేసినా సెక్షన్ 129 ప్రకారం కేసు నమోదు చేయవచ్చు. ఇక.. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 134ఏ ప్రకారం 'పబ్లిక్ సర్వెంట్లు' ఎవ్వరూ ఎన్నికల ఏజెంట్లుగా, పోలింగ్ ఏజెంట్లుగా, కౌంటింగ్ ఏజెంట్లుగా వ్యవహరించకూడదు. ప్రభుత్వ సంఘటిత నిధి నుంచి గౌరవ వేతనం పొందుతున్న వలంటీర్లందరికీ ఈ సెక్షన్లు వర్తిస్తాయి. వీటిని ఉల్లంఘిస్తే కేసు నమోదు చేసి శిక్షించవచ్చు. ఇక.. ఐపీసీ సెక్షన్ 171ఎఫ్ ప్రకారం ఎన్నికల్లో ఓటర్లను అవాంఛనీయరీతిలో ప్రభావితం చేయడం శిక్షార్హమైన నేరం. దీనికింద గరిష్ఠంగా ఏడాది జైలు శిక్ష లేదా జరిమానా... లేదా రెండూ విధించవచ్చు. ఇది కూడా వలంటీర్లకు వర్తిస్తుంది. ప్రభుత్వం ఎలాగూ వారిపై చర్యలు తీసుకోదని... ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ప్రజాప్రాతినిధ్య చట్టం, ఐపీసీ ప్రయోగిస్తే తప్ప వలంటీర్లు పద్ధతిగా ఉండరని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

# ప్రాజెక్టులపై పగ

(మొదటి పేజీ తరువాయి)

కమిటీ (ఆర్‌సీసీ) రూ.8,932 కోట్ల మేర తగ్గిస్తే కిమ్మనలేదు. పైగా ఆయన ప్రభుత్వం చప్పట్లు కొట్టి సంతకాలు పెట్టొచ్చింది. పల్నాడు జీవనాడి వరికపూడిసెల వేదన వర్ణనాతీతం. కేవలం రూ.32 కోట్లు అటవీ శాఖకు చెల్లిస్తే ఆ ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయి. కానీ జగన్ సర్కారుకు మనసురాక పల్నాడు ప్రాంతాన్ని, రైతాంగాన్ని దాహార్తికి వదిలేసింది.

**వెలిగొండపై అడుగడుగునా అబద్ధాలు**

- మార్చి 7వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు రెండు సొరంగాలు ప్రారంభిస్తూ.. ప్రకాశం ప్రజల 20 ఏళ్ల కల నెరవేరిందన్నారు. కానీ ఈ ఐదేళ్లలో టన్నెల్‌కి ఒక్క మీటర్ మేర కూడా లైనింగ్ పనులు చేయని చేతకాని ప్రభుత్వం ఇది. వెలిగొండ సొరంగాలు పూర్తయి నీటి విడుదలకు సిద్ధంగా ఉన్నాయని ప్రభుత్వం చెప్పుకోవడం పచ్చి అబద్ధం. వీటిని ప్రారంభించడమంటే పశ్చిమ ప్రకాశం, బద్వేలు, ఉదయగిరి ప్రజలను మోసం చేయడమే.
- రెండో సొరంగంలో ఉన్న టన్నెల్ బోరింగ్ మెషీన్ అందులోనే ఉండిపోయింది. దానిని బయటకు తీయలేదు. అది 12వ కిలోమీటర్ వద్ద చెడిపోయి బయటకు తేలేని పరిస్థితిలో ఉంది. దాన్ని బయటకు తీయడం సాంకేతికంగా సాధ్యం కాదు. అక్కడే ఒక చిన్న బైపాస్ చేసి అందులో పూడ్చిపెట్టాలి. ఈ విషయం తెలిసి కూడా రెండేళ్ల నుంచి ఈ పని ఎందుకు చేయడం లేదు? దీనిని కప్పిపుచ్చడం కోసం ప్రారంభోత్సవాలంటూ జగన్ దొంగాట ఆడుతున్నారు.
- శ్రీశైలం ప్రాజెక్టులో నీళ్లు లేనందున నల్లమల సాగర్‌కు నీళ్లు పంపలేకపోతున్నామని ప్రచారం చేసుకుంటున్నారు. వాస్తవం ఏమిటంటే శ్రీశైలంలో నీళ్లున్నా వెలిగొండకు విడుదల చేయలేరు. ఇది పచ్చి నిజం. రెండో టన్నెల్‌లో బోరింగ్ మెషీన్ అడ్డంగా ఉంటే నీళ్లు ఎలా వదులుతారు?
- వైసీపీ హయాంలో ఒక్కరికైనా పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించారా? కల్పించామని చెప్పే ధైర్యం ఉందా? ఒక్కరిని కూడా ముంపు నుంచి తరలించకుండా నల్లమలసాగర్‌లో నీరు ఎలా నింపుతారు? ఏమీ చేయకుండా ప్రారంభోత్సవాలు చేసే నైతిక హక్కు ఉందా? ఈ రోజు శ్రీశైలం డ్యాంలో నీరు ఉండి, వదిలితే నేరుగా సుంకేసుల గ్రామంలోకి వెళ్తాయి. ఇది నిజమా కాదా? పునరావాసం పూర్తి చేయడానికి ఇంకా రూ.1,200 కోట్లు కావాలి.
- గత ప్రభుత్వాలు నిర్మించిన ఫీడర్ కెనాల్ అధ్వాన పరిస్థితిలో ఉంది. దాని గుండా నీరు నల్లమలసాగర్‌కు వదిలితే అది కనీసం ఐదారు చోట్ల తెగిపోయి నల్లమల సాగర్‌లోకి వెళ్లే బదులు సమీప గ్రామాల్లోకి ప్రవేశించే ప్రమాదం ఉంది. ఈ విషయం వైసీపీ ప్రభుత్వమే నియమించిన నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికలో ఉంది. ఈ ఐదేళ్లూ దానిని సరిచేసే ప్రయత్నం ఎందుకు చేయలేదు?
- మొదటి సొరంగంలో ఒక కిలోమీటర్, 2వ సొరంగంలో 7 కిలోమీటర్ల లైనింగ్ పనులు ఇంకా పూర్తి కాలేదు. ఇది పూర్తి చేయకుండా నిర్దేశిత పరిమాణంలో నీరు ఎలా వెళ్తుంది? ఎక్కడైనా వీక్‌జోన్ ఉండి, సొరంగం కూలిపోతే దీనికి బాధ్యులెవరు?
- నల్లమల సాగర్‌లో ఒకవేళ నీరు నింపగలిగినా.. కాలువల ద్వారా వదిలే పరిస్థితి ఉందా? జగన్ హయాంలో డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్ ఎన్ని ఎకరాలకు అదనంగా అభివృద్ధి చేశారో చెప్పగలరా?

**పోలవరం ప్రాజెక్టుపై మాయలు**

టీడీపీ హయాంలో 2019 ఫిబ్రవరిలో ప్రాజెక్టు ఖర్చును రూ.55,657 కోట్లకు కేంద్ర జలసంఘం నియమించిన టెక్నికల్ అడ్వైజరీ కమిటీ(టీఏసీ) ఆమోదించింది. ఇది జరిగి ఐదేళ్లవుతోంది. జగన్ ప్రభుత్వం ఇంతవరకు రూ.55,657 కోట్ల పెట్టుబడి అనుమతిని కేంద్ర ఆర్థిక, జలశక్తి శాఖల నుంచి తెచ్చుకోలేకపోయింది. క్రమం తప్పకుండా ఢిల్లీ వెళ్లే సీఎం జగన్.. 22 మంది ఎంపీలను చేతిలో పెట్టుకుని కూడా కేంద్రం నుంచి ఈ అనుమతి సాధించలేకపోయారు.

- టీడీపీ ప్రభుత్వం రూ.55,657 కోట్లకు సాధించిన అనుమతిని ఆర్‌సీసీ 2020 మార్చిలో రూ.46,257 కోట్లకు కుదించింది. సీఎం జగన్, 22 మంది ఎంపీలు అందుకు తలకాయలు ఊపి, చప్పట్లు కొట్టి సంతకాలు పెట్టి వచ్చారు. వీరి ప్రతాపం ప్రశ్నించే సామాన్యులపై, అణగారిన వర్గాల మీదే.
- ఆర్‌సీసీ కోత విధించి కొత్తగా ఖరారు చేసిన రూ.46,725 కోట్లకు కూడా కేంద్ర ఆర్థిక, జలవనరుల శాఖ నుంచి అనుమతి తెచ్చుకోలేక కొత్త నాటకానికి తెరతీశారు. ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తానని విభజించారు. మొదటి దశలో 41.15 మీటర్ల వరకు నీటిని నింపి పాక్షిక ప్రయోజనాలు కల్పిస్తామంటారు. మొదటి దశ పూర్తికి రూ.15,000 కోట్లు ఇవ్వాలని కేంద్రానికి లేఖలు రాశామని పదే పదే చెబుతుంటారు. ప్రధానిని, కేంద్ర మంత్రులను కలిసినప్పుడు నిజంగా అడుగుతున్నారో లేదో అనుమానమే!
- ప్రధాన తూము నుంచి కాలువలను అనుసంధానించే సొరంగం పనులు, ఇంకొన్ని అనుబంధ పనులు ఇంకా ఎందుకు పూర్తికావడం లేదో సామాన్యుడికి అర్థం కాని ప్రశ్నే.

గత ఏడాది నవంబరు 15వ తేదీన పల్నాడు జిల్లా మాచర్లలో వరికపూడిసెల ఫొటో ఎగ్జిబిషన్ చూస్తున్న సీఎం జగన్ (ఫైల్)



**32 కోట్ల కోసం వరికపూడిసెల బలి**

వరికపూడిసెల ఎత్తిపోతల పథకానికి అన్ని అనుమతులూ సాధించామని జగన్ సర్కార్ డప్పు కొట్టుకోవడం తప్పితే నయాపైసా పని జరగలేదు. అనుమతులు వచ్చేశాయంటూ నిరుడు నవంబరులో సీఎం హడావుడిగా భూమిపూజ చేశారు. వాస్తవమేమిటంటే.. ఈ ప్రాజెక్టు కింద అవసరమైన 19 హెక్టార్ల అటవీ భూమి అప్పగించడానికి అటవీ పరిహారం కింద రూ.32 కోట్లు కట్టాలని అటవీ శాఖ 3 నెలల ముందే సమాచారమిచ్చినా ఈ డబ్బు ఆ శాఖకు జమ చేయలేదు. ప్రాజెక్టు పనులు ప్రారంభించనూ లేదు.

# ఆ ముగ్గురిపై గురి!

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదు చేసింది. ఈ నెల 17న చిలకలూరిపేట సభకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాల్సిన పోలీసులు కనీసం ట్రాఫిక్‌ను కూడా కట్టడి చేయలేదు. మోదీ మాట్లాడుతున్నప్పుడు సౌండ్ బాక్స్‌లపైకి కొందరు ఎక్కడం.. విద్యుత్ లైట్ల స్టాండ్లపైకి ఎక్కిన వారిని దిగాలంటూ స్వయంగా మోదీయే వేదికపై నుంచి సూచించడం, అయినా పోలీసులు స్పందించకపోవడం.. వీఐపీ గ్యాలరీల్లోకి కొందరు నీళ్ల బాటిళ్లు విసరడం లాంటివి పోలీసుల ఉద్దేశపూర్వక వైఫల్యంగా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందాయి. ఐబీ కూడా తన నివేదికలో పల్నాడు పోలీసుల వైఫల్యాన్ని ఎత్తిచూపినట్లు తెలిసింది. సభా ప్రాంగణంలో భద్రతా లోపాలను ఎస్పీజీ స్వయంగా గుర్తించి స్థానిక పోలీసులను అప్రమత్తం చేసినా పెడచెవిన పెట్టారని ఆ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. వైఫల్యాలకు బాధ్యులెవరు.. ఉద్దేశపూర్వకంగా చేశారా.. నిర్లక్ష్యంగా వ్యవహరించారా అనే అంశాలపై ఐబీ నివేదిక ఆధారంగా పల్నాడు ఎస్పీతో పాటు ఇతర బాధ్యులపై చర్యలు ఉంటాయని పోలీసు వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సభకు రాకుండా జనాన్ని పోలీసులు అడ్డుకున్న విధానం.. సభ విఫలమైందంటూ సీఎం రోత మీడియాలో ప్రసారమైన వార్తలను విశ్లేషించిన బీజేపీ రాష్ట్ర నేతలు.. 'ఇదే ఆ పోలీసు అధికారుల అసలు ఎజెండా' అని తమ ఢిల్లీ పెద్దలకు ఇంకో నివేదిక పంపినట్లు సమాచారం.

## ప్రభుత్వ నిర్ణయాల పరిశీలనకు స్ర్కీనింగ్ కమిటీ

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులో ఉన్ననేపథ్యంలో అత్యవసర ప్రతిపాదనలు పరిశీలించి, ఆమోదానికి ఎన్నికల సంఘానికి పంపించడానికి వీలుగా స్ర్కీనింగ్ కమిటీ ఏర్పాటయింది. ఈసీ ఆదేశాల మేరకు సీఎస్ నేతృత్వంలో ఈ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ కమిటీలో సభ్యులుగా సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శితోపాటు సంబంధిత శాఖల కార్యదర్శులు ఉంటారు. కోడ్ నేపథ్యంలో ప్రభుత్వంలోని వివిధ శాఖల నుంచి అనేక ప్రతిపాదనలు ఈసీ ఆమోదం కోసం నేరుగా కమిషన్ కార్యాలయానికి వస్తున్నాయి. దీన్ని నివారించడానికి స్ర్కీనింగ్ కమిటీ ఏర్పాటుకు ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో ప్రభుత్వ శాఖలన్నీ తమ ప్రతిపాదనలను ముందుగా స్ర్కీనింగ్ కమిటీకి పంపించాలి. వాటిని కమిటీ పరిశీలించి, ఆమోదించాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ సీఈవోకి నోట్ పంపిస్తుంది. ఈసీ ఆమోదం పొందిన తరువాత మాత్రమే ప్రతిపాదనలను అమలు చేయాల్సి ఉంటుంది.

# కలెక్టర్లు, ఎస్పీలపై ఈసీ నిఘా!

- పది మందిపై వేటు పడే అవకాశం
- నివేదికలు పంపిన సీఈవో మీనా

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొంతమంది కలెక్టర్లు, ఎస్పీలపై కేంద్ర ఎన్నికల కమిషన్ నిఘా పెట్టింది. వారి తీరుపై నిరంతరం ఆరా తీస్తోంది. అధికార పార్టీతో అంటకాగుతున్న 10మంది కలెక్టర్లు, ఎస్పీలపై బదిలీ వేటువేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కోడ్ వచ్చినా, పదే పదే నిబంధనలను గుర్తు చేస్తున్నా.. పక్షపాత ధోరణితో వీరు అధికార పక్ష నేతలతో అంటకాగుతున్నారనే సమాచారాన్ని ఈసీ సేకరించింది. తన ఆదేశాలను తుంగలోతొక్కిన అధికారులపై ఏ క్షణమైనా వేటు వేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రతిపక్ష ఓటర్ల తొలగింపు, ఓటర్ల జాబితాల్లో అవకతవకలు, వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న పలువురు అధికారులపై విపక్షాలు పలుసార్లు ఢిల్లీ వెళ్లి మరీ ఫిర్యాదులు చేశాయి. వాటిపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో)ని సీఈసీ నివేదికలు అడిగింది. కోడ్ అమల్లోకి వచ్చాక ఈసీ ఆదేశాలను బేఖాతరు చేస్తూ అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారులతో పాటు.. గతంలో ఇంకొందరు అధికారులపై విపక్షాల నుంచి అందిన ఫిర్యాదులపైనా ఆయన్ను రిపోర్టులు కోరినట్లు తెలిసింది.

కోడ్ అమల్లోకి వచ్చినా ఇప్పటికీ కొంతమంది కలెక్టర్లు, ఎస్పీల తీరు మారలేదని.. పాలకపక్షానికి అనుకూలంగా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బ్యానర్లు తొలగించండి, ఫ్లెక్సీలు తీయండి, కోడ్ అమలయ్యేలా చూడండంటూ పదే పదే సీఈవో చెబుతున్నా.. కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఘటనలు ఈసీ దృష్టికి వెళ్లాయి. అధికార పార్టీతో అంటకాగుతున్నదెవరు.. నిబంధనలు తుంగలో తొక్కింది ఎవరు.. సీఈవో ఆదేశాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదెవరో అందిన సమాచారం ఆధారంగా ఆయా అధికారులపై కమిషన్ నిఘా పెట్టింది. దాని ఆదేశాలతో సీఈవో వారందరిపైనా నివేదికలు పంపినట్లు తెలిసింది. పారదర్శకంగా ఎన్నికలు జరగాలంటే పక్షపాత ధోరణితో వ్యవహరించే అధికారులు ఉంటే జరగదని ఈసీ అభిప్రాయపడుతున్నట్లు తెలిసింది.

**రాజధాని జిల్లా కలెక్టర్‌కు సీఈవో క్లాసు**

ఎన్నికల కోడ్ రాగానే నిబంధనలకు విరుద్ధంగా కరకట్టమీద ఉన్న పోస్టర్లు, ఫ్లెక్సీలు, స్తంభాలపై ఉన్న రాజకీయ పార్టీల రంగులు తొలగించాలని రాజధాని జిల్లా కలెక్టర్‌ను సీఈవో మీనా ఆదేశించినట్లు తెలిసింది. ఆయనే స్వయంగా గమనించి మరీ కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారు. మరుసటి రోజు మళ్లీ ఆయన వచ్చే సమయానికి వాటిని తొలగించలేదు. అలాగే ఉన్నాయి. అధికార పార్టీకి చెందిన రంగులు కరెంట్‌పోల్స్‌పై ఉండడం, ఫ్లెక్సీలు ఉండడంతో సీఈవో గమనించి.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవి తొలగించమన్నాను కదా.. ఎందుకు తొలగించలేదని కలెక్టర్‌ను ప్రశ్నించగా.. ఆ బాధ్యత జేసీకి అప్పగించానంటూ ఆ కలెక్టరు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు సమాచారం. దీంతో సీఈవో ఆయనపై ఆగ్రహించి క్లాసు తీసుకున్నట్లు తెలిసింది. ఆ వెంటనే కరెంటు పోల్స్‌కు వేరే రంగులు వేయించినట్లు సమాచారం.

# వైసీపీ అరాచకమేంటో ప్రధానికీ చూపించారు

- పోలీస్ వ్యవస్థను ఇంత ఘోరంగా ఎవరూ వాడలేదు
- ఈసీ, కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు: టీడీపీ

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఈ రాష్ట్రంలో తన మార్క్ అరాచకం ఏమిటో వైసీపీ ఏకంగా ప్రధాని నరేంద్ర మోదీకే రుచి చూపించిందని తెలుగుదేశం పార్టీ వ్యాఖ్యానించింది. ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్సీ దీపక్ రెడ్డి మంగళవారం ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'ప్రధాని సభలోనే భద్రతా వైఫల్యాలు సృష్టించడం వైసీపీకే చెల్లింది. పోలీసు వ్యవస్థను ఇంత ఘోరంగా దుర్వినియోగం చేసిన ప్రభుత్వం దేశంలో మరొకటి లేదు. చిలకలూరిపేట సభలో ప్రధాని లేచివచ్చి కరెంటు టవర్ మీద ఉన్నవారిని పోలీసులు కిందకు దించాలని విజ్ఞప్తి చేసినా ఏ పోలీసూ పట్టించుకోలేదు. ప్రధాని మాట్లాడే సమయంలో సభలో తోపులాట చోటు చేసుకొని మైకులు పనిచేయలేదు. అక్కడ తోపులాట జరగకుండా పోలీసులు నివారించలేకపోయారు. ఆ దిశగా కనీసం ప్రయత్నం కూడా చేయలేదు. మా వలంటీర్లను పంపాలని మేం ప్రయత్నిస్తే మమ్మల్ని కదలకుండా నిలిపివేశారు. మాపై పెట్టిన శ్రద్ధలో పదో వంతు కూడా తోపులాటపై పెట్టలేదు. ఇదే తోపులాట వల్ల ప్రధాని భద్రత ప్రమాదంలో పడితే ఏమిటి పరిస్థితి? ప్రధాని వచ్చినప్పుడు ఏం చర్యలు తీసుకోవాలో బ్లూ బుక్‌లో స్పష్టంగా రాసి ఉంటుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ దానిని పర్యవేక్షించాలి. కాని ఎవరూ ఏదీ పట్టించుకోలేదు. పోలీసులను కావాలని ప్రేక్షక పాత్రకు పరిమితం చేశారు. గతంలో పంజాబ్‌లో ఇలాగే జరిగితే కొందరు పోలీస్ అధికారులను సస్పెండ్ చేశారు. ప్రధాని పాల్గొన్న ఈ సభను విఫలం చేయాలని అధికార పార్టీ కుట్రపన్నింది. దీనికి కొందరు పోలీసు అధికారులను వాడుకొంది. సభ లోపలా... బయటా వారి కుట్రలు యథేచ్ఛగా జరిగాయి. ప్రజలు ఈ సభకు సాఫీగా రాకుండా ట్రాఫిక్‌ను కావాలని గందరగోళం చేశారు. పార్కింగ్ స్థలాల వద్దకు వాహనాలు వెళ్లకుండా కావాలని వాటిని తప్పుదోవ పట్టించారు. ఇటువంటి పెద్ద పెద్ద సభల నిర్వహణ టీడీపీకి కొత్తేమీ కాదు. కాని పోలీసులు ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్రల వల్ల మేం ఇబ్బంది పడాల్సి వచ్చింది. జరిగిన ఘటనలు అన్నింటిపైనా మా పార్టీ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు, డీఓపీటీకి, యూపీఎస్సీకి, కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేయబోతోంది. ఈ కుట్రలో భాగస్వాములైన పోలీసు ఉన్నతాధికారులపై చర్యలు ఉంటేనే ప్రజలకు ఎన్నికల వ్యవస్థపై నమ్మకం కలుగుతుంది' అని దీపక్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

**బీజేపీ ఫ్లెక్సీ తొలగింపుపై వివాదం**

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముందున్న ఫ్లెక్సీ తొలగింపు వాగ్వాదానికి దారితీసింది. సీతారామపురంలోని బోయపాటి వీధిలో బీజేపీ కార్యాలయం నాలుగు అంతస్తుల భవనంలో ఉంది. ఈ కార్యాలయం అడ్రస్‌తో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని విజయవాడ మున్సిపల్ సిబ్బంది తొలగించే ప్రయత్నం చేయగా బీజేపీ కార్యకర్తలు అభ్యంతరం చెప్పారు. ప్రధాని మోదీ ఫొటో తీసేందుకు ప్రయత్నించగా తాడేపల్లిలో వైసీపీ కార్యాలయం బోర్డు తీసేశారా? అక్కడ జగన్ బొమ్మ కనిపించలేదా.? అంటూ వాదనకు దిగారు. ఇది ప్రభుత్వస్థలం కాదని, తాము అద్దె చెల్లిస్తున్న భవనంలోకి వచ్చేందుకు మీకు అధికారం లేదని సిబ్బందికి బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ స్పష్టంచేశారు. ఈసీ మార్గదర్శకాల్లో అటువంటి నిబంధన ఉంటే నోటీసివ్వాలని... అప్పుడు తామే స్వచ్ఛందంగా తొలగిస్తామని చెప్పారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడలో మంగళవారం ఉదయం జగన్ కటౌట్‌ను చూపిస్తున్న నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, సాయంత్రం కటౌట్‌ను తొలగిస్తున్న అధికారులు

# ఎన్నికల కోడ్ అపహాస్యం!

- పోలీసులు, యంత్రాంగం పక్షపాతం విడనాడాలి
- ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ హితవు
- జగన్ కటౌట్ వద్ద నిరసన.. సాయంత్రానికి తొలగించిన అధికారులు

అమరావతి(ఆంధ్రజ్యోతి), ఆలమూరు/తణుకు, మార్చి 19: రాష్ట్రంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ అపహాస్యం చేస్తున్నారని రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్, సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ విమర్శించారు. నియమావళి అమలు దేశవ్యాప్తంగా ఒక రకంగా ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో మరో రకంగా ఉందన్నారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడలో ముఖ్యమంత్రి జగన్ కటౌట్ వద్ద ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి వాటిపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార పార్టీ అరాచకాలకు ఇదో నిదర్శనమన్నారు. కాగా, మంగళవారం సాయంత్రం అధికారులు ఆ కటౌట్‌ను తొలగించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించిన పత్రాలపై ముద్రించిన సీఎం బొమ్మలను ఏ విధంగా తొలగిస్తారో, వాటిపై చర్యలు ఏమిటో అర్థం కావట్లేదని రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. రేషన్ సరఫరా చేసే వాహనాలపై సీఎం చిత్రాలను ఇప్పటివరకూ తొలగించలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విద్యార్థులు తీసుకునే సర్టిఫికెట్లతోపాటు అనేక పత్రాలపై సీఎం బొమ్మలు కొనసాగుతున్నాయన్నారు. రైతుల పొలాల్లో వేసిన రాళ్లపై కూడా ఆయన ముఖ చిత్రమే ఉందని తెలిపారు. రాష్ట్ర, జిల్లా ఎన్నికల అధికారులు స్ఫూర్తిదాయకంగా వ్యవహరించి ప్రజల్లో భద్రతాభావం నింపాలని సూచించారు. ఎన్నికలు సక్రమంగా జరిగేలా వ్యవహరించాలని కోరారు. ప్రభుత్వ వనరులు, వ్యవస్థలను, సిబ్బందిని నిస్సిగ్గుగా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం బాధాకరమని నిమ్మగడ్డ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని ఎస్కేఎస్డీ మహిళా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఓటర్లలో చైతన్యం, నిశ్శబ్ద విప్లవంలా మొదలైందని, రానున్న ఎన్నికల్లో ఇది చూడబోతున్నామని చెప్పారు. పోలీసులు, ఎన్నికల యంత్రాంగం పక్షపాత ధోరణి విడనాడాలని హితవు పలికారు. విఫలమైన వారి పట్ల చర్యలు తీవ్రంగా ఉంటాయని, తిరుపతిలో అదే జరిగిందని గుర్తుచేశారు. మంచి పాలన రావాలంటే సరైన వారిని ఎన్నుకోవడానికి యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

**'సీ-విజిల్'లో ఫిర్యాదు చేయాలి..**

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై 'సీ-విజిల్' యాప్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా ప్రతి పౌరుడు ప్రజాస్వామ్యానికి రక్షకుడిగా మారాలని నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్నందున 'సీ-విజిల్' ఫిర్యాదుల జాబితాలో ఏపీ అగ్రస్థానంలో ఉంటుందని పేర్కొన్నారు. 'ఈరోజు నేను తణుకు వెళ్తుండగా.. అంబేద్కర్ కోనసీమ జిల్లా జొన్నాడ వద్ద అధికారులు అన్ని వాహనాలతోపాటు నా వాహనాన్ని కూడా 100 శాతం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆ పక్కనే ఉన్న 60 అడుగుల వైసీపీ కటౌట్‌ను మాత్రం పట్టించుకోలేదు. దీనిపై సీ-విజిల్‌లో ఫిర్యాదు చేశాను. పౌరులందరూ సీ-విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, కోడ్ ఉల్లంఘనలను అందులో పోస్టు చేయాలి' అని సూచించారు.

# రాష్ట్రమంతా ఆక్రమించేసి..!

- సిద్ధం హోర్డింగులకు ఈసీ ఆమోదం కోరిన వైసీపీ
- 27,648 సైన్ బోర్డులకు అనుమతి కోరిన వైనం

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్ షెల్టర్లు, భారీ హోర్డింగులు, ఇతర ప్రకటనల సైన్ బోర్డులన్నిటినీ పాలకపక్షం వైసీపీ రెండు నెలల కిందటే అదిరించి.. బెదిరించి ఆక్రమించేసింది. రాష్ట్రంలో 27,648 హోర్డింగులు, బస్ షెల్టర్లు, ఇతర ప్రధాన కూడళ్లలోని వాణిజ్య ప్రకటన సైన్ బోర్డులపై 'సిద్ధం' ప్రచారాన్ని ప్రారంభించేసింది. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా సీఎం జగన్ బొమ్మతో కూడిన 'సిద్ధం' ప్రకటనలే. విపక్షాలేవీ ప్రచారం చేసుకునే వీల్లేకుండా హోర్డింగులన్నిటిని కబ్జా చేసేశారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే హోర్డింగులన్నింటికీ ఎన్నికల సంఘం అనుమతి తప్పనిసరైంది. దరిమిలా ఆ 27,649 హోర్డింగులకు అనుమతులివ్వాలని ఈసీని వైసీపీ మంగళవారం కోరింది. ఎన్నికల కోడ్ ప్రకారం.. అనుమతిలేని హోర్డింగులను స్థానిక సంస్థల అధికారులు తీసేస్తారు. పైగా ఇలా రాష్ట్రమంతా ఒకే పార్టీకి గంపగుత్తగా హోర్డింగులు అప్పగించేందుకు నిబంధనలు అంగీకరించవు. ప్రవర్తనా నియమావళి ప్రకారం రాజకీయ పక్షాలన్నిటికీ సమానంగా కేటాయించాలి. భూములు ఆక్రమించి.. క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నట్లుగా.. రాష్ట్రంలోని భారీ హోర్డింగులన్నిటినీ వైసీపీ గుంజేసుకుని.. ఇప్పుడు కోడ్ వచ్చాక తాపీగా వాటికి అనుమతి కోరుతోందని.. నిబంధనల ప్రకారం ఈసీ గనుక చర్యలు చేపడితే.. ప్రస్తుతం వైసీపీ బిగించిన హోర్డింగుల్లో సగానికి పైగా తీసేయాల్సి వస్తుందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

### ప్రభుత్వ వాణిజ్య స్థలాల్లో రాజకీయ పోస్టర్లు, బ్యానర్లను
# అనుమతించొద్దు

- రోడ్ల పక్కన హోర్డింగులు పార్టీలన్నిటికీ సమానంగా పంపిణీ
- నగదు, బహుమతుల పంపిణీని అడ్డుకోవాలి: సీఈవో మీనా

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించవద్దని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ ఆదేశించారు. ప్రస్తుతం జాతీయ, ప్రధాన రహదారుల పక్కనున్న హోర్డింగులను అన్ని రాజకీయ పార్టీలకు సమాన ప్రాతిపదికన కేటాయించాలని, నూతన హోర్డింగులకు అనుమతులివ్వొద్దని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరుపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో అమరావతి సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ... ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో రాజకీయ ప్రకటనలు, పోస్టర్లు, హోర్డింగులు, బ్యానర్ల ప్రదర్శన విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల సంఘం (ఈసీ) మార్గదర్శకాలకు విరుద్ధంగా ఎటువంటి రాజకీయ ప్రచారాన్ని అనుమతించవద్దని సూచించారు. ప్రైవేటు భవనాలపై వాల్ పెయింట్స్‌కు అనుమతి లేదని, ఇప్పటికే ఉన్న వాటిని వెంటనే చెరిపించేయాలన్నారు. ప్రభుత్వ అనుమతితో ప్రైవేటు భవనాలపై ఇప్పటికే ఉన్న పెద్ద హోర్డింగులు, కటౌట్ల భద్రతను, నిర్మాణ స్థిరత్వాన్ని ఒకసారి పరిశీలించాలని, ఏమాత్రం దృఢత్వం లేకపోయినా ప్రకటనలకు అనుమతి ఇవ్వొద్దని స్పష్టం చేశారు. 'సరిహద్దు రాష్ట్రాల నుంచి మద్యం, ఓటర్లను ప్రభావితం చేసే పలు రకాల వస్తువుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి. ఇందులో భాగంగా సరిహద్దు ప్రాంతాల్లో శాశ్వత ప్రాతిపదికన చెక్‌పోస్టులు ఉన్న చోట వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ పెంచాలి. రాజకీయ పార్టీలు, ఉద్యోగులకు, ఓటర్లకు నగదు, బహుమతుల పంపిణీని తీవ్రంగా పరిగణించాలి. సీ-విజిల్ ఫిర్యాదలను నిర్దీత సమయంలో నూరు శాతం పరిష్కరించాలి. ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్మెంట్ వ్యవస్థను పెద్ద ఎత్తున వినియోగించుకునేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలపై వత్తిడి పెంచాలి' అని ఆదేశించారు. ఇంకా కొన్ని జిల్లాల నుంచి జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళికలు అందలేదని, వాటిని వెంటనే అందజేయాలని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే లోపే ఎన్నికల సిబ్బందికి మరో ఒకట్రెండు సార్లు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే అంశంపై జిల్లా ఎన్నికల అధికారులు దృష్టి సారించాలన్నారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

### ఎన్నికల ప్రవర్తనా నియమావళి
## అమలుపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్ దిల్లీరావు

**కృష్ణలంక, మార్చి 19:** జిల్లాలో ఈసీఐ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్టు కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీ నా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఎస్.దిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌తో కలిసి హాజరయ్యారు. నిష్పక్షపాత, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ముఖేష్‌కుమార్ మీనా దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రవర్త నా నియమావళి (ఎంసీసీ) పటిష్ఠ అమలుకు తీసుకొన్న చర్యలపై సమీక్షించారు. బోర్డర్ చెక్‌పోస్టుల వద్ద పర్యవేక్షణ, క్షేత్రస్థాయిలో ఫ్లయింగ్ స్క్వాడ్‌ల పనితీరు, సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ విస్తృతస్థాయిలో వినియోగించడం, సీవిజిల్, ఇతర మార్గాల ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం తదితరాలపై సూచనలిచ్చారు. కలెక్టర్ దిల్లీరావు, జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు సరళి, ఫిర్యాదుల పరిష్కారం, నివేదికల నిర్వహణ వ్యవస్థను వివరించారు. సమావేశంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


అదనపు డీఎంఈగా పదోన్నతి పొందిన వెంకటేష్‌ను అభినందిస్తున్న ప్రభుత్వ డాక్టర్ల సంఘం ప్రతినిధులు

## అదనపు డీఎంఈగా డాక్టర్ వెంకటేష్‌కు పదోన్నతి

**వన్‌టౌన్, మార్చి 19:** స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ వెంకటేష్ అదనపు వైద్య విద్యా సంచాలకుడు (అడిషనల్ డీఎంఈ)గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం, సిద్ధార్థ మెడికల్ యూనిట్ ప్రతినిధులు మంగళవారం ప్రభుత్వాసుపత్రిలో ఆయనకు అభినందనలు తెలిపారు. వెంకటేష్ పాలన దక్షతను కొనియాడారు. పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. డాక్టర్లు పి.రత్నబాబు, సంపత్‌ప్రియ, కుమార్, దుర్గారాణి, అంకిత, నురుల్లా, మహేష్, శ్రీనివాస్, జ్వలిత వెంకటేష్‌ను అభినందించిన వారిలో ఉన్నారు.

## డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలి

▸▸ **ఎన్నికలు, టెన్త్ స్పాట్ నేపథ్యంలో ఈసీకి సీపీఐ లేఖ**

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు, పదో తరగతి స్పాట్ వ్యాల్యూయేషన్ కారణంగా డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు మంగళవారం ఆయన లేఖ రాశారు. గత ఐదేళ్లుగా డీఎస్సీ నిర్వహించని జగన్ సర్కారు ఎన్నికల నేపథ్యంలో హడావుడిగా డీఎస్సీ పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమైందని ఆ లేఖలో విమర్శించారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల మంది నిరుద్యోగులు, వేలాది మంది సెకండరీ గ్రేడ్ టీచర్స్ కూడా డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. డీఎస్సీ పరీక్షలను ఈనెల 30 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించినందున అభ్యర్థులు చదువుకోడానికి తగిన సమయం లేదని పేర్కొన్నారు. సాధారణ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు.

## 1 నుంచి టెన్త్ పత్రాల మూల్యాంకనం

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ప్రశ్నపత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 1 నుంచి 8 వరకు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి మంగళవారం అన్ని జిల్లాల డీఈవోలకు ఆదేశించారు. ఈ ఏడాది నుం చి 26 జిల్లా కేంద్రాల్లో మూల్యాకనం జరుగుతుందని, సుమారు 29వేల మంది టీ చర్లు ఇందులో పాల్గొంటారని తెలిపారు. కాగా, మంగళవారం జరిగిన పదో తరగతి ద్వితీయ భాష పరీక్షకు 97.05శాతం విద్యార్థులు హాజరయ్యారని డి.దేవానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18902 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

## తిరుమలలో నేటి నుంచి శ్రీవారి తెప్పోత్సవాలు

తిరుమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ తెప్పోత్సవాల్లో తొలిరోజు సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవమూర్తులను శ్రీవారి పుష్కరిణిలో తెప్పపై కొలువుదీరి విహరించనున్నారు.

## విశాఖ ఎంపీగా, ఎస్.కోట ఎమ్మెల్యేగా పోటీ చేస్తా: పాల్

విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో తాను విశాఖపట్నం లోక్‌సభ, ఎస్.కోట శాసనసభా నియోజకవర్గాల నుంచి పోటీ చేయనున్నట్టు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ ప్రకటించారు. విశాఖ రై ల్వే న్యూకాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరుల తో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తనపై కక్ష సాధింపు చర్యలకు దిగిందని ఆరోపించారు. ఆశీల్‌మెట్టలోని పాల్ కన్వెన్షన్ సెంటర్‌కు పన్ను చెల్లించాలంటూ జీవీఎంసీ అధికారులు వచ్చారని, వారిని పురపాలకశా ఖా మంత్రి ఆదిమూలపు సురేశ్ పంపించారని పాల్ ఆరోపించారు. కాపు సామాజిక నేత ముద్రగడ పద్మనాభాన్ని ప్రజాశాంతి పార్టీలోకి ఆహ్వానిస్తే... తిరస్కరించారన్నారు. ఎవరికీ అమ్ముడుపోనని చెప్పే ఆయన...మరి వైసీపీలో ఎలా చేరారని ప్రశ్నించారు. నరేంద్రమోదీకి సీఎం జగన్ దత్తపుత్రుడని విమర్శించారు. జగన్ గెలిచినా మోదీకే మద్దతు ఇస్తారన్నారు.

## బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు

▸▸ **ఆరుగురికి గాయాలు - ముగ్గురి పరిస్థితి విషమం**

సూళ్లూరుపేట, మార్చి 19: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సమీపంలో ఉన్న వట్రపాలెం వద్ద బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో అక్కడ పనిచేసే ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో హైవే పక్కనే ఉన్న మదీనా ఫైర్ వర్క్స్‌లో భారీ శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు ఉలిక్కిపడ్డారు. గోడౌన్ నుంచి దట్టమైన పొగలు వస్తుండడంతో ఇంకా పేలుడు మందులు ఉన్నాయోమోనని జనాలు హైవే రోడ్డు పైనే ఉండిపోయారు. ఇంతలో గోడౌన్ మంటల్లో గాయపడిన వారు బయటకు రాగా వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారిలో బీహార్‌కు చెందిన శంకర్ చౌదరి, పింకేష్ జాదవ్, రాజ్‌కుమార్, గండ్ మండేల్, జార్ఖండ్‌కు చెందిన రవి, సూళ్లూరుపేట వట్రపాలేనికి చెందిన కందుకూరి శివకుమార్ ఉన్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు.

## ఏసీబీ వలలో సబ్ రిజిస్ట్రార్, రైటర్

▸▸ **రెండున్నర లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టివేత**


ఏసీబీ అధికారులకు పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్, రైటర్

మడకశిర టౌన్, మార్చి 19: శ్రీసత్యసాయి జిల్లా మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు మంగళవారం రాత్రి దాడు లు నిర్వహించారు. అసైన్డ్ భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు రైతు నుంచి లంచం తీసుకున్న సబ్ రిజిస్ట్రార్ దామోదర్ అలియాస్ దామోదర్‌రెడ్డిని, రైటర్ షమీవుల్లాను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి లంచంగా తీసుకున్న రూ.2.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి విలేకరులకు తెలియజేశారు. మడకశిర మండలం గంతలపల్లి గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి 8.36 ఎకరాల అసైన్‌మెంట్ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదించాడు. ఎకరానికి రూ.50 వేల ప్రకారం లంచం ఇస్తే రిజిస్ట్రేషన్ చేస్తానని సబ్ రిజిస్ట్రార్ బేరం పెట్టాడు. లంచం ఇవ్వడం ఇష్టంలేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు రైటర్ షమీవుల్లా ద్వారా మొదటి విడత రూ.2.50 లక్షలను సబ్ రిజిస్ట్రార్‌కు మంగళవారం రాత్రి కార్యాలయంలోనే అందజేశాడు. అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు సబ్ రిజిస్ట్రార్‌ను, రైటర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నా రు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు.

# వాటర్ ట్యాంకుపై వైసీపీ రంగులు

● **చూసీ చూడనట్టున్న అధికారులు**

**గన్నవరం, మార్చి 19:** ఎన్నికల నియామావళి అమల్లోకి వచ్చి నాలుగు రోజులవుతున్న అధికార పార్టీ వైసీపీ రంగులను తొలగించటం లేదు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. గన్నవరం విమానాశ్రయం సమీపంలోని ఓ ప్రైవేటు వెంచర్‌లో వాటర్ ట్యాంకుపై జగన్, రాజశేఖర్‌రెడ్డి బొమ్మలతో కూడిన వైసీపీ రంగులు వేశారు. వాటిని తొలగించకుండా అలానే వదిలేశారు. జాతీయ రహదారిపైకి కనిపిస్తున్నా అధికారులు వాటిని తొలగించకపోవటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు వైసీపీకి చెందిన రంగులను అలాగే ఉంచి ఇతర పార్టీల రంగులను, బ్యానర్‌లను ముందుగానే తొలగించారని చెబుతున్నారు.

### వైసీపీ అనుకూల ధోరణిని అధికారులు వీడాలి

**రాణిగారితోట:** ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాజకీయ పార్టీల పోస్టర్స్, బ్యానర్స్, పేర్లు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే రాణిగారితోటలో పలువురికి జీవనోపాధి నిమిత్తం టీడీపీ, వైసీపీ ఆధ్వర్యంలో బండ్లను అందజేశారు. వీటిపై ఆయా పార్టీల రంగులతో పాటు పేర్లుండడంతో అవి కనిపించకుండా రంగులు వేయాలని ఆయా బండ్ల నిర్వాహకులకు అధికారులు సూచించారు. అయితే రాణిగారితోట 18వ డివిజన్‌లో మాదాల వెంకటేశ్వరరావు వీధిలో ఒక బండిని వైసీపీ నేత అందజేశారు. దానిపై ఆయన పేరుని మాత్రమే కనిపించకుండా రంగు వేశారు. బండి మొత్తానికి ఉన్న వైసీపీ రంగుని మాత్రం అలాగే ఉంచేశారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. అదే డివిజన్‌లో బాలస్వామి వీధిలో టీడీపీ నేత ఇచ్చిన బండిపై మాత్రం టీడీపీకి సంబంధించిన చిన్న అనవాలు కనిపించకుండా పూర్తి రంగును వేయించారు. దీనిపై స్థానిక టీడీపీ నేతలు అధికారుల తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు వైసీపీ అనుకూల ధోరణిని వీడి విధులు సరిగ్గా నిర్వర్తించాలని కోరుతున్నారు.


వైసీపీ రంగు అలాగే ఉంచి టీడీపీ బండికి పూర్తిగా రంగు మార్చిన అధికారులు


గన్నవరంలో ట్యాంకుపై జగన్, రాజశేఖర్‌రెడ్డి బొమ్మలతో వైసీపీ రంగులు


భక్తుల రాకపోకలకు అడ్డంకిగా ముందుకు చొచ్చుకు వచ్చిన షాపులను తొలగించాలని సూచిస్తున్నఏఈవో సీసీ వెంకటరెడ్డి

## బకాయిలు చెల్లించండి

● **లీజుదారులను ఏఈవో హెచ్చరిక**

**వన్‌టౌన్, మార్చి 19:** దుర్గగుడి నుంచి లీజుకు పొంది షాపులు నిర్వహించుకుంటున్న యజమానులు బకాయిలు చెల్లించాలని ఏఈవో సీసీ వెంకటరెడ్డి హెచ్చరించారు. మొత్తం 24 షాపులకు గాను 21 షాపులు యాక్టివ్‌గా ఉన్నాయి. షాపులన్నీ కలిసి సుమారు రూ.2 కోట్ల వరకు బకాయి ఉన్నారు. ఇప్పటికే పలు మార్లు షాపుల యజమానులకు నోటీసులిచ్చారు. మరోవైపు అభివృద్ధి పనులు జరుగుతున్నందున, తమను ఎలానూ ఖాళీ చేయిస్తారని అప్పటి దాకా బకాయిలు చెల్లించకుండా మిన్నకుందామన్న భావనలో షాపుల వారున్నట్లుగా తెలుస్తోంది. కాగా రూ.2 కోట్ల భారీ బకాయిలుండటంతో ఇటీవల ఈవో రామారావు కూడా బకాయిల రాబడికి సమీక్ష నిర్వహించారు. ఇదేక్రమంలో తాజాగా షాపుల వారు తమకు కేటాయించిన స్థలం పరిధికి మించి భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా చొచ్చుకు రావడంతో ఏఈవో రెడ్డి వాటిని తొలగించాలని ఆదేశించారు. ఇదే విషయంపై పలువురు భక్తులు ఫిర్యాదు కూడా చేశారు.


కాంస్య పతకం సాధించిన రాష్ట్ర పురుషుల టీమ్

## చాన్నాళ్లకు ఏపీ కబడ్డీ టీమ్‌కు కాంస్యం

**విజయవాడ స్పోర్ట్సు, మార్చి 19:** బీహార్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీహార్‌లో జరుగుతున్న 33వ జాతీయ జూనియర్ పురుషుల కబడ్డీ టోర్నీలో రాష్ట్ర పురుషుల జట్టు చాన్నాళ్లకు కాంస్యంతో సత్తా చాటింది. పూల్ హెచ్ విజేతగా నిలిచి క్వార్టర్స్‌కు అనంతరం సెమీస్‌కు చేరిన ఏపీ జట్టు ఇక్కడ హర్యానాతో జరిగిన పోరులో 13 పాయింట్లతో పరాజయం పాలైంది. దీంతో పురుషుల జట్టుకు కాంస్యం లభించింది. టీమ్ ఐక్యంగా ఆడి ఏపీ ప్రతిష్ఠను ఇనుమడింపు చేసిందని ఏపీ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ అభినందించారు.

## 21న పీబీ సిద్ధార్థలో ఇన్‌కెండో 2కే24

**మొగల్రాజపురం, మార్చి 19:** కామర్స్ విద్యార్థుల్లోని సృజనాత్మకతన వెలికితీసేందుకు వారిలో నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకునేందుకు వీలుగా 15 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఇన్‌కెండోను ఈ నెల 21న నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ చెప్పారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్విజ్, దలాల్‌స్ట్రీట్, ఫైనాన్సియల్ ఎనలిస్ట్, డిబేట్, యాడ్ మేకింగ్, డ్యాన్స్, మిస్టర్ అండ్ మిస్ ఇన్‌కెండో, ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి దాదాపు 300 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. అనంతరం డీన్ రాజేష్ జంపాల, డైరెక్టర్ వేమూరి బాబురావు, కామర్స్ విభాగాధిపతి కోనా నారాయణరావు, ఈవెంట్ నిర్వాహకులు సుభాకర్, ధర్మేంద్ర, ఫణి కృష్ణ, విద్యార్థులతో కలిసి బ్రోచర్ ఆవిష్కరించారు.


బ్రోచర్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తదితరులు

## అయోధ్యకు విమానాన్ని నడపండి

● **ఇండిగో సీఈవోకు ఏపీ చాంబర్స్ లేఖ**



**ఆంధ్రజ్యోతి, విజయవాడ:** నగరం నుంచి అయోధ్యకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం విమాన సర్వీసును నడపాల్సిందిగా ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్‌కు, ఆంధ్ర చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ చాంబర్స్) లేఖ రాసింది. ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు ఈ మేరకు ఇండిగో సీఈవోకు విమాన సర్వీసు ఆవశ్యకత గురించి లేఖలో విపులంగా వివరించారు. 2017 మే 3న విజయవాడ విమానాశ్రయానికి కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ హోదాను కల్పించిందన్నారు. కాగా ఈ విమానాశ్రయాన్ని ప్రపంచస్థాయి విమానాశ్రయంగా తీర్చిదిద్దటానికి మరిన్ని నగరాలకు కనెక్టివిటీ, ప్రయాణికుల సౌకర్యాలు, కార్గో సేవలకు గట్టిగా కృషి చేస్తున్నామన్నారు. నగరం నుంచి హైదరాబాద్ మీదుగా అయోధ్యకు డైరెక్ట్ ఫ్లైట్‌ను ప్రవేశపెట్టాలని ఇండిగోను అభ్యర్థిస్తున్నట్టు లేఖలో భాస్కరరావు పేర్కొన్నారు. అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామాలయం ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులకు గొప్ప ప్రాముఖ్యమైనదన్నారు. అయోధ్యకు చేరుకోవటానికి నగరం నుంచి నేరుగా విమానాలు లేనందున రోడ్డు మార్గాన ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. నగరం నుంచి నేరుగా రైళ్లు కూడా లేవన్నారు. గతంలో తాము నగరం నుంచి షిర్డీకి విమాన సర్వీసును అభ్యర్థించగా ఆ సర్వీసు ఇప్పుడు విజయవంతంగా నడుస్తోందన్నారు. అలాగే అయోధ్యకు విమాన సర్వీసు నడిపితే 100శాతం ఆక్యుపెన్సీ ఉంటుందన్నారు. నగరం నుంచి హైదరాబాద్ లేదా బెంగళూరు మీదుగా అయోధ్యకు డైలీ సర్వీసు నడపాలని విజ్ఞప్తి చేశారు.

# దుర్గమ్మా.. మహేష్‌ను కరుణించమ్మా!

● **జనసేన పశ్చిమ సీటు కేటాయించాలని కోరుతూ అమ్మవారికి మొక్కులు**

**వన్‌టౌన్, మార్చి19:** జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేష్‌కు రానున్న ఎన్నికలలో పశ్చిమ నుంచి పోటీ చేసేందుకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు వినతుల వెల్లువ కొనసాగుతోంది. పార్టీలోని వివిధ విభాగాల వారు మద్దతు పలుకుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం జనసేన కార్యాలయంలో జరిగిన అంతర్గత సమావేశంలో పోతిన మహేష్ పాల్గొన్నారు. ప్రజాదరణ చూరగొన్న మహేష్‌కు సీటు కేటాయించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. పార్టీ నగర సంయుక్త కార్యదర్శి గన్ను శంకర్ ఆధ్వర్యంలో దుర్గగడి వరకు పోతిన మహేష్‌కు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కామధేను అమ్మవారి ఆలయం వద్ద 108 టెంకాయలను సమర్పించారు. ఈ సందర్భంగా మహేష్ సేవలను కొనియాడుతూ పశ్చిమ సీటు కేటాయించడమంటే అతడి వ్యక్తిగత లబ్ధికోసం కాదని, పార్టీ మనుగడ, నియోజకవర్గ అభివృద్ధి కోసమన్నారు. తిరుపతి అనూష, బొమ్ము గోవిందలక్ష్మి, తమ్మిన లీలాకరుణాకర్, మొబీనా, హనుమాన్, ఏలూరు సాయిశరత్, అమీర్‌బాషా, ఎస్.రాముగుప్తా పాల్గొన్నారు.

### పశ్చిమ సీటు మహేష్‌కు ఇవ్వాలి

చిట్టినగర్: బీజేపీ-టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోతిన మహేష్‌కు పశ్చిమ సీటు కేటాయించాలని నగరాల సామాజిక వర్గ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి చిట్టినగర్ నగరాల కల్యాణమండపంలో నగరాల సామాజికవర్గ ఆత్మీయ సమావేశం జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మహేష్‌కు సీటు ఇస్తే సుమారు 30 నుంచి 40 వేల మెజారిటీ ఓట్లతో గెలుస్తారన్నారు. పవన్‌కల్యాణ్ పునరాలోచన చేసి మహేష్‌కు సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేష్ మాట్లాడుతూ తన పట్ల నగరాల సామాజిక వర్గం చూపిస్తున్న అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు. చిట్టినగర్ అమ్మవారి గుడి కమిటీ అధ్యక్షుడు ఎల్.అప్పారావు, కార్యదర్శి ఎం.హనుమంతరావు, నగరాల నేతలు పోతిన బేషు కంతేశుడు, జి.అమర్, టి.హేమంత్, ఆర్.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది గోగిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


కామధేను అమ్మవారి ఆలయం వద్ద టెంకాయలు కొడుతున్న జనసేన శ్రేణులు

# కోర్టు అమీనాకు బెదిరింపు!

● **రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ ఆస్తుల జప్తుకు కోర్టు ఆదేశం** ● **జప్తునకు వెళ్లిన కోర్టు అమీనా విధులకు సిబ్బంది ఆటంకం**

**విజయవాడ లీగల్, మార్చి 19:** రోడ్డు ప్రమాదం కేసులో రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ వారిపై వేసిన కేసులో బాధితుడికి పరిహారం చెల్లించమని కోర్టు ఇచ్చిన తీర్పులో కంపెనీ వారు సొమ్ము చెల్లించకపోవడంతో బాధితుడు తిరిగి కోర్టును ఆశ్రయించడంతో ఇన్సూరెన్సు కంపెనీ ఆస్తులను జప్తు చేయాలని కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు అమీనా మంగళవారం లబ్బీపేట సిద్ధార్థ నగర్‌లోని ఇన్సూరెన్సు కంపెనీకి వెళ్లి కోర్టు ఇచ్చిన ఆర్డరును చూపి కంపెనీ ఆస్తులను జప్తు చేయాలని చెప్పగా కంపెనీ సిబ్బంది అమీనాపై బెదిరింపులకు పాల్పడుతూ విధులకు ఆటంకం కలిగించారు. తమ కంపెనీలోని చెక్కులు, వస్తువులు చోరీకి గురయ్యాయని అమీనాపై కేసు పెడతామని బెదిరించడంతో చేసేది లేక జరిగిన విషయాన్ని కోర్టు దృష్టికి తెలియజేయాలనే ఉద్దేశంతో అమీనా వెనక్కి తిరిగి వచ్చేశారు. జప్తు చేసేందుకు వెళ్లిన సమయంలో ఇన్సూరెన్సు కంపెనీ సిబ్బంది తన విధులకు ఎలా ఆటంకం కలిగించారు, ఎలాంటి బెదిరింపులకు పాల్పడ్డారనే విషయాన్ని అమీనా న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిసింది.

గన్నవరానికి చెందిన ఆళ్ల శ్రీనివాసరెడ్డి 2013 డిసెంబరు 28న కారు ఢీకొనడంతో తీవ్రమైన గాయాలయ్యాయి. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స తీసుకొని 3 సార్లు సర్జరీలు జరిగాయి. ఇప్పటికి గాయాలు మానలేదు. దీంతో అతడు కారుకు సంబంధించిన ఇన్సూరెన్సు కంపెనీ రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ వారిపై న్యాయవాది ఆలూరి సుధాకరరావు ద్వారా మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో కేసు దాఖలు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, బాధితుడికి రూ.14,96,426లతో పాటు పిటీషన్ వేసినప్పటి నుంచి (9-11-2015) ఇప్పటివరకు 7.5 శాతం వడ్డీతో సహా చెల్లించాలంటూ 2023 ఫిబ్రవరి 23న తీర్పు ఇచ్చింది. కానీ ఇన్సూరెన్సు కంపెనీ వారు డబ్బు చెల్లించకపోవడంతో బాధితుడు మరోసారి కోర్టులో ఈపీ (ఎగ్జిక్యూషన్ పిటీషన్) దాఖలు చేశారు. పిటీషన్ పరిశీలించిన న్యాయమూర్తి, ఇన్సూరెన్సు కంపెనీ ఆస్తులను జప్తు చేయాల్సిందిగా ఆదేశిస్తూ అమీనాను నియమించారు. కోర్టు ఆర్డర్‌ను పట్టుకొని సోమ, మంగళవారాలు ఇన్సూరెన్సు కంపెనీ వద్దకు అమీనా వెళ్లగా వారు పైవిధంగా విధులకు ఆటంకం కలిగించాని, పైగా ఎదురు కేసు పెడతామని భయపెట్టడంతో చేసేదిలేక అమీనా కోర్టు ఆర్డరుతో వెనక్కి వచ్చి న్యాయమూర్తికి విన్నవించనున్నట్టు తెలిసింది.

## ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మోసం

**సత్యనారాయణపురం:** ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరు తో మోసం చేసి నగదు కొట్టేశారని వివాహిత సత్యనారాయణపురం పోలీసులకు మంగళవారం ఫిర్యా దు చేసింది. జే అనుషాదేవి పెజ్జోనిపేట డేవిడ్ స్ట్రీట్ లో నివసిస్తుంది. ఈమె టెలిగ్రామ్ యాప్‌లో క్రిస్టోగ్లోబ్ ఈడీలో నుంచి టొప్ర ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే లాభం వస్తుందని మెసేజ్ వచ్చిం ది. దీంతో ఆమె టెలిగ్రామ్ యాప్‌లో చాట్ చేసింది. మీ పెట్టుబడికి ఎక్కువ లాభం వస్తుందన్నారు దీం తో ఆమె ఈనెల 13న రూ.2వేలు యూపీఏ ట్రాన్సాక్షన్ చేసింది. వెంటనే రూ.2800 వచ్చాయి. మరుసటి రోజు రూ.15వేలు, రూ.46వేలు వేలు వేసింది. డబ్బులు తిరిగి రాలేదు. యాప్‌లో చాట్ చేస్తే ఇంకా వేస్తే కలిపి మొత్తం వేస్తామన్నారు. దీంతో మోసపోయానని గ్రహించి సత్యనారాయణపురం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 24న జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీ

**విజయవాడ స్పోర్ట్సు:** నగరం సమీపంలోని గ్రీన్ స్కూల్లో ఎస్‌ఆర్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 24న జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టో ర్నీని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటన లో తెలిపారు ఇందులో ప్రతిభ చాటిన 13 మందిని ఈ నెల 31న రాజమండ్రిలో జరిగే స్టేట్ లెవె ల్ టోర్నీకి ఎంపిక చేస్తారు. ఈ టోర్నీలో పాల్గొనే వారు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపీచెస్.ఓఆర్‌జీలో 23న శనివారం సాయంత్రం 5 గంటలకల్లా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9700775220, 9247153387 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## హెల్త్ వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ టీమ్

చెన్నైలో అన్నా వర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే ఆలిండియా ఇంటర్ వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొనే హెల్త్ వర్సిటీ మహిళా టీమ్‌ను ఎంపిక చేసినట్టు వర్సిటీ స్పోర్ట్సు బోర్డు సెక్రటరీ ఇ.త్రిమూర్తి ఒక ప్రకటనలో తెలిపా రు. ఎంపికైనవారిని వైస్ చాన్సలర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సుమితా శంకర్ అభినందించారు.

టీమ్ ఇదే... ఎం.శివజోత్స్న, జి.నీలోత్పలా, కె.సుగ్న్యా (విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల), టీ.గ్రీష్మ, ఎన్‌ఎన్ శ్రీస్వప్నిత, పీ సిరిచందన (ఏలూరు ఆశ్రమం మెడికల్), ఎన్.చరితారెడ్డి (చినవుటుపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ మెడికల్ క ళాశాల), కేవీ, గాయత్రి, ఎ.జ్యోతి మణిమాల, జి.సిరి (విశాఖపట్నం అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్) ఎంపికయ్యారు. టీమ్ మేనేజర్‌గా జె.రాము (విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల పీడీ), కోచ్‌గా డాక్టర్ పవన్‌కుమార్ (ప్రభుత్వ డెంటల్ కళాశాల పీడీ) వ్యవహరిస్తారు.

### వేసవి క్రీడా శిక్షణకు దరఖాస్తులు

శాప్ ఆదేశాలతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆ ధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు 50 ఉచిత వేసవి క్రీడాశిక్షణా శిబిరాల నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఎస్‌డీవో ఎస్‌ఏ అజీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో వేసవి క్రీడాశిబిరాల నిర్వహణకు ఆసక్తి ఉన్న క్రీడా సంఘాలు, వ్యా యామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఈ నెల 31న సా యంత్రం 5గంటల్లోగా, తమ దరఖాస్తులో నిర్వహిం చే క్రీడాంశాన్ని ఏ ప్రదేశంలో నిర్వహిస్తారో తెలుపుతూ ఐజీఎంసీలోని తమ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

## వికలాంగుల హక్కుల చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయండి

**ధర్నాచౌక్:** వికలాంగుల హక్కుల చట్టాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పటిష్ఠంగా అమలు చేయాలని వీహెచ్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. మ స్కులర్ డి.జార్డర్‌కు రూ.15వేలివ్వాలన్నారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నం చిన్న సుబ్బయ్య యా దవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పేరెల్లి ఎలీషా మాదిగ, జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, కోర్‌కమి టీ సభ్యులు ఎల్.గోపాల్, అందె రాంబాబు, మహిళా అధ్యక్షురాలు సుజాత నాయుడు పాల్గొన్నారు.

## 'గోలగాని'కి పశ్చిమ కేటాయించండి

**ధర్నాచౌక్:** స్థానికులకు అండగా ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న గోలగాని రవికృష్ణకు బీజేపీ పశ్చిమ ఎమ్మెల్యే సీటు కేటాయించాలని ఏపీ నాయీ బ్రాహ్మణుల సమైఖ్య, బీసీ సమైఖ్య, యాదవ సంఘం సమైఖ్య నేతలు కోరారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నాయీ బ్రాహ్మణుల సమైఖ్య రాష్ట్ర నే త కేవీ రామారావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర బీజేపీ నేతలకు, ప్రధాని మోదీకి రవికృష్ణ పేరును ప్రతిపాదిస్తూ వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. ఆయనకు సీటును కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో గెలుస్తారన్నారు. తురాల లీల వెంకట ప్రసాద్ యాదవ్, చింత కృష్ణ, బోట్ల నాగార్జున పాల్గొన్నారు.

## చేనేతలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వండి

**ధర్నాచౌక్:** రానున్న ఎన్నికల్లో చేనేతలకు తగిన సీట్లు కేటాయించి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసి న ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడుతూ ప్రస్తుత శాసనసభలో ఒక్క చేనేత సామాజికవర్గం ఎమ్మెల్యే లేకపోవడం శోచనీయమన్నారు. చేనేతలు నేటికీ సా మాజికంగా రాజకీయంగా వెనకబడి ఉన్నారన్నారు. చేనేతల సమస్యలు అసెంబ్లీలో చర్చించేందుకు ఆ వర్గం నుంచి అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఉండాలన్నా రు. చేనేతలను విస్మరించిన పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు భండారు ఆనంద ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు ఇనమాల శివరాంప్రసాద్, ఏపీ దేవంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నక్కిన చిన వెంకట్రాయుడు, ఏపీ చేనేత కార్మిక సంఘం నేత పిల్లలమర్రి నాగేశ్వరరావు పలు చేనేత సంఘాల నేతలు పాల్గొన్నారు.

## ఉమ్రా యాత్ర విజయవంతం కావాలి : రవీంద్ర

**మచిలీపట్నం టౌన్:** పవిత్ర ఉమ్రా యాత్రకు విజయవంతం కావాలని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ఆకాంక్షించారు. ఉమ్రా యాత్రకు వెళుతున్న ముస్లిం సోదరులను కలిసి వారు శుభాకాంక్షలు తెలిపారు. మోటమర్రి బాబా ప్రసాద్, ఇలియాస్ పాషా, గడ్డం రాజు, ఖాజా, అజీమ్, ఆరీఫ్, బాజానీ, సలీం, మౌలాలి, అమీర్, మహేష్, వేణు, చిన్నం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## టైగర్ ట్రయంఫ్-24తో వ్యూహాత్మక భాగస్వామ్యం పెంపు

» అమెరికా రాయబారి ఎరిక్ గర్సెట్టి

విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భారత్, అమెరికా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి 'టైగర్ ట్రయంఫ్-24' కార్యక్రమాలు ఉపయోగపడతాయని అమెరికా రాయబారి ఎరిక్ గర్సెట్టి అన్నారు. నేవల్ డాక్‌యార్డులో ఐఎన్ఎస్ జలాశ్వపై భారత్, అమెరికా నౌకాదళాలు మంగళవారం సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వవ్యాప్తంగా సముద్రాలలో ఎక్కడ ఏ విపత్తు సంభవించినా ఒకరికొకరు సాయం చేసుకునేందుకు ఈ కార్యక్రమాలు ఉపకరిస్తాయన్నారు. వృత్తిపరమైన అంశాలపై చర్చలు, ప్రణాళికలు రూపొందించడం, వాటిని అమలు చేయడం వంటివి ఇందులో ఉంటాయన్నారు. ఈ నెల 31 వరకు నిర్వహించే విన్యాసాల్లో యాంఫీబియస్ (ఉభయ చర) ఆపరేషన్లు కూడా ఉంటాయన్నారు. సమావేశంలో అమెరికా నేవీ తరఫున రియల్ అడ్మిరల్ జాక్విన్ జె మార్టినెజ్ డి పినిలోస్, యుఎస్ సెవెన్త్ ఫ్లీట్ రిజర్వ్ వైస్ కమాండర్ కెప్టెన్ బ్రాంట్, కమాండింగ్ ఆఫీసర్ సోమర్‌సెట్, తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ పాల్గొన్నారు.

## సర్వీసులో లేని వ్యక్తికి జీతాలు ఇస్తున్న ప్రభుత్వం

» పీఎం 15 సూత్రాల అమలు కమిటీ రాష్ట్ర సభ్యుడు అర్షద్

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): డిప్యూటేషన్‌పై 2005నుంచి ఇప్పటి వరకు మైనార్టీ సంక్షేమశాఖలో కొనసాగుతున్న మస్తాన్‌పై చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి 15 సూత్రాల అమలు కమిటీ రాష్ట్ర సభ్యుడు అర్షద్ డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఈ మేరకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 'డిప్యూటేషన్ నిబంధనలకు విరుద్ధంగా అర్షద్ 19 ఏళ్లుగా వివిధ హోదాల్లో మైనార్టీ సంక్షేమశాఖలో పనిచేశారు. ప్రస్తుతం కమిషనరేట్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా కొనసాగుతూ మైనార్టీ సంక్షేమ శాఖ ఖజానాకు గండి కొడుతున్నారు. దీనిపై సీఎస్, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశా' అని అర్షద్ తెలిపారు.

## వేతన సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం జిల్లా వైద్యారోగ్యశాఖాధికారుల కార్యాలయాల్లో గ్రీవెన్స్ డే నిర్వహిస్తారని ఆరోగ్యశాఖ కమిషనర్ జె.నివాస్ మంగళవారం తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తమ వేతన సమస్యల్ని గ్రీవెన్స్ డేలో డీఎంహెచ్‌వోలకు తెలియజేయాలని సూచించారు. వేతనాల సమస్యల్ని పరిష్కరించుకునేందుకు ఇదే చివరి అవకాశమని, వినతులన్నింటినీ విజయవాడలోని హెల్త్ డైరెక్టర్ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. కాగా, మంగళవారం డీఎంహెచ్‌వోలు నిర్వహించిన గ్రీవెన్స్ డేకు మంచి స్పందన వచ్చిందన్నారు.

## ముందస్తు బెయిల్ మంజూరు చేయండి

» స్కిల్ కేసులో అచ్చెన్నాయుడు పిటిషన్

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు మళ్లించారనే ఆరోపణలతో 2021 డిసెంబరులో సీఐడీ నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టీడీపీ ఏపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు బుధవారం విచారణ జరపనున్నారు. ఈ కేసులో అచ్చెన్నాయుడిని 38వ నిందితుడిగా సీఐడీ చేర్చింది.

## ఏపీపీఎస్సీ అప్పీల్‌పై నేడు విచారణ

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని పేర్కొంటూ ఆ పరీక్షను రద్దుచేసి, తాజాగా నిర్వహించాలని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ కమిషన్ దాఖలు చేసిన అప్పీల్‌పై హైకోర్టు నేడు విచారించనుంది. ఈ అప్పీల్‌పై న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరపాల్సి ఉంది. అయితే జస్టిస్ జి. నరేందర్ సెలవుపై ఉండడంతో, అత్యవసరంగా విచారణ జరపాలని జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ ఎన్.హరినాథ్‌తో కూడిన ధర్మాసనాన్ని ఏపీపీఎస్సీ, రాష్ట్ర ప్రభుత్వం న్యాయమూర్తులు అభ్యర్థించారు. సంబంధిత బెంచ్ ఈ వ్యవహారంపై విచారణ జరుపుతుందని పేర్కొన్న ధర్మాసనం... విచారణను వాయిదా వేసింది.

## వైసీపీ రౌడీలను అణచివేయండి

» సీఈవోకి ఎంఏ షరీఫ్ విజ్ఞప్తి

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ప్రతిపక్ష నాయకులు, టీడీపీ సానుభూతిపరులపై దాడి చేస్తూ, వైసీపీ రౌడీలు పెట్రేగిపోతున్నారని శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఏ షరీఫ్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేశారు. అరాచకాలకు పాల్పడుతున్న వారిని ఉక్కుపాదంతో అణిచివేసి, రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం సీఈవో ముఖేశ్‌కుమార్‌మీనాకు వినతిపత్రం ఇచ్చారు.

## 15 అసెంబ్లీ, 2 పార్లమెంటు స్థానాల్లో సీపీఐ పోటీ!

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 15 అసెంబ్లీ, 2 పార్లమెంటు స్థానాల్లో పోటీ చేయనున్నట్లు సీపీఐ ప్రకటించింది. ఏఏ స్థానాల్లో పోటీ చేయా లి, అభ్యర్థులుగా ఎవరిని నిలబెట్టాలనే అంశంపై మంగళవారం విజయవాడలో ని దాసరి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో చర్చించారు. "ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న కాంగ్రెస్, సీపీఎంలతో కలిసి రాష్ట్రంలో పోటీ చేయాలని నిర్ణయించాం. సీట్ల సర్దుబాటుపై రెండు, మూడు రోజుల్లో మూడో దఫా చర్చలు జరగనున్నాయి. తర్వాత అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తాం" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ మీడియాకు తెలిపారు.

## నేడు తిరుమలకు నారా లోకేశ్

» కుమారుడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా రేపు అన్నదానం

తిరుమల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కుటుంబ సమేతంగా గురువారం తిరుమలకు రానున్నారు. తన కుమారుడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా సతీమణి బ్రహ్మణి, తల్లి భువనేశ్వరితో కలిసి భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నారు. ఏటా దేవాన్ష్ జన్మదినాన తిరుమలలోని భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేయడం ఆనవాయితీగా వ స్తోంది. బుధవారం సాయంత్రం లోకేశ్, బ్రహ్మణి, దేవాన్ష్, భువనేశ్వరి తిరుమల చేరుకోనున్నారు. గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం అన్నప్రసాదం ట్రస్టుకు రూ.38 లక్షల విరాళాన్ని ఇచ్చి వితరణలో పాల్గొంటారు.

## అవును.. బుల్లెట్ ప్రూఫ్ బస్సులు కొన్నాం

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి ఆర్టీసీ యాజమాన్యం స్పందన

విజయవాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ, ఇంటెలిజెన్స్ విభాగాల అభ్యర్థనల మేరకు కొత్తగా బుల్లెట్ ప్రూఫ్, నాన్ బుల్లెట్ ప్రూఫ్ బస్సులను కొనుగోలు చేసినట్లు ఏపీఎస్ఆర్టీసీ తెలిపింది. 'ప్రజాధనంతో ప్రచారం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనంపై ఆర్టీసీ యాజమాన్యం వివరణ ఇచ్చింది. మొత్తం రూ.27.44 కోట్లతో రెండు బుల్లెట్ ప్రూఫ్, 3 నాన్ బుల్లెట్ ప్రూఫ్ బస్సులు కొన్నట్లు పేర్కొంది. ఈ బస్సుల కొనుగోలుకు సంబంధించి ఇప్పటి వరకు రూ.20.53 కోట్లు చెల్లించినట్లు వెల్లడించింది. కోడ్ ను అనుసరించి నిబంధనల ప్రకారం బుల్లెట్ ప్రూఫ్ బస్సులను ముప్పు ఉన్న వీఐపీలకు ముందస్తు చెల్లింపు పద్ధతిన అద్దెకిస్తామని స్పష్టం చేసింది.

## వీఆర్వోపై వైసీపీ నేత దాడి

» శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో ఘటన

ధర్మవరం, మార్చి 19: ప్రభుత్వ స్థలం చుట్టూ కంచె వేసిన వైసీపీ నాయకు డు, దాన్ని తొలగించాలని సూచించిన వీఆర్వోపై దాడికి తెగబడ్డాడు. శ్రీసత్యసా యి జిల్లా ధర్మవరం పట్టణ 26వ వార్డు సచివాలయంలో మంగళవారం ఈ దారుణం జరిగింది. వైసీపీ నేత నరసింహులు 26వ వార్డులోని ప్రభుత్వ స్థలం చుట్టూ కంచె వేశారు. సోమవారం ఆ స్థలం వద్దకు వచ్చిన వీఆర్వో అశోక్.. కంచె తొలగించాలన్నారు. దీంతో 'స్థలం మాది. కంచె తొలగించమని చెప్పడానికి నువ్వెవరు?' అంటూ నరసింహులు వాగ్వాదానికి దిగారు. స్థలానికి సంబంధించిన ఆధారాలు ఉంటే సచివాలయం వద్దకు తీసుకురావాలని సూచించి వీఆర్వో వెళ్లిపోయారు. అనంతరం నరసింహులు సచివాలయానికి వెళ్లి వీఆర్వోతో వాగ్వాదానికి దిగారు. ఆయనపై దాడి చేసి, టేబుల్‌పై ఉన్న కంప్యూటర్‌ను ధ్వంసం చేశారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు సచివాలయం వద్దకు వెళ్లి విచారించి, కేసు నమోదు చేశారు.

## 'శక్తి' నాశనం కోరేవారి

# వినాశనం తప్పదు

» వారి నాశనం తమిళనాడు నుంచే మొదలవ్వాలి: ప్రధాని మోదీ



చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఇండియా కూటమి నేతలు హిందూ ధర్మాన్ని అదేపనిగా అగౌరవపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, హిందూమతానికి, ప్రత్యేకించి స్త్రీశక్తికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న ఆ కూటమికి నాశనం తప్పదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సేలంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఎన్డీయే కూటమి ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. తాను శక్తితో పోరాడుతున్నానని ముంబైలో ఆదివారం జరిగిన తన పాదయాత్ర ముగింపు సభలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై మోదీ తన బీజేపీ ప్రచార సభల్లో విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. మంగళవారం తమిళనాడులోని సేలంలో జరిగిన బీజేపీ ప్రచార కార్యక్రమాల్లోనూ ఆయన మరోసారి రాహుల్, 'ఇండియా' కూటమిలోని డీఎంకేపై నిప్పులు చెరిగారు. డీఎంకే, కాంగ్రెస్ అంటే అవినీతి, కుటుంబ పాలనే గుర్తుకువస్తాయన్నారు. హిందూధర్మాన్ని అవమానిస్తున్న ఇండియా కూటమి నేతలను భారతీయులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరన్నారు. తమిళ శైవమఠాధిపతుల ఆశీస్సులతో తమిళ సంస్కృతిని చాటే సెంగోల్‌ను కొత్త పార్లమెంట్‌లో ప్రతిష్ఠించడాన్ని వ్యతిరేకించారని, సెంగోల్‌ను ఇండియా కూటమి నేతలంతా అవమానించారని, ఈ దుష్టశక్తులను ఏప్రిల్ 19న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు ఓడిస్తారని హెచ్చరించారు. వారి నాశనం తమిళనాడు నుంచే ప్రారంభమవుతుందని చెప్పారు. ముంబై శివాజీ పార్కులో ఇండియా కూటమి జరిపిన మొదటి ర్యాలీలోనే ఆ కూటమి నేతల అసలు రంగు బయటపడిందని, హిందూ ధర్మాన్ని, స్త్రీ శక్తిని నాశనం చేయడమే తమ లక్ష్యమని ప్రచారం చేశారని మోదీ పేర్కొన్నారు. శక్తిని ఎలా పూజించాలో, ఎలా ఉపాసించాలో తమిళులందరికీ తెలుసునన్నారు. సేలం నగరంలోని కొట్టై మారియమ్మన్ ఆలయం పై 'ఓం శక్తి, మా మారియమ్మన్' అక్షరాలు చెక్కబడి ఉన్నాయని, ఈ సభకు విచ్చేయడానికి ముందు ఆ అమ్మవారిని దర్శించుకున్నానన్నారు. రాష్ట్రంలో స్త్రీశక్తిపీఠాలు కూడా ఉన్నాయని, వాటిలో కంచి కామాక్షి, మదురై మీనాక్షి, సమయపురం మారియమ్మన్ ఆలయాలు ప్రసిద్ధమైనవన్నారు. హిందూ ధర్మంలో, హిందూ మతంలో శక్తి అనే పదానికి ఉన్నతమైన అర్థాలు ఉన్నాయని, అలాంటి శక్తి స్వరూపాన్నీ, సనాతన ధర్మాన్నీ నాశనం చేస్తామని ఇండియా కూటమి నేతలు చెబుతుండటం గర్హనీయమన్నారు. ఇండియా కూటమి నేతలుగానీ, ప్రతిపక్ష పార్టీల నాయకులుగానీ ఇతర మతాల జోలికి వెళ్లడం లేదని, కానీ హిందూ మతం, హిందూ ధర్మాన్ని కించపరిచేలా విమర్శలు చేస్తారన్నారు. స్త్రీశక్తి అంటే కూడా వారికి గౌరవం లేదని మోదీ ఆరోపించారు. తమిళ మహాకవి సుబ్రమణ్యభారతి తన కవితల ద్వారా శక్తిస్వరూపిణి కాళిమాతను భరతమాతగా ఉపాసించేవారని, ఆ భారతియారే తనకు స్ఫూర్తి అని అన్నారు. నారీశక్తిని ఉపాసించేవారిని నాశనం చేయాలనుకునేవారికి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. వచ్చే ఐదేళ్లలో అవినీతికి వ్యతిరేకంగా ఎన్డీయే ప్రభుత్వం సుదీర్ఘ పోరాటం సాగిస్తుందని శపథం చేశారు.

### కేరళలో భారీ రోడ్‌షో

2024 ఎన్నికల్లో ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాలపైనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టి కేంద్రీకరించారు. దీంతో దక్షిణాదిలోని ఒక్కో రాష్ట్రంలో ఆయన రెండు, మూడు సార్లు పర్యటిస్తున్నారు. అందులోనూ కేరళలో ఈసారి ఖాతా తెరవాలని ఆయన పట్టుదలతో ఉన్నారు. ఈ క్రమంలో మంగళవారం కేరళలోని పాలక్కడ్‌లో బీజేపీ నిర్వహించిన భారీ రోడ్‌షోలో మోదీ పాల్గొన్నారు. తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి హెలికాప్టర్‌లో ఆయన పాలక్కడ్ చేరుకున్నారు. పూలతో అలంకరించిన ఓపెన్ టాప్ వాహనంపై నిలబడి దారి పక్కన బారికేడ్ల అవతల బారులు తీరిన ప్రజలకు మోదీ అభివాదం చేశారు. కొట్టమైదాన్ అంచువిలక్కు నుంచి హెడ్ పోస్ట్ ఆఫీస్ వరకు భారీ రోడ్‌షో సాగింది. పాలక్కడ్, పొన్నాలీ అభ్యర్థులు కృష్ణకుమార్, నివేదికా సుబ్రహ్మణ్యం తరఫున ఆయన ప్రచారం నిర్వహించారు.

### ప్రధాని మోదీ భావోద్వేగం

» హత్యకు గురైన కార్యకర్తను తలుచుకుని కంటతడి

మోదీ మంగళవారం తమిళనాడులోని సేలం జిల్లాలో బీజేపీ నాయకులు ఏర్పాటుచేసిన విజయ సంకల్ప సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదేళ్ల కిందట బీజేపీ కార్యకర్త దారుణ హత్యకు గురైన ఘటనను గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. "ఆడిటర్ రమేశ్‌ను నేను మరిచిపోలేదు. దురదృష్టవశాత్తు రమేశ్ ఈ రోజు మన మధ్య లేరు. పార్టీ కోసం రమేశ్ నిరంతరం శ్రమించారు. ఆయనో మంచి వక్త. రేయింబవళ్లు పార్టీ కోసం ఆయన పనిచేసిన తీరు స్ఫూర్తిమంతం. కానీ, ఆయన హత్యకు గురయ్యారు" అని ప్రధాని అన్నారు. మరో కార్యకర్త లక్ష్మణన్‌కూ నివాళులు అర్పించారు.

## తెలంగాణ గవర్నర్‌గా రాధాకృష్ణన్



న్యూఢిల్లీ, హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ గవర్నర్ పదవికి, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి డాక్టర్ తమిళిసై సౌందర్ రాజన్ చేసిన రాజీనామాను ఆమోదించారు. ఆమె స్థానంలో మరొకరిని నియమించే వరకూ తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించాలని జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో బుధవారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో రాధాకృష్ణన్ తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపడతారు. వెరసి, తెలంగాణకు వరుసగా మూడోసారి కూడా తమిళనాడుకు చెందిన వ్యక్తే గవర్నర్‌గా రావడం విశేషం. తెలంగాణ తొలి గవర్నర్‌గా నరసింహన్ కొనసాగగా.. ఆ తర్వాత అదే రాష్ట్రానికి చెందిన తమిళిసై వ్యవహరించిన విషయం తెలిసిందే. నిజానికి, తమిళిసై రాజీనామా తర్వాత తెలంగాణకు కొత్త గవర్నర్‌ను నియమించాల్సి ఉంది. కానీ, లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జార్ఖండ్ గవర్నర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికలు ముగిసే వరకూ ఆయనే గవర్నర్‌గా కొనసాగే అవకాశం ఉంది. ఇక, ఇప్పటి వరకు కొనసాగిన తమిళిసై గతంలో తమిళనాడు బీజేపీ శాఖ అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తించిన విషయం తెలిసిందే. ఇప్పుడు రాధాకృష్ణన్ కూడా అదే నేపథ్యం నుంచి వచ్చారు. బాల్యం నుంచే ఆర్ఎస్ఎస్ నేపథ్యం కలిగిన రాధాకృష్ణన్.. గతంలో తమిళనాడు బీజేపీ శాఖ అధ్యక్షుడిగా పని చేశారు. తమిళనాట పార్టీ బలోపేతానికి ప్రయత్నించారు. కమ్యూనిస్టుల అడ్డాగా పేరుగాంచిన కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి 1998లో తొలిసారిగా విజయం సాధించారు. మరుసటి ఏడాదే మళ్లీ జరిగిన 1999 ఎన్నికల్లోనూ రెండోసారీ విజయబావుటా ఎగరేశారు. 2014లో అన్నాడీఎంకే అభ్యర్థి, 2019లో సీపీఎం అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. ఇటీవలి వరకూ బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, కొంతకాలంపాటు కేరళ ఇన్‌చార్జిగానూ వ్యవహరించారు. కొబ్బరి, కొబ్బరి ఉత్పత్తులను ప్రోత్సహించే ఆల్ ఇండియ కాయిర్ బోర్డుకు అధ్యక్షుడిగానూ పని చేశారు. ఎన్డీఏ కూటమి నుంచి 2004లో డీఎంకే వైదొలగిన తర్వాత కూటమిలోకి అన్నాడీఎంకే రావడంలో కీలక పాత్ర పోషించారు. అప్పట్లో అన్నాడీఎంకే అధినేత్రి జయలలితతో పలు మార్లు సమావేశమై ఆమెను ఒప్పించారు. గత ఏడాది ఫిబ్రవరిలో ఆయనను జార్ఖండ్ గవర్నర్‌గా నియమించారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు రాధాకృష్ణన్ కృతజ్ఞతలు తెలిపారు.

## వైసీపీకి దళిత ఎమ్మెల్యే ఆర్థర్ గుడ్‌బై

» షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా నందికొట్కూరు(ఎస్సీ) ఎమ్మె ల్యే టి.ఆర్థర్ వైసీపీకి గుడ్‌బై చెప్పారు. మంగళవారం హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గా ఆర్థర్ విజయం సాధించినా.. పెత్తనమం తా శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిదే. కొంతకాలం కిందట ఆయనకు తెలియకుండానే మంత్రి ఆర్కే రోజా, సిద్ధార్థ్ రెడ్డి పలు కార్యక్రమాలను ప్రారంభించారు. దీనిపై ఆర్థర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే.. సిద్ధార్థరెడ్డి చెప్పిందే తడవుగా ఆయనకు సీఎం జగన్ టికెట్ నిరాకరించారు.

## ఎన్నికలు రాగానే జగన్‌కు జనం గుర్తొచ్చారు

» దారిపొడవునా కట్టే పరదాల ఖర్చు ఎవరిదో చెప్పాలి: ఆనం

నెల్లూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ ఐదేళ్లపాటు బారికేడ్లు, పరదాల మాటున తిరిగారు. ఇప్పుడు ఎన్నికలు రావడంతో ప్రజలు గుర్తుకు వచ్చారు' అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి విమర్శించా రు. మంగళవారం నెల్లూరులో మాట్లాడారు. 'ఐదేళ్లలో మొట్టమొదటిసారి బస్సు యాత్రతో ప్రజల్లోకి వస్తున్న జగన్‌ను టీడీపీ స్వాగతిస్తోంది. అయితే జగన్, ఆయన కుటుంబానికి సెక్యూరిటీ సమస్య ఉందని 3 నెలల క్రితం డీజీపీ వెల్లడించారు. అందుకనే ఎస్ఎస్‌జీ సెక్యూరిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. మరి అంత సెక్యూరిటీ సమస్య ఉన్నప్పుడు ఇప్పుడు బస్సు యాత్రను డీజీపీ ఎలా ఒప్పుకున్నారు? ఇప్పుడు సెక్యూరిటీ సమస్య పోయిందా? లేక గతంలో డీజీపీ, ఇంటెలిజెన్స్ అధికారులు అబద్ధాలు చెప్పారా? దీనిపై స్పష్టత ఇవ్వాలి. జగన్ సుమారు 2,000 కిలోమీటర్లు బస్సు యాత్ర చేయనున్నారు. ఆయన ప్రయాణమార్గంలో దారి పొడవునా పరదాలు కట్టే ఖర్చు ఎవరిది..! వాటికయ్యే ఖర్చును భరించేది ఎవరో ప్రజలకు చెప్పాలి' అన్నారు.

## ఫార్మా చదివింపులు 800 కోట్లు!

» డాక్టర్ రెడ్డీస్, హెటెరో, దివీస్, టొరెంట్ సహా 35 ఫార్మా సంస్థలు బాండ్ల రూపంలో రాజకీయ పార్టీలకు సమర్పించిన సొమ్ము ఇది

» బదులుగా.. యూసీపీఎంపీ రూల్స్‌ను వాటికి అనుకూలంగా సవరించిన సర్కారు?

న్యూఢిల్లీ, మార్చి 19: అర్ధరాత్రి పూట బండి మీద వేగంగా వెళ్తుంటాం! చౌరస్తాలో రెడ్ లైట్ వెలుగుతుంది. అక్కడ పోలీసు లేకపోయినా.. మిగతా మూడు వైపుల నుంచి వాహనాలు రాకపోయినా.. రోడ్డంతా ఖాళీగా ఉన్నా.. రెడ్ లైట్ పడగానే ఆగుతాం. దీన్నే 'ఫోర్స్ ఆఫ్ లా' అంటారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం.. సిగ్నల్ జంపింగ్‌కి జరిమానా పడుతుందన్న భయమే మనని ఆపుతుంది. అలా కాకుండా.. వాహనాలు నడిపేవారందరికీ ఒక అసోసియేషన్ ఉండి.. సిగ్నల్ జంపింగ్‌లకు ఏ శిక్ష వేయాలో సూచించే అవకాశం ఆ సమాఖ్యకే చెందిన ఎథిక్స్ కమిటీకి ఉంటే? ప్రభుత్వానికి ఈ వ్యవహారం మీద ఎలాంటి నియంత్రణా లేకపోతే? సిగ్నల్ జంపింగ్ చేసిన వాహనదారులు బాగా పలుకుబడి కలిగినవారై ఉంటే? వారికి శిక్ష పడే అవకాశం ఉంటుందా? ఉండకపోవడానికే అవకాశం ఎక్కువ కదా? ఫార్మా కంపెనీలు రాజకీయ పార్టీలకు సమర్పించిన ఎన్నికల బాండ్లతో అచ్చం అలాంటి వ్యవహారమే జరిగిందన్న అనుమానాలు వ్యక్తం చేస్తూ 'ద వైర్' వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. దాని ప్రకారం.. 35 ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీలు దాదాపు రూ.800 కోట్ల విలువ చేసే ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసి వివిధ రాజకీయ పార్టీలకు సమర్పించాయి. ఆ ఫార్మా కంపెనీలన్నీ.. ఔషధ నియంత్రణ, ఔషధాల ధరలను నిర్ణయించడానికి సంబంధించి ప్రభుత్వ విధానాల రూపకల్పనలో కీలకపాత్ర పోషించే రెండు ప్రధాన అసోసియేషన్లలో సభ్యత్వం ఉన్నవే. ఆ రెండు అసోసియేషన్లలో ఒకటి.. ఐడీఎంఏ (ఇండియన్ డ్రగ్స్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్) కాగా మరొకటి ఐపీఏ (ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయెన్స్). రాజకీయ పార్టీలకు బాండ్ల రూపంలో విరాళాలు సమర్పించిన ఫార్మా కంపెనీల్లో టాప్ 5లో ఉన్న డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు ఈ రెండింటిలో సభ్యత్వం ఉంది. ఆ కంపెనీ రూ.80 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసింది. రూ.69.25 కోట్లు విలువ చేసే బాండ్లు కొన్న నాట్కో ఫార్మాకు కూడా ఈ రెండింటిలో సభ్యత్వం ఉంది. రూ.77.5 కోట్ల విలువైన బాండ్లు కొన్న టొరెంట్ ఫార్మాకు, రూ.60 కోట్ల విలువైన బాండ్లు కొన్న హెటెరో గ్రూపునకు ఐడీఎంఏలో సభ్యత్వం ఉంది. రూ.55కోట్ల విలువ చేసే ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసిన దివీస్ లాబొరేటరీస్‌కు ఎందులోనూ సభ్యత్వం లేదు. ఈ 35 కంపెనీలూ కలిసి కొన్న బాండ్ల విలువ రూ.799.66 కోట్లు. 2024-25 బడ్జెట్‌లో ఫార్మా పరిశ్రమ అభివృద్ధికి మోదీ సర్కారు కేటాయించిన మొత్తం సొమ్ములో సగానికన్నా ఎక్కువ ఇది.

### ఇవీ అనుమానాలు..

అపరిమిత లాభాల కోసం ఫార్మా కంపెనీలు ఎలాంటి అనైతిక కార్యకలాపాలకూ పాల్పడకుండా ప్రభుత్వం 'యూనిఫామ్ కోడ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ మార్కెటింగ్ ప్రాక్టీసెస్' నిబంధనలను సవరించి, తాజా నిబంధనలను 13న విడుదల చేసింది. దాని ప్రకారం.. ఫార్మా కంపెనీలు తాము తయారుచేసే ఔషధాలనే రోగులకు సిఫారసుచేసే వైద్యులను ఉచితంగా విదేశాలకు తీసుకెళ్లడం, వారికి కానుకలు ఇవ్వడం, విదేశాల్లో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడం వంటివి నిషిద్ధం. అయితే.. ఏదైనా కంపెనీ ఈ నిబంధనలను ఉల్లంఘించినట్టు ఫిర్యాదు వస్తే ఆ కంపెనీపై చర్య తీసుకునే విషయంలో తుదినిర్ణయం ఆయా అసోసియేషన్లదేనని ఈ నిబంధనలు చెబుతున్నాయి. అవసరమైతే ఆ కంపెనీని తమ అసోసియేషన్ నుంచి బహిష్కరించవచ్చు కూడా. కానీ.. అదంతా స్వచ్ఛంద వ్యవహారం. పైన పేర్కొన్నట్టు.. 'ఫోర్స్ ఆఫ్ లా' ఏమీ లేదిక్కడ. ఏ చట్టంలోని ఏ సెక్షన్ ప్రకారం ఆ కంపెనీపై చర్యలు తీసుకుంటారో పేర్కొనలేదు. యూసీపీఎంపీలోని సెక్షన్ 12(వి) ప్రకారం.. అవసరమైతే సంబంధిత ప్రభుత్వ విభాగం రంగంలోకి దిగుతుందని పేర్కొన్నారు. కానీ ఇక్కడే అసలైన మెలిక ఉంది. ఆయా ప్రభుత్వ విభాగాలు అలా రంగంలోకి దిగాలంటే.. ఫార్మా అసోసియేషన్లకు చెందిన ఎథిక్స్ కమిటీ అందుకు సిఫారసు చేయాలట. ఒక దొంగకు శిక్ష వేయాలంటూ.. ఆ దొంగే సభ్యుడుగా ఉన్న సంస్థ పోలీసులకు సిఫారసు పక్కన పెట్టి.. ఉదాహరణ కోసం.. ఎథిక్స్ కవిటీ న్యాయబద్ధంగా వ్యవహరించి, ఒక ఫార్మా కంపెనీపై చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వానికి సిఫారసు చేసిందనే అనుకుందాం. ప్రభుత్వం ఆ కంపెనీకి ఎలాంటి జరిమానా విధించాలనే విషయంపై యూసీపీఎంపీ నిబంధనల్లో ఎలాంటి స్పష్టతా లేదు. ఏ చట్టం ప్రకారం ఆ కంపెనీని శిక్షించాలనే విషయాన్ని కూడా ఆ నిబంధనలు చెప్పట్లేదు. తప్పు చేసే ఫార్మా కంపెనీలపై సుమోటోగా చర్యలు తీసుకునే ఎలాంటి అవకాశాన్నీ ప్రభుత్వానికి ఈ నిబంధనలు కల్పించట్లేదు. పైగా.. ఒక ఫార్మా కంపెనీ తప్పు చేసినట్టు ఎవరైనా ఫిర్యాదు చేస్తే, వారి వివరాలను మాత్రం తప్పనిసరిగా బయటపెట్టాలని ఈ నిబంధనలు చెబుతున్నాయి. ఫార్మా కంపెనీలకు అనుకూలంగా ఉన్న ఈ నిబంధనలన్నీ.. వాటిపై ఫిర్యాదు చేసేవారి పనిని కష్టతరం చేస్తున్నాయని 'అసోసియేషన్ ఆఫ్ డాక్టర్స్ ఫర్ ఎథికల్ హెల్త్‌కేర్ (ఏడీఈహెచ్)'కు చెందిన డాక్టర్ గురీందర్ వంటివారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే.. ఔషధాలు, వైద్య ఉపకరణాల ధరల నిర్ణయానికి సంబంధించి సంస్కరణలపై ఒక కమిటీని ఏర్పాటు చేయడానికి 2024 మార్చి 12న కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. 2013 నాటి 'డ్రగ్ ప్రైసింగ్ కంట్రోల్ ఆర్డర్'ను సవరించడమే ఆ కమిటీ పని. అందులో ముగ్గురు సభ్యులు ప్రభుత్వ అధికారులు కాగా.. ఇద్దరు సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు. ఆ ప్రత్యేక ఆహ్వానితులు ఎవరో కాదు.. ఐడీఎంఏ, ఐపీఏ ప్రతినిధులే. అంటే.. ఔషధాల ధరల నియంత్రణకు సంబంధించిన కమిటీలో ఫార్మా కంపెనీల ప్రతినిధులు ఉంటారుగానీ.. పౌరసమాజానికి సంబంధించినవారు ఉండరు. ఈ నిబంధనలన్నీ ఇలా ఫార్మా కంపెనీలకు అనుకూలంగా ఉండడానికి కారణం రాజకీయపార్టీలకు, వాటికీ ఉన్న ఆర్థిక బంధమేనన్న అనుమానాలు గతంలో ఉండేవని.. ఎన్నికల బాండ్లు దానిపై ఒక స్పష్టతను ఇచ్చాయని ఆరోగ్య రంగ సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నట్టు 'ద వైర్' తన కథనంలో పేర్కొంది.

## విజిలెన్స్‌కు విస్తృత అధికారాలు... ఇప్పట్లో కుదరదు

» హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు



అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు అపరిమిత అధికారాలు కల్పించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ శాఖ ఐజీ రఘురామిరెడ్డి రాసిన లేఖను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు జూన్ నెలకు వాయిదా వేసింది. మంగళవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక న్యాయవాదులు సి.సుమన్, మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ... విస్తృత అధికారాలు కల్పించమంటూ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజీ లేఖపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి న్యాయశాఖ సూచించిందని తెలిపారు. ఈ ప్రతిపాదనపై 13మంది శాఖాధిపతుల సమ్మతి తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై విధానపరమైన నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదని చెప్పారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. ఈ వివరాలు నమోదు చేసిన న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు.. ఐజీ రాసిన లేఖతో పిటిషనర్ ప్రయోజనాలకు ఏమైనా భంగం కలిగిందా అని ఆరా తీశారు. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న సీఎం జగన్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజీ కొల్లి రఘురామిరెడ్డి, సీఎస్, జీఏడీ ముఖ్యకార్యదర్శి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ, ఐజీని ఆదేశిస్తూ విచారణను జూన్‌కు వాయిదా వేశారు. రాష్ట్రంలోని ఏ కార్యాలయాన్నైనా, సంస్థనైనా సందర్శించేందుకు, తనిఖీ చేసి రికార్డులు జప్తు చేసేందుకు, వారెంట్ లేకుండా అరెస్టు చేసేందుకు వీలుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో పనిచేసే గెజిటెడ్ అధికారులను అధీకృత అధికారులుగా నియమించి, అపరిమిత అధికారాలు కల్పించాలని కోరుతూ ఐజీ రఘురామిరెడ్డి రాసిన లేఖను సవాల్ చేస్తూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ.... పిటిషనర్ పార్టీలో వ్యాపారాలు ఉన్న నాయకులను సోదాల పేరుతో వేధిస్తారనే ఆందోళనతో వ్యాజ్యం దాఖలు చేశామని పేర్కొన్నారు. ఈ వ్యాజ్యం దాఖలు చేయడంతోనే ప్రభుత్వం వెనక్కి తగ్గిందని తెలిపారు.

### రాజకీయ ప్రయోజనాల్లేవు


» ఎన్నికల తరువాత విచారించినా అభ్యంతరం లేదు

» హైకోర్టులో ఎంపీ రఘురామ అఫిడవిట్ దాఖలు

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్, ఆయన ఆప్తులకు అనుచిత లబ్ధి చేకూర్చేలా వైసీపీ ప్రభుత్వం రూపొందించిన వివిధ పాలసీలు, తీసుకున్న నిర్ణయాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ఎంపీ కె.రఘురామకృష్ణ రాజు దాఖలు చేసిన పిల్‌పై విచారణను హైకోర్టు జూన్ చివరి వారానికి వాయిదా వేసింది. 'పిల్‌ను రాజకీయ ప్రయోజనాల కోసం దాఖలు చేయలేదని, ఎలాంటి దురుద్దేశం లేదని పిటిషనర్ చెబుతున్నారు. ఎన్నికల తరువాత విచారణ జరిపినా అభ్యంతరం లేదని అఫిడవిట్ వేశారు' అని ధర్మాసనం గుర్తుచేసింది. పిల్ విచారణార్హతపై ప్రతివాదులు అభ్యంతరాలు లేవనెత్తుతున్నారని పేర్కొంది. ఇరుపక్షాలకు అసౌకర్యం కలిగించేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు లేనందున విచారణను జూన్ చివరివారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు పిల్ గురించి ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలలో ఎలాంటి ప్రకటనలు చేయొద్దని పిటిషనర్, రాష్ట్ర ప్రభుత్వం, ఇతర ప్రతివాదులను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశాలిచ్చింది. పిల్‌లోని అంశాలపై మాట్లాడకుండా నిరోధిస్తూ ఆదేశాలు ఇవ్వాలన్న ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. ఎంపీ రఘురామ దాఖలు చేసిన పిల్ మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ.... పిల్‌పై విచారణను వేసవి సెలవుల తరువాతికి వాయిదా వేయాలని ఎందుకు కోరుతున్నామో కారణాలతో అఫిడవిట్ దాఖలు చేశామని విన్నవించారు. సీఎస్ తరఫున అడ్వకేట్ జనరల్(ఏజీ) ఎస్. శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ... హైకోర్టు నిబంధనలకు అనుగుణంగా పిటిషనర్ వ్యాజ్యాన్ని దాఖలు చేయలేదని పేర్కొన్నారు. ప్రతివాది భారతి సిమెంట్స్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.రవి వాదనలు వినిపిస్తూ.... పిల్‌ను పెండింగ్‌లో ఉంచడం వల్ల ప్రతివాదుల ప్రతిష్ఠ దెబ్బతింటుందన్నారు. పిల్‌కు విచారణార్హత లేదని వాదించారు.

## నా అరెస్టు అక్రమం!

» సుప్రీంకోర్టులో కవిత రిట్ పిటిషన్



న్యూఢిల్లీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసుకు సంబంధించి తన అరెస్టు విషయంలో ఈడీ ఏకపక్షంగా, నియంతృత్వంగా వ్యవహరించిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. సుప్రీంకోర్టులో తాను గతంలో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఈడీ అధికారులు నిబంధలను ఉల్లంఘిస్తూ తనను అరెస్టు చేశారని పేర్కొన్నారు. ఇలాంటి అనాగరిక, నిస్సహాయ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఈ మేరకు కవిత మంగళవారం సుప్రీంకోర్టులో 537 పేజీలతో కూడిన రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఢిల్లీ మద్యం కేసులో వందలకోట్ల మేర అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న ఈడీ.. ఇప్పటి వరకు ఒక్క ఆధారాన్ని కూడా చూపలేకపోయిందని పిటిషన్‌లో కవిత గుర్తు చేశారు. తన అరెస్టు ఉత్తర్వుల్లో పేర్కొన్న కారణాలన్నీ పూర్తి అసత్యాలేనన్నారు. ట్రయల్ కోర్టుకు సమర్పించిన రిమాండ్ అప్లికేషన్ కూడా తప్పుదోవ పట్టించేలా ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 ప్రకారం సుప్రీంకోర్టు జారీ చేసే ఉత్తర్వులను అధికారులంతా పాటించాల్సి ఉంటుందని, కానీ తన విషయంలో ఈడీ అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపించారు. ఇక, ఈడీ కస్టడీలో ఉన్న కవిత.. తన తల్లి, కుమారులను కలుసుకునేందుకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7 కవితకు కోర్టు అనుమతి ఇచ్చింది.

ఆంధ్రజ్యోతి
# దిక్సూచి
విజయనాడ ● బుధవారం 20 మార్చి 2024
diksuchi@andhrajyothy.com



# కలినరీ ఆర్ట్స్‌లో బీబీఏ, ఎంబీఏ

**కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్(ఐసీఐ)- బీబీఏ, ఎంబీఏ ప్రోగ్రాములలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటికి అమర్‌కంటక్‌లోని ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ సహకారం అందిస్తోంది. తిరుపతి, నోయిడా క్యాంపస్‌లు ఉన్నాయి. సీయూఈటీ(యూజీ/పీజీ) స్కోర్ లేదా సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. వయోపరిమితి నిబంధనలు లేవు. ఎంపికైన అభ్యర్థులకు చెఫ్, కిచెన్ మేనేజ్‌మెంట్-కలినరీ స్పెషలిస్టులుగా రాణించేందుకు అవసరమైన స్కిల్స్ నేర్పిస్తారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లోని రెస్టారెంట్లలో ఆహారాన్ని తయారు చేసే పద్ధతులు, వాటి నిల్వ, ప్రమాణాలకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. వెజిటేరియన్ ప్రాక్టికల్ ఆప్షన్ కూడా ఉంది.**

## బీబీఏ (కలినరీ ఆర్ట్స్)

- ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. తిరుపతి, నోయిడా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 120 సీట్లు ఉన్నాయి.
- **కోర్సు వివరాలు:** ఈ ప్రోగ్రామ్‌లో 61 మాడ్యూల్స్ ఉంటాయి. వీటికి మొత్తం 152 క్రెడిట్స్ నిర్దేశించారు. క్లాస్ రూం టీచింగ్, ప్రాక్టికల్ టీచింగ్, ఇంటర్న్‌షిప్, వైవావోస్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, సెమిస్టర్ ఎండ్ ఎగ్జామ్స్ ఉంటాయి.
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.
- **ఎంపిక:** సీయూఈటీ(యూజీ) 2024 స్కోర్ లేదా సంస్థ నిర్వహించే ఐజీఎన్‌టీయూ-ఐసీఐ జేఈఈ(యూజీ) 2024 స్కోర్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

## ఎంబీఏ(కలినరీ ఆర్ట్స్)

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. తిరుపతి, నోయిడా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 30 సీట్లు ఉన్నాయి.
- **కోర్సు వివరాలు:** ఇందులో 24 మాడ్యూల్స్ ఉంటాయి. వీటికి మొత్తం 92 క్రెడిట్స్ నిర్దేశించారు. థియరీ క్లాసెస్, ప్రాక్టికల్ క్లాసెస్, అసైన్‌మెంట్‌లు, ప్రజంటేషన్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు, మిడ్ టర్మ్ ఎగ్జామ్స్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ఎక్స్‌టర్నల్ ఎగ్జామ్స్, సెమిస్టర్ ఎండ్ ఎగ్జామ్స్ ఉంటాయి.
- **అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఏదేని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.
- **ఎంపిక:** సీయూఈటీ(పీజీ) 2024 స్కోర్ లేదా సంస్థ నిర్వహించే ఐజీఎన్‌టీయూ-ఐసీఐ జేఈఈ(పీజీ) 2024 స్కోర్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

### ఉద్యోగావకాశాలు

ప్రముఖ హోటళ్లు, ఆతిథ్య రంగ సంస్థల్లో చెఫ్‌లుగా రాణించే వీలుంది. ఫ్లయిట్ కిచెన్స్‌లో, ఇండియన్ నేవీ ఆతిథ్య విభాగాల్లో, షిప్పింగ్ - క్రూయిజ్ సంస్థల్లో, రైల్వే కేటరింగ్ సర్వీస్‌లలో, దేశ విదేశాల్లోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో కిచెన్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లుగా పనిచేయవచ్చు. ఐసీఐ సహా హోటల్ మేనేజ్‌మెంట్, ఫుడ్ క్రాఫ్ట్ సంస్థల్లో ఫ్యాకల్టీలుగా చేరవచ్చు. స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లు నిర్వహించే హోటళ్లు, గెస్ట్ హౌస్‌లలో కిచెన్ మేనేజ్‌మెంట్ బాధ్యతలు నిర్వహించవచ్చు. స్వయం ఉపాధి కింద సొంతంగా రాణించే అవకాశం ఉంటుంది. ఫుడ్ బ్లాగర్, ఫుడ్ అనలిస్టులుగా రాణించవచ్చు. ఫుడ్ బేస్డ్ స్టార్టప్ కంపెనీలలో మేనేజ్‌మెంట్ ట్రెయినీలుగా ఉద్యోగాలు పొందే వీలుంది.

### ఐజీఎన్‌టీయూ-ఐసీఐ జేఈఈ వివరాలు

- ఇందులో 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.
- బీబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ అంశాల నుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు ఇస్తారు.
- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఫుడ్ ప్రొడక్షన్/మేనేజ్‌మెంట్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్/మేనేజ్‌మెంట్, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ అంశాలనుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు ఇస్తారు.

### ముఖ్య సమాచారం

- రిజిస్ట్రేషన్ ఫీజు లేదు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 25
- **ఐజీఎన్‌టీయూ-ఐసీఐ జేఈఈ(యూజీ/పీజీ) తేదీ:** మే 26
- **ఫలితాలు విడుదల:** మే 31
- **మొదటి రౌండ్ సీట్ అలాట్‌మెంట్:** జూన్ 3
- **రెండో రౌండ్ సీట్ అలాట్‌మెంట్:** జూన్ 10
- ఫైనల్ రౌండ్ సీట్ అలాట్‌మెంట్: జూన్ 18
- **స్పాట్ అడ్మిషన్స్:** జూన్ 24 నుంచి జూలై 12 వరకు
- **అకడమిక్ సెషన్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.icitirupati.in

## SCHOLARSHIP ALERT

### Kotak Suraksha Scholarship Program 2024-25



*Description:* Kotak Securities Limited (KSL) invites applications from students studying in Classes 9 to 12 or pursuing general/professional graduation.
*Eligibility:* Open to PwD applicants currently studying in Classes 9 to 12 or pursuing general/professional graduation in India. Applicants must have secured at least 55% marks in their previous academic year. PAN India applicants are eligible. Annual family income of the applicants must not exceed INR 3,20,000.
*Prizes & Rewards:* Scholarship up to INR 1,00,000 per year
*Last Date:* 30-04-2024 *Application mode:* Online only
*Short Url:* www.b4s.in/aj/KSSP1

### Bhumi Fellowship Program in India 2024-26

*Description:* Bhumi Fellowship Program in India 2024-26 is a 2-year, full-time paid program designed to develop future leaders in education. It provides young graduates with hands-on training and experience in teaching and transforming schools in India.
*Eligibility:* Open to individuals aged 20-30 with a degree in Social Work, Education, or Engineering, who are willing to commit to a two-year full-time fellowship and are based in Chennai or willing to relocate.
*Prizes & Rewards:* A monthly grant of 25,500 and other benefits *Last Date to Apply:* 30-05-2024
*Application mode:* Online Applications Only
*Short Url:* www.b4s.in/aj/THBF5

### University of Bath GREAT Scholarship, India 2024

*Description:* University of Bath GREAT Scholarship, India 2024 is an opportunity offered by the University of Bath in collaboration with the British Council's Study UK campaign. Under this programme, students from 15 countries including India will receive financial support to pursue postgraduate study in the UK.
*Eligibility:* Open to Indian citizens with a valid passport who hold an offer for a full-time, postgraduate taught master's course at the University of Bath. Candidates must be classified as international students for tuition fee purposes and demonstrate an outstanding academic background.
*Prizes & Rewards:* A partial tuition fee of £10,000 for one year of study *Last Date to Apply:* 20-05-2024
*Application:* Online *Short Url:* www.b4s.in/aj/UBG01

buddy4study.com

# ప్రవాళ బిత్తికలు


పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

**ప్రవాళ బిత్తికలు(Coral Reefs) అనేవి సముద్రాలలో ఆయన రేఖా మండలాలలో నివసించే ప్రవాళ కీటకాలు(Coral Polyps) లేదా పగడపు పురుగులతో నిర్మితమైనవి. ఈ కీటకాలు సముద్రాలలో ఉండే కాల్షియం కార్బోనేట్‌ను గ్రహించి తమ కర్పరాల(Shells)ని నిర్మిస్తాయి.**

ప్రవాళ కీటకాలు వివిధ రంగులలో ఉంటాయి. పచ్చ, పసుపు, గులాబీ, తెలుపు, ఊదా మొదలైనవి. ఈ కీటకాలు గుంపులు గుంపులుగా, కాలనీలుగా నివసిస్తాయి. ఇలాంటి కాలనీలు పెరుగుతూ ఒక దానితో ఒకటి పెనవేసుకుని ప్రవాళ బిత్తికలుగా, ప్రవాళ ద్వీపాలుగా ఏర్పడతాయి. ప్రవాళ బిత్తికలు, దీవులు కేవలం ప్రవాళ కీటకాలతో ఏర్పడలేదు. ఇతర సముద్రాంతర్గత జీవులు కూడా వీటి నిర్మాణానికి తోడ్పడతాయి. అందులో ముఖ్యమైనవి సున్నపు ఆల్గే(Calcareous algae) ఫోరమినిఫెరా (Foraminifera), ఎఖైనోడర్మ్(Ech-inoderms) మొదలైనవి.

### ప్రవాళ బిత్తికల పెరుగుదలకు కారణాలు

సాధారణంగా ప్రవాళ కీటకాలు ఆయన రేఖా మండల సముద్రపు నీటిలో విస్తారంగా నివసిస్తాయి. వీటి పెరుగుదలకు కొన్ని అనుకూల పరిస్థితులు అవసరం.



- ముఖ్యంగా ప్రవాళ కీటకాల పెరుగుదలకు ఉష్ణోగ్రత 20 డిగ్రీల సెల్సియస్ ఉండాలి. అధిక శీతల, అధిక ఉష్ణోగ్రతలలో ఈ కీటకాల పెరుగుదల కుంటుపడుతుంది.
- ఈ ప్రాణులకు అత్యవసరమైన సూర్యరశ్మి, ప్రాణ వాయువు(ఆక్సిజన్) 55 మీటర్ల లోతు వరకు మాత్రమే పుష్కలంగా ఉంటుంది. అందువల్ల వీటి పెరుగుదల 55 మీటర్ల లోతు వరకే పరిమితమై ఉంటుంది.
- ఉష్ణమండల ప్రాంత సముద్ర జలాలైన 30 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 30 డిగ్రీల దక్షిణ అక్షాంశాల మధ్య అధికంగా పెరుగుతాయి.
- స్వచ్ఛమైన ఉప్పునీరు పగడపు దిబ్బల పెరుగుదలకు అనుకూలంగా ఉంటుంది. అయితే మంచినీరు, అధిక లవణీయత రెండూ ప్రవాళ కీటకాల పెరుగుదలకు హానికరం.
- సాధారణంగా ప్రవాళ బిత్తికలు ఆయన రేఖా ప్రాంతాలలో(Tropical regions) ఖండాల తూర్పు తీర ప్రాంతంలోనే కనిపిస్తాయి. ఖండాల పశ్చిమ తీర ప్రాంతాలలో చల్లని నీరు పైకి ఉబికి శీతల ప్రవాహాలుగా ప్రవహిస్తున్నందున ఉష్ణోగ్రత తగ్గి వీటి పెరుగుదలకు ప్రతికూలం.
- స్వచ్ఛమైన ఉప్పునీరు ప్రవాళ కీటకాలు నివసించడానికి అవసరం. నదులు సముద్రాలలో కలిసేచోట ఒండ్రుమట్టితో నీరు బురదగా (Turbid waters) ఉండటం వల్ల నది ముఖద్వారాల వద్ద ప్రవాళ బిత్తికలు ఏర్పడవు.
- వీటి ముఖ్య ఆహారం కాల్షియం కార్బోనేట్. ఇది కొరవడిన ప్రాంతాలలో వీటి పెరుగుదల కృశించి పోతుంది. కాబట్టి ఇవి ఇతర సూక్ష్మ సముద్ర జీవరాశుల నుంచి గ్రహించి తమ కర్పరాలను నిర్మిస్తాయి. ప్రవాళ కీటకాలు తమ గూళ్లు(Reef) ఉన్న చోటు నుంచి కదలవు. తమని తాకుతూ దాటివెళ్లే నీటి నుంచే ఆహారాన్ని గ్రహిస్తాయి. కాబట్టి నీటి చలనం అవసరం. మితవేగ ప్రవాహాలు ఉన్న ప్రాంతాలలో ఇవి పెరుగుతాయి. నిలకడగా ఉన్న నీరు వీటి పెరుగుదలకు ప్రతికూలం.
- మంచి నీటి ప్రాంతాలలో ఈ కీటకాలు నివసించవు. అధిక వర్షపాతం, నదీజలాల ప్రవేశం మొదలైనవి వీటి పెరుగుదలకు ప్రతి బంధకాలు.

ప్రవాళ కీటకాలు 55 మీటర్ల కంటే ఎక్కువ లోతులో నివసించలేవు. అనేక బిత్తికలు సముద్రాలలో సుదూరంగా ఏర్పడి ఉంటాయి. ఇవి ఏర్పడటానికి అక్కడి సముద్రాంతర్గత ఉపరితలాలందు రెడ్జ్‌లు గాని, ఉబ్బెత్తు శిఖరాలు గాని ఉన్న వాటిపై ఇతర జీవరాశులు నివసించి 55 మీటర్ల లోతు వరకు వ్యాప్తి చెందినప్పుడు, ఆపై ప్రవాళ కీటకాలు సమూహ నివాసమేర్పరచుకుంటాయి. ఈ కీటకాల పెరుగుదల సముద్ర ఉపరితలం వరకే వ్యాప్తి చెందుతుంది. ఉపరితలంపైన పెరిగిన బిత్తికలలోని కీటకాలు మరణించి వీటి కర్పరాలు బిత్తికలో కలుస్తాయి.

తీరం వైపున ఉన్న కీటకాలకు ఆహార లేమి వల్ల ఇవి క్షీణించి లాగూన్లు ఏర్పడటానికి కారణమవుతున్నాయి. బిత్తికి నిర్మాణం ఒక ద్వీపం చుట్టూ ఏర్పడినట్లయితే మధ్యలో చక్రాకార లాగూన్ ఏర్పడుతుంది. దీన్ని అటోల్ అంటారు.

**బిత్తికల రకాలు:** ప్రవాళ బిత్తికల ఆకారం, నిర్మాణం, ఉనికిని బట్టి మూడు రకాలుగా పేర్కొనవచ్చు. అవి తీరాంచల బిత్తిక(Fringing Reef), అవరోధక బిత్తిక(Barrier Reef), అటోల్(Atoll)

**తీరాంచల బిత్తిక:** ఇవి ఖండ తీరానికోగాని, ద్వీపానికోగాని అంటుకొని తీరపు అంచున మాత్రమే ఏర్పడతాయి. వీటి ఉపరితలం గరకుగాను, ఎగుడు దిగుడుగాను ఉంటుంది. దీని వెలుపలి అంచు సముద్రంలోనికి వాలుగా ఉంటుంది. సముద్రమట్టం వరకు పెరిగిన ప్రవాళ కీటకాలకు తీరం వైపు ఆహార సమృద్ధి లేనందువల్ల క్రమంగా క్షీణించి లాగూన్‌లు ఏర్పడతాయి. వెలుపలి అంచున ఉన్న కీటకాలకు సముద్ర జలాల నుంచి సమృద్ధి ఆహారం లభించడం వల్ల బాగా, ఏపుగా పెరుగుతాయి. తీర ప్రాంతపు వైపున ఉన్న కీటకాలు నదీజలాల సమ్మేళనం వల్ల బురద నీటి ప్రవేశం వల్ల క్షీణించి లాగూన్ ఏర్పడటానికి కారణమవుతాయి. ఈ విధంగా ద్వీపాన్ని గాని, తీరాన్ని గాని అంటుకొని తీరంవైపు లాగూన్ గల ప్రవాళ బిత్తిక సముదాయాన్ని తీరాంచల బిత్తికలు అని పేర్కొంటారు. ఉదాహరణకు.. లక్ష దీవులు, కార్ నికోబార్ దీవులు. ఫ్లోరిడా తీరంలో, న్యూహెబ్రిడీస్ దీవులలో ఉన్నవి చెప్పుకోదగ్గవి.

**అవరోధ బిత్తికలు:** అతి పెద్దదైన, విస్తారమైన బిత్తికలలో ఇవి ముఖ్యమైనవి. తీరానికి దూరంగా ఏర్పడి లోతు విస్తీర్ణంలో తీరాంచల బిత్తికల కంటే అధికంగా ఉంటాయి. వెలుపలి వైపు ఇవి సముద్రంలోనికి ఎక్కువగా వాలు కలిగి ఉంటాయి. లాగూన్ వెడల్పు అధికంగా ఉండి, తీరం నుంచి సుమారు 10 నుంచి 180 కి.మీ. వరకు ఉంటుంది. 'ఆస్ట్రేలియా గ్రేట్ బారియర్ రీఫ్' దీనికి మంచి ఉదాహరణ. ఈ బిత్తిక ఆస్ట్రేలియా ఖండపు తూర్పున క్వీన్లాండ్ తీరాన 1900 కి.మీ. పొడవు, 160 కి.మీ. వెడల్పున వ్యాపించి ఉంది. ఇది ఉత్తరాన తీరం నుంచి 128 కి.మీ. దూరం వరకు, దక్షిణాన 11 కి.మీ. దూరం వరకు విస్తరించి లాగూన్‌తో కూడి ఉంది. తీరానికి బిత్తికకు మధ్య సముద్రం ప్రశాంతంగా ఎక్కువ అలలు లేకుండా జలక్రీడలకు అనువుగా ఉంటుంది.

**అటోల్:** అటోల్ బిత్తికలో చక్రాకారంలో గాని, గుర్రపు నాళపు ఆకారంలో గాని ఉండి మధ్యలో లాగూన్ కలిగి ఉంటుంది. కొన్నింటిలో ఈ లాగూన్ మధ్య చిన్న ద్వీపం ఏర్పడుతుంది. చక్రాకారంగా ఉన్న బిత్తిక చుట్టూ కొన్ని చోట్ల ఖాళీలు ఏర్పడి, వాటికి వెలుపలి సముద్రంతో సంబంధం ఉంటుంది. నిర్దిష్టంగా ఏర్పడిన అటోల్‌కు చెందిన లాగూన్ మధ్యన ద్వీపం ఉండదు. అటోల్లు అధికం పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడ్డాయి. ఉదా:- తూర్పుఫిజీ అటోల్, పశ్చిమ కారోలినలోని ట్రుక్ అటోల్ మొదలైనవి. మాల్దీవ్ ద్వీపాలలో కూడా అనేక దీవులు అటోల్ ఆకారంలో ఉన్నవే.

**భారతదేశం - పగడపు దిబ్బల విస్తరణ:** భారతదేశంలోని పగడపు దిబ్బలు గల్ఫ్ ఆఫ్ కచ్(గుజరాత్), గల్ఫ్ ఆఫ్ మన్నార్(తమిళనాడు), పాక్ అఖాతం, అండమాన్ అండ్ నికోబార్, లక్షద్వీప్ దీవులతో సహా చాలా ప్రాంతాల్లో కనిపిస్తాయి. వాయువ్య ప్రాంతంలోని గల్ఫ్ ఆఫ్ కచ్ ప్రపంచంలో అత్యంత ఉత్తరంగా ఉన్న పగడపు దిబ్బలుగా పేర్కొంటారు. పగడపు దిబ్బల చిన్న చిన్న ముక్కలు రత్నగిరి(మహారాష్ట్ర), మాల్వాన్(మహారాష్ట్ర), రెడి(దక్షిణ బొంబాయి)లో, మంగళూరు(కర్ణాటక)కు పశ్చిమాన ఉన్న గవేషాని బ్యాంకు వద్ద కూడా కనిపిస్తాయి.



వి.వెంకట్‌రెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

## లిటిల్స్



### తెలివైన కుందేలు

ఒక అడవిలో ఓ కుందేలు ఉండేది. అది ఒంటరిది. స్నేహితుడు ఎవరైనా దొరికితే బావుండు అని అనుకునేది. ఎందుకో తెలీదు కానీ.. ఆ కుందేలుకు చిన్న గొర్రెపిల్లలంటే ఇష్టం. వాటితో స్నేహం చేయాలనుకునేది. అవేమో అడవిలో కనపడేవి కావు. గొర్రెలను కాపరి కాస్తుంటాడు. అది కూడా చిన్న గొర్రెపిల్లలు బయటకు రావు.


ఒక రోజు కుందేలు గడ్డి తినటాకి రోడ్డు పక్కన ఉండే పొదల దగ్గరకు వెళ్లింది. ఓ గొర్రెపిల్లను తీసుకుని ఓ వ్యక్తి దారిలో వస్తున్నాడు. ఆ వ్యక్తి సంతలో కొని ఆ గొర్రెపిల్లను తెస్తున్నాడు. ఆ గొర్రెపిల్ల అందంగా ఉంది. ఆ అమాయక గొర్రెపిల్లతో స్నేహం చేయాలనుకుంది కుందేలు. ఎలాగైనా ఆ గొర్రెపిల్లను ఆ వ్యక్తి బారిన నుంచి విడిపించటానికి సిద్ధమైంది. ఎదురుగా వెళ్తే తనను కూడా పట్టుకుంటాడని అనుకుంది. కొంచెం ఆలోచించింది.

పొదల మాటున ఉండే ఇంటిలో ఓ అందమైన షూలను చూసింది. వాటిలో కుడి షూ తీసుకొచ్చి రోడ్డుమీద జారవిడిచింది. ఆ వ్యక్తి ఆ షూ చూసి ఆశ్చర్య పోయాడు. ఎంత బావుందో.. అయితే ఒక్కటే షూ ఉంది అనుకున్నాడు. రెండో షూ కూడా అక్కడే ఉంటుందని మొదటి షూను అక్కడే ఉంచి వెదకసాగాడు. ఎట్టకేలకు ఓ పొదలచాటున రెండో షూ కనపడింది. మొదటి షూ చూస్తే కనపడలేదు. ఏదో తీసుకెళ్లిందని అనుమానించాడు. అయినా కూడా ఆ షూను దక్కించుకోవాలనే కల ఆయనది. దీంతో మాత్రం ఆలోచించకుండా ముందుకు వెళ్లాడు. ఈ చంకలో ఈ గొర్రెపిల్ల ఒకటి అని గొణుక్కుంటూ.. ఆ గొర్రెపిల్లను ఓ చెట్టు కింద ఉంచాడు. చేతిలో ఉండే షూ అక్కడే వదిలేసి.. రెండో షూ కోసం వెళ్లిపోయాడు ఆ చుట్టు పక్కల ప్రాంతంలోకి.




వెంటనే ఆ గొర్రెపిల్ల దగ్గరకు పోయింది కుందేలు. తను శాకాహారినని చెప్పింది. ఆ గొర్రెపిల్ల భయపడింది. ఆ తర్వాత అందమైన కుందేలు మాటలను నమ్మింది. కుందేలు వెంట వెళ్లిపోయింది. ఇంతలో ఆ వ్యక్తి వెతగ్గా.. రెండో షూ దొరికింది. ఇక సంతోషంతో షూ తీసుకుని.. చెట్టు దగ్గరకు వచ్చాడు. తీరా చూస్తే ఆ గొర్రెపిల్ల కనపడలేదు. ఆ షూ కూడా కనపడలేదు. రెండూ పోయెనే అని విలవిల్లాడాడు.


### సరైన నీడ ఏది?




### దారి కనుక్కోండి



### ఏవి ఎన్ని?



### డైలీ సుడోకు - 259

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 6 | | 4 | 3 | | | 8 | |
| | 8 | 7 | | | | | | 2 |
| 2 | 4 | | | | 8 | | | 1 |
| | 7 | | | | | | | |
| 4 | | 1 | 8 | | 9 | 2 | | 6 |
| | | | | | | | 9 | |
| 8 | | | 3 | | | | 6 | 5 |
| 6 | | | | | | 4 | 7 | |
| | 9 | | | 4 | 6 | | 2 | |

### సుడోకు - 258 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 2 | 5 | 7 | 3 | 4 | 6 | 1 | 8 |
| 3 | 6 | 1 | 8 | 5 | 9 | 2 | 7 | 4 |
| 7 | 8 | 4 | 2 | 6 | 1 | 3 | 9 | 5 |
| 5 | 1 | 2 | 4 | 7 | 6 | 8 | 3 | 9 |
| 4 | 7 | 6 | 9 | 8 | 3 | 1 | 5 | 2 |
| 8 | 9 | 3 | 1 | 2 | 5 | 4 | 6 | 7 |
| 6 | 4 | 7 | 3 | 9 | 2 | 5 | 8 | 1 |
| 1 | 5 | 8 | 6 | 4 | 7 | 9 | 2 | 3 |
| 2 | 3 | 9 | 5 | 1 | 8 | 7 | 4 | 6 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.